
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.5.2026
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



ఎదురు తెన్నులు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




తేనె కన్నులు

మాసపత్రిక, జూన్, 2026 ₹ 60/-

ISSN 2454–4329



స్వేచ్ఛ సుందరి



ముత్యాల పందిరి

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 37 సంచిక 6

జూన్ - 2026

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

Published by

**BAPANNA ALAPATI**

**1-1-60/5, R.T.C. 'X' Roads,**
**Hyderabad - 500 020.**
**Ph. 040-27645536.**

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 720/- (సంవత్సర చందా),
₹ 1,440/- (రెండు సంవత్సరాలకు),
₹ 2,160/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

PEER REVIEWED

LCCN 91-903060

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com
Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు


# మిసిమి

## జూన్ నెల సూచికలు...


**మిసిమి** డైరి : ఆమె ... 3
జీవన మకరందం : స్వామి చైతన్యానంద ... 8
కొలకలూరి ఇనాక్ గారితో : **మిసిమి** ... 9
మౌనస్ఫురిత హృదయ గీతిక-**ఇందిర** : ప్రొ. వై. పార్థసారథి ... 21
భాష-ఆవిష్కరణ : వి. వరదరాజు ... 26
తెలుగు రాసే విధానం వేరా? : డా. నాగులపల్లి భాస్కరరావు ... 28
అశ్వశబ్దము : డా. జొన్నలగడ్డ మార్కండేయులు ... 31
కె. ఆర్. కె. మాస్టారు : డా. దేవబత్తిని వెంకటరావు ... 36
ఋషికుల్య : రామవరపు వేంకట రమణమూర్తి ... 40
నాగరకత-సమాజ పరిణామాలు : వల్లభనేని అశ్వినీకుమార్ ... 45
కిషినావ్ విశేషాలు : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు...50
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 55
సముద్రపు దొంగలు : చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్...58
ఒక దశాబ్ది కథలు : మామిడి విజేత ... 64
మ్యూజియం ఆఫ్ బేడ్ ఆర్ట్ : టి.వి. ప్రసాద్ ... 67
కువైట్ సావిత్రమ్మ-చక్రవేణు : రాజా ... 71
హైబిజ్ టీవీ అవార్డులు : వలేటి గోపీచంద్ ... 72
ఆడంబరానికి దూరంగా... : సి.యస్.ఆర్. ... 73
సత్యశోధన : ఎ.కె. ... 74
సాహో.. డాన్ కిహోటే : శారద ... 75
చార్లీ చాప్లిన్ నా కథ-ఒక పాఠకుని స్పందన : డా. అలజంగి మురళీధర రావు...76
ఉపనిషత్ ఉద్యానవనమ్ : డా. యన్. విజయరాఘవ రెడ్డి ... 78
చదవండి : **మిసిమి** ... 79





పరిణామాలు



కొలకలూరి ఇనాక్

### అట్టమీది బొమ్మలు




తేనె కన్నులు



స్వేచ్ఛ సుందరి



ముత్యాల పందిరి



ఎదురు తెన్నులు


# ఆమె ...

ఆమె గంభీరత - ఆమె సౌందర్యాన్ని మించినది.
ఆమె మనోకాంతి - ఆమె లావణ్యాన్ని వెలిగిస్తుంది.
ఆమె వర్చస్సు - ఆమె తేజోవంతమైన శరీర ఛాయను మరింతగా ప్రకాశింపజేస్తుంది.
ఇంతకీ ఎవ్వరామె?
ఆమె దుఃఖం ప్రతి స్త్రీ దుఃఖం
ఆమె వేదన మానవజాతి వేదన!

ఆమె గదిలో అడుగుపెడితే - ఆమె మహారాణి -
ఆమె సౌందర్యానికి నిర్వచనం వోగ్ కూడా ఇవ్వలేకపోయింది.
ఆమెకు నటన పాఠాలు రినాయర్ కూడా నేర్పలేకపోయాడు!
ఆమెను మోడల్‌గా - మెడోన్నాను చిత్రించాడు సాల్వడార్ డాలి!
తారలను - 'లార్జర్ దాన్ లైఫ్' అంటాము.
కాని ఆమె వ్యక్తిత్వం సిల్వర్ స్క్రీన్‌ని మించింది - ఎందుకో
ఆ సినిమా స్క్రీన్ ఈమెకు ఇరుకై పోయింది!
అంత గొప్ప వెండితెర - ఈమె మల్టీ టేలెంటెడ్ పర్సనాలిటీ ముందు వెలవెలపోయింది.
ఆమె భావోద్వేగాల - ఆనాటి విషాదపు వ్యక్తీకరణ - ఆ తెల్లతెర అర్థం చేసుకోలేక తెల్లబోయింది!
నీవు ఎంత సౌందర్యరాశివైతేనేమి?
నీవు ఎంత ఆకర్షణీయంగా వుంటే ఏమిటి?
నీవు ఎంతో తెలివిగల విద్యావతివైనంత మాత్రాన-
నీవు ఎంత గొప్ప పేరు ప్రఖ్యాతులతోపాటు గౌరవ ప్రశంసలు పొందితే మాత్రం
అయ్యో నీ కష్టాల కోటా నీకు తప్పదు కదా!

ఆమె గదిలో ప్రవేశించింది - ఒక వింత వెలుగు గదిలో నిండిపోయింది..
ఆమె చిరునవ్వు నవ్వింది - ఆ క్షణం ఈ ప్రపంచం సౌందర్యంతో, ఆనందంతో వెల్లివిరిసింది!
ఎంతటి లావణ్యం! ఎటువంటి శరీరఛాయ!
ఒక్క పొంగుతో దింపిన పాల మీగడలాంటి ఒంటి నునుపు!
ఆ పుప్పొడి చర్మం కప్పుకున్న బలమైన బోన్సు!
ఇంతటి ప్రపంచంలో కేవలం అయిదుగురు అందగత్తెల్లో ఒకరు!
వోగ్ పత్రికను అలంకరించిన అరుదైన అందం - అమాయిక చందం!
రినాయిర్‌తో అభినయ పాఠాలు చెప్పించుకున్న పంతులమ్మ..
సత్యజిత్ రే ని మెస్మరైజ్ చేసిన మెడోన్నా -
అనురాధగా జీవించిన బాధాతప్త రాధ!
రాజ్‌కపూర్‌ని లెక్కచేయని రాజసం - రాజకుమారి!

తూర్పు పశ్చిమాలను కొంగున ముడివేసిన భారతి!
భారతీయ సంస్కృతికి ఎవ్వరూ నియమించని రాయబారి!
ప్రపంచం అంతా చీరకట్టి పర్యటించిన ప్రయాణికురాలు – తెలుగింటి ఆడపడుచు!
రేడియో – టివి – హాలీవుడ్ – స్టేజ్ – జాకీ, నటి – డైరెక్టర్ –
రచయిత్రి – ఎడిటర్ – స్త్రీవాదం పురుడుపోసుకోక ముందే –
కోక కట్టిన కోయిలమ్మ – వేల సంవత్సరాల సంస్కృతికి నిధి / ప్రతినిధి!
రెండు పెళ్లిళ్లు – రెండు పెటాకులు – ఇద్దరు కవలలు –
ప్రపంచంలో ఆడదాని ఆవేదనకు అగుపించని నీడ!
ఎవ్వరికీ తలవంచని ధీర – తన స్వేచ్ఛకు తానే బందీ అయిన పావురం –



లీలా నాయుడు

– – – –

ఆమె – స్వాతంత్ర్యానంతరం – భారతదేశాన్ని రెండు దశాబ్దాలు, అందమైన – పొందికైన సొగసు సంపత్తులతో అలంకరించిన స్త్రీ మూర్తుల పదిమందిలో ప్రముఖంగా వుంది. రాణి గాయత్రి దేవి – నయన్‌తార సహగల్, దేవికారాణి, టంగుటూరి సూర్యకుమారి, రాణీ సీతాదేవి, వైజయంతిమాల, విజయలక్ష్మి పండిట్! అందరూ భారతమూలాలతో పశ్చిమ దేశాలకు – చీరకట్టి – మాతృదేశపు నగలే ధరించి – గొప్ప సంస్కృతికి రాయబారులయ్యారు. ఒక స్టైల్ – ఎలిగెన్సుతో పశ్చిమ దేశాలకు భారతీయ సంస్కృతిని పరిచయం చేశారు – బ్రిటీష్ రాజ్ పతనం తర్వాత ఉవ్వెత్తున ఉబికిన తరంగం – సంస్కృతీ నావను దూరతీరాల రేవులలో లంగరువేసి ఆశ్చర్యపరిచినవారు.

ఇందులో విషాదమేమంటే – ఈతరం భారత ముఖచిత్రం నుంచి – మెలమెల్లగా కనుమరుగైపోవటానికి పావు శతాబ్దకాలం జరిగినా, అది దీర్ఘకాలం కాదేమో?

ఈ స్త్రీమూర్తులందరు వారివారి మేధోసంపత్తి – విద్వత్తు – కళాకౌశలం సంపూర్తిగా ప్రదర్శించగల శక్తి – వనరులున్నా – ఎందుకో ఆ సందర్భాలు అరుదుగానే జరిగాయి. ఒక్కొక్కరు కాలగతిలో కనుమరుగైపోతూ తమ అందాలను – పొందికైన సొగసులను – వెన్నెలల్లో, హరివిల్లులతో నిక్షిప్తపరిచి నిష్క్రమించారు – వీరు తాము నివసించిన కాలపు నాగరకత – సంస్కృతిలో భాగమయిన భాగ్యులు – భాగ్యమతులు!

ఎంతటి సౌందర్యవంతులో అంతటి మేధోసంపత్తులు – అంతకు మించిన భారతీయ ఆత్మస్వరూపులు –
అలాంటి అరుదైన పదిమంది – కేవలం పదిమందిలో ఒక్కరైన ఒక ‘లీల’ తన తెలుగు నాయుడు మూలాల నుంచి ఫ్రెంచి ‘బోన్స్’ పోర్సెలిన్ శరీర ఛాయ – సౌందర్యాన్ని – ఎదుగుదల – సినిమా – రేడియో – టివి – పత్రికలు– యు.ఎన్. అంబాసిడర్ సఖిగా ప్రపంచాన్ని చుట్టిన వీర వనితా సాహసాలు – తన సంతోషాలను – తన వేదనలను – మనిషి దుఃఖాన్ని మీకు నివేదించటానికి సిద్ధంగా వుంది!

– – – –

జీవితానికి ఒకే ఒక పార్శ్వమూ – ఒకే సత్యముంటుందని ఎవ్వరూ నమ్మటం లేదు – నేను చెప్పబోయే కథ ఇప్పటి నిన్నటి లీల కథ! కొన్ని దశాబ్దాల క్రితం చెప్పవలసి వస్తే – తప్పనిసరిగా – అప్పటి నిర్ణయాల తప్పొప్పులకు క్షమాపణలు చెప్పుకోవలసిందే – కాని నేను విన్నది ఏమంటే – సాహిత్యకారుల – విమర్శకుల అభిప్రాయం ప్రకారం – ఏ ఒక్కరు పూర్తి పాఠం – అదే జీవితపాఠం ఇవ్వలేరు – అదెలాగంటే – ఈ విశ్రాంతరాళం ఎప్పటిదో – ఎప్పటి వరకూ కొనసాగుతుందో చెప్పగలమా?

ఒకరకంగా నేను అదృష్టవంతురాలినే – రెండు రోజుల్లో నా కథ చెప్పటానికి కూర్చున్నాను. నా పూర్వీకుల

తమ జీవిత కథలు చెప్పటానికి చాలాచోట్ల తిరిగారు. మన మహర్షులు మాట విని వుంటే – అలా జరిగేది కాదు – ఏ ఒక్క మనిషి జీవితాన్ని చిన్న మూట గట్టి – చేతికందించలేము కదా! –

'తుల్‌ముద్' అన్నట్లు – 'నువ్వు మనిషిని నిర్వచింపలేవు – నీవు చూసేది – విశ్వాంతరాళంలో ఒక భాగాన్ని మాత్రమే. ఒక 'విశ్వ శకలాన్ని మాత్రమే' –

ఒక వ్యక్తి – ఒక వ్యక్తి కాదు.

ఇప్పుడు నేను చెప్పేది – ఒక లీల పార్శ్వమే ఆ లీలా నాయుడు – నేను ఇప్పటి లీలను నేనే –

నేనే మీకు నా కథ చెప్తున్నాను. ఇదొక సందర్భం!

ముమ్ముందు – నా కథ వేరే రకంగా రూపు చెందవచ్చు – ప్రస్తుతానికి ఆ విషయం వదిలేద్దాం!

– – – –

ఇప్పుడే నాకు విలియమ్ బ్లేక్ పద్యం గుర్తుకొస్తుంది.

సుఖదుఃఖాలు పెనవేసుకుని ఉంటాయి – ఆత్మకు దేవతా వస్త్రంలా!

అన్ని వేదనలకు, బాధలకు – ఆనందం పట్టుదారంలా పట్టి వుంటుంది!

ఇది నేను పూర్తిగా నమ్ముతాను – దేనినుంచి నాకు మినహాయింపు లేదు – ఒకరి కథ నిజాయితీగా చెప్పాలంటే – విషాదాలూ, సంతోషాలూ సమానంగానే వుంటాయి.

నాకు – నా బాధల కోటా బాగానే వుంది.

రెండుసార్లు పెళ్లి చేసుకున్నాను. మొదటిసారి ఒబెరాయ్ హెూటల్స్ కుటుంబంలో తిలక్‌రాజ్‌ని –

రెండోసారి – నా చిన్ననాటి పరిచయం – కవి – డామ్ మోరేస్!

రెండూ పెటాకులే అయినాయి. ఆ జ్ఞాపకాలతో నేను కృంగిపోలేదు – అవే స్మృతుల నెమరు వేసుకుంటూ కూర్చోలేదు – కలలదేముంది ఏవైనా వస్తుంటాయి!

నా నిర్ణయాలు – నా కష్టాలు బేరీజు వేసుకోవటం కేవలం స్త్రీ దుఃఖాన్ని మళ్లీ ప్రపంచానికి విప్పి చెప్పటమే! నాలాంటి – నా ముందుతరం వారంటే నాకు గౌరవమే. వారి నిర్ణయాలు తప్పుపట్టలేము – వాటి పర్యవసనాలు వారే కదా అనుభవించింది. అలాగే నా నిర్ణయాల పూర్వాపరాల బాధ్యతా, బాధా – నాదే!

నా మనస్సాక్షి గాయాలను – ఇష్టంగానే భరిస్తాను. ఎందుకంటే అందులో – నాకు విలువైన అనుభవం వుంది–

నేను సినిమాలకి కొత్తగా వస్తున్నపుడు – నా వయసు ఇరవయి కూడా లేదు – ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ (తలపండిన జర్నలిస్ట్, సోషలిస్ట్) – 'నువ్వు తారవు కావటానికి చాలా చిన్నదానివి – ఇంకా చాలా డక్కాముక్కీలు తినాలి' అన్నారు.

అంటే ముళ్ల పాన్పుపై నిద్రించాలా? వెంట్రుకలతో నేసిన చొక్కాలు వేసుకోవాలా? ఈ బాధలకి కొలమానం వుందా – ఈయన రచయిత – జర్నలిస్ట్‌గా ఎదగటానికి ఏరకంగా సఫర్ అయ్యాడు? ఇవన్నీ అడగాలని వున్నా – బాధకి – బాధలకి కూడా గౌరవం వుంటుందని – విలువ కడతారని నమ్మాను!

కొన్ని మత విశ్వాసాలలో ఈ బాధకు చాలా గౌరవం వుంటుంది.

నా తల్లితండ్రులు – పెద్దగా మతాన్ని 'ప్రాక్టీసు' చేసినవాళ్లు కాదు. నాన్న హిందు – తెలుగువాడు. అమ్మ కేథలిక్ – ఫ్రెంచ్ వనిత! నన్ను వాళ్ళెపుడూ తమ బాటలో నడవాలని ఇబ్బంది పెట్టలేదు. నన్నే ఎంచుకోమన్నారు. అపుడు నాకు ఏడేళ్ళే – నేను వెళ్తున్న కేథలిక్ బడి – మాష్టారు – జెనీవాలో – 'ఇండియాలో మొసళ్లను – చేపలను పూజిస్తారు' అని చెప్పారు. 'వాళ్ల దేవుళ్లు రాళ్లు – చెక్కలే' – అని కూడా అన్నారు.

నాకప్పటికే ఒక అవగాహన వుంది. – గంగామాత అన్నా – మత్స్యావతారం చదువుకున్నాను.

ధైర్యంగా నిలబడి – 'మాష్టారు మీ వెనుకవున్న మేరీమాత కూడా – చెక్కతో చేసిందే' అన్నాను. ఆయన తత్తరపాటుతో – ఇది విగ్రహం కాదు – పూజకోసం – మన ధ్యాస నిలపటానికి నిలబెట్టిన పవిత్రమాత –

అంటూ, కాని ఆయనకి తెలుసు ఆయన గొయ్యి ఆయనే తవ్వుకుంటున్నట్లు – వెంటనే మాటమార్చి – అవును 'నీకు బాప్టిజమ్ జరిగిందా'? లేదని చెప్పాను.

అలాగా? అయితే రోజూ చర్చికి వస్తావెందుకు? మాటల్లో చెప్పకపోయినా – చర్చిలోని చీకటి – నిశ్శబ్దం – విశ్వాసం – ఇవే కదా చర్చిని నిలబెట్టినది. మేము స్నేహితులమైపోయాం.

నేను 'సూఫీ' వైపు మొగ్గు చూపుతున్నాను అని చెప్పినపుడు ఎందుకు అని ప్రశ్నించాడు.

'సూఫీ'లో ఎన్నో కాండిల్స్ వెలిగిస్తారు. ప్రపంచంలో అన్ని మతాలు – కాండిల్స్ – దీపాలు వెలిగిస్తారు.

క్రిస్టియానిటీ – జుడాయిజమ్ – ఇస్లాం – బుద్ధిజమ్ – హిందువులు – గిరిజనులు నమ్మకంతో దీపాలు పెడతారు.

ఆలీఖాన్ – సూఫీ ఆచార్యుని తమ్ముడు పేరుగాంచిన ఇనాయత్‌ఖాన్ – వీరిద్దరు నన్ను 'సూఫీ'ని చేశారు. వారు జెనీవా వచ్చినపుడు – వారితో పియానో వాయించేదాన్ని. వీరి చుట్టూ అఘాతమైన ఆధ్యాత్మికత ఆవరించి వుండేది. ఇవన్ని నాకు తెలిసి వస్తున్నా చెప్పేందుకు అప్పుడు మాటలు లేవు.

బైబిల్ – చైల్డ్ – చైల్డ్ భాషే మాట్లాడుతుంది! ఒక్క యాపిల్ తీసుకోమంటారు – నాకన్నీ కావాలి' ఒక్క రంగే ఎంచుకోమంటారు – నాకన్నీ ఇష్టమే – ఆయనకెదురు చెప్పకుండా – మేము స్నేహంగానే వుండిపోయాం!

– – – –

నా స్నేహితురాలు ఒకావిడ యిలా చెప్పింది. నువ్విలా వుండటానికి కారణం – నువ్వు ఒకచోట పెరగలేదు– అవును నేను బొంబాయిలో పుట్టాను. నాకు ఏడేళ్లు వచ్చేసరికి మహానగరాలు – పారిస్ – జెనీవాలో పెరిగాను. సూఫీలు కూడా ఒకచోట వుండరు – వీరు గాఢంగా ప్రేమిస్తారు. ఇప్పుడే ఇక్కడే అన్నట్లు వర్తమానంలో ప్రవర్తిస్తారు.



పత్తిపాటి రామయ్య నాయుడు

దైవం అంటే ప్రేమమూర్తి – నీ అనుభవంతో ఆయనను దర్శించు – విడిపోవటంలోని విషాదాన్ని – ఆనందంగా దర్శించాను. సంగీతంతో పండగ చేసుకోవలసింది – జీవితం – వేడుకలో దైవాన్ని చూడు – వేడుకలోని అంతర్లీనమే వేదన!!

ఒకసారి నాన్నను అడిగాను. 'నొప్పి ఎందుకు కలుగుతుంది'?

నీవు నిప్పులో చేయి పెడితే కాలి నొప్పి తెలుస్తుంది. మంటకు దూరంగా వుండాలి – ఏది ఎలా నొప్పి కలిగిస్తుందో ఎలా? తెలుస్తుంది – తెలుసుకోవటమే ఒకటే దారి!

మనసు ఒకసారి వెనుతిరిగి చూస్తే – మరొకరు చేసిన తప్పుల మూలంగా మనకు ఎలా తెలుస్తుంది?

ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలు? చిన్నప్పటి నుంచి మనకొక నమ్మకం ఇది మనకు జరగదు – అని! బహుశా అదే కర్మ అంటారేమో! మనం అంత తెలివితక్కువగా వుంటామా అని ధీమా?

ఏది ఏమైనా మానవజాతి, చరిత్ర నుంచి ఏమి నేర్చుకుంది? రచయిత రాసింది చదివే పాఠకుడు – నేను ఇలాంటి తప్పు చేయను అనుకుంటాడు!

ఇదే నా కథ – నేను చెప్పదలుచుకున్న కథ – దీనికి వేరే పార్శ్వాలు కూడా వున్నాయి. నా జీవితంలోకి వచ్చినవాళ్ళు వారి వెర్షన్ వాళ్లు చెప్తారు. వారి దృష్టిలో లీలా? అయినా నా లీల నేను పెద్ద కథ. జీవితంలో చాలా సందేహాలున్నాయి. వాటికి ఆమె అవగాహన పరంపరే –

ఈ కథ – మీరు వినబోయే కథ!

టాల్‌స్టాయ్, అన్నా కెరనినా నవల ప్రారంభంలో – 'సంతోషంగా వున్న కుటుంబాలన్నీ ఒకరకంగా వుంటాయి – సంతోషంగా లేని కుటుంబాలకు ఎవరి కారణాలు వారికుంటాయి' అని మొదలవుతుంది. ఇది ఇట్లాగే వుంటుందా? అంటే సంతోషం అంత చప్పగా ఒకేరకంగా వుంటుందా?

అంటే సంతోషంగా లేనివాడు – ఎందుకు లేడో – ఎట్లా లేడో తెలుసుకోవాలి కదా!

ఇప్పుడు భారతదేశంలో బాల్యం అంత సంతోషంగా గడవదు – నడవదు – కన్నవాళ్లు కఠిన క్రమశిక్షణ, చదువుకోసం వత్తిడి – జీవితంలో పైకి రావటానికి తాపత్రయం – అన్నీ పసివాళ్లను వత్తిడికి గురిచేస్తాయి.




అమ్మ మార్తాతో లీల

పెద్దవాళ్లు ఎంత కష్టపడి చదివింది – ఎంతదూరం నడిచి బడికి వెళ్లింది – ఎన్ని బెత్తం దెబ్బలు తిన్నది ఇలా... వారి ఆలోచనలే వేరు, ఆరోజులే వేరు – బంగారు కాలం అని నిట్టూరుస్తారు.

నా చిన్నప్పుడు ప్రతి చైల్డ్ ఒక 'బండిల్ ఆఫ్ ఫీలింగ్స్' నిస్సహాయత – స్వార్థం – ఇంట్లో దెబ్బలు పడితే, స్కూల్లో గ్రౌండ్ చుట్టూ ఎండలో పరుగుపెట్టడం – ఇలా రెండూ – కోపంలో నిస్సహాయంగా రగిలిపోవటానికి కారణాలు – ఏ బాలుడూ దెబ్బలతో నీతి నేర్చుకోడు – గ్రౌండ్ చుట్టూ పరుగులు పెడితే చదువు రాదు. ఇవన్నీ నేను చదువుతూ పెరిగే రోజుల్లో దగ్గర్నుంచి చూశాను. ఆ సందేహం నాకూ లేదు. చాలు – ఇవి సంతోషంతో గుర్తు చేసుకునే సంఘటనలే. అయితే నా తల్లితండ్రులు – మంచి దయ గలవారు. వారిని నేనెంతో ప్రేమించాను – ఈరోజు గుర్తుచేసుకుంటే అమ్మ – నాన్న నన్ను ఎంతో గౌరవంతో, అనురాగంతో చూశారు. ఏనాడూ చిన్న దెబ్బ వేయలేదు – ఎటువంటి కఠిన శిక్షలు విధించలేదు. నన్ను సరైన మార్గంలో పెట్టాలంటే – కూర్చోపెట్టి ఏది మంచో–ఏది చేయకూడదో–సౌమ్యంగా, అనునయంగా చెప్పేవారు. అదీ విషయం – ఇప్పుడు కథలోకి వెళ్దాం...

## కమ్మతెమ్మెర


**మిసిమి** మార్చి నెల అందుకోవడంలో జాప్యం జరిగింది. ఎందుకోమరి? ఎప్పుడూ నెల ఐదో తారీఖున లోపల అంది పోయేది. ఈసారి ఆలస్యమవడంతో మళ్ళీ వారిని అభ్యర్థించడంతో మరొక కాపీ పంపారు. ఇంతలో ఏప్రిల్ మాసం వచ్చేసింది. ఈసారిమాత్రం ఎలాంటి ఆలస్యం జరగలేదు. మొత్తం మీద రెండూ పత్రికలు ఏకబిగిన చదవడం జరిగింది. నేను కళాశాలలో చదువుతున్న సమయంలో (ఆంగ్లమాధ్యం) బెనర్జీ గైడులు దొరికేవి. అప్పుడు తరగతులు మిస్సైతే పాఠాలు వినలేకపోయామే అనే బెంగ ఉండేది. అప్పుడొక మిత్రుడన్నాడు "వై సీనియర్, బెనర్జీ గివ్వస్ ఎనర్జీ" అనేవాడు. అలా అవి చదువుకొనేవాళ్ళం.



ఈ విషయం ప్రస్తావించడానికి కారణం ఏమిటంటే **మిసిమి** ఒక సూక్ష్మ విజ్ఞానసర్వస్వం. ఇందులో చరిత్ర, భౌగోళికం, సైన్స్, సాహిత్యం, సంగీతం, లలిత కళలు, ఇంకా మహానుభావుల ఇంటర్వ్యూలతో ఒక చక్కని గైడులా విషయం పరిజ్ఞానంతో పదిమందికి ప్రయోజనకరంగా తీర్చిదిద్దే బడుతోంది. ఈ పత్రికను తీర్చిదిద్దుతున్న "ఎందరో మహానుభావుల"కు అభివందనములు. అభినందనలు.

*- దోసపాటి వేంకట రామచంద్ర రావు, విజయనగరం, ఫోన్ : 7780594995*

# జీవన మకరందం



- ❖ మన బలహీనతలకు ఆధ్యాత్మిక ముసుగుతో దైవత్వాన్ని ఆపాదిస్తుంటాం!
- ❖ కేవలం ప్రాపంచిక (లౌకిక) సేవలతో సమూహాలకు శాశ్వత సంతోషాన్ని అందించలేము!
- ❖ జాతి, తమ విశ్వాసంతో, ఆధ్యాత్మిక సాధనతో ఆనందాన్ని పొందవచ్చు!
- ❖ గురువు తన శిష్యునిలోని శక్తియుక్తులను వెలికి తెచ్చే అవకాశం కలిగించాలి –
- ❖ ధన సంపాదన, ఏదో సాధించాలనే తపన ఇవే, నీ లక్ష్యం కాకూడదు.
ఆధ్యాత్మిక చైతన్యం నీ జీవితాన్ని సౌందర్యవంతం చేస్తుంది!
- ❖ నీవు ఏ క్రీడ ఎంచుకున్నా – ఎన్ని పరుగులు చేశావో, ఎన్ని గోల్సు చేశావో ముఖ్యం కాదు.
ఆ క్రీడలో ఎంత ఆనందాన్ని ఆస్వాదించావో అన్నదే – ముఖ్యం!
- ❖ ఆలయాల్లో లభించే తీర్థప్రసాదాలు చాలా పవిత్రమైనవి! దైవ భావన నిన్ను పునీతం చేస్తుంది!
- ❖ క్షమాగుణం లేకుండా నీకు మనశ్శాంతి లభించదు. క్షమించటం అంటే నీలోని దైవత్వాన్ని – ధ్యానాన్ని సాధన చేయటమే!



- ❖ భావావేశంతో జీవించకు – ఎరుకలో బ్రతకటం అలవాటు చేసుకో–
అనవసర అనారోగ్యకర బంధనాల్లో చిక్కుపడకు.
నీమీద – నీ నమ్మకంతో ధైర్యంగా జీవించటానికి ప్రయత్నించు!
- ❖ నీలోని చెడుని జయించాలంటే మంచిని నిద్రలేపాలి! అదే దైవ గుణం!
- ❖ విమర్శ సముద్రంలాంటిది. ఒక్కసారి అందులో దిగితే అడుగూ వుండదు – అంతూ దొరకదు! బైటపడటం అంత తేలిక కాదు!
- ❖ తత్త్వశాస్త్రం బోధించిన సిద్ధాంతమే విజ్ఞానశాస్త్రం నిరూపిస్తుంది.
కారణాంతాన – కార్యం సిద్ధిస్తుంది!
- ❖ శరీరం విశ్రాంతంగా వుంటే – నీలోని చైతన్యం నీ విద్యుత్తును మేల్కొపుతుంది!
- ❖ ద్వేషం మూలంగా మంచిని కూడా చెడుగా చూస్తాం!
- ❖ కొన్ని విషయాల్లో చాలా కఠినంగా వుండాలి! నీ హృదయాన్ని విచ్చలవిడిగా వదిలివేయకు –
దానిని ఎపుడూ విద్వత్తు అధీనంలో నియంత్రించటం అలవాటు చేసుకో–
- ❖ నీవు ఎవరినైనా ఇష్టపడుతున్నావు అంటే ఆ ఎవరు, **ఎవరైనా** నీవు ఇష్టపడుతున్నావన్నమాట!

**స్వామి చైతన్యానంద**
**(ఆంగ్లం)**

## "తెరచిన పుస్తకం ఆయన జీవితం"/ "గొడ్డ కాడి బుడ్డోడు వి.సి.అయిన వైనం"

# కొలకలూరి ఇనాక్



కొలకలూరి ఇనాక్

**– మిసిమి**

**ఆ**యనను చిన్నతనంలో "అలగా" వాడు అని పిలిచేవారు. అలగా వాడంటే అనాథ కావొచ్చు. సరైన కుటుంబం లేనివాడు కావొచ్చు. ఆ పేరుతో ఆయనకు వేసిన ముద్ర తోటిపిల్లల నుంచి ఛీత్కారాలు, చెంపదెబ్బలకు దారితీసింది. వీటిని తప్పించుకోవటం కోసం ఆయన బాల్యమంతా పరుగులు పెట్టడంలో గడిచిపోయింది. అలా అలవాటైన పరుగు ఆయన్ని జీవితాన్ని కాపాడింది.. గుంటూరులో ప్రవేశపరీక్ష రాయటానికి ట్రెయిన్ టికెట్ కొనటానికి డబ్బులేక పట్టాలవెంట ధైర్యంగా పరుగుదీయగల నైపుణ్యాన్ని నేర్పింది. బర్రెలు కాసే బుడతడు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అయ్యేందుకు మార్గం వేసింది.. ఆయనే పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్.. తనను సమాజం అక్కున చేర్చుకునే సామాజిక వర్గం కాదు. అయినా ఆయన సమాజం పట్ల ద్వేషం పెంచుకోలేదు. చదువంటే మక్కువ..అంతిమంగా అది ఆయనలోని అశాంతిని సాహిత్యంగా మార్చింది.. ఎనభై ఆరేళ్ళ ముదిమి వయసులోను మనుషులంటే ప్రేమ పోలేదని ఆయనతో జరిపిన మూడు గంటల సంభాషణ స్పష్టం చేసింది..

ఆయన సంభాషణ వారి జీవితంలోని మూలమూలాలను వెతికి మరీ చూపింది..మధ్య మధ్యలో ఆయన సజల నయనాలు పాత జ్ఞాపకాలను తడిపేయగా గాద్గికమైన గొంతు పొరబోయింది. ఆ నిశ్శబ్దపు నీడ అట్టడుగు జీవితాలెందుకు ఎడారిగాలులతో ఉక్కబోతల ఇసకతుఫానులై సంఘర్షణల తీరాలను తాకుతాయో అర్థమయింది..

ఇంచుమించుగా ఇనాక్ గారు తనలోకి తాను చూసుకున్న క్షణాల్లోంచి ద్రవీభవించిన దుంఃఖం ఈ సంభాషణ ..**మిసిమి** పాఠకులను ముంచెత్తక మానదు.

*పరీక్ష రాయటానికి అణా రైలు టికెట్‌కి లేక పట్టాల వెంట పరుగులు పెట్టిన పది సంవత్సరాల 'అలగా' వాడు, శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సెలర్‌గా ఎదిగాడు... వందకు పైగా పుస్తకాలు వివిధ ప్రక్రియల్లో రాశాడు... దాదాపు 57పుస్తకాలు భారతీయ భాషల్లోనే కాక ఆంగ్లం, జర్మన్, సంస్కృతంలోకి అనువాదం చెందాయి... 10 పుస్తకాలు వివిధ విశ్వావిద్యాలయాల్లో పాఠ్యపుస్తకాల్లో చోటు చేసుకున్నాయి.... ఆయన వ్యక్తిత్వం అహంకార రహితం... ప్రేమతత్వం... మనిషిని మనిషిగా ప్రేమించగల విశాల హృదయం....అనుక్షణం జీవితాన్ని ప్రేమించే వెలుగు దివ్వె....18మంది కుటుంబ సభ్యులతో కళకళలాడుతూ అలరారే కుటుంబీకుడు... ఆయన జీవన ప్రయాణం తెలుసుకుందాం రండి....*

---

**మిసిమి : ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు నమస్కారం..మిసిమి కి స్వాగతం. మీరు మేరు నగం.. మన భారతీయ తత్త్వ శాస్త్రంలో ఒక పర్వతానికి, ఒక నదికి, ఒక సముద్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నమ్మకానికి, గంభీరతకు, నిత్యచలనతకు పైమూడూ ప్రతీకలు. మిమ్మల్ని తెలిసినవారు ఈ మూడూ మీలో అంటే మీ వ్యక్తిత్వంలో, విద్యలో, మీ లౌకిక జీవనంలో మీ మర్యాదలో నిబిడీకృతమై ఉన్నాయని అనుకోవటంలో అతిశయోక్తి లేదు..ఈరోజు మీతో సంభాషించటానికి పూనుకున్నది మిమ్మల్ని అంచనా వేయటానికి కాదు.. మాకు తెలిసిన పార్శ్వాలు కాక మీ అంతరంగ ఆవిష్కరణ ప్రధాన లక్ష్యం.. మీరు చెప్పండి.. మీ మనసు విప్పండి.. చాలు..**

**ఇనాక్ :** ఒక ఆత్మీయ వాతావరణంలో మిమ్మల్ని కలుసుకోవటం చాలా సంతోషంగా ఉంది..

**మిసిమి : మిమ్మల్ని నోబెల్ సాహిత్య పురస్కారానికి అర్హులైనవారుగా డా. రావెళ్ళ రమేష్ గారు మిసిమి పుటల్లో గట్టిగా వినిపించారు. ఆ దిశగా మీరేమైనా చేశారా చెప్పండి..**

**ఇనాక్ :** రమేష్ గారు నా గురించి గొప్పగా మీరు చెప్పినట్టు రాశారు. మీరు ప్రచురించాక చాలామంది నాగురించి మాట్లాట్టం మొదలుపెట్టారు. తర్వాత రమేష్ గారిని ఆ ప్రాసెస్ గురించి అడిగాను. ఆయన ఇలా ఇలా ఉంటుందని చెప్పారు. ఆ దిశగా ప్రయత్నాలు మనవాళ్ళు చేశారు. 2023లో రమేషు గారిని కలిసినప్పుడు ఇవి తనదృష్టికి కూడా వచ్చాయని ఆయన చెప్పారు. అయ్యా అశ్వినీ గారు అదీ సంగతి..

**మిసిమి : ఇందాక మాటల్లో మీవి 108 పుస్తకాలు వచ్చాయని చెప్పారు. మీమీద ఎన్ని పుస్తకాలొచ్చి ఉంటాయి?**

**ఇనాక్ :** లెక్కపెట్టలేదు గానీ, నా రచనల మీద వచ్చిన పుస్తకాలు అరవై, డెబ్బై మధ్య వచ్చి ఉంటాయి..పోయిన సంవత్సరమే ఓ ఎనిమిది పుస్తకాలొచ్చాయి..ఇక్కడ మీకో విషయం చెప్పాలి.అదేమిటంటే నా రచనలు అనువాదమవటం అనే క్రియ ఇటీవలి కాలంలో చాలా ఎక్కువైంది. ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తమిళం, మళయాళల భాషల్లోకి వెళుతున్నాయి. వీటిల్లో కన్నడం ఎక్కువ, మళయాళం తక్కువ.. నా మునివాహనుడు పుస్తకం చాలా ప్రాచుర్యం పొందాక, సాహిత్యఅకాడెమీ వారు చాలా సంతోషపడ్డారు.. నా ఊరబావి సంకలానాన్ని భద్రిరాజు కృష్ణమూర్తిగారు సాహిత్య అకాడెమీ కన్వీనర్‌గా ఉన్నప్పుడు మోడర్న్ క్లాసిక్‌గా తీసుకున్నారు. సాధారణంగా జీవించి ఉన్న వ్యక్తులవి తీసుకోరు. నేను exception..ఆ పుస్తకాన్నిప్పుడు ఇరవైనాలుగు భాషల్లోకి అనువాదం చేస్తున్నారు.

**మిసిమి : ఒక్కమాట ఇనాక్ గారు.. మోడర్న్ క్లాసిక్ అంటే ఏమిటి?**

**ఇనాక్ :** కాలాన్ని దాటి నిలబడి ఉండే పుస్తకం అనుకోవచ్చు.. అవి సాధారణంగా కాలం చేసిన వ్యక్తులవే ఉంటాయి..ఎప్పుడో కానీ నాలాంటివారివి ఉండవు. మీపుస్తకానికి ఎప్పుడో పురస్కారం రావాలి, కానీ రాలేదు..అందుకని ఈపనిచేస్తున్నాం అని చెప్పారాయన. ఇప్పటికి ఎనిమిది భాషల్లోకి వెళ్ళిందా పుస్తకం. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లోకి కూడా వెళుతోందిప్పుడు. ఇంకో విషయం చెప్పాలి మీకు. మునివాహనుడు ఇప్పటివరకూ ఏడు భాషల్లోకి అనువాదమైంది.తిరుపతిలో ఉన్న సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి కృష్ణమూర్తిగారు చాలా ఇష్టపడి మునివాహనుడుని సంస్కృతంలోకి అనువాదం చేశారు. సాధారణంగా సంస్కృతం నుంచి తెలుగులోకి వస్తాయి కానీ, తెలుగు నుంచి సంస్కృతంలోకి వెళ్ళటం చాలా అరుదు. ఇక నావి మొత్తం నలభై ఎనిమిది అనువాదాలున్నాయి. వాటిలో నాపై వచ్చిన పుస్తకాలు ఇరవై ఒకటి. నేనొక పుస్తకం Voice of Silence పేరుతో ఇంగ్లీషులోనే రచన చేశాను. ఒక మిత్రుడు నిశ్శబ్ద స్వరం శీర్షికతో తెలుగులోకి అనువాదం చేశాడు. నూర్ అనే ఆయన సాహిత్య అకాడెమీ వైస్ ఛైర్మన్‌గా ఉండేవాడు. ఆయన పంజాబీ భాషలోకి తర్జుమా చేశారు.

**మిసిమి : మీ అనువాదాల గురించి బాగా చెప్పారు. ఒకరోజంతా మీతో గడిపినప్పుడు నాకు ఎన్నో విషయాలు చెప్పారు. వాటి గురించి అనేక పర్యాయాలు మిసిమిలో ప్రస్తావించాను. అయితే ఇవాళ మీ బాల్యం, విద్యార్థి దశల గురించి మా పాఠకులకు చెప్పండి..**

**ఇనాక్ :** నా బాల్యం గురించి చెబుతాను. కొంచెం ఇబ్బందికరమైనదే. మా నాయన వేటపాలెంలో పుట్టాడు. ఆయన, ఆయనతో పాటు చెల్లెలు.. తల్లి గతించింది. తండ్రి ఇంకో పెళ్ళి చేసుకున్నాడు. సంవత్సరంపాటు ఆవిడ వీళ్ళిద్దరినీ బాగానే చూసింది.ఆవిడకు పిల్లలు వచ్చాక వీళ్ళని ఎలాగైనా వదుల్చుకోవాలనుకుంది. తెనాలి పక్కనున్న అంగలకుదురులో మేనమామల పంచన చేరారు ఆయనా, చెల్లెలు.. ఆయనకప్పుడు ఆరు సంవత్సరాలు..చెల్లెలికి నాలుగు సంవత్సరాలు. మాతాత ఏంచేశాడంటే మా నాయనను ఒక రైతుకు అప్పచెప్పాడు.. దేనికి అంటే పశువులు కాయటానికి.. ఆ ఊళ్ళో సత్యం గారనే ఆయన దగ్గర పశువులు కాసేందుకు ఉన్నాడు. మూడు బస్తాల వడ్లు సంవత్సర సంపాదనతో ఆయన అక్కడ చేరాడు. మూడు

బస్తాల జీతగాడి నుంచి పదిహేను బస్తాల జీతగాడయ్యాడు అక్కడే. ఇరవైరెండే ఏట వరకు అక్కడే ఉన్నాడు. ఆయన మేనమామలు ఎంత మంచివాళ్ళంటే , ఈయన సంపాదించిన వడ్లనన్నింటిని జాగర్తపరిచి ఆయన చెల్లెలు పెళ్ళి చేశారు. మా నాయన పెళ్ళి గురించి చెప్పాలి. ఆరోజుల్లో పదిహేను, పదహారేళ్ళకు పెళ్ళి చేస్తుండేవారు. మా నాయన ఉండేది కమ్మవారింట్లో.. ఈయన శ్రమజీవి. వాళ్ళు ఈయన్ని బాగా చూసేవారు. వాళ్ళకేమో ఈయన ఎప్పటికీ వాళ్ళదగ్గరే ఉండాలని ఉండేది. పెళ్ళయితే వెళ్ళిపోతాడేమోనన్న భయం ఉండేది. ఈయన పెళ్ళివిషయం మేనమావలు కూడా పట్టించుకోలేదు. ఆరోజుల్లో అంతకాలం పెళ్ళికాకుండా ఉండటం విశేషమే. మా తాత (మా అమ్మ తండ్రి) వేజండ్లలో ఉండేవాడు. ఆయనకు పన్నెండుమంది సంతానం. మా అమ్మ పదకొండవది. ఆయన తన కూతురుకి పెళ్ళిచేసినా బయటకు పంపకూడదని నిర్ణయించుకున్నాడు. ఈ సంబంధం గురించి మా నాన్న మేనమామలు చెప్పారు. పిల్లను అంటే మా అమ్మను చూడటం జరిగింది. వెంటనే ఒప్పుకున్నాడు. ఒకటే ఇబ్బందేమిటంటే పెళ్ళయితే అత్తారింట్లో ఉండాలి. మా అమ్మ వెంటనే చేసుకుంటానని చెప్పింది. మానాన్న నాకన్నా ఓ గుప్పెడు ఎత్తుంటాడు. బలిష్టంగా ఉండి చక్కటి ఆరోగ్యవంతుడు. పెళ్ళినాటికి మా అమ్మకు పధ్నాలుగేళ్ళు. అప్పటికి ఆవిడకు రెండేళ్ళు ఆలస్యమైందనే చెప్పాలి. సత్యంగారు వాళ్ళు పిల్లను మా ఇంటికి పంపించండి, మావాడు మాదగ్గరే ఉంటాడంటారు. కోడలుగా మా అమ్మని తీసుకెళతామంటారు. మా అమ్మ తరపువాళ్ళు కుదరదనేశారు. జీవితంలో తల్లీతండ్రీ లేరంటే చాలా చిన్నచూపుంటుంది. అందులో మాదిగపల్లిలో ఇంకా ఎక్కువ. అక్కడా “అలగా” బ్యాచ్ అని ఒకటుంటుంది. వీళ్ళెవరంటే ఆ ఊళ్ళో పుట్టి పెరగరు. ఎక్కడో పుట్టి పెరిగి ఇక్కడ అంటే ఒక ఊళ్ళో స్థిరపడటానికి వస్తారు. అలా మానాన్న పెళ్ళయ్యాక అత్తారింటికి వచ్చాక, ఇల్లు లేకపోవటం ఆయనకో సమస్య అయింది.అత్తా మామల దగ్గర జీతగాడయ్యే పరిస్థితి వచ్చింది. దాన్ని ఆయన ఒప్పుకోలేకపోయాడు. కానీ మా అమ్మంటే చాలా ప్రేమ. మీవాడిని పంపిస్తారా అని అడిగే రైతులు తయారయ్యారు. గవిని శ్రీరామయ్యగారనే ఆయన, ఈయన్ని ఇష్టపడ్డాడు.ఈయన చేరాడు. పొద్దున ఆరుగంటలకు వెళితే రాత్రి ఏడుగంటలకు వచ్చేవాడు. బాగా చూసుకునేవారు. మంచి భోజనం పెట్టేవారు ఆయన సుఖంగా శాంతంగా ఉన్నాడు కానీ నేను “అలగా” వాడి కొడుకునయ్యాను. మాఅమ్మ ముందు అనేవారు కాదు..లేనప్పుడు ఇబ్బంది అయేది. పిల్లతో ఆడటానికి వెళితే అలగా వాడివి అని రానిచ్చేవాళ్ళు కాదు. స్కూల్లో ఏదైనా అడిగితే చెప్పలేకపోతే మాస్టారు, చెప్పినవాడితో ఆ చెప్పనివాడి ముక్కుమీద చేత్తో దెబ్బకొట్టినట్టు రాయించేవారు.. నేనాపనిచేస్తే వాళ్ళ ఇళ్ళలో అలగా వాడు ఇలా చేస్తాడా అని అసహనంగా ఉండేవారు.. నాకింట్లో ఉంటే సంరక్షణ ఉంది. బళ్ళో ఉంటే ఉంది. ఈరెండూ కాకుండా ఇంకెక్కడైనా ఉంటే మాత్రం లేదు. అందుకని పరిగెత్తి పారిపోవటం అలవాటయింది.

**మిసిమి : ఇదే మరొకరయితే తప్పుతోవలో వెళ్ళేవారేమో కానీ మీలో నెగిటివిటీ లేకపోవటం మిమ్మల్ని ఆ తప్పుదారిన వెళ్ళనివ్వలేదు..**

**ఇనాక్ :** నా చదువు మొదలైన కొత్తలో నాకో ఇబ్బంది వచ్చింది. మా నాన్న నన్ను ఎక్కడైనా జీతగాడిగా పెడదామన్న ఆలోచనకు వచ్చాడు. నా ఖర్మకొద్ది మా నాన్న పెదజీతగాడు..చినజీతగాడు పెళ్ళై వెళ్ళిపోయాడు. గవిని శ్రీరామయ్య గారు నన్ను పంపించమన్నాడు. మా నాన్నకు నేను పడుతున్న ఇబ్బందులు తెలుసు. అందుకని రైతు దగ్గర పెట్టేస్తే నయమని భావించాడు. ఆయన నిర్ణయం ఆయనకు బాగానే ఉంది కానీ నాకు బాగా లేదు. సంచీ అక్కడ పారేయ్ అని దాదాపు ఈడ్చుకు పోయాడింటికి. నా అదృష్టం కొద్ది మా అమ్మకు నన్ను చదివించాలని ఉండేది. నేను ఇద్దరు బలవంతుల మధ్య ఇరుక్కుపోయాను. మా నాయనది ఉక్కు శరీరం.. మా అమ్మది ఉక్కు మనసు.. కానీ మా నాయన నన్ను లాక్కెళ్ళి రైతు దగ్గర పెట్టేశాడు. పశువుల లేగదూడలతో నాకు మచ్చిక ఏర్పడింది. నేను మొదటిసారి ఎప్పుడు ఏడ్చానంటే 1947 ఆగస్టు 15వ తేదీన అందరికీ జెండాలు చొక్కాకు పెట్టారు. నేను చదువుకోవటం లేదని నాకు పెట్టనన్నారు. మానసికంగా తెలియని

దిగులు నాలో చోటుచేసుకుంది. శ్రీరాములు గారు రైలుకట్ట పక్కన పశువులు మేపుకునేందుకు మైలు దూరం వరకున్న పచ్చిగడ్డిని వేలంపాటలో తీసుకున్నాడు. పశువుల్ని మేపి తీసుకురావటమే నా పని. తీసుకొచ్చాక అన్నం పెట్టేవాళ్ళు. అక్కడ ఉంటే ఉండొచ్చు, లేదా ఇంటికి రావొచ్చు. మూడు, నాలుగ్గంటలకు ఇంటికి వచ్చేసేవాడిని. నాకు జీతగాడన్న ముద్ర పడిపోయింది. చదువుకోకపోవటంతో నన్నందరు చిన్నచూపు చూసేవారు. నేను చెడుగుడు బాగా ఆడేవాడిని. నన్ను ఆడనిచ్చేవారు కాదు. నేను కోడూరి వారి టీంలో ఆడి గెలిపిస్తే (హోం టీం ని ఓడించి) అందుకు కూడా కొట్టేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే మీరు ఊహించలేని జీవితం గడిపాను.. తర్వాత యూనివర్సిటీలో విశాఖపట్నంలో చదివే రోజుల్లో యూనివర్సిటీ టీం కెప్టెన్‌ని. అలాగే రన్నింగ్ రేస్‌లో కూడా ముందుండేవాడిని. ఇక్కడ చేయలేనివి అక్కడ చేశాను. మళ్ళీ బాల్యం రోజుల్లోకి వస్తే స్కూల్‌కు వెళ్ళటంలేదన్న బాధ అలాగే ఉంది. ఆ బాధ మా ఆసామి తీర్చాడు. అదెలాగంటే నాకు పేడ, కసువుతో కలిపి తీయటం వచ్చేది కాదు. మా ఆసామి రెండు మూడుసార్లు నేర్పించే ప్రయత్నం చేశాడు.. కానీ నావల్ల కాలేదు. ఆయన విసిగిపోయి ఓ దెబ్బవేశాడు. నాకు రోషం వచ్చింది కానీ జీతగాడు పేడతీయకపోతే ఇంకెందుకు. కాబట్టి కొట్టడంలో తప్పులేదు. అక్కడి నుంచి పారిపోయాను. ఇంటికిపోతే మళ్ళీ మా నాయన ఇక్కడే పెడతాడు. మా అమ్మకి చెబితే నాన్న చెప్పినట్టు వినరా అంటుంది. మరేం చేయాలి.. ఇల్లొదిలిపెట్టి పారిపోవటం ఒక్కటే మార్గ అనిపించింది. మా నాన్న పుట్టిన వేటపాలెం వెళ్ళిపోయాను. మొదటి రెండురోజులు రాముడు కొడుకొచ్చాడని బానే చూశారు (మా నాన్న పేరు రామయ్య). ఎందుకొచ్చావని ఎంక్వైరీ చేశారు. చెప్పాను. మీవాడిక్కడ ఉన్నాడని మనిషిపోయి కబురు చెప్పాడు. ఎంత దూరం ఉంటుంది రెండు ఊళ్ళమధ్య అంటే, ఐదారు కిలోమీటర్లుంటుంది. తీసుకు వెళ్ళేందుకు మా అమ్మ వస్తుందని చెప్పారు. మళ్ళీ భయంతో పరుగుతీశా. ఈసారి మా నాన్న పెరిగిన అంగలకుదురు వెళ్ళిపోయా.. అక్కడా బాగా చూశారు.. ఎందుకొచ్చావంటారు.. మళ్ళీ మా అమ్మ వచ్చేట్టు ఉందని ఈసారి తెనాలిలోని అయితానగర్ గోడ దగ్గరకు వచ్చాను. అక్కడా రెండురోజులే.. మళ్ళీ అక్కడినుంచి మరో పరుగు.. ఈసారి మా మేనత్త ఉన్న వల్లభాపురం గ్రామానికి వెళ్ళాను.. అక్కడ వాళ్ళు నన్ను పెంచుకుని వాళ్ళమ్మాయికిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నారు. ఇంకోపక్క మా అమ్మ వస్తోందని తెలిసింది. ఆవిడను (మా అమ్మను) చాలా కష్టపెట్టాను. కానీ తప్పదు. అక్కడినుండి కొలకలూర్ వచ్చాను. అక్కడ బెంజమిన్ గారి హాస్టల్ ఉండేది. అక్కడ అన్నం పెట్టి చదువు చెబుతారని పేరుండేది. నన్ను అడిగి వివరాలు తెలుసుకున్నాడు. ఎందుకొచ్చావు అన్నాడు. చదువుకోవాలని అన్నాను. అయితే చదువుకో అన్నాడు. రెండు నెలల తర్వాత అక్కడికి మా అమ్మ వచ్చి ఏడవటం మొదలుపెట్టింది. ఇక జీతానికి నిన్ను పెట్టనంది.. బెంజమిన్ గారు ఇది చూసి ఆయన ఏడవకమ్మా, మీ అబ్బాయిని తీసుకువెళ్ళాలంటే తీసుకెళ్ళిపో అన్నాడు. మళ్ళీ మామూలే.. తిరిగి వచ్చాక నన్ను చూసిన మా నాయన చాలా తిట్టాడు. తనకు కనిపించవద్దని గట్టిగా కసురుకున్నాడు. అలా నేను మా నాయనకు కనిపించకుండా దాక్కోవటం మొదలుపెట్టాను. ఇలాంటి సమయంలో నా జీవితాన్ని మార్చింది తగరపు దేవదాసు గారు, ఆయన భార్య అపరాజితమ్మ గారు.. ఆవిడ అక్కడి స్కూల్లో టీచర్. కానీ మాదిగపల్లిలో ఉండాల్సి వచ్చింది. ఈయన గుంటూరు ఏసీ కాలేజీలో బి.ఏ. ఆఖరి సంవత్సరం చదువుతుండేవాడు. పిల్లలకు ట్యూషన్లు చెబుతుండేవాడు. రూపాయి ఫీజు.. నేను ఆ పిల్లలను చూస్తుండేవాడిని.. నాకు భుజాన కండువా, మెళ్ళో సంచీ ఉండేవి. ఆయన లెక్కలు చెబుతూ వడ్డీ లెక్క చెప్పి పిల్లలను అడిగినప్పుడు అక్కడే ఉన్న నేను నోటికి చెబితే ఆశ్చర్యపోయాడు. రాసి చూపిస్తావా అంటే చూపిస్తా అన్నాను. నీకెట్లా వచ్చు అంటే మొత్తం కథంతా చెప్పాను. జీతగాడిగా ఉండి పారిపోయిన వైనం గురించి. మాదో అతి సాధారణ కుటుంబం.. మా ఊరిలో మేమెవరమో ఎవరికీ పెద్ద తెలియదు. అందువలన ఆయన మా ఇంటికొచ్చి మాఅమ్మనడిగి వివరాలు తెలుసుకున్నాడు. వాళ్ళింటికి తీసుకళ్ళి చదువు చెప్పటం మొదలుపెట్టాడు. ఎప్పుడూ ఆయన దగ్గరే ఉండేవాడిని. అతనకి బంకలా

అతుక్కుపోయావేమిరా అని మా అమ్మ విసుక్కునేది. మూడునెలలు గడిచాక ఆయన నిన్ను ఆరోతరగతిలో చేర్పిస్తానురా అన్నాడు.. ఈలోగా మూడు సంవత్సరాల కోర్స్ చెప్పేశాడు నాకు.

నేను వారింట్లోనే పడుకుంటూ ఉండేవాడిని..అక్కడే చదువుకుంటూ ఉండేవాడిని. మాఅమ్మకు నేను ఇంటికి వచ్చి అన్నం తింటే చాలు.. ఆరోజుల్లో చదివిన పద్యాలు ఎంతగా మనసుకు హత్తుకున్నాయంటే రామాయణంలోని పద్యాలు చదివినప్పుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసేశారని బాధపడి ఎందుకు అలా జరిగింది అని మాస్టారుగారిని అడిగేంతగా.. నేను ఆరోతరగతిలో చేరేందుకు గుంటూరులో పోటీపరీక్ష రాశాను. పరీక్ష పొద్దున్న పదిగంటలకు.. మధ్యాహ్నం రెండు గంటలకు.. మొత్తం నాలుగు పరీక్షలు రెండు రోజులు... మొత్తం ముప్పైఆరుమందిమి. అందర్నీ చేబ్రోలు, గుంటూరు, తెనాలి ఇలా చేర్పించాడు దేవదాసు మాస్టారు.. పరీక్ష రాయటానికి గుంటూరు వెళ్ళాలంటే ట్రైన్‌లో పెద్దవాళ్ళకు ఆరణాలు.. పిల్లలకు అణా.. మొత్తం ముప్పై ఆరుమందిమి..ఆరోజుల్లో సాధారణంగా టికెట్ ఎవరూ కొనేవారు కాదు.. కొంటే చేతకానివాడివని ఎగతాళి చేసేవారు.. ఆరోజు స్టేషన్‌లో టికెట్ కలెక్టర్, పోలీసు ఉండటంతో మా మాస్టారు పిల్లల్ని టికెట్ తెచ్చుకోమని పంపారు.. నా దగ్గర ఆ అణాలేదు..డబ్బులు లేవు మాస్టారు, మీరు కొనండని అడగలేను.. అది నా అశక్తత.. ఈలోగా అందరూ టికెట్ కొనుక్కున్నారు.. ఎక్కేశారు. మాస్టారేమో నువ్వు ఎక్కవేమిరా అంటున్నాడు. నాదగ్గర టికెట్ లేదని చెప్పలేకపోయాను..



మిసిమిలో పద్మశ్రీ

నా కళ్ళను కన్నీటి పొరలు కప్పేస్తుండగా ట్రైన్ కదిలింది.నేనివాళ పరీక్ష రాయకపోతే ఆరో తరగతిలో చేరలేను. చేరకపోతే మళ్ళీ జీతానికి పెడతాడు. ఎట్లారా అని ఆలోచిస్తే ఒకటే తట్టింది.. రైలెమ్మటే పరిగెత్తడమే నాకు తెలిసిందీ.. నేను చేయగలిగినది.. ఆరున్నరకు బండి బయల్దేరింది. ఆ పట్టాల వెంట పరిగెడుతూ పరిగెడుతూ నేను కూడా మూడుగంటల్లో రైల్వే స్టేషన్ చేరిపోయాను. బయటకొచ్చేశా. రెండు ఫర్లాంగులలో స్కూల్ ఉందని అడిగితే చెప్పారు. ఐదు నిముషాల్లో చేరిపోయా. నేనొస్తానని ఊహించని మా దేవదాసు మాస్టారు నన్నుచూసి వలవలా ఏడ్చేశాడు. ఎట్లా వచ్చావురా అన్నాడు.. చాలా గొప్ప వ్యక్తండీ ఆయన.. (ఈ సంగతి చెబుతూ ఇనాక్ గారి గొంతు కాసేపు మూగపోయింది. కళ్ళమ్మట బొటబొటా కన్నీరు రాలింది.. కొంచెం గ్యాప్ తీసుకున్నారు).. నడిచొచ్చాను మాస్టారు పట్టాలవెంట అన్నాను. ఆయన ఏడుస్తున్నాడు..ఆ ఏడుపులోనే నన్ను ఓదారుస్తున్నాడు. నా ఒళ్ళంతా ప్రేమగా నిమిరాడు. పక్కనే ఉన్న కుండలోంచి నీళ్ళుతెచ్చి తాగరా అన్నాడు. నిజానికి నాకు దాహమేమీ లేదు. నా పరీక్ష రెండు గంటలు ఆయన అక్కడే ఉన్నాడు. ఎట్టా రాశావురా అన్నాడు. బాగా రాశాను మాస్టారు అన్నాను. మళ్ళీ మధ్యాహ్నం పరీక్ష అయ్యాక స్టేషన్‌కు తీసికెళ్ళాడు. ఈసారి టికెట్ ఆయనే కొన్నాడు. అక్కడ జీడీలుంటే అవి కొనిపెట్టాడు. మా అమ్మతో వీడు పరీక్ష పాసవుతాడమ్మా.. గొప్పోడవుతాడు, నీవంశాన్ని ఉద్ధరిస్తాడు అని చెప్పాడు. ఆమే ఏడ్చేసింది. మా నాయనకు కూడా చెప్పాడు.. వాడిని జీతానికి పెట్టకండి, చదువుకోనియ్యండన్నాడు.. మా నాయన ఆలోచనలో మార్పులేదు. ఏ సంవత్సరానికా సంవత్సరం పాసయితే జీతానికి పెట్టను. తప్పితే

జీతానికి పెడతానన్నాడు. అప్పటికి అంటే 1948 నాటికి ఫీజు రాయితీల్లేవు.. రూపాయి పావలా ఫీజు.. ఎలా కట్టాలి.. నువ్వు సంపాదించుకో అన్నాడు మా నాన్న. ఎలా సంపాదిస్తాను.. అంటే నీ జీవితాన్ని నువ్వే దిద్దుకో అన్నాడు మా నాన్న..

**విసిబి :** మీ నాన్నపైన మీకు కోపం రాలేదా?

**ఇనాక్ :** లేదండీ.. మా నాన్నంటే భయం అంతే..ెంపు మేం పోతే నువ్వు కష్టపడి చదువుకోవాలి. ఆ కష్టమేదో ఇప్పుడే పడు..అప్పుడు కష్టం ఉండదు అనేది ఆయన అభిప్రాయం. అప్పట్నించి అన్ని పనులు చేసేవాడినండీ. ముంజెలు అమ్మేవాడిని. కాయగూరలమ్మేవాడిని. పొలంలో పనిచేసేవాడిని. పొగనారు పోసేవాళ్ళకి నారుమొక్క అందించేవాడిని. అలుపులేకుండా ఇద్దరు చేసేపని ఒక్కడినే చేసేవాడిని. చాలా చురుకైన పిల్లవాడు మా దగ్గరుంచండి అనేవారు. దొరసాని పెరుగు, మజ్జిగ కలిపిన అన్నం పంపిస్తుండేది. అందరు ఆకులు కోసి తెచ్చుకుని అందులో తాగుతుండేవారు. నేను ఆకులు కాకుండా చేతుల్లోనే పోయించుకుని తాగేవాడిని. అదిచూసి నాంచారయ్య అనే అతను నా చేతులు కళ్ళకద్దుకుని, నాచేతుల్లో పోయించుకుని దాన్ని మళ్ళీ తన చేతుల్లోపోయించుకుని తాగేవాడు. అది చూసి మిగిలినవారందరూ మాక్కూడా పొయిరా చిన్నోడా అంటూ నిలబడేవారు.. (ఈ విషయాలన్నీ ఇనాక్ గారు చెబుతూ మధ్య మధ్యలో ఆగిపోయేవారు.ఆయన కళ్ళు చెమ్మగిల్లేవి). మా అమ్మ మిరపకాయలు కోయటానికి నన్ను తీసికెళ్ళేది. అందరి కంటే ఎక్కువ కాయలు కోసేవాడిని. అర్ధరాత్రి పూట ధనియాలు పీకేవాళ్ళం .. రెండుగంటలకు మొదలుపెడితే పొద్దున్నే ఏడుగంటలకు పూర్తయ్యేది. కోసేటప్పుడు ఎండపడితే గింజ రాలిపోతుంది. అప్పుడు కూలీ డబ్బుల రూపంలో ఇచ్చేవారు కాదు.. మొయ్యగలిగినన్ని ధనియాల కట్టలిస్తారు. లేదా వడ్లు ఇస్తారు. ఇవన్నీ రైల్వేట్రాక్ దగ్గర అమ్మాలి. వయసుకు మించిన బరువు మోస్తూ ఉండేవాడిని. మిగిలినవాళ్ళందరూ మా అమ్మను హెచ్చరిస్తూ ఉండేవారు. చిన్నప్పటి అలా సోకిన వెన్నునెప్పి నాకు నా జీవితాంతమూ ఉండిపోయింది. పొలం దున్నే పనిచేస్తానని మా నాయన వెంట పోయాను. పిల్లాడొచ్చాడని పశువులెంత ప్రేమగా నన్ను చూశాయనుకున్నారు. అరక ఎత్తిపెట్టడంలో నాగలి జారిపోయింది. ఆ పశువులు ఆగిపోయినయ్.. నా బాధేదో రైతు రాములయ్య గారు, మా నాన్న చూసి గ్రహించి మందలించారు కానీ.. నేను ప్రతి విషయము నేర్చుకోగలిగాను. మాతాత వాళ్ళింటి పేరు వేజండ్ల. ఆయన తన ఆస్తిని కొడుకులకు పంచాడు కానీ, మా అమ్మకేమీ ఇవ్వలేదు. మా నాయన కష్టపడి డబ్బు పోగేసి ఎకరం పొలం కొని మా అమ్మకిచ్చాడండీ. అది ఆమె పేరుతోనే ఉంది.

నేను తొమ్మిదో తరగతిలో ఉండగా మా నాయన చనిపోయాడు. ఎలా చనిపోయాడు అనేదో పెద్ద కథ. నేను పధ్నాలుగో ఏట ఎస్.ఎస్.సి.పాస్ అయ్యాను. పదహారో ఏట ఇంటర్మీడియెట్ పాసయ్యాను. పంధొమ్మిదో ఏట బి.ఏ.ఆనర్సు పాసయ్యాను. ఇరవై రాకముందే లెక్చరర్ అయ్యాను. పాసవ్వటం గురించి మా నాయన పెట్టిన భయం అలా ఉండిపోయింది నాలో.. మా నాయన పోయాక మా అమ్మ నిర్ప్రాణంగా మారిపోయింది. పశువులమ్మేసింది. కోళ్ళు అమ్మేసింది. ఎప్పుడూ ఓ మూల కూర్చుని ఏడుస్తూ ఉండేది. అప్పటికి ఆమె వయసు ముప్ఫై సంవత్సరాలు. మళ్ళీ పెళ్ళిచేద్దామనుకున్నారు. అయితే నేను, తమ్ముడు, చెల్లెలు ఉన్నాం కదా.. వీళ్ళని ఏంచేయాలి..ఎవరు చూస్తారు అనేది తర్వాత ప్రశ్న.. మా అమ్మ మేనిఛాయ పసుపు. ఆ రంగు మాకెవరికీ రాలేదు. మళ్ళీపెళ్ళి చేసుకోవటానికి నా ముగ్గురు పిల్లల్నీ చూసుకోవాలనే కండిషన్ పెట్టింది. భార్యపోయిన ఒక కానిస్టేబుల్ ఒకాయన ముందుకొచ్చాడు కానీ, మా అమ్మ పెట్టిన కండిషన్‌కి మళ్ళీ రాలా.. నాకేమో మా అమ్మకు పెళ్ళిచేయాలని పట్టుదల. ఆరోజుల్లో పది పాస్ కాగానే రైల్వేలో, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలుండేవి. నాకేమో వయసు సరిపోలేదు. బి.ఏ ఆనర్స్ అయ్యేనాటికి నాకు పంధొమ్మిది సంవత్సరాల పదినెలలు. లెక్చరర్ అయిపోయాను. నిజానికి ఇరవైఒకటి నిండితేగానీ ఉద్యోగమివ్వరు.. కానీ మా ప్రిన్సిపాల్ నామీద దయ తలిచాడు. మళ్ళీ మా అమ్మను నేను కోరాను.. పెళ్ళిచేసుకోమ్మా అంటూ.. ఆమె నవ్వింది.. ఆ నవ్వులో పెద్ద మగాడైపోయాడు నా కొడుకు అన్న

సంతోషముంది. మా మామలేమన్నారంటే వీడికి పెళ్ళిచేస్తే తర్వాత చెల్లికి అంటే మా అమ్మకు పెళ్ళి చేయొచ్చు అన్నారు.. అయితే ఆమె ఒకమాట చెప్పింది. నువ్వు వేజండ్ల మాదిగపల్లిలో నువ్వు అలగా వాడివి. ఇక్కడ ఎవరినీ చేసుకోకు అన్నది. ఆరోజుల్లో కొన్ని కట్టుబాట్లొచ్చాయి. బావి దగ్గర ఒకమ్మాయి.. మొహాన నీళ్ళు జల్లిందంటే అర్థం నువ్వంటే ఇష్టమని. నీకు కాలు అడ్డంపెట్టి పడేస్తే నిన్ను పడేసిందని. అందుకని వాటి జోలికిపోకు. వాళ్ళని నీ దగ్గర రానివ్వకు అని గట్టిగా చెప్పింది. సంవత్సరం తర్వాత గుంటూరు ఏసీ కాలేజీలో ఉద్యోగమొచ్చింది.. మా అమ్మ నాతో ఓ సంవత్సరముంది. నన్ను పెళ్ళిచేసుకోమని పోరసాగింది. అప్పుడు నాకో గోల ఉండేది. నేను విశాఖపట్నంలో చదువుకునే రోజుల్లో ఒకమ్మాయి నన్ను ఇష్టపడింది.. ఆమెపేరు సరస్వతి.. ఇప్పుడు లేదు.. ఆ అమ్మాయికి సంసార బాధ్యతలున్నాయి.. బ్రాహ్మలమ్మాయి.. ఆ అమ్మాయికి నేను కావాలి. నా తమ్ముడు, చెల్లి, అమ్మలతో కలిసి ఉండటం ఇష్టం లేదు.. మాదిగపల్లికి వచ్చే ప్రశ్న లేదు. దాంతో నేను దెబ్బతిన్నాను. ఇష్టపడింది ఆమే.. నేను కాదు..అలాంటిది ఆమె వెనక్కిపోతోందని కొంచెం దిగులుపడ్డా.. ఆ అమ్మాయి డబ్బున్నవారమ్మాయి.. ఒకరోజు ట్రెయిన్‌లో కలిసి వచ్చాం.. అదే చివరిసారి మేం కలిసింది.. ఆ తర్వాత మా ఇద్దరిమధ్య కాంటాక్ట్ లేదు. మా అమ్మ ఇది కనిపెట్టి కోప్పడింది. మాకు కూడా చెప్పనంత మొనగాడివయిపోయావా అని నొచ్చుకుంది. నీకు పెళ్ళయితే మావలన నీ జీవితం పాడవలేదన్న తృప్తి నాకుంటుందయ్యా అంది.. మా అమ్మ పెళ్ళై వెళ్ళిపోతే సరస్వతి వస్తుందన్న స్వార్థ చింతన నాకు ఉంది..చూడండి మనసు ఎలా ఆలోచిస్తుంటుందో.. మా అమ్మకూడా తన పెళ్ళి గురించి కూడా కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేసింది... మీ నాయనని చూసిన కళ్ళతో ఇంకో మగాడిని చూడలేను అని.. ఇంకో విషయమేమిటంటే ఫైనల్‌గా మా తమ్ముడు క్లాస్ వన్ ఆఫీసర్‌గా స్థిరపడ్డాడు.. చెల్లెలికి కూడా మంచి సంబంధం చూసి పెళ్ళిచేశాను.

ఆరోజుల్లో పి.యు.సి.వచ్చి చేరింది ఇంటర్మీడియేట్ స్థానంలో. పి.యు.సి. ఒక్క సంవత్సరం కోర్సు. ఇంటర్ రెండేళ్ళు. దాంతోటి ఉద్యోగంలో ఉన్న చివరివాళ్ళకు అంటే జూనియర్స్‌కు పనిలేదు.. నేను జూనియర్ కావటంతో నా ఉద్యోగం పోయింది.. హైదరాబాద్ వచ్చి DPI ని కలిశాను. ఆయన పేరు వామనరావు. ఆయనకు నన్ను తిరిగి తీసుకోమన్న దరఖాస్తు ఇచ్చాను. ఆయన కవర్ నా చేతికిస్తూ ఉంచుకో, మళ్ళీ ఇంకోసారికి పనికొస్తుందన్నాడు. అంటే ఏమిటి అర్థం.. నీకు ఇక ఉద్యోగం రాదూ అని..

నేను చిన్నప్పుడు నాటకాలలో బాగా చురుగ్గా ఉండేవాడిని. బోయి భీమన్న గారి పాలేరు నాటకంలో చిన్న పాలేరుగా నటించేవాడిని. అది భీమన్న గారికి తెలుసు. ఆయనోసారి చూశారు కూడా. అది చూసి నేనంటే అభిమానం ఏర్పరుచుకున్నాడాయన. ఆ పరిచయం ఆయనతో కొనసాగింది.. ఆయన విద్యాశాఖలో డైరక్టర్‌గా ఉండేవాడు. హైదరాబాదే కదా అని ఆయన్ని కలిశాను. ఉద్యోగం పోయిందని చెప్పాను. ఆయనో సలహా ఇచ్చాడు. నీకు లెక్చరర్ ఉద్యోగం ఇప్పించలేను కానీ, జూనియర్ అసిస్టెంట్ జాబ్ ఇవ్వగలను అన్నాడు. నువ్వేమీ పని చేయక్కర్లా, ఆఫీస్‌కు రానక్కర్లా, ఉద్యోగాలకు అర్జీలు పెట్టి జాబ్ ప్రయత్నాలు చేసుకో అన్నాడు. ఒక నెలే అవకాశమిచ్చాడు. ఈలోగా అన్వర్ ఉల్ లూమ్ కాలేజీ ఇంకా చాలాచోట్ల దరఖాస్తు పెట్టాను. ఆరోజుల్లో చంగల్రాయనాయుడు గారు చిత్తూర్లో కాలేజీ పెట్టారు. ఆయన పార్లమెంట్ సభ్యుడు.. అక్కడ నాకో మాట చెప్పండని భీమన్న గారిని అడిగాను. భీమన్న గారేమన్నారంటే.. నామాట ఆయనెందుకు వింటాడు.. సంజీవయ్య గారిని కలువు అని పంపించాడు.. అప్పుడాయన ముఖ్యమంత్రిగా ఉన్నారు. నేను రెండు నవలలు అప్పటికే రాసి ఉన్నాను. అవి ఆయనకు ఇచ్చాను.. ఆ పరిచయం ఉంది. ఆయన నన్ను చూసి ఏం వచ్చావు అన్నాడు. ఉద్యోగం పోయిందన్న విషయం చెప్పాను.

అప్లికేషన్ ఎవరికో ఇమ్మని చెప్పాడు. ఇచ్చాను. రోజూ తిరిగి విసిగిస్తూ ఉండేవాడిని. మొత్తమ్మీద ఉద్యోగం వచ్చింది, చిత్తూరు కాలేజీలో.. చెంగలనాయుడు గారి కాలేజీలో.. చేరిన ఆరు నెలలకు మళ్ళీ ఉద్యోగం పోయింది. మళ్ళీ హైదరాబాద్ పరిగెత్తాను. కాకినాడ పి.ఆర్.కాలేజీలో ట్యూటర్ పోస్ట్ వచ్చింది. అప్పుడు

జీతం లెక్చరర్‌కి 186 రుపాయలొస్తే ట్యూటర్‌కి 124 రూపాయలే.. మళ్ళీ ఇదే తంతు. ఆరునెలలకి ఇంకోసారి ఉద్యోగం పోయింది. మళ్ళీ హైదరాబాద్ ప్రయాణం.. వాళ్ళు చూస్తామని చెప్పటం.. ఈసారి ట్యూటర్ పోస్ట్ అనంతపురంలో వచ్చింది. అనంతపురంలో పనిచేయటం నాకు లాభం చేకూర్చింది. అక్కడే ఎన్.సి.సి.ఆఫీసర్ అయ్యాను.. లెక్చరర్ అయ్యాను.. రైటర్ అయ్యాను. అనంతపురంలోనే నాకు పెళ్ళి అయింది.

**మిసిమి :** మీ పెళ్ళి ఎలా అయిందో చెప్పండి?

**ఇనాక్ :** అయితే కొంచెం వెనక్కి వెళ్ళాలి. నేను గుంటూరు ఏసీ కాలేజీలో పనిచేస్తున్నప్పుడు "సమత" అనే నవల రాశాను. ఆంధ్రప్రభ నవలల పోటీలో ప్రైజ్ వచ్చింది. అది సంజీవయ్యగారికి అంకితమిచ్చాను.. ఆయన మీద ఉన్న గౌరవంతో ఆపని చేశాను. నేను అంకితం ఇచ్చినందుకు ఆయన ఆశ్చర్యపోయాడు. నా రచనా వ్యాసంగం చాలా చురుగ్గా ఉండేది. అప్పట్లో యూనివర్సిటీ పరిధిలో 146 కాలేజీలుండేవి.ఈ కాలేజీల్లో తెలుగు భాష పట్ల అభిరుచి పెంచడానికి కథలు, కవితలు, వ్యాసాల పోటీలు పెడుతుండేవారు. ఎక్కువశాతం బహుమతులు నాకే వచ్చేవి. నేను చెప్పేది1957,58సంవత్సరాల నాటి సంగతులు. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు నేనంటే చాలా అభిమానంగా ఉండేవాడు. నేను బాగా రాస్తానని మెచ్చుకుని, బాగా పైకొస్తావురా అని ఆశీర్వదించాడు. భారతి వాళ్ళు నన్ను విపరీతంగా ప్రేమించారు. నేను రాసిందల్లా పడుతుండేది. 1958లో ఒకసారి రేడియో వాళ్ళు ఒక నాటకాల పోటీ పెట్టారు. ప్రధానంగా భారతదేశంలోని యూనివర్సిటీల వారికోసం. అప్పుడు పదహారు భాషల్లో నిర్వహించారు. తెలుగు నుంచి నేను కూడా పంపించాను.. ఆరు ఫస్ట్ ప్రైజులు, పన్నెండు సెకండ్ ప్రైజులు, ముప్పై ఒక్క థర్డ్ ప్రైజులు ఇచ్చారు. అందులో తెలుగుకి రెండు ప్రైజులొచ్చాయి.. నాకు సెకండ్ ప్రైజు వచ్చింది. ఇంకోటి థర్డ్ ప్రైజు. ఆ నాటకాన్ని హైదరాబాద్ స్టేషన్ వాళ్ళు ప్రొడ్యూస్ చేశారు. తురగా జానకీరాణి అందులో ముఖ్యపాత్ర వేసింది. బాగారాశావబ్బాయి అని మెచ్చుకునేది. తురగా కృష్ణమోహన్‌కు కోపంగా ఉండేది (నవ్వుతూ చెప్పారు).. ఇప్పుడవన్నీ గుర్తుకొస్తే నవ్వొస్తాయనుకోండి. అప్పుడు నా వయసు పద్దెనిమిది సంవత్సరాలు. పేపర్లో నేను ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారి దగ్గర బహుమతి తీసుకున్నట్లు న్యూస్ వచ్చింది. అదో సంచలనం అప్పుడు.. ఆలిండియా రేడియో మద్రాసు, విజయవాడ, హైదరాబాద్ స్టేషన్ల నుంచి నా నాటకాలు, రచనలు ఎక్కడో ఒకచోట ప్రసారమవుతుండేవి. గంట నాటకానికి నలభై రూపాయలు, అరగంట నాటకానికి పాతిక రూపాయలు ఇస్తుండేవారు. శంకరమంచి సత్యం నన్ను అడుగుతుండేవాడు.. "మాకు మాత్రమే తెలుసు అనుకునేవాళ్ళం, రేడియో టెక్నిక్. నీకెలా పట్టుబడిందిరా" అంటూ... ఇదేమాట తరువాతి రోజుల్లో గొల్లపూడి మారుతీరావు అంటుండేవాడు. నాకు బహుమతి వచ్చిన తర్వాతి సంవత్సరంలో సత్యాని (శంకరంచి సత్యం) కొచ్చింది. ఆ నాటకం పేరు ఆనందం. నాకు బహుమతి రావటంతో రేడియో వాళ్ళకి నేను పనికొచ్చే ముడిసరుకునైపోయాను..

ఒకసారి విజయవాడ స్టేషన్‌కు ఒక నాటకం ఇస్తే అందులో రచయిత్రి లత పాత్ర వేస్తోంది. ఆవిడ రేడియోలో పనిచేసేది కదా.. అందులో బావ అని ఏడురకాలుగా పలకాలని నేను రాశాను.. ఆవిడ నువ్వు చెప్పరా అంది.. నేను ఆవిడని అక్కా అని పిలిచేవాడిని. మీకు తెలుసుకదా అక్కా అంటాను. నువ్వు చెప్పరా అంటుంది ఆవిడ.. నాకు ఏసీ కాలేజీలో నాటకాలు వేయటం, వేయించటంలోను అనుభవం ఉండటంతో మొత్తానికి ఏడు సార్లు ఎలా పలకాలో చెప్పాను. భలే చెప్పావురా అని ముద్దుపెట్టుకుందావిడ. బందా కనకలింగేశ్వరరావు గారు ప్రొడ్యూసర్. నాటకాలేస్తావా అని అడిగాడు.. ఉద్యోగం ఉంది కదా సర్ అని చెప్పి తప్పించుకున్నాను.కాకినాడలో నాకు ఉద్యోగంలో నూటనాలుగు రూపాయలొచ్చేది.. భారతి వాళ్ళు కానీ, రేడియో వాళ్ళుకానీ నెలకు ఇచ్చేది ఇంకా ఎక్కువుండేది. నేను రేడియోలో ప్రొడ్యూసర్ ఇంటర్వ్యూకి వచ్చాను. అప్పుడు ధర్మజ్ఞాని స్టేషన్ డైరక్టర్. నీకు ఉద్యోగం ఇస్తాం కానీ, నీకు అక్కడే మంచి కెరీర్

ఉంటుంది. ఆలోచించుకో అన్నాడు. అక్కడ నువ్వు ప్రిన్సిపల్, ప్రొఫెసర్ ఇట్లా ప్రమోషన ఛానెల్ ఉంది. ఇక్కడ అదేమీ ఉండదు అని హెచ్చరించటంతో చేరలేదు. నా బదులు వేలూరి సహజానందను ఆ పొజిషన్లో తీసుకున్నారు. రావూరి భరద్వాజ, సహజానంద, సునందిని మంచి మిత్రులయ్యారు. భరద్వాజ కార్డుముక్క రాసేవాడు. ఫలానా అంశం మీద ప్రసంగం కావాలి పంపించండి.. రికార్డింగ్ వెంటనే అంటూ.. అలా రేడియో నన్ను చాలా ఆదరించింది.

**మిసిమి : మీ వివాహం గురించి చెప్పలేదు మీరు?**

**ఇనాక్ :** గుంటూరు నుంచి అనంతపురం వచ్చినప్పుడు ఆందోళన పరిస్థితుల నుంచి ప్రశాంతతలోకి వచ్చినట్టుంది నాకు. అయితే పొద్దుపోయేది కాదు. నాలుగు గంటలకు కాలేజీ అయిపోతే మరునాడు తొమ్మిదిగంటల వరకూ ఖాళీయే.. అప్పుడు నాది "అనాథ" అనే నవల సీరియల్‌గా వస్తోంది. ఈ సీరియల్ చదివిన ఒకావిడ ఎవరితను అని ఎంక్వైరీ చేస్తే ఈ ఊళ్ళోనే ఉంటాడని చెప్పారు.

ఉమెన్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో లైజన్ ఆఫీసర్‌గా పనిచేసే ఒకావిడ నన్ను వాళ్ళ పిల్లలకు లెక్చర్ ఇవ్వమని కోరింది. అయితే నన్ను ఆవిడకు పరిచయం చేసింది వేణు అనే క్లర్క్, ఆ డిపార్ట్‌మెంట్ అతనే. మీరు రాస్తుంటారా అని అడిగితే నాటకం ఒకటి రాస్తున్నానని చెప్పాను. అప్పుడా వేణు ఆవిడకు చెప్పాడు. మీకు నచ్చిన అనాథ నవల రచయిత ఇతనే అని. ఆవిడ నాచేత ఒక లెక్చర్ ఇప్పించింది. మళ్ళీ మళ్ళీ పిలవటానికిలేదు.. అందుకని నా దగ్గర ట్యూషన్ కోసం చేరింది. అదొక మిష అని నేననుకున్నాను. ఆ మనిషి నా దగ్గరకు డైరక్ట్‌గా ట్యూషన్ కోసమని ఎలా చెప్పగలుగుతుంది. చెప్పలేదుకదా.. అందుకని ట్యుటోరియల్ కాలేజీకి వెళ్ళింది.. ఆవిడ బి.ఎస్సీ చదివింది. బి.ఏ. స్పెషల్ తెలుగు కోసం చేరింది. ఒక మాస్టారిని ఛందస్సు అడిగింది. ఆయన మళ్ళీ పత్తాలేకుండా వెళ్ళిపోయాడు. ఇంకో ఇద్దరు మనుషులను వెళ్ళగొట్టిందనుకోండి.. తర్వాత నాగురించి ఆమే ఆ ట్యుటోరియల్ కాలేజీ వారికి తెలియచేసింది. మంచి రచయిత మన ఊళ్ళో ఉన్నాడు. మీరు పిలవ్వొచ్చు అని. అలా నన్ను వాళ్ళు కాంటాక్ట్ చేయటం, పాఠం చెప్పటం జరిగాయి. అదికూడా మొదట ట్యుటోరియల్ కాలేజీలో, తర్వాత ఆమె ఆఫీసులో.. అక్కడినుంచి ఆమె గారి ఇంట్లో .. నేనంటే ఆమెకిష్టమైందని నాకర్థమయింది. అప్పటికి లోకం పూర్తిగా తెలుసని చెప్పను, లోకాన్ని చదివానని చెప్పను.. అప్పుడప్పుడే తెలుసుకుంటున్నాను.. నా వయసు అప్పుడు ఇరవైరెండేళ్ళు.

పదిహేను రోజుల తరవాత వాళ్ళమ్మ వెళ్ళిపోయింది. ఆమె అసిస్టెంట్లు ఉండేవారు. పాఠం పూర్తయ్యాక భోజనం చేసి వెళ్ళమని కోరేది. ఆమె ఇష్టం స్పష్టంగా తెలిసిపోయింది. ఒకపక్క విశాఖపట్నం విషాదం, మరోపక్క నా పెళ్ళికి భీష్మించుకున్న మా అమ్మ అన్నీ కలిసి పెళ్ళివైపు లాగాయి. అలా వైవాహిక బంధంలోకి ప్రవేశించాను..

**మిసిమి : కులాంతరమా?**

**ఇనాక్ :** అవును.మాది కులాంతర వివాహమే..కానీ సాఫీగా జరగలేదు. ఆమె తండ్రి వద్దకు నా ప్రపోజల్ చెబుదామని వెళితే నన్ను ఛడామడా తిట్టాడు. కానీ ఆమె తల్లికి ఇష్టమే.. మా అమ్మకు కూడా నా ఉద్దేశం చెప్పాను. ఆవిడ తీసుకురమ్మని చెప్పింది.. ఆమె, ఆమె చెల్లెలు, తమ్ముడు వచ్చారు. మా అమ్మ వాళ్ళని చూశాక ఒకే ఒక్క ప్రశ్న వేసింది. ఆమెలో ఏముందని చేసుకుందామని అనుకుంటున్నావు అంది. నీకన్ని మంచి సంబంధాలొస్తే తిరగ్గొట్టావు అంది. నన్ను నమ్మింది ఆ మనిషి అన్నాను. నా తల మీద ఠాప్ మని ఓ మొట్టికాయ మొట్టి పో చేసుకో ఫో అంది. నేను రిజిస్టర్ మేరేజ్ చేసుకోవచ్చు.. కానీ "అలగా" వాడు అలగా పని చేశాడంటారు వేజండ్లలో.. అది నాకిష్టం లేదు. ఇంట్లో పెళ్ళి చేసుకోవలసిందే అని పెట్టుకున్నాను. అలాగే మా అమ్మకి కన్విన్సింగ్‌గా సమాధానం చెప్పటానికి కూడా టైం పట్టింది. మా అమ్మ నాన్నల పేర్లు రామయ్య, వీరమ్మ..పెళ్ళి జరిగినప్పుడు శ్యాంసన్, విశ్రాంతమ్మ అని పేర్లు పెట్టారు. వాళ్ళకి క్రైస్తవంతో పెద్ద సంబంధం లేదు.. తెలీదు కూడా.. మా నాన్న శ్యాంసన్ పేరు ఎవరికీ తెలీదు. మా అమ్మ మాత్రం

విశ్రాంతమ్మ పేరునే ఇష్టపడింది. నేను చదువుకున్న స్కూల్‌లో, ఆరు రోజులు స్కూలు.. ఏడోరోజు చర్చ్.. అలాగని నాకు క్రైస్తవంతో పెద్ద పరిచయం లేదు. బాప్టిజం కూడా తీసుకోలేదు.

మా అమ్మకేమో నా కొడుకు మహారాజు..పేరుకూడా అలాగే ఉండాలని కోరుకుంది. ఒక పాస్టర్ గారిని అడిగింది.. ఎవరికీ లేని పేరు మా అబ్బాయికి పెట్టండని.. ఆయన సాయంత్రం చెబుతానని చెప్పాడు. అలాగే వచ్చి పేరు రాసిచ్చాడు. ఆయన పెట్టిన పేరు నాకు ఎస్సెల్సీ వరకు తెలీదు."ఇనాక్" అని పిలిచేవారు. "ఇనోక్" అని పిలిచేవారు.."ఆనోక్" అని పిలిచేవారు. ఇంగ్లీషులోనేమో "ఇనోక్" అని ఉంది. తెలుగు బైబిల్లలో హానోక్ అని రాసుంది. అది కాస్తా ఆనోక్‌గా మారింది. ఇన్నిరకాల పేర్లున్నా మా ఊరిలో నన్ను నూకలగాడు అని పిలిచేవాళ్ళు. పాస్టర్ గారు "ఈనక్" అని పిలిచేవారు. ఏసీ కాలేజ్ ప్రిన్సిపల్ కూడా "ఈనక్" అని పిలిచాక నాకు రూఢి అయిపోయింది నా పేరు ఈనక్ అని.. అప్పటిదాకా నాపేరు కరెక్ట్‌గా తెలీదు నాకు. నేను హైస్కూల్‌లో ఉన్నప్పుడు రిజల్ట్ లిస్టులు రెండు ఉండేవి. ఒకటి పాస్ లిస్ట్.. ఇంకోటి ప్రమోషన్ లిస్ట్.. అన్నింటిలో పాసయి ఒక సబ్జెక్ట్‌లో కనీస మార్కులు రాకపోతే ప్రమోట్ చేసేవారు.. ప్రమోషన్ అంటే దయతలిచి పాస్ చేయటం అన్నమాట.. నాకు ప్రతిసారీ టెన్షన్. నాకు ఒక్క సైన్స్‌లో మాత్రం మార్కులు తక్కువొస్తుండేవి..హైస్కూల్ అయ్యాక తెలుగు, హిస్టరీ, పాలిటిక్స్ గ్రూప్‌లో చేరా.. అక్కడ ఫస్ట్ మార్క్ రాకపోతే ఏడ్చే పరిస్థితి వచ్చింది. తెలుగుకి నిర్మల అడ్డమొచ్చేది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కి నూర్జహాన్ అడ్డమొచ్చేది. వాళ్ళు నా క్లాస్మేట్స్.. తర్వాత సెకండ్ ఇయర్‌లో వాళ్ళని దాటాను..

ఇదే సమయంలో కథలు రాయటం బాగా అలవాటయింది. జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు బాగా ప్రోత్సహించేవారు. అలాగే వి.ఎల్.నరసింహారావు గారనే టీచర్ ఉండేవారు. ఆయన కూడా.. గుంటూరు ఏసీ కాలేజీలో ఈ వాతావరణం చాలా ఉండేదండీ.. ఫస్ట్ మార్కులు రావటం మొదలయ్యాక ఆనర్స్ చదవమని సలహా ఇచ్చారు. అప్పట్లో బి.ఏ., ఎమ్మేలకు నాలుగు సంవత్సరాలు పట్టేది. ఆనర్స్‌కు మూడు సంవత్సరాలు పట్టేది. ఆనర్స్ చదవాలంటే ఆంధ్రా యూనివర్సిటీలో చదవాలి.. అక్కడ సీటొచ్చింది.. చేరిపోయాను. ఇప్పటికీ నాకు ఎమ్మే లేదు. బి.ఏ.హానర్స్ తోటే పిహెచ్.డి చేశాను.

**మిసిమి : గొడ్డ కాడి బుడ్డోడు వి.సి.అయ్యాడు.. ఎంత గొప్ప స్ఫూర్తివంతమైనది మీ కథ..**

**ఇనాక్ :** ఇంకోటండీ..ఎవడైనా ఆసక్తిగా ఉన్నాడంటే వాడికి సహాయం చేయటానికి సిద్ధంగా ఉంటుందండీ ప్రపంచకం.. అయితే వాడు రోగ్ కాకుడదు.. నా విషయానికొస్తే భారతి పత్రిక వారు రాసిందల్లా వేస్తుండేవారు. ఇక రేడియో వాళ్ళు అవకాశాలమీద అవకాశాలిచ్చారు. ప్రొడ్యూసర్ సునందిని ఒకేసారి ఎనిమిది నాటికలు రాసిచ్చేయమంది. ఒకసారి ఒక కవిత చదివాను."మనకేం మనం బాగున్నాం../దేశమింకా బాగుందని".. ఇలా సాగుతుంది ఆ కవిత. ఆ కవిత విన్న విశ్వనాథ సత్యనారాయణ నన్ను పట్టుకు ఏడ్చాడండీ. నువ్వురా మహాకవివి.. వీళ్ళంతా అర్థం కాని కవులురా అన్నాడు. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడే పద్యాలు రాసేవాడిని. పాపయ్యశాస్త్రిలానో, జాషువాలాగానో ఉన్నాయంటుండేవారు.. నాకా ముద్ర పడటం ఇష్టంలేదు.. నాలాగా లేనప్పుడు ఎందుకని ఆపేశా.. కథలు, నవలలు, నాటకాలు ఇవి రాయటం మొదలుపెట్టా..

"కుమార సంభవం" పాఠం చెప్పిన మా షడంగి మాస్టారు, కుమార సంభవం ఆధారంగా భారతదేశంలో స్త్రీ స్థితి రాయమంటే, అందరికంటే భిన్నంగా రాశాను.. బాలికగా, కన్యగా, భార్యగా, తల్లిగా, వృద్ధాప్య దశ.. ఇలా స్త్రీ జీవితంలోని ఐదు దశలు మనక కుమార సంభవంలో కనపడతాయని రాశాను... మిగిలినవాళ్ళెవ్వరూ అలా రాయలా.. నీకెలా తోచిందిరా ఇలా రాయాలని అంటాడు మా షడంగి మాస్టారు.. ఆయన ఒరియా బ్రాహ్మడు.. పరమ ఛాందసుడు. ఈ ఐదు దశలు నీకెలా కనిపించాయిరా అంటాడు. పార్వతి, రతీ దేవిల గురించి కాకుండా కాళిదాసు మనిషిని గురించి ప్రారంభించాడన్న గొప్ప విషయం చెప్పావు. ఇప్పటివరకూ ఎవరు చెప్పలేదు అని ఆయన పొగుడుతూ చెప్పిన మాటలు ఇంకా గుర్తున్నాయి.. పార్వతి, రతి పాత్రల ఆధారంగా చేసిన ఈరకమైన విశ్లేషణ చాలా పేరు తెచ్చుకుంది. సంస్కృతంలో ఫస్ట్

మార్క్ రావటమంటే మామూలు విషయం కాదు. నాకు వచ్చింది. నువ్వు చాలా గొప్పవాడివి అవుతావురా అని ఆశీర్వదించాడాయన..

నా కథలవీ చూసి శివలెంక శంభూప్రసాద్ భారతిలో ఎడిటర్‌గా చేరమని ఆహ్వానం పంపాడు. అప్పటికి నేను ఇరవైరెండేళ్ళవాడిని. నేను సున్నితంగా ఒప్పుకోలేదనుకోండి. నాచేత రివ్యూ చేయించటం కోసం పది పన్నెండు పుస్తకాలు పంపించేవాడు. నేను రివ్యూ చేయక్కర్లేదంటే పారేయమనేవాడు. నేనంటే అంత గురుండేది ఆయనకు.. ఇనాక్, జ్యోతి, కొలకలూరి, మనోరాణి, రవి.. ఇట్లా వేర్వేరు పేర్లతో ఆ పుస్తకాల సమీక్ష చేసేవాడిని.. నెలకు ఐదు పుస్తకాలపై నా సమీక్షలు వచ్చేవి..

**మిసిమి : మీ వివాహం వరకు చెప్పారు. మీ కుటుంబం గురించి మళ్ళీ వద్దాం.. మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను.. చెప్పండి.. మీ ఉత్సాహానికి కారణం ఏమిటి? మీరు అందర్నీ ఎంతో ఆప్యాయతతో పలకరిస్తారు.. పదిమందిని ప్రోత్సహిస్తారు.. అది అందరకూ సాధ్యం కాదు.. మీరెలా సాధించారు.. మీ డ్రైవింగ్ ఫోర్స్ ఏమిటి?**

**ఇనాక్ :** నన్నెవ్వరూ own చేసుకోని సమాజంలో పుట్టడం వలన లోకాన్నంతటినీ own చేసుకోవాలన్న ఆశ నాలో కలిగింది. అందరి ప్రేమను పొందాలన్న ఇష్టముండేది. అందుకు ఏంచేయాలో అవి చేశాను. ఉద్యోగంలో చేరాక, నాకు సమయం మిగిలిపోతోంది.. ఏం చేయాలని అడిగేవాడిని. అది నాకు రాయటం నేర్పింది. పత్రికలు వాళ్ళు అడిగితే రాశాను. రేడియో వాళ్ళడిగితే రాశాను. ఎవరికీ నో చెప్పేవాడిని కాదు. అనంతపురం జిల్లాలో నేను తిరగని పాఠశాల లేదు. ఒక సంవత్సరంలో కనీసం ఆరువందల ఉపన్యాసాలు ఇచ్చి ఉంటాను. గురజాడ, జాషువా, వీరేశలింగం పంతులు, విశ్వనాథ.. ఇలా వీరందరి గురించి చెబుతూ, వారు తెచ్చిన చైతన్యాన్ని చెప్పేవాడిని. విశ్వనాథ గురించి ఎందుకు అనేవాళ్ళకి అతనెంతటి ప్రతిభామూర్తో వివరించి చెప్పేవాడిని. జాషువా ఎందుకంటే.. నా గురించి .. నాలాంటి వారి గురించి చెబుతాడనేవాడిని. వాళ్ళిదరికీ కాకపోవచ్చు. కానీ వాళ్ళిద్దరూ నాక్కావాలని చెప్పేవాడిని. దీనివలన లోకం కావాలి అనే ఆసక్తి నాలో పెరిగింది. ఒకసారి నన్నడిగారు.. ఏమిటి విశ్వనాథ గొప్ప అని. అప్పుడు నేను చెప్పాను. వంద స్త్రీ పాత్రలు సృష్టించిన రచయితనెవరైనా చెప్పండి అని అడిగాను. చెప్పలేకపోయారు.. విశ్వనాథ ఉన్నాడని చెప్పాను. ఒక స్త్రీ పాత్రకు, ఇంకో స్త్రీ పాత్రకు పోలిక లేకుండా విశ్వనాథ వంద స్త్రీ పాత్రలు సృష్టించగలడని చెప్పాను."హృదయాలయం" అనే కవిత చదివితే నన్ను వాటేసుకున్నాడు.. ఎంత బాగా రాశావురా అన్నాడండీ. అంతకు ముందు మనకేం మనకేం మనం బానే ఉన్నామనే కవితను కూడా విని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నాడని చెప్పాను కదా.. ఆయన (విశ్వనాథ) చనిపోయినపుడు, నువ్వంటూ ఒకడు పుట్టబట్టి దేశం బావుందని కవిత్వం రాశాను. అంటే మనిషిని మనం ప్రేమించటం మొదలుపెడితే ఏరకమైన పరిమితులు అడ్డం రావండీ. నన్ను వ్యతిరేకించేవాళ్ళ పట్ల నాకేమీ కోపం ఉండదు. అది అతనిష్టం అంటాను. మా అమ్మ బాగా చెప్పిందండీ. దేశంలో ఉన్న ఆడవాళ్ళంతా అమ్మలేనండీ. అమ్మా అనరా.. ఎవరైనా ఆనందిస్తారు అని చెప్పేది. మా అమ్మని అమ్మా అనేవాడిని. నా భార్యను అమ్మా అనేవాడిని. చిత్రం చూడండి మా అమ్మ జయంతి, వర్ధంతి ఒకేరోజు.. ఇక మా ఇద్దరమ్మాయిలు టీచింగ్‌లో ఉన్నారు. ఆశాజ్యోతి బెంగుళూరులో ఉంది. రిటైరయింది. అల్లుడు రిజిస్ట్రార్‌గా రిటైర్ అయ్యాడు. వాళ్ళకి ఇద్దరు కొడుకులు. రెండో వాడిని తాత పోలిక వచ్చిందంటూ ఉంటారు. కానీ వాడు నాకన్నా బావుంటుంది. వాళ్ళిద్దరు కాక ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు ఇంజనీర్లు. మొత్తం ఎనిమిదిమంది మనవళ్ళు, మనవరాళ్ళు.. నా కుటుంబం మొత్తం పద్దెనిమిది మంది. రెండో అమ్మాయి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్..

**మిసిమి : మీ కెరీర్, మీ సాహితీ వ్యాసంగం అందరికీ తెలుసు. మీగురించి ఇంకా తెలియనది ఏమన్నా ఉందా?**

**ఇనాక్ :** నా జీవితం ఓపెన్ బుక్ లాంటిది. అందరికీ అన్నీ తెలిసిన విషయాలే.

**మిసిమి : ఇంకా ప్రణాళికలేమన్నా ఉన్నాయా మీకు?**

**ఇనాక్ :** జీవితచరిత్ర రాయాలన్న కోరికయితే ఉంది. ఏమవుతుందో చూద్దాం. నా "రంధి" నవల ఇష్టంగా చదువుతున్నారు.. అలాగే కరోనా కాలంలో వచ్చిన "వలస" నవల. రెండింటినీ బాగా ఆదరించారు. నోబెల్ కమిటీకి పంపిస్తున్నారు.

**మిసిమి :** మీరు వలస నవల అనువాదాన్ని బుకర్ ప్రైజ్ పరిశీలన నిమిత్తం పంపండి. వాళ్ళు ట్రాన్స్‌లేషన్‌కు ఇస్తున్నారు. వీలైతే రంధి, ఊరబావి అనువాదాలు కూడా పంపండి.

**ఇనాక్ :** తప్పకుండా చేస్తాను. రిటైర్డ్ ఐయ్యేస్ అధికారి కాకి మాధవరావు రంధి నవలను ఇంగ్లీషులోకి చేశారు.

**మిసిమి : మర్చిపోకుండా బుకర్ ప్రైజ్ కోసం పంపించండి.. ఇక మిసిమికి మీరు ప్రియమైన పాఠకులు.... మరి ఆ పాఠకులకు మీ సందేశం...**

**ఇనాక్ :** **మిసిమి** పత్రిక ఒక్క తెలుగులోనే కాదు, భారతీయ భాషల్లోనే ఒక అద్భుతమైన పత్రిక. అందరూ సినిమా వార్తలిస్తారు. ఆ పని మీరుచేయరు. కథ, నవల, కవిత్వం అంశాలకు మీరు దూరంగా ఉంటారు. మీరు ఏం వేస్తారు అంటే జీవితాన్ని వేస్తారు.. **మిసిమి**లో ఏం ఉంటుందంటే సంగీతముంటుంది. సాహిత్యముంటుంది. కళలుంటాయి. కళల ప్రోత్సాహం ఉంటుంది. ఒక విస్తృతమైన సమాజాన్ని చూపిస్తుంది **మిసిమి**. కోడూరి పుల్లారెడ్డి చిత్రకళ గురించి రాస్తే చాలా ఆసక్తిగా చదువుతాను. మన మిత్రుడు నిమ్మగడ్డ శేషగిరిరావు పర్యటించిన దేశాల సమాచారం చదివితే విస్తుబోతుంటాను. తెలివిగలవాళ్ళం అనుకునేవాళ్ళు, ఇంటలెక్చుయల్స్ అనుకునేవాళ్ళు **మిసిమి** చదవకపోతే ఎంతోకొంత కోల్పోయినట్లే.. జీవితాన్ని నేర్చుకోవాలి అని **మిసిమి** బోధిస్తున్నట్లు నాకనిపిస్తుంది.

**మిసిమి : చాలా చాలా ధన్యవాదాలు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు..మీ జీవితంలోని ఒడిదుడుకులను, సమాజం పట్ల, మనుషుల పట్ల మీకున్న ప్రేమను ఆర్ద్రతతో కూడిన కంఠతడి మా పాఠకులు కూడా గమనించారు. మీతో గడిపిన ఈ మూడుగంటలు మమ్మల్ని మీ జ్ఞాపకాల తోటలో విహరింపచేశాయి.. మీకు ధన్యవాదాలు.**

### నిబిడత

*నిబిడత అంటే వర్ణనీయ వస్తువు వర్ణించే కవిలో ఉండటం. వస్తువే కవి కావటం, వస్తువుకూ కవికీ అవినాభావ సంబంధం. కవి లేకుండా వస్తువు లేదు. వస్తువువినా కవి ఉండడు. కవిలో వస్తువుండటమంటే కవి తన అనుభవమే, జీవితమే, తనను తానే సాహిత్యంగా రూపొందించుకోవటం. కవే సాహిత్యం కావటం. ఇంతవరకు కవి వేరు, తన సాహిత్యం వేరు. ఇప్పుడు కవి తానే, కావ్యమూ తానే కావటం. ఇప్పటిదాకా తాను సృష్టించిన సాహిత్యం ఉంది. ఇప్పుడు తనను సృష్టించిన సాహిత్యం ఉంటుంది. తాను గతించినా తను సృష్టించిన సాహిత్యం ఇంతకాలం ఉండేది. ఇప్పుడు తాను భౌతికంగా గతించినా తన సాహిత్యంలో తాను ఆత్మికంగా ప్రతిష్ఠితుడై ఉంటాడు. తనలో వస్తు వుండటం, తానే వస్తువు కావటం, అభివ్యక్త వస్తువులో తన అస్తిత్వం దాగి అంతర్లీనంగా ఉండటం నిబిడతను తెలుపుతుంది.*

*ప్రజల సాహిత్యంలో నిబద్ధత కంటే నిమగ్నత ఉత్కృష్టం. నిమగ్నత కంటే నిబిడత విశిష్టం. సారస్వత పరిణామంలో నిబిడత పక్వఫలం. నిబద్ధత నిమగ్నత నిబిడత లేని సాహిత్యం ప్రజలకు దూరంగా ఉంటుంది. ఏ వర్గం సాహిత్యం ఆ వర్గం విముక్తి కారకమవుతుంది. అందువల్ల వర్గ వర్ణ సాహిత్యం అనివార్యం. విముక్తి దృష్టి అపరిహార్యం. ఏ వర్గం వర్ణం కోసం ఆ వర్గం, ఆ వర్ణం సారస్వతం సృష్టించుకోవడమంటే నిబిడత సాహిత్యం అవతరించటమే. క్రమంగా వికాసం చెందుతున్న నేటి సాహిత్యం ప్రజా బాహుళ్యాన్ని విముక్తం చేసే కృషిలో ఉంది. ఈ పథంలో సామాన్యుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం విలువలుగా ప్రతిబింబించే సాహిత్యం దర్శించి మాన్యులవుతారు. ఆధునికాంధ్ర సాహిత్యంలోని ఈ విలువలను వెలువరించటం, వెలార్చటం, వెలకట్టటం నేటి విమర్శ సాధిస్తుంది.*

**సంభాషణ : అశ్వినీకుమార్**

*ధ్వని ముద్రణకు రాత ప్రతి : **సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

# మౌనస్ఫురిత హృదయ గీతిక
# ఇందిర

– ఆచార్య వై. పార్థసారథి

**కఖారే కలశి ధారి,**
**రాధా జే జమునా నది,**
**ధీరే ధీరే చాలి జాయె,**
**మనరే కృష్ణ స్మృతి.... ఒడియా భజన గీతం**

రాధ తన నడుముపై కుండ పెట్టుకుని యమునా నదికి వెళుతోంది. ఆమె మనసులో కృష్ణుడి జ్ఞాపకాలు, అల్లరి దృశ్యాలు నిండిపోయాయి.

* * * *

నేను మొదటిసారి అత్తవారింటికి వెళుతున్నాను. రతిపతి పారిజాత పుష్పాల బాణాలు విసిరి, మానవ జన్మను సార్థకపరచే సౌఖ్యం ఒనగూరే ఫలం అది. శీతాకాలంలో వసంత వాయువులు, అమావాస్య సైతం పూర్ణిమలా వెన్నెల ప్రసరించే ఆనందం దొరికే చోటు.

* * * *

ఇందిర నవల మౌనంలో ముడుచుకున్న హృదయ భావాల వెలుగులో రాయబడ్డ సుకుమార గాథ. ప్రేమ, దుఃఖం, విరహం, సహనం మృదుస్వరాల్లో ఆలపించిన అంతరంగ గీతిక. ఆమె దుఃఖం శబ్దం చేయదు. ఆమె జీవితం బాధతో విరిసినా, ఆ బాధలోని మృదుల కాంతిని తాకే అనుభూతి ఈ నవల కలిగిస్తుంది.

బంకించంద్ర రచించిన ఇందిర నవల పందొమ్మిదవ శతాబ్దపు బెంగాల్ సమాజంలోని మార్పులు, ముఖ్యంగా స్త్రీ స్థానం, వ్యక్తిత్వం – సామాజిక విలువల మధ్య ఉన్న సంఘర్షణలను సున్నితంగా తెలుపుతుంది. స్త్రీని తల్లి, భార్య, సోదరి వంటి పాత్రలకు పరిమితం చేసిన సమాజంలో ఇందిర స్వంత వ్యక్తిత్వాన్ని ప్రకటించే వ్యక్తిగా నిలుస్తుంది.

సమాజంలో పెరుగుతున్న ధన ప్రాధాన్యతను, ఆధునికత ఏవిధంగా మనుషుల జీవితాలను డబ్బుతో ప్రభావితం చేస్తుందో, ఈ నవలలో బంకిం నాయిక ద్వారా ధన కేంద్రీకృత దృక్కోణాన్ని ప్రశ్నింపజేస్తాడు. సుఖం డబ్బుతో మాత్రమే రాదని ఆమె తన ఆలోచనల ద్వారా తెలుపుతుంది.

"తోటలో పూలు అందంగా వుంటాయి. కాని వాటిని కోసి గిన్నెలో పెట్టినపుడు, అవి అంత అందంగా వుండవు. కలలు కనడంలో ఉన్న ఆనందం, అవి సాకారమయినపుడు, అంతకుముందు ఉన్న ఆకర్షణ తగ్గిపోతుంది. ఆకాశం నిజంగా నీలం కాదు. కాని అది నీలంగా కనిపిస్తుంది. ఆస్తి కూడా అంతే. ధనం సాధారణమైన ఆనందం కోసమే. చాలామంది ధనవంతులు వాస్తవానికి ధన భాండాగారానికి కాపలాదారులే."

ఈ ఉపమానాల ద్వారా ఆమె జీవిత ఒడిదుడుకులను వివరిస్తూ రచయిత, ధనం కంటే స్వేచ్ఛ అవసరమని తెలియపరుస్తాడు.


ఇందిర భావాలు ఆనాటి బెంగాలి మధ్యతరగతి ఆత్మను ప్రతిబింబిస్తాయి. అందంపట్ల ఆమెతో చెప్పిస్తూ, చూపించిన ఆసక్తి, తన కాలాన్ని మించిపోయింది. నదీ ప్రవాహాన్ని, సెలయేటి గలగలను చూసినపుడు ప్రకృతి విశాలతను, సౌందర్యాన్ని తిలకించినపుడు, ఆమెలోని భావోద్వేగాలు మేలుకోవడం, ఆత్మస్థైర్యాన్ని మరింతగా పెంచుకోవడం వంటివి, ధనం ద్వారా తీరని ఆనందం, తృప్తికి లోనై కష్టాలను ఎదిరించే శక్తిని పొందుతుంది. తన ప్రయాణంలో చిన్నపిల్లలు 'కలశిధారి' అంటూ రాధ విరహ గీతాలను పాడుతున్నప్పుడు అందంగా అనిపించి, తన జీవితానికి అన్వయించుకుంటుంది. అదే పాటను తాను పాడుతుంటే తన తాత్కాలిక సంరక్షకురాలైన వృద్ధ మహిళ ఇష్టపడదు. ఆ పాటలోని పదాలు బలమైన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరచి అంతరాత్మను తాకుతాయి. కష్ట సమయంలో జపిస్తూ ధైర్యం తెచ్చుకుంటుంది.

ఇందిర అభిప్రాయంలో అందం, న్యాయం, ప్రశంస వంటి పదాల అర్థం – వ్యక్తి వ్యక్తికి, కాలం నుండి కాలానికి మార్పు చెందుతాయి. రాముడు సీతను అడవిలో విడిచిపెట్టినపుడు రాముడిని ప్రశంసిస్తాం. కాని సాధారణ వ్యక్తి చేస్తే అతనిని తప్పు పడతాం. ఈ వాదనలు,

నిర్ధారణలు వినోదాత్మకంగా ఉన్నా, అంతర్భూతమైన అర్థం కలిగి, తన భర్తను ఆకర్షించడానికి ఇందిర చేసిన చతురతలను సమర్థిస్తాయి.

నేను నా భర్తను బాల్యంలో ఒక్కసారి మాత్రమే వివాహంలో చూశాను. వివాహిత స్త్రీని అయినా విధవలా బ్రతుకుతున్నాను. నాకు దాంపత్య సుఖం లేదు. ఎదురుగా వున్న వ్యక్తి నా భర్త. నేనెవరో ఆయనకు తెలియదు. ఆమెకు హృదయం ద్రవిస్తుంది. ఆమె శారీరక సౌఖ్యాన్ని కోరుకుంటుంది. అతను నన్ను ఇష్టపడుతున్నాడు. అంటే నన్ను పతిత అనుకుంటున్నాడా? ఈ భావం వ్యభిచారంతో సమానమని భావిస్తుంది. ఒకవైపు శారీరక వాంఛ – మరోవైపు సామాజిక నైతికత స్వరూపంలో రచయితలోని కవి సహజ ప్రవృత్తిని సమర్థిస్తూనే, నైతికవాది మాత్రం సామాజిక నియమాలను అనుసరించాలంటాడు.

**విషాదం కేవలం పరిస్థితుల వల్ల మాత్రమే గాక, మనుషులలో ఉన్న పరస్పర విరుద్ధ అంతర్గత ఆలోచనలను సమన్వయం చేసుకోలేని అసమర్థత వలన కూడా ఉద్భవిస్తుంది. ఈ వైరుధ్యాన్ని ఛేధించడమే సమర్థత.**




* * * *

బంకించంద్ర ఈ నవలను మొదట హాస్యరస ప్రధానమైన కథగా వంగదర్శన్ పత్రికలో ఒక సీరియల్‌గా రాసినప్పటికి, తదనంతర కాలంలో మరింతగా విస్తరింపజేసి 1873లో నవలగా ప్రచురించారు. చారిత్రక నవలలతో (దుర్గేశ్‌నందిని), కపాలకుండల, మృణాళిని) చేసిన ప్రయోగాల తర్వాత, సమకాలీన జీవితంపై ఆయన దృష్టి సారించారు. వాస్తవిక, సామాజిక అంశాల ఆధారమైన రచనలను చేశాడు.

బంకింలో ఈ మార్పుకు ప్రధాన కారణం – ఆయన స్నేహితులు, సమకాలీకుల అభిప్రాయాల ప్రకారం – ఇందిర రచనా సమయంలో ఆయన బెంథామ్, జె.యస్.మిల్, కామ్టే వంటి పాశ్చాత్య, సామాజిక తత్త్వవేత్తల రచనలను అధ్యయనం చేశారు. ముఖ్యంగా మిల్ రచన 'ద సబ్జెక్షన్ ఆఫ్ వుమెన్', కామ్టే పాజిటివ్ సిద్ధాంతాలవల్ల ప్రభావితమయ్యాడు.

బంకించంద్రపై ప్రభావం చూపిన మరో రచయిత మైఖేల్ మధుసూధన్ దత్. బెంగాలి సాహిత్యంలో ఆధునికతకు నాంది పలికిన ఈ కవి రచించిన స్త్రీ పాత్రలైన తిలోత్తమ, శూర్పణఖ, శర్మిష్ట, తార, వీరాంగన – వీరు తమ ప్రియులకు తమ హృదయాన్ని నిస్సంకోచంగా వ్యక్తపరచడమే గాక, ప్రియుడి సాంగత్యం కావాలనే చూపే ఆసక్తి – ఒక నిర్భయ స్వభావాన్ని సూచిస్తుంది. మహిళా విముక్తి అవసరాన్ని తెలుపుతూ సామ్య (సమానత్వం) రచన వంగదర్శన్‌లో ఆ కాలంలో రాయడం ద్వారా బెంగాలి సమాజంలో కొత్త యుగానికి నాంది పలికాడు.

మధ్యయుగ సాహిత్యంలో ఇంత తెలివైన, స్వతంత్ర్య మహిళను ఊహించడం కష్టం. తన అనుభవాలను చెప్పేటప్పుడు ఆమె భయం, సంకోచం, కుటుంబ బంధాలను వదిలి, లక్ష్యంపై దృష్టి సారిస్తుంది. ఇక్కడ బంకిం మిల్ సిద్ధాంతాలను సజీవరూపంలో చూపించాడు.

ప్రేమలో పురుషుడు చూపించే ఆధిపత్యం నుండి బంకిం ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాడు. కుటుంబం అంటే భర్త – భార్య ప్రధాన కేంద్రంగా, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ జోక్యం లేకుండా ఉన్నప్పుడే ప్రేమ వికాసం చెందుతుందని, అందులోనే స్త్రీ తన మానసిక, శారీరక భావాలను వ్యక్తపరచే స్వేచ్ఛ కలుగుతుందని ఇందిర నవల ద్వారా తెలియజెప్పాడు.

ఇందిర నవల ఒక సామాజిక కథ మాత్రమే కాదు. అది మారుతున్న విలువలు, స్త్రీ స్వాతంత్ర్యం, మనోభావోద్వేగాలపై ఒక లోతైన పరిశీలన. ఈ నవలలో ఇందిర తన కథను తన ద్వారానే చెప్పించి, రచయిత ఆమెలోని అంతర్గత సంఘర్షణలను సజీవంగా మనముందుంచాడు.

* * * *

**ఇందిర**

**ఆనందం**

నాకు అత్తవారింటికి వెళ్ళే అవకాశం వచ్చింది. నాకు చిన్నప్పుడే వివాహం అయినా, మా నాన్న బాగా ధనవంతుడు కావడం, మా మామగారు పేదవారు

కావడంతో మా నాన్న నన్ను అత్తగారింటికి పంపక, ముందు అల్లుడు సంపాదనాపరుడు అయిన తర్వాతే పంపుతానని ఖరాకండిగా చెప్పడంతో నేను మా ఇంట్లోనే ఉండిపోవలసి వచ్చింది. ఈ మాటలు తెలిసిన నా భర్తకు కోపం వచ్చి డబ్బు సంపాదనకోసం పంజాబ్‌కు చేతిలో చిల్లిగవ్వ లేకుండా కాలినడకన వెళ్ళాడు. ఆ ప్రయాణ కష్టాలు, అనుభవాల ఆధారంగా ఆయన బాగా డబ్బు సంపాదించి, వెనక్కు రావడంతో, మా మామగారు నన్ను అత్తవారింటికి పంపకపోతే, నా భర్తకు మరో వివాహం చేస్తానని చెప్పడంతో, వచ్చిన అలంకారాలతో కూడిన పల్లకి, బోయీలు, దాసీలు, కానుకలు చూసిన మా తండ్రి నన్ను పంపడానికి అంగీకరించారు.

మా రెండు గ్రామాల మధ్య ప్రయాణానికి ఒకరోజు పట్టడంతో తెల్లవారుఝామునే బయలుదేరాము. ఆయన పేరు ఉపేంద్ర (భర్తపేరు ఉచ్చరించినందుకు మన్నించాలి) అని మాత్రమే తెలుసు. రూపురేఖలు లీలా మాత్రంగానే గుర్తున్నాయి. ఆయనను గుర్తుపట్టగలనా అనే సందేహం పీడిస్తోంది. మార్గమధ్యంలో ఉన్న ఒక అడవి ప్రాంతంలో దొంగల భయం వున్నా పదహారుమంది దాసదాసీలు, సేవకులు, బోయీలతో ప్రయాణంలో నాకేం భయం. ఒక సరస్సు దగ్గర అలసిపోయిన బోయీలు భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా, దాసీలు సెలయేరులో స్నానం చేస్తున్నారు. ఇంతలో ఎవరో నా పల్లకీని ఎత్తుకుని పరిగెత్తారు. నా మనుషులను బల్లెంతో పొడిచి నన్ను కత్తితో బెదిరించారు. నా విలువైన నగలు, బట్టలు తీసుకుని నాకొక పాతచీర ఇచ్చి ఒక నిర్జన ప్రదేశంలో వదలి వెళ్ళిపోయారు. నాపట్ల పశువులా ప్రవర్తించబోయిన ఒక దొంగను, వాళ్ళ నాయకుడు తిట్టి, ఎవరో కాయస్థుల అమ్మాయి – సమస్యలొస్తాయని మందలించాడు.

**దుఃఖం**

నేను ఈ విపత్తు, దుఃఖం నుండి తేరుకునేలోపు చీకటి పడింది. ఏదైనా జంతువు నన్ను తినేస్తే బాగుండునని కోరుకున్నాను. ఒక చెట్టు మొదట్లో నిస్సత్తువతో పడిపోయాను. ఈ పరిస్థితిలో ఎవరూ నన్ను గౌరవంగా చూడరని ఆలోచించి చనిపోవాలి అని నిశ్చయించుకున్న నాకు, సూర్యకిరణాలు, పక్షుల కిలకిలారావాలు, చిగురిస్తున్న లతలు, వికసిస్తున్న పుష్పాలను చూసి జీవితంపై ఆశ మొదలైంది. ఆకులు కోసి వక్షాన్ని కప్పుకుని, నా గాజులు చూసి వివాహం అయిందని గుర్తిస్తారని – తీగలతో గాజులు చేసుకుని పాత చీర వంటికి చుట్టుకుని కష్టంగా బయలుదేరాను. ఒక ముసలమ్మ సాయంతో మా ఊరికి వ్యతిరేక దిశలో వెళ్ళి ఓ గ్రామం చేరుకున్నాను. ఒక బ్రాహ్మణ వృద్ధుడు నన్ను కాయస్థులని గుర్తించి, తన ఇంట్లో ఆశ్రయం కల్పించాడు.

కాశీ బయలుదేరుతున్న ఒక కుటుంబంతో కలసి, కలకత్తా వెళ్ళే ఏర్పాటు చేశాడు. కలకత్తాలో ఉన్న మా బాబాయి దగ్గరకు వెళ్ళి, ఆయన సహాయంతో మా ఊరికి వెళ్ళ వచ్చని తలచి అంగీకరించాను. ఆ కుటుంబం కాళీమాత పూజకోసం భవానీపురంలో ఆగి, బాబాయి చిరునామా అడిగితే ఏమీ తోచలేదు. లోతు తెలియని సముద్రంలా ఉన్న ఇంత పెద్ద మహానగరాన్ని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఆ కుటుంబం కాశీ ప్రయాణం మొదలవడంతో, వారి ధర్మపత్ని ఎక్కడైనా పనికి కుదురుకుని అదృష్టం పరీక్షించుకోమని చెప్పింది. ధనం, ప్రతిష్ట, పేరు ప్రఖ్యాతులు గల కుటుంబం నుండి వచ్చిన నేను దాసీగా కుదురుకోవడం అనే ఆలోచననే ఊహించుకో లేకపోయాను.

నన్ను పనిమనిషిగా పెట్టుకోవటానికి, బ్రాహ్మణ కుటుంబాన్ని కలవడానికి వచ్చిన ఓ కుటుంబం అంగీకరించింది. నాకంటే కాస్త ఎక్కువ వయస్సు ఉన్న సుభాషిణి – నీవు మా కాయస్థులట కదా అంటూ స్నేహపూర్వకంగా మాట్లాడింది. నా కుటుంబ గౌరవం కాపాడడం కోసం నా పేరు కుముదిని అని చెప్పి, దాసీ పనికాక వంట పని చేస్తానని చెప్పాను. వారింట్లో ఉన్న బ్రాహ్మల వంట మనిషి కంటే, మాంసాహారం వండే కాయస్థుల పిల్ల – బాగా బ్రతికి చెడ్డ కుటుంబంలా కనిపిస్తోంది అంటూ ఆమె అత్తగారు నన్ను అంగీకరించింది. నా వంటకాలు అందరికీ నచ్చడంతో నాకొక ఆశ్రయం దొరికింది. సుభాషిణి నన్ను ఆప్తమిత్రురాలిగా గుర్తించడంతో, పిల్లలకు కథలు చెబుతూ, పాటలు పాడుతూ వారింటిలో మనిషిలా మారిపోయాను. సుభాషిణి భర్త రమణబాబు పేరున్న వకీలు.

సుభాషిణి నా ప్రవర్తన, పద్ధతి, వ్యవహరించే తీరు గమనించి, నా గురించి అదేపనిగా అడగడంతో,

ధనవంతుడైన నా తండ్రి గురించి, నా మామగారి గురించి చెప్పక తప్పలేదు. నా కథంతా విన్న సుభాషిని తన ఏడుపు ఆపుకోలేకపోయింది. తన భర్త ద్వారా నా తండ్రికి ఉత్తరం రాస్తానని ప్రయత్నాలు చేసినా, నేను తపాలా ఆఫీస్ వివరాలు తెలియక సరిగా చెప్పలేకపోవడంతో ఆయన రాసిన ఉత్తరాలన్నీ వెనక్కు వచ్చాయి. నా భర్త, మామగారి పేరు మీద ఉత్తరాలు రాసినా అవీ వెనక్కు వచ్చాయి. నన్ను దొంగలు ఎత్తుకు వెళ్ళారు కాబట్టి, నన్ను స్వీకరించడానికి నా భర్త, మామగారు సందేహించి ఉంటారని అనిపించి, ఎలాంటి ఆశ, ఆధారం లేదని దుఃఖంతో కుమిలిపోయాను.

**విరహం**

ఒకరోజు ఉదయం అంతా హడావిడిగా వుంది. రమణబాబు గారికి ఒక ధనవంతుడైన కక్షిదారు వస్తున్నాడని, ఆయనకు భోజనం రుచిగా తయారు చేయాలని నాకు చెప్పారు. వడ్డించడానికి కూడా నన్ను పిలవడంతో, అందగాడు, స్ఫురద్రూపి, ముప్పై సంవత్సరాల వయస్సు ఉన్న ఆ వ్యక్తిని చూడగానే నాకు ఏదో వెలుగు చూసినట్లయింది. ముసుగులో ఉండి ఆయనను చూస్తూ వడ్డించాను.

వివాహిత స్త్రీ అయి కూడా విధవలా బ్రతికే ఈ జన్మపై నాకు విరక్తి కలిగింది. వివాహ సమయంలో తప్ప భర్తను చూడలేదు. యవ్వనమంతా మోడుబారిపోతోంది. ఈ జన్మపై రోత కలిగింది. మళ్ళీ, మళ్ళీ ఆయనను చూసి ఈయనే నా భర్త అనిపించింది. ఆయన నా వంటకాలను మెచ్చుకుని, మా ఊరు ఎక్కడ అని అడిగారు. కాలాదీఘి అని అబద్ధం చెప్పాను. దొంగల కాలాదీఘినా అని అడిగితే అవునని అనడంతో ఆయన ఏమీ మాట్లాడలేదు. అది నన్ను దొంగలు ఎత్తుకెళ్ళిన ప్రాంతం. ఉపేంద్రబాబూ – నింపాదిగా భోజనం చేయండని రమణబాబు అనడంతో నేను ఉలిక్కిపడ్డాను. ఈయనే నా స్వామి. నా జీవితంలో ఆనందానికి అవకాశం ఉందని అనిపించి, ఆ ఆలోచనే ఊరట కలిగించింది.

పనిమనిషిని ఆయన ఎన్నిరోజులు ఉంటాడని అడిగితే, మోజు పడ్డావా, ఛీ – ఇలాంటిదానివనుకోలేదు అంటూ ఛీత్కరించింది. చివరకు సుభాషిణిని అడిగితే, నీ బంగారు చందమామను మేమే పట్టి తెచ్చాం. ఆయన ఆస్తి వ్యాజ్యం ఏదో ఉండడంతో, నీవు చెప్పిన వివరాలు సరిపోవడంతో రమణబాబు ఆయనను రమ్మని పిలిపించారని అంటూ నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. మరి నన్నెందుకు పరిచయం చేయలేదని అడిగితే అలా చేస్తే సర్వనాశనం అయిపోతుంది. నిన్ను దొంగలు ఎత్తుకుపోయారు. ఎక్కడ తిరిగావో, ఏమయ్యావో ఎవరికి తెలుసు? నిన్ను పతిత అని ముద్ర వేసినా ఆశ్చర్యం లేదు. అందుకుగాను దీనిని జాగ్రత్తగా పరిష్కరించాలని సుభాషిణి అనడంతో నాకేమీ అర్థం కాలేదు.

సుభాషిణి సలహాతో ఆయనను కలవాలని వంట మనిషి పేరుతో ఒక ఉత్తరం వ్రాసి పనిమనిషిని బ్రతిమాలి ఆయనకు పంపాను. ఆయన అంగీకరించారు. సుభాషిణి నన్ను అలంకరించింది. సువాసన నూనెలు రాసి, తన బట్టలు ఇచ్చి అందంగా తయారు చేసింది. కన్నీరు పెట్టుకుంది. ఏ స్త్రీకి ఇలాంటి కష్టం రాకూడదని, నన్ను ముద్దు పెట్టుకుంది. ఆమె ముద్దు, ఆలింగనం నాకొక ధైర్యాన్ని ఇచ్చాయి.

నాకొక కొత్త సందేహం పుట్టుకొచ్చింది. ఆయన నా భర్త అని నాకు తెలుసు. కాని నేనెవరో ఆయనకు తెలియకపోయినా నన్ను రాత్రిపూట కలవడానికి ఎందుకు అంగీకరించారు? అంటే నా ప్రణయాన్ని స్వీకరించడానికి తయారయ్యారన్నమాట. ఇక్కడ సుభాషిణి స్త్రీ, పురుషుల మధ్య ఉండే తేడాలను చెప్పి, వారి స్వభావాన్ని గుర్తించమని హితబోధ చేసింది. (ఇక్కడ బంకించంద్ర పురుషాధిపత్య అంశాలకు సంబంధించిన చర్చను సుభాషిణి ద్వారా తెలియజెపుతాడు). ఆయన వసతి గృహానికి నన్ను పంపింది.

స్వామి సన్నిధిలోకి, పరపురుషుని గదిలోకి వెళ్ళడం తొలిసారి. నా ఏడుపు చూసి, నీ అంతట నీవే వస్తానన్నావు కదా! మరెందుకు ఏడుస్తున్నావని ఆయన అనగానే నన్ను కులటగా భావిస్తున్నారని మరింత బాధకు లోనయ్యాను. మీ దొంగల కాలాదీఘీ దగ్గర ఇంత సుందరాంగి ఉంటుందని నాకు తట్టలేదు అన్నారు. నేను ధైర్యం తెచ్చుకుని మాట్లాడడం మొదలుపెట్టాను. ఆయన తన భార్య కాలాదీఘీలో తప్పిపోయిందని, రెండవ వివాహం చేసుకోలేదని చెప్పారు. మీ మొదటి భార్య వస్తే సవతి అవుతుందేమో అని అన్నాను. ఈ సమయంలో ఆమె వస్తే

ఏం చేస్తారని అడిగితే ఆమె గురించి ఏమీ తెలియదు. ఎవరితో కలసిపోయిందో? ఆమెను త్యజిస్తాను అన్నారు.

నెమ్మది నెమ్మదిగా నా వశమయ్యారు. దగ్గరకు వస్తుంటే దూరం పెట్టాను. నేను కులటను కాదు. మీతో కొత్త ప్రదేశాలు తిరగాలని వచ్చాను తప్ప వేరే ఉద్దేశం లేదు అంటూ వెళ్ళిపోబోయాను. నీ అందం నన్ను వివశుణ్ణి చేస్తోంది. ప్రాణ సమానంగా చూసుకుంటాను అంటూ నన్ను పట్టుకోబోయారు. నేను వేరే గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని, నేను మీ దాసిని, ఎనిమిదిరోజులు నాతో మాట్లాడకుండా ఉండండి. ఈ ఎనిమిది రోజులు పరీక్షా సమయం అంటే అంగీకరించారు.

విధాత ఎన్నిరకాల విద్యలు స్త్రీలకు రాసి ఇచ్చారో, అన్నీ అవలంబించి ఎనిమిది రోజులు వారిని శారీరకంగా దూరం ఉంచాను, కాని ప్రేమ సంభాషణలు చేస్తూ ఉన్నాను. వారి ప్రతి పనిలో సహచర్యలు చేస్తూ, వారికి అన్ని సదుపాయాలు సమకూర్చాను. అతని మనసును ఎంతగా రగిలించానో కాని, నన్ను వదలి వెళ్ళడానికి ఏమాత్రం ఇష్టపడడం లేదు.

స్త్రీ వల్ల ప్రపంచానికి ఇంత నష్టం జరుగుతుందా? అని నాకు నవ్వు వచ్చింది. మావటివాడు ఏనుగును అంకుశంతో నియంత్రించినట్లు, ఇంగ్లీషువాడు తన క్రింది అధికారులను కఠిన చూపులతో నియంత్రించినట్లు, మేము మిమ్ములను చిరునవ్వులతో, చూపులతో నియంత్రించగలం.

ఇద్దరం ఒకరి లొంగుబాటులోకి మరొకరు వచ్చాము. మేము కలకత్తాలో స్వతంత్రంగా వున్నాము. ఒకరోజు ఆయన అత్యవసరంగా ఇంటికి వెళ్ళాలి అన్నారు. రమణబాబుతో మాట్లాడారు. నా భర్త, తల్లితండ్రుల గురించి అడిగారు. ఆయన దేనికి సరిగా జవాబు ఇవ్వకుండా – ఇవన్నీ కాగితం మీద రాసి, సీల్డ్ కవర్‌లో వకీలు సంతకంతో ఇస్తాను. మీ ఊరు వెళ్ళాక చూడమని చెప్పారు.

నన్ను తన వెంట తమ ఊరికి తీసుకువెళతానని చెప్పినపుడు నేను నవ్వుతూ – ఈమె ఇందిర – రమణబాబు ఇంటి నుండి తెచ్చానని చెబుతారా అని అడిగాను. నీకు ఇందిర పేరు ఎలా తెలుసని గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. దొంగలు ఎత్తుకుపోవడం, కలకత్తా రావడం, సమాజం చూపే దుష్ట పరిస్థితుల భయంతో నిజాలు చెప్పలేకపోయానని చెప్పాను. వారు నాకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని వివాహ సమయంలో జరిగిన అన్ని పద్ధతులను, ఇద్దరం కలసి ఉన్నప్పుడు మాట్లాడుకున్న మాటలు అడిగారు. నీవు నా ఇందిరవా? కుముదినివా? మాయావివా అని ఆశ్చర్యంగా ప్రశ్నించారు. (బంకిం ఇక్కడ ఆ కాలంలో ఉండే మహామాయ, భైరవి, విద్యాధరి వంటి నమ్మకాలను చర్చిస్తారు.) రమణబాబు తన భార్య సుభాషిణికి ఇదంతా తెలుసని వివరంగా చెప్పారు. ఆమె వివరాలన్నీ సీల్డ్ కవర్లో ఇచ్చానని అది మీ కుటుంబానికి చూపించమని రమణబాబు అనడంతో ఆయన నన్ను మా గ్రామ పొలిమేరలో వదిలి వెళ్ళిపోయారు.

నేను ఏడుస్తూ ఇంట్లోకి వెళ్ళడంతో, నా తల్లి, తండ్రి నోటిమాట రాక మ్రాన్పడిపోయారు. నా చెల్లెలుకి మాత్రం జరిగింది చెప్పాను. రెండు రోజుల తర్వాత ఆయన మా ఇంటికి వచ్చారు. నేను ఇంట్లో ఉన్న సంగతి ఎవరూ చెప్పలేదు. నా చెల్లెలు నా స్వామిని నా వద్దకు తీసుకు వచ్చింది. ఇప్పటికైనా నమ్మారా? కుముదిని – ఇందిర ఒక్కటే అని నన్ను చూపించింది. నా భర్తతో సగర్వంగా పల్లకీలో మామగారింటికి వెళ్ళాను.

**మనోమథనం**

నా మొదటి ప్రయాణం ఒక కథలా, కలలా జరిగి నాకు స్థైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని కలిగించింది. ఈ రెండవ ప్రయాణంలో ఒక ధనవంతుడి ఆస్తిగా వెళుతున్నాను – నా స్వేచ్ఛను వదులుకుంటున్నానా? ఈ రెండు ప్రయాణాలు సమానమేనా అనే ప్రశ్న నన్ను వేధించింది. నా సుఖ జీవన ప్రదాత – ప్రతిరోజు తలుచుకునే – సుభాషిణిని మళ్ళీ కలిసే అవకాశం రాలేదు – ఎందుకంటే ఇప్పుడు నేను స్వతంత్రత లేని వ్యక్తిని.

– – – –

మనిషిలో ఉద్భవించే కోరికలు స్వతంత్రంగా వుండి, మనిషి అంతరంగంలో, మనస్సాక్షి రూపంలో స్థిరపడే సామాజిక నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో, ఆ వైరుధ్యాన్ని సమన్వయం చేయలేకపోవడంతోనే విషాదం ఉత్పన్నమవుతుంది.

ఆచార్య వై. పార్థసారథి
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 900 043 8090

# భాష - ఆవిష్కరణ

*- వి. వరదరాజు*

ప్రతి శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణ మానవ జీవితాన్ని వేగవంతం చేసింది. సుఖమయం కావించింది. వీటిలో ప్రత్యేకమైనది భాష. మదిలోని భావాన్ని వ్యక్త పరచే వాహకమే భాష . ఇది నమ్మకాలు ప్రోది చేస్తుంది. సంస్కృతి నిర్మిస్తుంది. చరిత్ర నమోదిస్తుంది. ఒక జాతికి గుర్తింపు తెచ్చి పెడుతుంది. తొలి నాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. తరువాత ఉత్తరం వచ్చింది. ఫోన్ మాట్లాడే దూరాన్ని చెరిపేసింది. అదనంగా మెయిల్, వాట్సప్ వంటి సమాచార సాధనాలు చాలా వచ్చాయి. నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో వున్నాయి. ఎన్ని సాధనాలు వచ్చినా భాష మారలేదు. అలానే వుంది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే. కానీ ప్రేరణ అలానే నిలిచి వుంది.

కృత్రిమ మేధా ఇప్పుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరిగి రాస్తోంది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది, వ్యాసాలు రచిస్తోంది, సంగీత బాణీలు కడుతోంది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధ ట్యూటరుగా, అనువాదకునిగా, ఒక సహచరునిగాను వ్యాహరిస్తున్నది. తర్కం, స్థిర వ్యస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజనీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే ఎఐ ప్రభావంతో రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఎఐ ద్వారా తక్షణమే పొందగలం.

కథలు చెప్పగలిగే వారే ప్రపంచంలో అత్యంత శక్తి మంతులు అంటారు పెద్దలు. మాట అంత మహత్తర మైనది. భాష ఒక జాతి సంస్కృతి, బావోద్వేగాల జీవన శ్వాస. ఎఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదం సరిగానే ఉంటుంది. ఐతే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. ఆ ఉద్వేగ అనుభూతి యంత్రానికి సాధ్యం కాదు కదా!

టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఎఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగా ఉంటుంది. కానీ పేలావం అనిపిస్తాయి. అనువాదం అంటే ఒక భాష నుండి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం.

అందుకే భాష భిన్నమైందని భాషవేత్తలు చెబుతారు. సైన్స్ ఫార్ములా తెలుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకోంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. మనలో విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తాయి. భాష నేర్చుకోవడంలో మెళుకువలు మప్పుతాయి. ఇది సజీవ శిక్షణ. ఆ సజీవత ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు.

కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయ పడతాయి. అవి పలుకుబడి సరిచేస్తాయి. వ్యాకరణం వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని అందిస్తాయి. టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. పాఠ్య ప్రణాళిక రాసుకోవచ్చు, విద్యార్థులు నుండి వేగంగా అభిప్రాయాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషా పటిమ ధారాళంగా మాట్లాడడం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే వస్తుంది.

సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతునే ఉంటాయి. యాస, మర్యాద పూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని

సమోదు చేయగలదు. కానీ మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీజు. ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం.

గత కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరక్కింది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు బాగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇంగ్లీష్ తప్పనిసరైంది. నేడు ఏ భాషనైనా ఎఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే ముప్పు కలిగించవచ్చు. భాష నేర్చుకోవలసిన అవసరంలేదనే భావన మనలో ఏర్పరస్తుంది. అందుకే టెక్నాలజీని నేర్పు వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సంస్కృతిక సందర్భం గుర్తెరగడం కూడాను . ఇది సామాజిక సంబంధాలు నిలిపే సాధనం. వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువ చేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమైవుంటాయి. ఇదే నిజ భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నం ద్వారానే భాషా పటిమ పట్టుబడుతుంది.

ఈ సాధనే భాష నిలిచి వెలిగేలా చేస్తుంది.

**వి. వరదరాజు**
శ్రీకాకుళం,
ఫోన్ : 94925 42033

## కమ్మతెమ్మెర

**మే మిసిమి** సంచికలో సత్యప్రసాద్ గారితో మీ సంభాషణ బాగుంది. తానొక అన్వేషి అన్నారు. ఇలాంటి వాళ్లను అర్థం చేసుకోవడం కష్టం. వారి సంస్థలో నేను కూడా కొన్ని సంవత్సరాల నుండీ వాలంటీర్‌గా చేస్తుండడం వల్ల రెండు మూడు సంగతులు చెప్పాలనిపించింది. వారు ఇంగ్లాండ్ నుండే (ఎక్కువ కాలం) సంస్థను నడపటం ఒక ఎత్తైతే, దగ్గరగా ఉండి పని చేస్తున్నప్పుడు అరే ఇలాంటి వాళ్ల మీద వదిలితే ఎలా పనులవుతాయి అనిపిస్తుంది. అయితే "మొత్తాన్ని చూడు కలుపును కాదు" అంటారు ఆయన ఎప్పుడూ. క్యాంపస్‌లో ఉన్నప్పుడు కూడా ఏ నాడూ ఆఫీస్‌ల చుట్టూ తిరగడం అంటూ ఉండదు. "లగాన్" సినిమాలో కుంటి వాడు ఒకడు క్రికెట్ టీమ్‌లో ఉంటాడు. అది గుర్తుకొస్తుంది నాకు. ఎవరైనా చేయగలరు చేసుకుంటూ పోదామంటారు. ఒకసారి ఒకమ్మాయిని మిగతా అమ్మాయిలందరికీ చాలా ఇబ్బంది అవుతోందని ఆయన దేశంలో లేనప్పుడు పంపించి వేస్తే ఆ తరువాత ఆ అమ్మాయి ఈయన క్యాంపస్‌కి రావడమే తడవూ, కలవడమూ మళ్లీ చేరిపోవడం జరిగింది. ఇప్పుడు ఆ అమ్మాయి చదువయిపోయి ఉద్యోగం చేసుకుంటూ పెళ్లి కూడా చేసుకుంది ఈ మధ్యన. ఆయనకు కనపడేది మనకు కానరానిది ఏమిటి అంటే లోతుగా ఆలోచించవలసిందే.


నీలవేణి

ఒక సారి హీల్ కుటుంబంలోకి ఆహ్వానించినాక బయటకు పంపటమేంటి అంటారు? క్యాంపస్‌కు వెళ్ళినప్పుడు వినాలే కాని చాలా కబుర్లు చెప్తారు. ఎవ్వరూ మాకు సమయం ఉండదు అనటమే వింటాం, గృహిణి అయినా పెద్ద ఉద్యోగి అయినా. కాకపోతే బరువైన కబుర్లు ఆలోచిస్తే. అన్నీ సంస్థకు సంబంధించినవే. నిరంతర శిక్షణ అంటే ఇదేనేమో? మరి సంస్థ పనులో? సమర్థులు delegate with vengeanceతో చేస్తారంటారు, అదే జరుగుతోంది అక్కడ. వారి మాటల సారాంశం మీరు చెప్పినట్లు ... "ఎదుటి వారిని ప్లీజ్ చేయడం పనిగా పెట్టుకుంటే you will be a prisoner forever throughout your life" అని రాసింది వాస్తవం. నిర్దయగా ముందుకు వెళ్ళిపోతారు తన గమ్యం వైపు. Eudaimonia అని గ్రీకు పదం. యూ దే మోనియా అని పలుకుతారు. తెలుగులో దగ్గరగా అర్థం వచ్చే పదం సార్థకత అనుకుంటా. అరిస్టాటిల్ బతికితే మనిషి అలా బతకాలని చెప్పారు. ఈ కోవలోకి వస్తారేమో ఆయన. P.S. మీ సంభాషణలో చిన్న తప్పులు కొన్ని దొర్లినాయి కాని మెసేజ్ స్పష్టంగా ఉంది.

***- జయశ్రీ, W/o దేవినేని మధు, ఫోన్ : 9989051200***

# తెలుగు రాసే విధానం వేరా?

– డా. నాగులపల్లి భాస్కరరావు

నేను 45 సంవత్సరాల పాటు ప్రజా అభిప్రాయాలు ఎట్లా ఏర్పడతాయి అనే విషయాన్ని వేరువేరు సందర్భాల్లో వేరువేరు ప్రాంతాల్లో పరిశోధన చేసాను. ఆ అవగాహన మర్చిపోలేనిది! సమాజంలో సామరస్యత లోపించడానికి ముఖ్య కారణం ఆలోచనా విధానం, వ్యక్తపరిచే విధానాలు, ఆ అలవాట్ల మీద ఆధారపడి ఉంటుందని గ్రహించిన విషయం. అనుకరించటం, వ్యతిరేకించటం అనే రెండు విధానాలే సమాజంలో పోలరైజేషన్ అనే ధోరణిలో సహన స్వభావం తగ్గిపోతుందనేది తెలియని విషయం కాదు. అయితే అది సరిదిద్దటానికి ఏమైనా ప్రయత్నాలు జరిగినవా అనేది ప్రశ్న.

దృక్పథాలు అనేకం. వైరుధ్యాలు లాగానే సమాజంలో పరిస్థితులపై దృక్పథాలు ఒకేవిధంగా ఉండవుగా. ఏ కోణాల నుంచి చూస్తాం, చదువుతాం అనే దాన్ని బట్టి ఎవరి దృక్పథం వారికుటుంది గదా. ఆశల మీద ఆధారపడి కూడా సమాజంలో సంభాషణలు ఉంటాయి గదా. వ్రాసే విధానంలో, చెప్పే విధానాల్లో దృక్పథాలు, వేరు వల్లే గదా, స్థానికంగా ఆ అలవాట్ల నుంచే గదా. ఉదాహరణకు కందుకూరి, గురజాడ రచనలు తీరు గమనిస్తే వ్రాసే విధానంలో ప్రతిబింబిస్తుంది. ఆ తర్వాత ఆరుద్ర, గోపీచంద్, చక్రపాణి చెప్పే, వ్రాసే విధానాలు గమనిస్తే వారు వ్రాసే శైలి కనబడుతుంది. అది వాళ్ళ దృక్పథం బట్టే గదా. వీళ్లంతా మార్పు కోసం, సాంఘికంగా పోరాడిన వాళ్లే. గురుదత్త కాగోజ్‌కి పూల్, శాంతారామ్ దో అంకె బారహత నుంచి కూడా అదే ఆలోచన గ్రహించవచ్చు. కంక్లూజివ్‌గా కాక సజెస్టివ్‌గా ఉంటుంది వాళ్ళ విధానాలు.

ఇవే నా తెలుగు వ్రాసే విధానానికి మొదటి మూలాలు. స్ఫూర్తి అని కూడా అనవచ్చు. ఆ రోజుల్లో కన్నా ఇప్పుడు సమాజంలో సామరస్యం లోపించటమే కాక, మనస్పర్ధలు పెరిగినవి అని చెప్పకనే తెలుస్తుంది. సహనశీలతకి ఎదుటి వాళ్ళని చర్చిలో దించే మార్గం కూడా. నేను చెప్పిందే ముఖ్యం, మూలం అనే భావంతో కాకుండా, విభేదాలని తగ్గించే విధానం, వేరువేరు మార్గాలకి అవకాశం కలగచేయటం వ్రాసే విధానంలో నుంచి రావాల్సిందేగా ఇదంతా సమాజంలో జరుగుతున్న వైరుధ్యాలు వాస్తవాలను గురించి వ్యక్తపరిచే విధానాలే, ఆలోచింప చేయటానికే చర్చిలో పాల్గొనటానికే, చేసే పద్ధతులే.

అర్థాలే వేరులే. సినిమా వాళ్ళు వాడే భాష అప్పుడప్పుడు అట్లా ఉంటుంది. వాళ్ళ దృక్పథాలు వాస్తవాలు వేరు అవ్వవచ్చు. వాళ్ళందరికీ సినిమా బాగుండాలనేదిగా ప్రయత్నం.

ఇప్పటి సమాజంలో విద్య, విజ్ఞానం విస్తృతం అయిన తర్వాత కూడా సామరస్యం తగ్గిందేగాని పెరగలేదు. సమాజంలో వాడే భాష, మాట్లాడే తీరు దిగజారటం ఎవ్వరికి వారే ఆలోచన విధానంలో నిమగ్నం అవ్వటం కూడా కొంత కారణం. భాష క్లోజ్‌డ్ అవుట్ లుక్ కన్నా, ఇన్‌క్లూజివ్, పార్టిసిపేటివ్ వే లో కమ్యూనికేషన్ విధానాలు ఉంటే ఎట్లా ఉంటుందో అదే నేను తెలుగులో వ్రాసే పద్ధతి ప్రయోగం, తీరు. కొంత కష్టం చదవటం అవ్వవచ్చు, అలవాటు అవ్వాలిగా. ఉద్దేశ్యం ముఖ్యం అనేది గ్రహించగలిగా. అన్ని సందర్భాలను వాస్తవాలుగా అట్లా రాయటం వీలుకాకపోవచ్చు. అయితే, పబ్లిషర్స్ ఒకటి రెండు సంవత్సరాలు కనీసం తీసుకుంటారు. పుస్తకాన్ని అందుబాటులో తేవటానికి! వ్రాసిన విషయాల్లో అప్పటి మార్పు ఉండవచ్చు. ఆ విషయాన్ని కూడా రచయిత కొంత పరిగణనలోకి తీసుకోవాలి భాషలో. సందేశాన్ని ఊహని జోడించి.

రండి ఆలోచిద్దాం, అని వాళ్ళ ఆలోచనలు పంచేవాళ్లు. వాళ్ల రచనా విధానాలు మార్గాలు వేరు. సూత్రధారులు, బలిపీఠం, గుండమ్మ కథ సినిమాల సంభాషణ తీరు గుర్తు తెచ్చుకుని పరిశీలిస్తే చెప్పే విధానాలు ప్రభావాలు గురించి వివరంగా తెలుస్తుంది.

నేను ఈ మధ్య తెలుగులో వ్రాయటం సందేహంతో మొదలైంది. నేను రాయగలనా, లేనా; ఇది నిజమా, కాదా అయినా నా అనుభవాల్ని జోడించి ఆలోచిస్తే కనపడే కోణాలు వేరువేరుగా ఉంటాయి. నేను తెలుగులో మొదటి పుస్తకం *గ్రామాలు గర్వించేలా ఉండాలిగా* మా ఊరే ఒక ఉదాహరణ అంటే ఉన్నాయా లేవా, ఆలోచించమని, అట్లా ఉండాలి అనేగా నా ఆలోచన. ఎవరికీ వారు వాళ్ళ ఊరుని గురించి ఆలోచన చేయండి అని చెప్పటం కాదా? మరి నాకు అప్పుడు టైటిల్ మార్చమని, తెలుగు ఎవరైనా మాస్టర్ చేత దిద్దించమని సలహాలు ఎందుకు ఇచ్చారో. అయితే మా గ్రామంలో ఎక్కువ కాలం ఉండటమేకాక, ఎక్కువ మంది పిల్లలతో రోజు మాట్లాడిన తర్వాత వాళ్ళ దగ్గరి నుండి మాట్లాడేపద్ధతి నేర్చుకోవటమే గాక, ఆ విధంగా వ్రాయటం ద్వారా చదివించగలిగితే ఆలోచింప చేయవచ్చునేమోనని నా రెండో తెలుగు పుస్తకం మహిళలే *గ్రామాలకు శ్రీరామరక్ష* అనేది వ్రాశా. అయితే గమనించవలసింది ఏమిటి అంటే నేను రాసేవి జరుగుతున్న విషయాలు. చరిత్ర కాదు, ఊహాజనితం అసలే కాదు. ఆలోచించవలసిన విషయాలు. నాకు తెలుసు, నేనే కరెక్ట్, నేను చెప్పేదే మీరు నమ్మాలి అని మాత్రం కాదు. అట్లాంటి పరిస్థితులు కొనసాగితే ఏమవుతుందో ఆలోచింపచేయటమే, చర్చలని ప్రోత్సహించే విధంగా. ఇది నా పద్ధతి.

దినపత్రికలు వ్రాసే ధోరణి నుంచి నేను నేర్చుకోవడమే గాక తప్పులని దిద్దుకోవటం కూడా జరిగింది. నా పద్ధతి మోడల్‌నే ఇన్‌క్లూజివ్ – ఇన్‌క్విజిటివ్ స్టైల్ అంటా. ఆలోచనలో మార్పు కోసం, మార్పు రాస్తాం కనుక ఇది, ఇట్లా అని రూఢీగా చెప్పగలమా? ఆప్షన్స్ అనేకం ఉండవచ్చు. వాటిని బయటికి తీసుకురావటానికి ప్రేరణ ఇవ్వటమే నా రచనా విధానం. నేను ఇప్పటికి వ్రాసిన ఆరు తెలుగు వివిధ పుస్తకాలు అన్ని, జరుగుతున్న ముఖ్యంగా గ్రామాలు నేపథ్యంలోని విషయాలే.

నేను రాసేది ఆలోచింపచేటానికి. నా ఉద్దేశాలను రుద్దటానికి కాదుగా! నేను చెప్పేది మాత్రమే నిజమని అసలే కాదు. ఆలోచించి నిర్ణయించుకోండి అనేది నా దృక్పథం. చదివే వాళ్ళని ఆలోచింపచేయటమే నా ధ్యేయం. రాయటంలో ఏదైనా ఉపన్యాసం కాకూడదు కదా. ప్రవచనం అసలే కాకూడదు. ప్రశ్నించే విధంగా, రేకెత్తించే విధాంగా ఉండాలి అనేది నా ఉద్దేశ్యం.

నేను కావాలనే కొన్ని వాక్యాలు కొన్నిసార్లు అసంపూర్తిగా రాస్తా. మరికొన్ని వాక్యనిర్మాణం సంపూర్ణంగా ఉండవు. పూర్తిచేయండి – చూద్దాంలాగా. ఈ శైలిని గురించి అడగకపోతే అర్థమయ్యే విధంగా చదివారా అని అనుమానం రేకెత్తించే విధంగా.

ఉదాహరణకు *గ్రామాలు, ప్రభుత్వ సంస్థలా* గ్రామాలు గర్వించేలా ఉండాలిగా అనే వాక్యాలు నా నిర్ణయాన్ని తెలియజేస్తాయా లేక ఆలోచింపచేస్తాయా? నాయకులు ఎట్లా అవుతారో? అనే పుస్తకం పేరు ఓపెన్ ఆపర్చునిటీస్ తెలియజేసే విధంగా ఉంటుంది. ఇట్లా ఉండాలి లేదా ఇట్లాగే ఉండాలి అనే బదులు ఆలోచనలు రేకెత్తించగలదు. ముఖ్యంగా యువకులలో ఆలోచించండి. క్లోజ్డ్ ఎండెడ్ విధానానికి కన్నా ఓపెన్ ఎండెడ్ ఆలోచనలు ప్రోత్సహించే విధానం మంచిది అని నా ఉద్దేశ్యం.

చెప్పకనే చెప్పే పద్ధతులు, విధానాలు తెలిస్తే ఒకరినొకరు గౌరవించుకోవడమే కాక, ప్రజాస్వామ్యంలో విలువలు అంటేనే కాక, వాటి ప్రత్యేకత తెలుసుకుంటే అది ఎప్పుడో కాదు, అట్లా మొదటినుంచి అలవాటు అయితే ఆ రాజకీయాలే వేరు, అప్పుడు వచ్చే ఆలోచన తీరు వేరు. గణాంకల్లోన్నే కాక గణనీయంగా ఉంటుంది భాష.

చెప్పడానికి కానీ, వ్రాసే దానికి ముఖ్యం క్రెడిబిలిటి కాక బాధ్యత కూడా. నేను రాసే దానికి నేనే బాధ్యుడిని అంటే, రాసిన దాని ప్రభావం ఎవరిమీద ఏవిధంగా ఉండొచ్చు, అనే గ్రహింపు ఉండటం, సెన్సివిటి ఉండడం. ఇది చాలా ముఖ్యం. రాసిన దానికి బాధ్యత వహించాలి, ఉండాలి అనే గుర్తింపు ఉన్న భాష విధానం వేరేగా ఉండాలిగా. అదే నేను రాసేవిధానంలోని ప్రత్యేకత అయితే ఇది అలవాటు పడిన గాడిలో ఉండరకపోవచ్చు. ఎక్కువసార్లు.

సమాధానం మీద దృష్టి కన్నా, ప్రశ్న రేకెత్తించటం లోనే ఉంది అసలు విశేషత కాదా? చాలా సమస్యలకి ముఖ్యంగా సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమస్యలుగా పరిగణించబడే వాటి విషయంలో దృక్పథం ఉంటే మంచిది అని నా భావన.

మమేకం అవ్వకుండా వ్రాయటం ఏవిధమైన స్వలాభం, అంటే ఎవరి తరుపునో ఎండోర్స్‌మెంట్‌గా మాట్లాడటం లేదా ఏదో ఒక ఉద్దేశంతో అదే రాసి ఆలోచనలని రేకెత్తించడం అనేది. అదే ఇప్పుడు ఎక్కువగా జరిగేది మన వార్తా ప్రపంచంలో.

అయితే, ఈ మధ్య అంతా స్పాన్సర్‌షిప్ మీద ఆధారపడటం ఎక్కువైందనేది కనపబడుతుంది. దీనివల్ల ఎండోర్స్‌మెంట్ భాష ఎక్కువైందన్నట్లు కనబడుతుంది. విచ్చలవిడిగా అన్నట్టు, బాధ్యత భావం లేకుండా.

తామరాకు మీద నీటి బొట్టు లాగా నిలబగలగటం. చదువరులని తెలివిగలవాళ్ళుగా భావించి పౌరుడిగా ఏమి చేయాలో, చేయొచ్చో తెలుసుకునే విధంగా చేయడమే ఉద్దేశం. నేను రాసేముందు ఆలోచనల ప్రభావం ఎట్లా ఉంటుంది, ఉండొచ్చు అని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తా, కొంతమందితో మాట్లాడి, వాళ్ళ అభిప్రాయాలు తెలుసుకోవటానికి ప్రయత్నిస్తా. నా భాష అట్లా వచ్చిందే.

నేను తెలుగులో ఆరు పుస్తకాలు, ఇంగ్లీషులో 22 పైగా పుస్తకాలు, ఎన్నో వ్యాసాలు రాశా. అన్నీకూడా స్వతహాగా ఆలోచనలతో రాసినవే. నా ఆదుర్దా, నా ఆలోచనలే అయితే వీటిని గూర్చి ఆలోచింప చేయవలసిన అవసరం ఉందని గ్రహించి ఆ విధంగా వ్రాయటం జరిగింది. అదే విషయం ఇతరులు ఏమి రాశారు, ఏం చెప్పారు అనే దానితో ప్రభావితం అవ్వను.

ఈ నా పుస్తకాలు అన్ని దేశం గురించి, గ్రామం గురించి, గడ్డు సమస్యలకి సంబంధించినవే. అవి నా స్వంత అనుభవాల మీద నేను చేసిన పరిశోధనల ఫలితాలు. గ్రామంలో గమనించిన పరిస్థితుల ఆధారంగా, ప్రభుత్వ నిర్ణయాలు వాటికి రాబోయే ప్రభావాలకి సంబంధించినవే. కుటుంబం గురించి వ్రాయటానికి కారణం అదే కదా మూలం గ్రామ దేశ మనుగడకి.

గోడమీద పిల్లిలా తప్పించుకునే పద్ధతిని తెలియ జేయకుండా రాయను. ఏమి చేస్తే ఏ ప్రభావం ఉండొచ్చు, తెలిసేలా చేయటమే రాయటం ధ్యేయం.


నేను ఇంగ్లీషులో ఆలోచించి రాయటం దాదాపు 55 సంవత్సరాలుగా జరిగే విషయం. గ్రామంలో ఉండి చూసి, మాట్లాడి చాలామంది అభిరుచి తెలుసుకున్న తర్వాత వ్రాసే విధానం వేరుగా ఉంటుందని గ్రహించా. అదేరీతిలో రాయటం కూడా మొదలైంది. అదే అందరూ తెలుగు భాషా కోణంతో చూస్తారు కానీ, భావ దృక్పథం దృష్టితో కాదుగా. నేను నేర్చుకుంటున్నా కానీ నాకు అంతా తెలుసు. నేను రాసేదే మంచి అని కాకుండా. ఏవిధంగా మార్పు తీసుకు రావచ్చు అని ప్రయత్నాలు చేస్తూనే ఉంటా. నేను 2022లో తెలుగులో రాసిన పుస్తకానికి 2025లో రాసిన పుస్తకానికి తేడా కనపడుతుంది.

తెలుగులో రాయటానికి నాకు ప్రోత్సాహం ముదునూరు *జీవిత చరిత్రల గ్రంథాలయం*లోని పుస్తకాల నుంచే కాక, కిరణ్ ప్రభ గారి రేడియో జీవిత చరిత్రలు నన్ను ప్రభావితం చేసినవి. తెలుగులో, అంతకుముందు నుంచి **మిసిమి** పత్రిక వ్యాసాలు కూడా, తెలుగు రాయటం నేర్పాయి.

**డా. ఎన్. భాస్కరరావు**
చైర్మన్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, న్యూఢిల్లీ,
ఫోన్ : 9811159588

## కమ్మతెమ్మెర

మే **మిసిమి**లో ముదునూరు *జీవిత చరిత్రల* లైబ్రరీ గురించి ప్రచురించిన వ్యాసం – మాకెంతో సంతోషం కలిగించింది. అభినందనలు. మీతో మాట్లాడి ఈ విషయం చెప్పాలనుకున్నాము. **మిసిమి** పత్రికను స్థాపించిన ఆలపాటి రవీంద్రనాథ్ ఆశయాలకు అనుగుణంగా ఇప్పటి కాలానికి అన్వయిస్తు నడుపుతున్న మీకు అభినందనలు – మీతో మాట్లాడి ఈ విషయాలు చెప్పటానికి ప్రయత్నిస్తాను.




***- దేవినేని మధుసూదనరావు, ఫోన్ : 9989051200***

# అశ్వశబ్దము


– డా. జొన్నలగడ్డ మార్కండేయులు

అశ్వశబ్దమునకు 'ము' చేరి అశ్వము అయింది. గుఱ్ఱము ప్రాచుర్యమైన అర్థముగా చదరంగములోను, చతురంగబలములోను సుపరిచితము. శ్రేష్టతావాచకముగ అశ్వము అశ్వశబ్ద గుఱ్ఱము (గుఱ్రము)గ ప్రశస్తి పలుకుబడి పరిచయము ఈవ్యాసలక్ష్యముగదుగా చతురంగాత్మకము

చతురంగాత్మకము//.....చతురంగము, చదరంగము సమానార్ధకములు. చతురంగము సమరక్రీడ. చదరంగము మేధో క్రీడగ చతురంగబలములు రెండు క్రీడలకు ప్రసిద్ధి.. త్రోసిరాజుగ ఎత్తుకు పైఎత్తు ఇద్దరు ఆటగాండ్ర నైపుణికి చదరంగము జోహార్లు చేయిస్తుంది. మేథోక్రీడగా ప్రపంచ క్రీడారంగస్థలములో ప్రాచీన యుద్ధతంత్ర పరిచయముగ అత్యంత ప్రాధాన్యముంది. శత్రువు నెదుర్కోగల చతురంగ వైభవ రాజధాని వర్ణనలేని పురాణ కావ్యము లేదనే చెప్పవచ్చు. యుద్ధవర్ణన సమరోత్సాహం చతురంగంగ, చతురంగ బలముల క్రీడ మేథోక్రీడగా రూపుదిద్దుకొని సామాన్యులకు మాన్యులకు, చక్రవర్తులకు ఆహ్లాద మిచ్చినదని చదరంగం కథలుగ రచనలలో కనబడతాయి. ఈ సాహిత్య రచనోత్సాహములో కవులు కూడ మేథో క్రీడగ అష్టావధానిగ ప్రతిభ చూపారు

చతురంగాత్మక ఈ మేథోక్రీడ మన తెలుగుకు ప్రత్యేకమైన సాహిత్యప్రక్రియలో అష్టావధానులకు ఒక అంశముగా నిర్ణయించారు. 1 పురాణము 2 పాఠము 3 ప్రసంగము 4 చతురంగము 5 ఘంటానాదము 6 పుష్పతాడనము 7 వ్యస్తాక్షరి 8 ప్రాసనిర్ధిష్టము 9 నిషేధాక్షరి 10 నిర్ధిష్టము 11 సమస్య 12 అభిప్రాయము అంశములలో ఎనిమిదింటికి పృక్షకులు ఎంపిక చేయబడతారు. పన్నెండు అంశాలను ఎదుర్కొంటానంటే అది అవధాని ఉత్సాహము తప్ప నియమము కాదు

ద్విగుణీకృతాష్టావధానముగ 1934 సంవత్సరములో వేములవాడ (తూర్పుగోదావరిజిల్లా కాకినాడ సమీపము) జరిగిన అత్యద్భుత ద్వ్యష్టావధానములో మహాకవి పులుగుర్త వేంకట రామారావు కుడిఎడమల 8+8=16 మంది



పృచ్ఛకులత్లో ఇరువైపులా నాలగవ పృచ్ఛకుడితో ఒకేసారి చదరంగము ఆడారు. ప్రప్రథమ ద్విగుణీకృతాష్టావధానిగ గుర్తింపు. మేధాసంపత్తి గుర్తింపుసరే. క్రీడగ అవధానులకు చతురంగ ప్రావీణ్యత పరీక్ష సవాలు మాత్రమే. కాదన రానిది., ఓడిపోయిన అవధాములు లేరు. విజయవంతము గానే ఎదుర్కొన్నారు. రామారావుగారు ద్విగుణీకృతాష్టావధానములో చదరంగవిజేత గానే కరతాళధ్వనులు అందుకున్నారు.. కవిగా కూడ ఆ క్రీడపట్ల అభిమానము చూపారు.. అరువదినాల్గు గడులలో గుఱ్ఱము నడకను ఒక సీసపద్యములో మక్కువతో (1934) రచించినది ఉదహరిస్తున్నాను. మహాకవి కాళిదాసుని కథకు సంబంధించిన అ.ప్ర.శి.ఖ నాలుగు పాదాలలోని మొదటి అక్షరాలతో ఉన్న గూఢార్థ ప్రచారకథ శ్లోకాలను కూడా ఆగడులలో నప్పారు. స్వహస్త దస్తూరి రచన. కవుల చతురంగక్రీడతురంగ నడకప్రావీణ్య మేథోప్రతిభకు నిక్షిప్త సాక్ష్య జిరాక్సు కాపీని ఈవ్యాసములో పొందుపరిచాను.

చతురంగబలమలలో గుఱ్ఱం ప్రాముఖ్యము మెదిలిన చతురంగాత్మక వ్యాసరచనకు ప్రేరేపించింది. చతురంగ మోహరింపు రణరంగము సమరోత్సాహము పురాణకాల పయనము చేయిస్తుంది. అదే స్ఫూర్తి క్రీడలోను ఉంది. క్రీడగానే కాదు. సజీవముగ సాహిత్యములోను, నిత్యజీవితములోను మనతో సహజీవనముగ పెనవేసుకున్న అక్షౌహిణీ అశ్వశబ్దస్తుతి ప్రాధాన్యము ఈ వ్యాసము.

**అక్షౌహిణిసేనగా చదరంగ పావులు :** ఒక అక్షౌహిణిసేన యుద్ధమునకు వెళ్ళే దృశ్యము ధనుశ్శాస్త్రములో ఉంది. సమస్త ఆయుధములు ధరించి భటుడు వెనుక చూపు

లేకుండా ముందు నడుస్తాడు. భటుల వెనుక గుఱ్ఱములు, ఆ వెనుక కొండల సమూహములలా ఏనుగులు నడుస్తాయి. ఏనుగులకు సమీపములో రథములు తిరుగుతాయి. రథచక్ర రక్షకులిద్దరు ఇరువైపులా సర్వసన్నద్ధమైన రెండు శకటములతో ఉంటారు.. రథాశ్వములు రథమును లాగుతాయి. రథాశ్వములు పురుషామృగానీలగరుడ వేగములుతో పరుగెత్తుతాయి. చదరంగక్రీడలో పావులు కూడ ఈవిధముగానె గడులలో అమరిక ఉంటుంది. అయితే శకటపావులు రథముల పాత్రను నిర్వహిస్తాయి. రథము ప్రాముఖ్యము తెలుసుకోవాలి.

రథాశ్వాలను తోలేవాడిని సారథి అంటారు. కాలకేతు, మాతలి, దారకుడు గొప్పసారథులని పేరుపడ్డారు. కురుక్షేత్ర యుద్ధములో పార్థసారథిగ కృష్ణుడు వ్యవహరించాడు. రథానికి నాలుగు గుఱ్ఱములు పూన్చబడతాయి. చోదకుడు ఆ రథము నొగల కూర్చుంటాడు. రథచోదకుడు కూడ రథిక సమానుడు. ఆహవకేళికి ఉన్ముఖముగ గురుతర వేగములలో అప్రమత్తుడై ఉండాలి. రథికులు అతిరథ, మహారథ, అర్థరథ, అతిరథోత్తముడు అని నల్గురు పేర్కొనబడ్డారు. సమర్థుడైన చోదకుడు ఉండాలి. రథమునకు శకట రక్షకులుంటారు. రథానికి రక్షణ శకటము కనుక రథమును చదరంగము ఆటలో శకటముగా ఉంది. మెగస్తనీసు క్రీ/పూ నాల్గవ శతాబ్దిలోనే తన రాతలలో ఈ రథవర్ణన చేశాడు. చదరంగములో శకట రథము మాత్రమే ఉంటుంది ఎదురెదురుగ పావులు ముఖాముఖి నడక చదరంగము ఆట. రాజు మంత్రి శకటము గుర్రము ఏనుగు భటులు మొదలైన పావులుగ నిర్దేశించబడిన నడకలతో రాజును బంధించే మెదడుకు పదును విజేతగ ఇద్దరి ఆటగాళ్ళమధ్య చతురంగము క్రీడ సాగుతుంది. అతిరథమహారథులు ఎల్లడ?

అతిరథమహారథులు కలిగిన పరోక్ష రథములుగ ఆటలో శకటము పావులు రెండు ఉంటాయి. రథబలముగ చదరంగములో రణరంగమును గోచరింప చేస్తాయి. రథమును గుఱ్ఱములు లాగుతాయి. రథాశ్వము కాదు. కాని గుర్రము ప్రత్యేకపావుగా చదరంగంలో ఉంది. అందుచేత హయ యుద్ధముగ గుర్రము నడక నేర్పు ఇరువురి ఆటగాళ్ళ గుఱ్ఱము విన్యాసము చదరంగములో మేథోక్రీడ ప్రత్యేకత కలిగి ఉంది. గుఱ్ఱముతో నిమిత్తములేని శకటము పావుది పరోక్ష రథప్రాముఖ్యము మహారథులుగ చతురంగాత్మకనే!. రణరంగములో గుఱ్ఱాలులాగే రథముపై సారథి నేర్పుకు అతిరథ మహారథులు యుద్ధము చేస్తారు. రణరంగ చతురంగ రథబలములలో శకటమునకు ప్రాధాన్యముంది. రణరంగమున యుద్ధసమయాన ఇద్దరు రథచక్రరక్షకులు సకలాయుధ, వస్తుసామాగ్రి శకటములతో రథమును అనుసరిస్తారు. చక్రరక్షకుల వలన యుద్ధరథ, రథికులు అప్రమత్తులై ఉంటారు. చక్రరక్షకులగ శకటములే మేధోక్రీడలో చదరంగ పావులులా, రథములులా చలిస్తాయి. అతిర మహారథి పాత్రశకట వ్యూహకర్తల సైన్యాధిపతి మంత్రి పావు సహకరిస్తుంది. ఇరుపక్ష ఆటగాళ్ళకు రాజుపావుకు రక్షణ మేథ క్రీడ.

గుఱ్ఱంమీద ఎక్కినవాడు ఆశ్వికుడు. చేతి మణికట్టుకు కొరడా త్రాడు కట్టుకొని అదలిస్తూ ఖడ్గబాణములను ప్రయోగిస్తూ పారిపోయిన వాని వెంటబడగలడు. సైన్యపు పార్శ్వాన్ని రక్షిస్తుంది. అశ్వికుడు యుద్ధవార్తలను చేరవేస్తాడు. దుర్గారణ్యము నందలి సేనరక్షణకు అశ్వదళమే మేలు. ఆటకట్టించే బహుముఖ ప్రజ్ఞ నడక చదరంగములో ఆశ్చర్యము కలిగిస్తుంది. గుఱ్ఱము పావులు క్రీడలో రాజును దొరకబుచ్చుకుని ఆటకట్టించడములో ప్రాముఖ్యమైన నడక నేర్పు యుద్ధరౌతు స్వారీ గుఱ్ఱము వీరవిహార చలనము విన్యాసముగ రణరంగాన్ని గుర్తుకు తెస్తూ చదరంగములో అరువది నాలుగు గడులలో విహారము ఈ పద్యములో చూడవచ్చు..

**సీ. ఒకటియు పదకొండు యొనరంగ నైదును... బదినైదు మరియు ముప్పదియు రెండు/నిరువదిరెండును, నిరువదెన్మిది, పదు నెన్మిదిమూడును నెసకమెసగ/ పదమూడు నేడు, నిరువదినాల్గు ముప్పది యర్వదిర్వదియారు, నెనయ నడక/యెలమి పందొమ్మిది, యిర్వదియేన్యది నాల్గిరువదొకటి నాణెముగను**

**తే.గీ//ముప్పదొక్కటి, పదునారు ముజ్జలిమియు నిర్వదిపయిమూడెన్మిదీరేడు, ఇరువది/ తొమ్మిది పదిరెండును, దొరిపదేడు...ఇరువదేడశ్వగతి గడులెనయు వరుస**

అప్రశిఖ అనే గూఢార్థకథప్రసిద్ధ కాళిదాసు శ్లోకములు లోని అక్షరాలను చతురంగము గడులలో నప్పబడ్డాయి. ఆమహాకవి తన స్వదస్తూరీతో రచనలకోని ఈ క్రింది

వ్రాతపతిలో ఫొటోకాపీలో చూడవచ్చు. అప్రశిఖ కాళిదాసుకు సంబందించిన కథ. నందుడు మాధవుడు అనే యిద్దరు మిత్రులు గురుకులంలో చదువుకునేవారు. మాధవుడు మేథావి. నందుడు కొంచెం తక్కువ ప్రతిభ వలన మాధవునికి సన్మానాలు సత్కారాలు లభించి ధనము సంపాదించాడు. స్వగృహాలకు తిరిగి వస్తూ ఒక చెట్టునీడన నిదురించారు. నందుడు మాధవుని ధనం అపహరించాడు. కాలితో త్రొక్కిపట్టి గొంతుపిసికి చంపబోయాడు. మెలుకువ వచ్చిన మాధవునికి చంపేస్తున్నానని పులిచంపిందని యింట్లో చెపుతానన్నాడు. చనిపోతూ ఒక కోరిక కోరాడు. మాధవుడు తన చివరి పలుకులుగ తండ్రికి 'అప్రశిఖ' మాటను నందునిని చెప్పమని కోరాడు. ఆ మాటలలో గూఢార్థముందని నందుడె హంతకుడని గ్రహించిన తల్లిదండ్రులు భోజరాజునాశ్రయించారు. "అ"నేనతవపుత్రస్య "ప్ర"సుప్తవనాంతరే "శి"ఖామాక్రమ్యపాదేవ "ఖ"డ్గేనాభిహతః శిరః.. మాధవుడు తెలివిగా శ్లోకములోని ప్రతి పదములోని మొదటి అక్షరము సందేశము "అ ప్రశిఖ".

అరువది నాల్గుగడులలో గుఱ్ఱం నడకను చూపుతూ అప్రశిఖ శ్లోకము అక్షరాలను నడిపిన స్వదస్తూరి ఈ క్రింద జిరాక్సు కాపీలో చూడవచ్చు. గుఱ్ఱంమీద ఎక్కినవాడు ఆశ్వికుడులా చదరంగ ఆట ఇరుపక్ష ఆటగాళ్ళు చేతి మణికట్టుకు కొరడా త్రాడు కట్టుకొని అదలిస్తూ పారిపోయిన వాని వెంటబడే వానిలా సైన్యపు పార్శ్వాన్ని రక్షించే ఆశ్వికుడుగ ముందువెనకల్ పావు నడిచే విధానము చూపరులకు ఆనందము కలిగిస్తుంది. అశ్వికుడు యుద్ధవార్తలను చేరవేస్తాడు. దుర్గారణ్యమునందలి సేనరక్షణకు అశ్వదళమే మేలు. రణరంగములోని కూడ గుఱ్ఱానికి విలువలా అనిపిస్తుంది;

**శ్లో. అతప్రక్రన నప్తద్గే రేమా నే హ సునాతదే**
**శిస్య శి వాం మ్య శిఖస్య ఖాతర త్రోఖి వపాద**

**శ్లో. అనేనతవశతోస్య ప్రసుప్తస్యవనంతరే**
**శిఖా మాక్రమ్య దేనఖద్గే నాభిహతశ్శిరః**

ఈ చతురంగాత్మకము అశ్వశబ్ద విలాసము రుచిరార్థములు ప్రాస్తావికము అప్రస్తుత ప్రసంగగముగా అనిపించవనే అనుకుని చెప్పాలపించింది.. జెండాపై కపిరాజు ముందు సిత వాజి శ్రేణియుం గూర్చి యే దండంబుంగొని తోలు స్యందనముమీద నారిసారించున్.. అర్జునపార్థసారధి కురుక్షేత్ర పండిత పామర పద్యము తెలుగువాడు కంప్యూటరు కాలములో కూడ చదరంగము క్రీడగ గొంతెత్తున్నాడు.

రథములు లేదా స్యందనములాగు గుఱ్ఱములకు అశ్వ, హయశబ్దములు సంస్కృత పదములుగ సమానార్థకములు. తెలుగులో మువర్ణము చేరి అశ్వముగా, హయముగా ప్రయోగింపబడతాయి. పరిచితముగా తెలుగు ప్రజానీకమునకు గుఱ్ఱము, గుఱ్ఱముగా, వాజిగ పలుకబడే అర్థముగా నిఘంటు వక్కరలేని పలుకుబడులవి. గుఱ్ఱముగా ఘోటకము, తురగము, వాజి, తేజి, ఆర్తని, కంఖాణి, గోడిగ, ఘోటిక, ధేనుక, బడబ, వాజిని మొదలైనవిగ అశ్వమునకు అర్థముగ పర్యాయపదములు. గుఱ్ఱము పలుకుబడి విశేషణములు.

అశ్వ, హయశబ్దములు గుఱ్ఱముగా ఎంత ప్రముఖమో అభూతకల్పనగ పురాణ ప్రఖ్యాతిగా అంతే ఖ్యాతి కలిగి ఉంటాయి. ఆశ్వీనము గుఱ్ఱము ఒక దినములో నడిచిన దూరము. ఆశ్వైజమాసముంది. ఆశ్వినేయులు నకులసహదేవులు. అశ్వినులు = అశ్వినీదేవతలు. అశ్వఖరజము, అశ్వతరము=గుఱ్ఱమునకు, గాడిదకు పుట్టిన కంచరగాడిద. అశ్వనీ నక్షత్రమునకు అశ్వకిని అశ్వముఖము వంటిదని పేరు. అశ్వశిరుడనే రాక్షసుడున్నాడు. శంకరాచార్యులుకు, శివునికి అశ్వ అర్థముంది అన్నారు. అశ్వత్థపదముగ శివుడని అర్థము. తాను వృక్షములలో అశ్వత్థ వృక్షమునని కృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అశ్వాకృతి కాదు పవిత్ర అశ్వశబ్ద ధ్వని. అశ్వత్థ వృక్షమును ప్రార్థిస్తే శత్రు నాశనము జరిగి మేలు జరుగుతుందని అథర్వవేదములో ఉంది. అ–శ్వ= నిత్యత్వము, త్థ = నిలిచి ఉండునది. అనిత్యత్వము కలిగిన ప్రపంచముగ, శివుని విష్ణువును కూడా ధ్వనించింది. అశ్వపదము శ్రేష్ఠమైనది కూడ అని చెప్పడం నా ఉద్దేశం.

తథాగతుడు బోధివృక్షమని పేరుపడిన అశ్వత్థ వృక్షము కిందనే మోక్షమార్గమును కనుగొన్నాడు. అందుచేత అశ్వత్థ వృక్షము పూజనీయము. ఇంద్రుని గుర్రమునుచ్ఛైశ్రవమును అశ్వత్థామ అని కూడ పిలవవచ్చు. ద్రోణపుత్రుడు అశ్వత్థామ పుట్టినపుడు అతని పసిరోదనము ఉచ్ఛైశ్రవమనిపించింది. ఆకాశవాణి ద్రోణపుత్రునికి అశ్వత్థామపేరును సూచించింది.

అశ్వత్థామగ పేరు ఉచ్ఛైశ్రవమునకే కాదు ఒక ఏనుగు కూడ తగిలించుకుని కురుక్షేత్ర యుద్ధమునే మలుపు తిప్పింది. **అశ్వత్థామ హతః కుంజరహ** అనేమాట ద్రోణుని వణికించింది. కుంజరమంటే ఏనుగు. భీముడు చంపిన అశ్వత్థామనే ఏనుగు ఉచ్చైస్స్వర ఘీంకారము కలదని భారతములో చెప్పబడలేదు. కుంజరః అన్నది వినబడకపోయినా ద్రోణునికి పుత్రుని హాహాకార స్వరమనిపించిందనీ చెప్పబడలేదు. ధర్మరాజు మాటగ మాత్రమే అశనిపాతమైంది. అశ్వత్థామ అనే ఆ ఏనుగు మాళవరాజైన ఇంద్రవర్మదని భారతములో చెప్పబడింది.

అశ్వశబ్దము, హయశబ్దము, పక్షులుకు, జంతువులుకు వలె స్త్రీలింగ విశేషణములు చేర్చి పలుకబడ్డాయి. ఆడు గుఱ్ఱమునకు కూడ అర్థము నిస్తాయి. స్త్రీ. పురుష నామవాచకముగ మనుష్య, దేవతా పరముగా అశ్వ, హయ శబ్దము వాడబడుతుంది. గుఱ్ఱము మాత్రము నిత్యదేశ్యము. 'సప్తాశ్వరథ మారూఢం-ప్రచండం కశ్యపాత్మజం' సూర్య స్తుతిలో సూర్యుని రథమును లాగే కీర్తి గడించాయి ఇంద్రాయుధము, మల్లికాక్షము, శోణము, శ్రావకిక్ష, హరితము, హలహలము, హేమము

పురాణ ప్రశస్తి.../అశ్వ, హయశబ్దములు కాంతి, అగ్ని, సూర్యుడు అని అర్థము కలిగి ఉన్నాయి. ప్రపంచము అనే అర్థము కూడ ధ్వనిస్తుంది. అశ్వమేధయాగము పేరిట రాజులకీర్తికి ఒక చిహ్నము తెచ్చింది. కుబేరుడికి, నరవాహనుడిగానే కాదు, హయవాహనుడనే పేరుకూడ ఉంది. చంద్రునితోబాటుగా హరికి కూడ వాహనము... ఖశ అనే ఒకరాక్షసుడి పేరు అశ్వ. శివునికి అశ్వ పేరుంది. ఇంద్రునికి ముందు సత్యదేవునిగా భూమిని పాలించాడు.

'అశ్వతార' కాద్రవేయ నాగజాతికి చెందినవాడు. వెయ్యితలలతో పాతళములో నివసిస్తున్నాడు. ఫాల్గుణ మాసములో సూర్య రథమును అనుసరిస్తాడుట. ప్రయాగలోని ప్రజాపతిక్షేత్రములో ఊర్జ మాసమునకాతడు అధిష్టానదేవత. అశ్వలాయనుడు సౌనకుని శిష్యుడు. స్రౌత, గృహ్య సూత్రముల రచయిత. జైముని ముని అశ్వమేధిక పర్వమును ప్రత్యేకముగా రచించాడు. ఈ జైమిని పర్వములో మహాభారత, రామాయణ, కృష్ణగాథలున్నాయి. మహాభారతమును వ్యాసుని శిష్యునిగా విన్నవారిలో జైమిని ఒకడు. విష్ణువుకు అశ్వశిరుడని పేరుంది. ఒక రాక్షసునికి కూడ అశ్వశిరుడు పేరుంది. అశ్వినులు అశ్వశబ్దమునకు సంబంధమున్నవారు అశ్వినులు. వారిని బంగారు రథములో. జింకలు, పక్షులు, దున్నలు అప్పుడప్పుడు సహజముగా గుఱ్ఱము మాత్రమే రథమును లాగుతాయి..

అశ్వశబ్దము వేదాలలో వైదిక ఆచారములలోను, దేవతలతోను సంబంధము కలిగి ఉంది. మానవ తలలు కలిగిన కిన్నరులది అశ్వదేహము. దధిక్ర, తార్క్ష్య, పైద్వ, ఎతాశ. (బహుశా సూర్యరథాశ్వము) మొదలైనవి ఋగ్వేదములో పేర్కొనబడ్డాయి. అశ్వాగ్ని హోమాగ్ని. దధ్యంచు ముని లేదా హయగ్రీవుడు అశ్వశీర్షములు పొందినవారు. యుద్ధవీరులతో అశ్వములకు అతీతాను బంధము గురించిన కథలున్నాయి. పొలిమేర రక్షకులుగ అయ్యనార్ దేవత గుఱ్ఱముపైన చిత్రింపబడ్డాడు. తెర్రాకోట గుఱ్ఱములను సమర్పించడముంది. యూరప్‌లో గుర్రము చెక్క తలలు ఇంటినిర్మాణము దూలములో అలంకరణగా ఉన్నాయిట. ట్రాజన్ హార్సు ప్రసిద్ధకథ. గ్రీకు, రోమన్లు గుఱ్ఱమును ఆదరించారు. అశ్వరూఢాంబిక లేక గుర్రాలక్క అంతర్వేదులో గ్రామదేవత.

**సామాన్యుని ధనికుల హయశబ్దవిలాసము :** మహా రాజులకు, ధనికులకు సామాన్యులకు స్వారీగ విలాసము. ప్రయాణ శకటముగా అశ్వశకటము వాడుకలో ఉంది. కాని గుఱ్ఱబ్బండి, గుఱ్ఱబ్బగ్గీ వాడుక ధ్వనిగ పవిత్రసూర్యాశ్వ శబ్దశ్రేష్ఠతా ప్రాముఖ్యమును ధ్వనించవు. వినోద ప్రదర్శనకు, భుజించదగిన ఆహారముగాను గుర్రము 4500 సంవత్సరముల నుంచీ ఉపయోగ పడుతోంది. నేటి గుఱ్ఱపుస్వారీ, గుఱ్ఱప్పందెములు పదహక్కు ప్రయోగములలో ప్రాచీన అశ్వారూఢుడుగ గడించిన ఖ్యాతి. అశ్వారూఢుడిది నేటి గుఱ్ఱపురౌతు పదప్రయోగములో ధ్వనించదు. అశ్వశబ్దప్రయోగము కన్న వాడుక గుఱ్ఱము స్వారీని కవులు ఇష్టపడ్డారు. మొహరమున తానెక్కిన పారని గుఱ్ఱమును గ్రక్కున విడువవలసిన జాబితాలో సుమతి చేర్చాడు. హయమది సీతగ భీమన చాటువుప్రసిద్ధము, గుఱ్ఱపురౌతు గొప్పదనము ప్రచారములో ఉంది. రౌతుకొద్దీ గుఱ్ఱము, యజమానిపట్ల గుఱ్ఱము విశ్వాసము కథలున్నాయి..

గుఱ్ఱమునకు యజమానిగ రౌతుకొద్దీ గుఱ్ఱము నడచునన్నది సామెత. దుర్జనుల గుణముగ అనడంలో

త్రాగిమైకంలో తూలినవాడు అదుపుతప్పిన గుఱ్ఱముగ గుఱ్ఱమెక్కాడురా అనే తెలుగువారి పలుకుబడి కనిపిస్తుంది. బజాజ్ కంపెనీవారి ద్విచక్రవాహనం పేరు చేతక్. రాణప్రతాప్ గుఱ్ఱము పేరది. గుఱ్ఱము విశ్వాసపత్రమైన బంటు అనే కథకు సాక్ష్యంగా నిలిచింది.

అశ్వశక్తి గొప్పది. తెల్లవారిపాలనలో అధికారులు గుఱ్ఱములమీద తిరిగారు. ఆనకట్ట నిర్మాణ పర్యవేక్షణ గుఱ్ఱము మీదనుండే చేసిన కాటన్ విగ్రహము అశ్వారూఢమే! అంతకుమునుపే రాజులు, జమిందారులు గుఱ్ఱములనెక్కి స్వారీచేసేవారు. శివాజి, రాణాప్రతాప్, ఝాన్సీవంటి వారు శత్రువులను అశ్వబలముతోనే ఎదిరించారు. తెల్లవారి రాకతో బలమును కొలవడానికి ఇంత అశ్వశక్తి అనే పదము హార్స్ పవర్ పేరిట మనకు ఆంగ్లపదము కూడ దిగుమతయింది. కోడి, పొటేలు పందెములులా అశ్వముల పోటి ఉంది. కాని గుఱ్ఱప్పందేలుగా హార్స్ రేస్ ఇంగ్లీషు పదప్రయోగానికి సమానార్థకము. గుఱ్ఱపుస్వారీ హార్స్ రైడింగుగా తెల్లవారి పాలనలో నిలదొక్కుకున్నా గుఱ్ఱపుస్వారీ చేయడం భారతీయులకు ప్రాచీనకాలము నుంచీ ఉంది. అశ్వకము అంటే చెడుగుఱ్ఱము అని అర్థము. పెంకె గుఱ్ఱముగా పేరు పడింది. దాన్ని స్వాధీనములోకి తెచ్చుకుని స్వారీ చేయడము సవాలుగా రాచరికతరము భావించేది. కళ్ళెం వేయడము మాట పుట్టింది. గుఱ్ఱమనిపిలిచినా, అశ్వమని పిలిచినా పంచకళ్యాణి అంటే మాత్రము అసలుసిశలైన అశ్వము, లేదా హయము అని పిలవబడింది. యుద్ధాశ్వము వేరు, రథాశ్వము వేరు. యుద్ధాశ్వము గురించి తెలుసు. రథాశ్వము గురించి తెలుసుకోవాలి.

**ముగింపు :** రథాశ్వముల ప్రాముఖ్యము.. రథములపై ఎదురుపడి ఒకరితో ఒకరు తలబడినపుడు ఒకరొకరిని విశిఖ శరములతో ముంచెత్తుకుంటారు. సారథిని రక్షించుకుంటు యుద్ధము చేయువాడు అతిరథుడు. విక్రమధుర్యుడై వెన్నాడి యోధు నదలించేవాడు మహారథుడు. ఒరులచే తెరలక పరుల చెండాడగ చలము చాలనివాడు సమరథుడు. పన్నిదములు పలికి భరమైన వెన్నిచ్చి అందంద పరచువాడు అర్ధరథుడు. పడనిసారథి, ఎన్నడు చెడని తేరు,... తరగని నిషంగములు, ఉరులని తురగచయము .... విడనికవచము, విరగనివిల్లు కలుగు... ధైర్యధుర్యుని అతిరథోత్తముడని అందురు. రథికునికి త్రయోదశ భావములున్నాయని ధనుశ్శాస్త్రము చెబుతుంది. రథికుడు వీనిని కనిపెట్టి అశ్వగమనము చేయించి రథము నడపాలి. చతురంగబలాలలోను రథబలము శ్రేష్ఠమైనది. చదరంగము ఆటలో శకటము రథమును దృష్టిలో పెట్టుకున్నదే. గుఱ్ఱము కూడ తగినవిగా ఉండాలి.

సురమణికంఠరాభరణము, అతిసాంద్రరోమములు. మిలమిల మెరిసే అందమైన మేనులు, గళుకైన బిగితొడలు, కురుమట్టమైన లాంగూలములు, కంబుభావము దాల్చు చెవులు మొదలైన విజయ లక్షణములు, గరుడపవ వేగము కలిగి ఉండాలి. ఇతడు రథికుడు.

అభిమన్యుని గుఱ్ఱాలు మూడేండ్లవయసు నుంచే యుద్ధములో పాల్గొన్నాయి. ద్రోణపర్వంలో గుఱ్ఱము వయసు ప్రస్తావన ఉంది. వేగసాహసములు కలిగిన అశ్వదళమే విజయ సాధకము. చాణక్యుడు అశ్వరక్షణాని కొక ప్రత్యేకశాఖ పరిపాలనావిభాగంలో ఉండాలని చెప్పాడు. అధర్వణ వేదకాలమునుండీ ఉపయోగములో ఉంది. రామాయణం బాలకాండ 7వ సర్గలో కాంభోజ, బాహ్లిక, నవాయు. సింధు దేశాల్లో పుట్టాయని చెప్పబడింది. హరిహరచతురంగం అనే గ్రంథములో 3వ స్వర్గ గజపదాతి బలంచే సాధ్యము కానిది అశ్వబలముచే జయింపవచ్చు. అశ్వాయుర్వేదము, అశ్వశాస్త్రము, అశ్వచికిత్సము. ఒక అక్షౌహినిలో అరవైఐదువేల ఆరువందలపది (65,610) గుఱ్ఱములుంటాయి. భటులు ముందు, వెనుక, గుఱ్ఱములు, వెనుక కొండలవలె ఏనుగులు, వాటికి సమీపములో అరదబృందములు, చక్రరక్షకులు, వారిననుసరించి శకటములు సమరసైన్యము సాగుతుంది. అశ్వహృదయము బాగుగా తెలిసినవాడు నలచక్రవర్తి. ఋతుపర్ణుడు అతనినుంచి ఆవిద్య నేర్చుకున్నాడు. ఇలా గుఱ్ఱమును గురించి ఒక వ్యాసపరిధి నిర్ణయించలేము. విష్ణువు హయగ్రీవుడు. హయగ్రీవ మువన్మహే అని బ్రహ్మ వేదములను పొందాడు. వేదశిరుడుగ పురాణ గాథలున్నాయి. అశ్వశాస్త్రము. నకులుడు అశ్వశిక్షకుడుగా ఖ్యాతి. అందుకే అశ్వపదము శ్రేష్ఠము. చదరంగ నడక కీర్తిగ ఎపుడూశశ్వతము

డా. జొన్నలగడ్డ మార్కండేయులు
రిటైర్డ్ లెక్చరర్, కవి, రచయిత, ఆత్రేయపురం
ఫోన్ : 944 021 9338



కరవది రాధాకృష్ణమూర్తి



## మనస్సుల మీద ముద్రల్ని వేసిన

# కె. ఆర్. కె. మాస్టారు

– డా. దేవబత్తిని వెంకటరావు

శ్రీ కరవది రాధాకృష్ణమూర్తిగారు 37 సంవత్సరాల పాటు జవహర్ భారతి కళాశాలలో అధ్యాపకత్వాన్ని నెరిపి, 2005లో ఉద్యోగ విరమణ గావించి, 2025, డిసెంబర్ 15న పరమపదించిన గొప్ప అరుదైన ఆంగ్ల అధ్యాపకులు. వీరిని అందరూ కె.ఆర్.కె. అని వ్యవహరించేవారు. కె.ఆర్.కె. అనే పేరు మననం కాగానే ఒక సౌమ్యమైన ఆకృతి, నిరాడంబర ప్రవర్తన, సాహితీ జ్ఞానత్వం, సావధాన స్వరూపం, స్వచ్ఛమైన చిరుదరహాసం ఇవన్నీ మనసుల్లో మెదలాడుతాయి. ఇక కుటుంబ నేపథ్యంలోకి వెళితే, వీరు 1947వ సంవత్సరం, ఆగస్టు 18న ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సమీపంలో గల పాకల గ్రామంలో శ్రీ వీరరాఘవరావు, శ్రీమతి కామేశ్వరమ్మ దంపతుల జ్యేష్ఠ సంతానం. తండ్రిగారిది ఉపాధ్యాయ వృత్తి. తల్లిదండ్రుల కీర్తికి వీరు మెరుగులు దిద్దినవారే. కె.ఆర్.కె. మాస్టారు, చెల్లెలు సీతామహాలక్ష్మి, తమ్ముళ్ళు రామచంద్రరావు, శ్రీధర్‌గార్లు ఒక కొమ్మకు పూచిన పూవులై, అన్యోన్యమై, అనురాగమై జీవించారు.

1974వ సంవత్సరం, జూన్ 14న మాస్టారు గారికి, శ్రీలక్ష్మిగారితో వివాహం జరిగింది. నెల్లూరులోని వి.ఆర్. కళాశాలలో పట్టభద్రుడైన మాస్టారు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీషు పట్టాని పొంది, 1968వ సంవత్సరంలో జవహర్ భారతి కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా చేరేనాటికి వీరి వయస్సు కేవలం 21 సంవత్సరాలు. అప్పుడు ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో మాధవరావుగారు, గోపాలరావుగారు తదితర ఉద్దండ పండితులు వెలుగొందుతున్నారు. అప్పుడప్పుడే తొంగిచూస్తున్న సాహితీ కౌశలంతో, భాషా పటుత్వంతో, బోధనా పటిమతో అలాంటి వారి అందరి మన్ననలను చూరగొని, పరిపూర్ణ అధ్యాపకునిగా, గొప్ప ఉపన్యాసకుడిగా, విలక్షణ వ్యక్తిగా, ప్రాచీన తెలుగు కావ్యాల్లోని మాధుర్యాన్ని, ఇంగ్లీషు సాహిత్యంలోని సొబగులు, చెణుకుల్ని, కవుల నైపుణ్యాన్ని తన బోధనద్వారా, ఉపన్యాసాలద్వారా విద్యార్థులకి, సహచర మిత్రులకి పంచిన సాహితీమూర్తిగా రాధాకృష్ణమూర్తిగారు గణుతికెక్కారు.

కె.ఆర్.కె.గారి ప్రతిభాపాటవాలు జవహర్ భారతి తరగతి గదులలో సుదీర్ఘకాలం ప్రకాశించాయి. వారు ఇంగ్లీషు పాఠం బోధిస్తున్నప్పుడు, వివరణ కూడ ఆంగ్లంలోనే చెప్పేవారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన చాలామంది విద్యార్థులు కొంత తెలుగులో వివరణ కోరుకునేవారు. తెలుగులో చెబితే విద్యార్థులకి ఇంగ్లీషు భాష ఎప్పుడూ పరాయిగానే ఉంటుందని, దానిని కొరుకుడుపడని ఒక జడపదార్థంగానే చూస్తారని, వీలున్నంత వరకూ ఇంగ్లీషులోనే అర్థమయ్యేలా సవివరంగా బోధించేవారు. విశ్వోదయ వ్యవస్థాపకులు డా॥ దొడ్ల రామచంద్రారెడ్డిగారు (డి.ఆర్.) కూడ ఒక సందర్భంలో, కొంత తెలుగులో బోధిస్తే పిల్లలకి

చేరుతుందేమో అన్న అర్థంలో సూచనప్రాయంగా తెలియజేశారు. కాని ఇంగ్లీషు సాహిత్యాన్ని ఇంగ్లీషులో బోధిస్తేనే దాని సొగసు, సొబగు చెడకుండా వుంటాయి అని మాస్టారి విశ్వాసం. అది 1986వ సంవత్సరం, సెప్టెంబర్ మాసం. డిగ్రీ మొదటి సంవత్సరం క్లాసులో మాస్టారు 'మర్చంట్ ఆఫ్ వెనిస్' డ్రామా బోధిస్తున్నారు. పాఠం చెప్పడం పూర్తికాగానే నేను లేచి, సార్! ఏదైనా మంచి డిక్షనరీ చెప్పండి కొనుక్కుంటాను అని అడిగితే, ఏదైనా పర్వాలేదు, 'ఇంగ్లీష్ టు ఇంగ్లీష్' కొనుక్కో అని అన్నారు. లేదు సార్, 'ఇంగ్లీషు టు తెలుగు' కొనుక్కుంటాను అన్నాను. వెంటనే సార్, 'కొనుక్కో తెలుగు బాగా వస్తుంది' అన్నారు. ఆ రోజు నుండి మాస్టారి ప్రభావం నన్ను వెన్నంటే ఉంది. ప్రఖ్యాత ఇంగ్లీషు రచయిత బెర్ట్రాండ్ రస్సెల్, ప్రముఖ తెలుగు రచయిత చలం గార్ల రచనల ప్రభావం, వ్యక్తిత్వాల ప్రభావం మాస్టారిగారి జీవనశైలి మీద, ఆలోచనాసరళి మీద ఎంతగానో ఉంది. వారి బోధనా జీవితాన్ని ఆక్రమించుకున్న రంగం నాటకరంగం (డ్రామా). నాటకం అంటే జీవితం. జీవితం కంటే గొప్పది మరొకటి లేదు కదా. అందుకేనేమో మాస్టారు షేక్స్పియర్ నాటకాలు ఎంతో విద్యార్థిరంజకంగా బోధించేవారు. జూలియస్ సీజర్ నాటకం బోధిస్తుంటే, అందులోని పాత్రలు మన ముందు ఉన్నట్లుగా, సన్నివేశాలు తరగతి గదిలో జరుగుతున్నట్లుగా సాగేది. సీజర్, బ్రూటస్, క్యాషియస్, ఆంటోని తదితర పాత్రలని కళ్ళకు కట్టినట్లు సాక్షాత్కరించేవారు. సీజర్ని, క్యాషియస్ మొదలగు కుట్రదారులు హతమారుస్తుంటే, బ్రూటస్ కూడా కత్తితో పొడిచే సన్నివేశాన్ని నాటకీయంగా చెబుతున్నప్పుడు అలా చెవులు రిక్కించి, వెంట్రుకలు నిక్కబొడుచుకొని, ఎంతో ఉత్సుకతతో వినేవాళ్ళం. Et to Brute, then fall Caesar అని చెప్పి ఆ క్లాసు ముగించారు. పక్కరోజు క్లాసులో జూలియస్ సీజర్ అంగరక్షకుడైన ఆంటోని, సీజర్ శవం దగ్గరకు చేరిన రోమ్ జనసందోహాన్ని ఉద్దేశించి, బ్రూటస్ చేసిన గాయాన్ని చూపిస్తూ It is the most unkindest cut of all అని వారిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడాడు అని చెప్తూ ఒకే వాక్యంలో, ఒకే పదానికి రెండు సూపర్లేటివ్ డిగ్రీలు వాడటానికి ఒక్క షేక్స్పియర్కే లైసెన్స్ ఉంది అని మాస్టారు అన్నారు. మానవుడు తన భావవ్యక్తీకరణలో వాడుతున్న సాధనం భాష అని, ఇక్కడ బ్రూటస్ చేసిన గాయాన్ని గురించి ఎక్కువ నొక్కి వక్కాణించడానికి కవి అలా వాడాడు అని, ఏ భావమైనా సరిగ్గా వ్యక్తం కావాలంటే భాషలో ఉండే ఒడుపూ, విరుపూ, నాజూకూ ప్రధానం అని బోధించారు. ఆవిధంగా కె.ఆర్.కె.గారి టీచింగ్ హాయిగా, ఒక నదీమతల్లి పరవళ్ళులా సాగిపోతుండేది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏ రూపంలోనైనా సాహిత్య గోష్ఠి నెరపడం మాస్టారి ప్రత్యేకత. కె.ఆర్.కె.గారు తరగతికి ఆలస్యంగా వచ్చిన సందర్భాలు అస్సలు ఉండేవి కావు, మిట్టమధ్యాహ్నం 2 గంటలకి క్లాస్ ఉందంటే 1.55 కల్లా ఎండలో హ్యాట్ పెట్టుకొని వచ్చేసేవారు. కె.ఆర్.కె. మాస్టారి క్రమశిక్షణ, సమయపాలన చూసి జూనియర్ అధ్యాపకులు కొద్దిమంది తమను తాము సరిదిద్దుకున్న సందర్భాలు ఉన్నాయి. డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్ గురించి చెబుతూ, కావలిలో వేరే రుతువులు, కాలాలు అన్ని ప్రాంతాలలో లాగా ఉండవు. సమ్మర్ - సమ్మరర్ - సమ్మరెస్ట్ మాత్రమే ఉంటాయి అని దైనందిన ఉదాహరణలతో చేప్పేవారు. మాస్టారు మాట్లాడుతుంటే హాస్యరసం ఒలుకుతూ ఉండేది. కె.ఆర్.కె.గారు హాస్యాన్ని, సత్యాన్ని మేళవించి మాట్లాడడం తోటి అధ్యాపకులకు ఎంతగానో నచ్చేది. మాస్టారి హాస్యం బుద్ధికీ, హృదయానికీ గిలిగింతలు పెట్టేదిగా ఉండేది. అందుకేనేమో వారి హాస్యచతురతకు నజీవత సంతరించుకుంది. ప్రశ్నించే విద్యార్థుల్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. విధేయులుగా ఉండే వారికంటే సృజనాత్మకంగా ఆలోచించేవారిని తయారుచేయాలనేది మాస్టారిగారి భావన. విద్యార్థులకు నేర్పితే మనం చెప్పిందే నేర్చుకొంటారు, వాళ్ళకై వాళ్ళు నేర్చుకోవడం అలవాటు చేస్తే ఎంతో నేర్చుకుంటారు అనే ఆలోచనతో నోట్సు, రెడీమేడ్ మెటీరియల్ ఇవ్వడానికి పెద్దగా సుముఖత చూపేవారు కాదు.

నేను 1990వ సంవత్సరంలో ఎడ్సెట్ పరీక్ష వ్రాశాను. ఆ టెస్ట్లో జార్జి ఇలియట్ అనే పెన్-నేమ్ ఏ ఆథర్కి చెందినది అనే బిట్ వచ్చింది. నాకు సరైన

సమాధానం తెలియలేదు. సరే, చేసేది ఏమీలేక పక్కరోజు జె.బి. కళాశాల ఆవరణలో ఒక సీనియర్ ఇంగ్లీషు మాస్టారు తారసపడితే, బిట్ గురించి అడిగాను. ఇది నా స్థాయికి, నా లెవల్‌కి ఒక బచ్చా క్వశ్చన్, కాని గుర్తుకు రావడంలేదు అంటూ వెళ్ళిపోయారు. ఆ ప్రశ్నకి సమాధానం వెతుక్కుంటూనే ఉన్నాను. పక్కరోజు కూడా ఆ సారే తటస్థపడితే, మరలా గుర్తు చేశాను. నోట్లోనే ఆడుతుంది, కాని గుర్తుకు రావటం లేదు, అనేసి వెళ్ళిపోయారు. ఆ ప్రశ్నకి సమాధానం దొరకబుచ్చుకో లేకపోయినందున ఏదో వెలితిగా, కొరవగా ఉంది. ఓరోజు రైల్వేస్టేషన్‌కి తూర్పు వైపున ఉన్న ఆంజనేయులు బంకు దగ్గర కె.ఆర్.కె. సార్ కనిపించారు. నమస్తే పెట్టి, సార్! జార్జి ఇలియట్ అనే పెన్-నేమ్ ఏ ఆథర్‌కి చెందినది అని అడిగాను. వెనువెంటనే Mary Ann Ivans అంటూ, నా వంక కూడా చూడకుండా యథాలాపంగా వారి ఇంటి వైపు సాగిపోయారు. అదీ వారి యొక్క అంతరంగ ఔన్నత్యం, ప్రజ్ఞానైశిత్యం, కీర్తి కోసం కక్కుర్తిపడని ఉదాత్తత. ఉన్నతంగా ఆలోచిస్తూ, సాధారణంగా జీవించే తత్వం కలిగినవారు మాస్టారు. వారు గట్టు వరకు నిండిన ఒక జలాశయం.

కె.ఆర్.కె మాస్టారికి ఇంగ్లీషు భాషా సాహిత్యాలలో ఎంత పాండిత్యం ఉందో, సంస్కృతం, తెలుగు భాషా సాహిత్యాలలో కూడా అంతే వైదుష్యం ఉంది. మనుచరిత్ర మధువు, భారతం అమృతం అని మాస్టారు అంటుండే వారు. సంవత్సరానికి ఒక్కసారైనా భారతాన్ని పూర్తిగా చదివి, ఆస్వాదించి, సాంత్వన పొందేవారు. విరాటపర్వాన్ని అయితే మరీ మరీ ఇష్టపడేవారు. వాళ్ళ అమ్మగారికి భారతంలోని శ్లోకాలను చదివి, అర్థతాత్పర్యాలతోసహా వివరించేవారు. భారతంలో ఎన్ని పాత్రలు ఉన్నాయో మన జవహర్ భారతిలో కూడా అన్ని పాత్రలు ఉన్నాయి అని అంటూ, ఇందులో కృష్ణుడు "రెడ్డిగారు" అనేవారు. చివరిదాకా కూడా పుస్తక పఠనం వీడనేలేదు. చనిపోయే దానికి వారం రోజుల ముందు కూడా వారు పఠించిన పుస్తకం వేదం వెంకటరాయ శాస్త్రిగారి వ్యాఖ్యానంతో ఉన్న ఆముక్తమాల్యద. ఈ సృష్టిలో మనిషి ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉంటాడు, తెలుసుకుంటూనే ఉంటాడు, పరిశీలిస్తూనే ఉంటాడు. విద్య బాల్యానికి మాత్రమే పరిమితం కాకూడదు అనే సత్యాన్ని మాస్టారు పాటించారు.

డి.ఆర్. గారు అంటే కె.ఆర్.కె. మాస్టారికి వల్లమాలిన అభిమానం, కృతజ్ఞతాభావం. తన విద్యార్థి హనుమంతరావు ఎం.ఎ. ఇంగ్లీషు పూర్తి చేసుకున్నందుకు అభినందనలు తెలియజేసి, అతనిని డి.ఆర్.గారి దగ్గరకు తీసుకెళ్ళి ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఇంగ్లీషు పార్ట్‌టైం లెక్చరర్ పోస్టుని ఇతనికి ఇస్తే బాగా పనిచేస్తాడు అని చెప్పారు. డి.ఆర్.గారు సరే అన్నారు.

కొద్ది రోజుల తరువాత హనుమంతరావు డి.ఆర్.గారిని కలిసినప్పుడు 'కె.ఆర్.కె. ఎప్పుడూ తన కొడుకు కోసం కూడా రాలేదు, నీ కోసం వచ్చి అడిగాడు' అని ప్రస్తావించారు. కె.ఆర్.కె.గారి మనసులో హనుమంతరావు పట్ల ఒక అవ్యాజమైన ప్రేమ, వాత్సల్యం ఉండేవి. బహుశా పేదరికాన్ని ప్రేమించడమంటే ఇదేనేమో! కె.ఆర్.కె. సారు ఒక స్వేచ్ఛాజీవి. జవహర్ భారతి మేనేజ్‌మెంట్ వారు రెండు పర్యాయాలు ప్రిన్సిపాల్‌షిప్‌ని ఆఫర్ చేసినా, రెండుసార్లు కూడా తన మనస్తత్వానికి సరిపడదని సున్నితంగా తిరస్కరించారు.

ఆస్థాన ప్రభావంలో పడినవారికి స్వేచ్ఛాలోచనలు, జీవితపు హాయి, అనుభవ పరంపర ఉండవు అంటారు గదా. మాస్టారు ప్రాణమైనా వదులుకుంటారేమో గాని, శృంఖలాలను భరించలేరు. 2005 ఆగష్టున ఉద్యోగ విరమణ సందర్భంలో డి.ఆర్.గారికి కృతజ్ఞతలు తెలుపుకొని, వీడ్కోలు తీసుకోవడానికి వెళ్ళినప్పుడు మాటల సందర్భంలో డి.ఆర్.గారు ఇక ఖాళీగానే ఉంటారు కదా, ఇంజనీరింగ్ కళాశాలలో ఏమైనా పని చేస్తారా? అని అడిగినప్పుడు ఇంజనీరింగ్ సబ్జెక్టులో ఉన్న ఇంగ్లీషు అంతా కమ్యూనికేషన్ స్కిల్స్ మీద ఉంటుంది, ఇంత వరకు నేను చెప్పింది అంతా ఇంగ్లీషు లిటరేచర్‌కి సంబంధించినది సార్ అని అన్నారు. వెనువెంటనే డి.ఆర్.గారు 'అవునులే నువ్వు ప్రిన్సిపాల్ పోస్టునే వద్దనుకున్నవాడివి కదా!' అని సున్నితంగా కామెంట్‌చేశారు. డి.ఆర్.గారి గురించి కె.ఆర్.కె. మాస్టారు మాట్లాడుతూ, వారికి అన్ని విషయాలూ తెలుసు, అందుకే He looks like a Saint.

ప్రతి నిత్యం కె.ఆర్.కె.గారు తనతో భావసారూప్యత, సమాలోచనలు కలిగిన అయిదారుగురు అనుంగు

మిత్రులతో కలిసి సాయంకాలం షికారుగా కావలి రైల్వేస్టేషన్‌కి వెళ్ళి, అక్కడ ఫ్లాట్‌ఫాం దగ్గర వీచే చల్లటి గాలులను ఆస్వాదిస్తూ, రకరకాల జనాల్ని పరికిస్తూ, బెంచీల మీద ఆసీనులై చాలా విషయాలను ముచ్చటించుకోవడం ఎన్నో సంవత్సరాల నుండి సాగుతున్న ఒక ఆనవాయితి. అక్కడ వారిది ఒక చిన్న ప్రపంచం. ప్రాపంచిక విషయాలన్నీ ప్రస్తావనకి వచ్చేవి. తెలియని ఏ చిన్న విషయమైనా, ఎవరు చెప్పినా స్వీకరించే సహృదయత మాస్టారుగారిది. నడిచే విజ్ఞానసర్వస్వంగా ఎన్నో విషయాలకి మాస్టారుగారు ఒక సమన్వయశీలి. అక్కడ వారి చర్చల్లో మహాభారతం, రామాయణం, షేక్స్పియర్, బెర్నార్డ్‌షా, తత్త్వశాస్త్రం, మనస్తత్వ శాస్త్రం, సమకాలీన రాజకీయాలు అలా ఎన్నెన్నో విషయాలు, ఎంతో వటుత్వం కలిగిన చర్చలు ఇష్టాగోష్టిగా సాగుతుండేవి.

రైల్వేస్టేషన్ దగ్గర ఎవరైనా దయనీయంగా మాస్టారికి కనిపిస్తే పక్కనున్న వాళ్ళకి కూడా తెలియకుండా గుప్తంగా ఎంతో కొంత ధనం ఇచ్చేవారు. ఒక 'రోటీ' తినగల ఆకలితో ఉన్న మనిషి ఒక 'రోటీ' తింటే అది 'ప్రకృతి' అవుతుంది; ఒక 'రోటీ' తినగల ఆకలితో ఉన్న మనిషి మూడు 'రోటీలు' తింటే అది 'వికృతి' అవుతుంది; ఒక 'రోటీ' తినగల ఆకలితో ఉన్న మనిషి సగం 'రోటీ' మాత్రమే తిని మిగిలిన సగం ఆకలితో ఉన్న మరో మనిషికి దానం చేస్తే అది సంస్కృతి అవుతుంది అని మాస్టారు చెప్పేవారు.

ఇష్టాగోష్టి అనంతరం నడుచుకుంటూ మానస క్యాంటిన్‌కి వెళ్ళి టీ తాగి నిష్క్రమించేవారు. అలా ఇంటికి వస్తుంటే ఒకరోజు నేను కూడా మాస్టారుతో కలిసి వారి ఇంటిదాకా నడుస్తున్నాను. లత థియేటర్ దగ్గరకి వచ్చేసరికి 'నాగదేవత' అనే సినిమా ఆడుతోంది. హాల్ ఆవరణలో చిన్న నాగదేవత విగ్రహాన్ని, హుండీని పెట్టి, కుంకుమ ఏర్పాటు చేశారు. జనాలు ఆ విగ్రహానికి నమస్కరించి, బొట్టుపెట్టుకొని, హుండీలో చందావేసి సినిమాకి వెళ్ళుతున్నారు. ఇది చూసిన కె.ఆర్.కె.గారు ఎంతమంది కందుకూరి వీరేశలింగం పంతుళ్ళు, గురజాడ అప్పారావులు వచ్చినా వీళ్ళు మారతారా! అనుకుంటూ సాగిపోయాం. రైల్వేస్టేషన్ దగ్గర గడిపిన ఆ గంట, గంటన్నర సమయం రోజంతటికీ నాకు ఎక్కువ సంతోషాన్ని ఇస్తుంది అని మాస్టారు చెప్పేవారు.

కె.ఆర్.కె. మాస్టారు, ఆశల్ని తృప్తితో జయించిన చింతనాపరుడు. మాస్టారి హృదయం బాహ్య సౌందర్యాన్ని కాక నైతిక సౌందర్యాన్ని ప్రేమించేది. వారు, మిత్రులతోనే తన ప్రపంచాన్ని సృష్టించుకొన్నారు. అనుంగు విద్యార్థులు కొందరు స్నేహితులుగా మారారు. వారి జీవనయానం కొలది మిత్రుల, విద్యార్థుల సాంగత్యంతో, ప్రేమాభిమానాలతో ఎంతో ఆనందంగా సాగిపోయింది. స్నేహపూరిత విద్యార్థులు తటస్థించినప్పుడు, వారి ప్రస్తావన వచ్చినప్పుడు, వారు విజయాలు సాధించినప్పుడు, ఇంటికి వచ్చి వలకరించినప్పుడు మాస్టారు ఎంత ఆనందపడేవారో, ఎంత సంబరపడిపోయేవారో మాటల్లో చెప్పలేము. మర్రి విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నట్టు, బిడ్డలో సంపూర్ణ మానవుడు దాగి ఉన్నాడని మాస్టారి భావన. అందుకే పిల్లలకి, ప్రపంచానికి మధ్య వారధిగా భగవంతుడు కె.ఆర్.కె. మాస్టారులాంటి అధ్యాపకుడిని సృష్టించాడేమో! బహుశా. మాస్టారి సాంగత్యంలో శిక్షణ పొందిన తరం దివ్యమైనది. కాలం ఎన్నటికీ చెరిపి వేయలేనంత గాఢంగా విద్యార్థుల మనస్సుల మీద ముద్రల్ని వేసిన అధ్యాపకుడు కె.ఆర్.కె. మాస్టారు.

జీవితంలో కొన్ని విలువలు, కొంత స్ఫూర్తి మనం ఎవరి నుంచి అయితే పొందుతామో, వారు దూరమైనప్పుడు మనసు బరువెక్కుతుంది, కళ్ళు చెమ్మగిల్లుతాయి. మాస్టారూ! మీ వాక్కులోని ఉన్నత భావ సంపదను వినే భాగ్యం మాకిక లేనందుకు భారమైన మా హృదయాలకి మీ జ్ఞాపకాలే ఆలంబన.

**డా. దేవబత్తిని వెంకటరావు**
లైబ్రేరియన్, జవహర్ భారతి డిగ్రీ కాలేజ్,
కావలి, ఫోన్ : 6281996234






ఋషికుల్య నది

**– రామవరపు వేంకట రమణమూర్తి**

నదులు నరులకు నాగరికతను ప్రసాదిస్తున్న నేలపై నడిచే దైవ స్వరూపాలు. ఇటువంటి నదుల కోవలోనికి వచ్చే నదే ఋషికుల్య నది. నేటి ఒఢిస్సా (ఒరిస్సా) రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలో తూర్పు కనుమలలోని రుషిమాల్ కొండల ప్రాంతంలో ఉంది దారింగ్ బడి ప్రాంతం. ఈ ప్రాంతాన్ని తొలిరోజుల్లో *బిందుసార తీర్థం* అని పిలిచేవారు. అలాగే రుషిమాల్ పర్వతాలను మహాబరుని క్షేత్ర అని అనేవారు. ఈ దారింగ్ బాడి ప్రాంతం "ఒరిస్సా రాష్ట్ర కాశ్మీర్" (కాశ్మీర్ ఆఫ్ ఒరిస్సా)గా పేరుపొందింది. ఈ దారింగ్ బడి బ్లాక్‌లో "తమాంగి" గ్రామ సమీపంలో ఋషికుల్య నది జన్మిస్తోంది. ఈ నది జననం గురించి ఒక కథ ప్రచారంలో ఉంది.

రుషిమాల్ కొండల ప్రాంతంలో తొమ్మిది మంది ఋషులు (పులహ, పులస్త్య, క్రతు, అత్రి, బృగు, అంగీర, వశిష్ట, మరీచ, అథర్వణ ఋషులు) కలిసి మధుకైటభుల మరణం తరువాత వరుణ యాగాన్ని ఈ ప్రాంతంలో నిర్వహించార్ను యజ్ఞం ప్రారంభించిన తరువాత 13వ రోజున యజ్ఞకుండం నుండి తీయని జలం ఉద్భవించింది. అనంతరం శివలింగ దర్శనం అయింది. యజ్ఞకుండం నుండి ఇలా ఉద్భవించిన నీరు నదిగా మారింది. నీటిధార లేదా నీటి ప్రవాహాన్ని "కుల్య" అని అంటారు. ఇలా ఋషులు యాగం చేయడం వలన పుట్టిన ఈ నదికి " ఋషికుల్య" అన్న పేరు వచ్చింది. ఇలా కంధమాల్ జిల్లాలో తమాంగి ప్రాంతంలో పుట్టిన ఋషికుల్య నది దారింగ్ బాడి ప్రాంతం దాటి గెడులబాటి, సురడ (సొరడ), ధారకోట, అసిక (ఆస్కా), జౌగడ, ప్రతాపపూర్, గంజాం, పాతగడ ప్రాంతాలు దాటి, ఇలా మొత్తం 165 కిలోమీటర్లు (105 మైళ్ళు) ప్రయాణించి బంగాళాఖాతం సముద్రంలో కలుస్తూ ధన్యజీవి అవుతోంది ఋషికుల్య నది.

ఋషికుల్య నదీప్రాంత చరిత్రను ఇప్పుడు పరిశీలిద్దాం.కళింగ ప్రాంతాన్ని అశోక చక్రవర్తి జయించిన తరువాత కళింగను రెండు భాగాలుగా చేసాడు.ఒక భాగానికి ధౌళీ (పూరీ క్షేత్రం దరి)ని రాజధానిగా చేసి, రెండో భాగంకు "జుగడ" లేదా "జౌగడ" ని రాజధానిగా ప్రకటించాడు. ఈ జౌగడ ఋషికుల్య నదీతీరంలో ఉంది. ఈ రాజ్య ప్రాంతాన్ని ఆనాడు "సమప" అని పిలిచేవారు. ఇక్కడ ఆనాడు అశోక చక్రవర్తి వేసిన శాసనం ఉంది. దీనినే "జౌగడ శాసనం" అని అంటారు. ఇక కళింగ ప్రాంతాన్ని పాలించిన శైలోద్భవ వంశం వారి కాలంలో ఋషికుల్య నదీ పరివాహక ప్రాంతం "కొంగడ" రాజ్యంలో భాగంగా ఉండేది. అలాగే ఖారవేలుడు, మథర (పితృభక్త) రాజుల కాలంలో కూడా ఈ ప్రాంతాన్ని "కొంగడ" రాజ్యంగా పిలిచేవారు. రాజుల పాలన విషయానికి వస్తే భౌమకార, సోమవంశీ రాజులు, సూర్యవంశీ గజపతుల, ముకుంద బాహుబలేంద్రుని పాలనను ఈ ప్రాంతం చవి చూసింది.

ఈ ప్రాంతం 1753 నాటికి ఫ్రెంచివారి పాలన (బుస్సీ దొర పాలన) లోనికి వచ్చింది. ఫ్రెంచి వారి అధికారాన్ని ఘుంసూర్ రాజ్యం (భంజ్ రాజవంశం) రాజైన కృష్ణభంజ్ (1754-1773) వ్యతిరేకించాడు. తరువాత కాలంలో ఋషికుల్య నదీపరివాహక ప్రాంతం 1756 నాటికి ఆంగ్లేయుల పాలనలోకి వెళ్ళింది. వీరి కాలంలో ఘుంసూర్ రాజ్యం రాజు ధనంజయ భంజ్

తిరుగుబాటు చేసాడు. చివరికి 1836 నాటికి ఘుంసూర్ రాజ్యం ఆంగ్లేయుల చేతిలోకి వెళ్ళింది. ఘుంసూర్ రాజ్యాన్ని కాపాడడానికి తిరుగుబాటులు చేసిన "దొర బిసోయి"ని 1837లో కంపెనీ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇతని అనంతరం ఇతని మేనల్లుడు "చక్రబిసోయి" తిరుగుబాటును కొనసాగించాడు. ఉత్తర భారతదేశంలో 1857 విప్లవం రావడానికి ముందే చక్రబిసోయి తన దేహాన్ని చాలించాడు. అనంతరం కాలంలో ఈ ప్రాంతం అంతా 1936 ఏప్రిల్ 1(ఒకటి)న నూతనంగా ఏర్పడిన "ఒరిస్సా" రాష్ట్రంలో అంతర్భాగం అయింది. ఇదీ క్లుప్తంగా ఋషికుల్య నదీ ప్రాంత చరిత్ర. మనం ఇప్పుడు ఋషికుల్య నదీప్రాంత విశేషాలు చూద్దాం. ఈ నదీ పరివాహక ప్రాంతంలో ఒకనాడు కొన్ని రాజ్యాలు పుట్టాయి. వాటి వివరాలను తెలుసుకుందాం.

**సొరడ లేదా సురడ :** సురడ అంటే దేవతలు ఉండే ప్రాంతం (సుర అంటే దేవత. అడ్డ అంటే ఉండే ప్రాంతం) అని అర్ధం. సురడకు దగ్గరలో ఋషికుల్య నదితో ఉపనది జోరా నది (తనలో పద్మ నదిని కలుపుకుని వచ్చి) కలుస్తోంది. ఇక్కడ రిజర్వాయర్ ప్రక్కన ఉన్న కొండ మీద కుంతేశ్వరీమాత ఆలయం ఉంది. నది ఒడ్డున పంచనామ (పంచలింగ) ఆలయం ఉంది.

ఒకనాటి సురడ (సొరడ లేదా ఖిండిసింగి) రాజ్యాన్ని రాజా శోభాచంద్రసింగ్ (క్రీ.శ.1168) స్థాపించాడు. తరువాత కాలంలో క్రీ.శ.1476లో రాజా బలియార్ సింగ్ ఈ ఖిండిసింగి రాజ్యాన్ని నాలుగు భాగాలుగా (సొరడ, బడాగడ, ధారకోట, షేర్ గడ) విడదీసి తన వారసులకు పంచిపెట్టాడు. సురడ రాజ్యాన్ని ఒక కుమారుడు రాజా సంధ్ ధనుసింగ్ (ఇంకో పేరు అభయ ప్రసాద్)కి అప్పగించాడు. సురడ ప్రాంత ప్రముఖుల విషయానికి వస్తే నారాయణ్ రాజ్ గురు (1780-1856) కృష్ణ పురాణం వ్రాశాడు. శశిభూషణరథ్ (1883-1943) స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజికవేత్త మరియు ఆషా దినపత్రిక వంటి వాటికి అధిపతి. ఇతను భగవత్ గీత, స్వాప్న సోపాన (అనువాదం) వ్రాశాడు. తెలుగుతో సహా పదకొండు భాషలు తెలిసినవాడు. పోప్ ఆఫ్ జర్నలిజం ఆఫ్ ఒరిస్సా"గా పేరొందిన వ్యక్తి ఇతను.ఇతను 1928 ప్రారంభించిన "దైనిక్ ఆషా" దినపత్రిక ఒరస్సా భాషలో వచ్చిన తొలి దినపత్రిక. ఇతని సోదరుడు రంగనాథ మహాపాత్రో 1940లో ఒరియా భాష టైప్ రైటర్ కనుగొన్నాడు. రచయిత్రి, కవి, అనువాదకురాలు, నాటక రచయిత్రి అయిన సీతాదేవి ఖడంగ (1902-1983) (అసికలో పుట్టినా) సొరడలో జీవించారు. మందిర్ ప్రభాస్ నాటకం, పొష్యపుత్ర నవల వీరి రచనలే.

**ధారకోట :** సొరడ (ఖిండిసింగి) రాజ్యాన్ని విడదీయడం వలన 1476లో ధారకోట రాజ్యం ఏర్పడింది. దీని తొలి రాజు రాజా హడూసింగ్ (1472-1540). ధారకోటలోని జగన్నాథ ఆలయంకి పునాది రాయిని 1732లో రాజా జైసింగ్ వేసాడు. ధారకోటలో 600 సంవత్సరాల నాటి కోట ఉంది. దాదాపు 200 సంవత్సరాలనాటి "సతీ చితి" (సతీ సహగమన స్థలం) కి సంబంధించిన మఠం ఉంది.

ధారకోటలోని కవిరత్న పురోహిత్ సదాశివ ఉద్గట (18వ శతాబ్దం) ప్రమోద గోవింద నాటకం వ్రాశాడు. ధారకోట రాజు రఘునాథ్ సింగ్ దేవ్ రామలీల (ఆనాటి ప్రసిద్ధ జానపద నృత్యం) గ్రంథం వ్రాశాడు. గోస్వామి కృష్ణచంద్రదాస్, కవి వైద్యనాథ్, శివ ఉద్గట, గణపతి సాహు వంటివారు ఈ సంస్థానం వారిచే సన్మానింపబడ్డారు. ధారకోట రాజు మదన్ మోహన్ సింగ్ "కేసరి రంగమంచ్" (నాటక ప్రదర్శన వేదిక)ని స్థాపించాడు. కృష్ణసింధ్ దాస్ సింధు రామాయణ, బ్రిజ సుందర సింగు అభినయ దర్పణ వ్రాస్తే ధారకోట రాజు కృష్ణ సింగు (1739-1788) కృష్ణసింగ్ మహాభారత, హరివంశ వంటివి వ్రాశాడు. భరతసేన సులోచన పరిణయ, సుభద్రా పరిణయను వ్రాయగా భువనేశ్వర మిశ్రా బాల సాహిత్యం సృష్టించాడు. ధారకోట రాజు దామోదర్ సింగ్ ఉత్కంఠమాలికను వ్రాసాడు.

**అసిక లేదా అస్కా :** అసిక అంటే పదునైన కత్తి లేదా చురకత్తి అని అర్ధం. ఋషికుల్య దాని ఉపనది బడానది సంగమ ప్రాంతంలో చురకత్తిలా ఉండే భూభాగంలో ఉండడం వలన ఈ పట్టణంకు అసిక (అస్కా) అన్న పేరు వచ్చింది. అసిక పట్టణాన్ని "సుగర్ సిటీ" (పంచదార నగరం) అని అంటారు. ఇక్కడ 1824లో చక్కెర కర్మాగారం నెలకొల్పబడింది. మనదేశంలోనే పురాతనమైనదే కాకుండా, ఆసియాలోనే ఇటువంటి కర్మాగారాల్లోనే ఇది మొదటిది. బ్రిటీష్ వారి కాలంలో ఈవూరు గంజాం ప్రాంతానికి కొంతకాలం ముఖ్యపట్టణం గాను, సైనిక స్థావరంగాను ఉండేది.

అసిక ప్రాంతం జోడి శంఖధ్వని (రెండు శంఖాలను కలిపి ఊదే) నృత్యానికి పేరుపొందింది. ఇక్కడ కొండపై కొంకన్ దేవి ఆలయంతో పాటు ఋషికుల్య నదీతీరంలో త్రిదివేశ్వర (బ్రహ్మ, విష్ణు, మహేశ్వర) ఆలయం ఉంది. ఈ త్రివిదేశ్వర ఆలయంలో కపిలేశ్వర గజపతి (1435-1466) పేరుతో వచ్చిన "కపిలేశ్వర రబ్దా" (కపిలేశ్వర శకం) అన్న పేరుతో ఉన్న శకాన్ని సూచిస్తున్న తేదీలతో గల శిలాశాసనం ఒకటి ఉంది. అంటే ఈ శకం ఒకనాడు ఈ ప్రాంతంలో వాడుకలో ఉండేదన్న మాట.

అసిక ప్రాంతానికి చెందిన నరసింగ దాస గోదరంగ విలాసను, శ్రీవత్స పాడీ శ్రీగుండీచను, నీలమాధవ్ చంద్రభాగను వ్రాసారు. ప్రఫుల్లకుమార్ భంజీయ కావ్యకళ ఓ, వైదేహిస విలాస్, కవివర్ రాధానాధ్ వంటి రచనలు చేసాడు. సీతాదేవి ఖడంగ ( సొరద వాసి ) కిషోరీ మణిదేవి వంటి స్వాతంత్ర్య సమరయోధులు ఈ ప్రాంతం వారే.

**జౌగడ లేదా జుగడ:** ఈ నదీతీరంలో ఉన్న ఓ చారిత్రక ప్రాంతం ఇది. ఇక్కడ ఆశోకుని శిలాశాసనం ఉంది. పూర్వకాలంలో జౌగడని జటాదుర్గ అని అనేవారు. ఇది మహాభారత కాలం నాటి ప్రాంతంగా భావిస్తున్నారు. నవీన శిలా యుగపు అవశేషాలు ఇక్కడ లభించాయి. ప్రముఖ ఆర్కియాలజిస్ట్ జె.డి. బెగ్లర్ అభిప్రాయంలో ఈ ప్రాంతం తొలినామం జగత. ఇక్కడి కోటను శైలోద్భవ వంశం రాజులు నిర్మించారు.

**తారాతరణి :** ఇక్కడ ఋషికుల్య నది సమీపంలోని కొండపై తారాతరణి ఆలయం (పీఠం) ఉంది. తారా, తరిణి దేవతలు వెలసిన ప్రదేశం ఇది. దేవీ భాగవతం ప్రకారం దక్షయజ్ఞం సంఘటనలో శివుని దుఃఖాన్ని తగ్గించడానికి సతీదేవి మృతదేహాన్ని మహావిష్ణువు తన సుదర్శన చక్రంతో ఖండించగా రెండు భాగాలు (వక్ష భాగాలు) ఇక్కడ పడినట్లు చెప్పబడింది. ఈ ఆలయం చాలా ప్రాచుర్యం పొందింది.

**గంజాం :** ఆంధ్ర రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా ఏర్పడక ముందు ఈ ప్రాంతం అంతా గంజాం అంతా గంజాం జిల్లాలోనే ఉండేది. గంజాం ప్రాంతాన్ని ఫ్రెంచి వారు బుస్సీ దొర హయాంలో 1757లో ఆక్రమించారు. కానీ 1765లో ఇది బ్రిటీష్ వారి పాలనలోకి వెళ్ళింది. ఎడ్వర్డ్ కాట్స్ ఫర్డ్ 1778లో ఇక్కడ ఒక కోటని నిర్మించాడు. ఈ కోటలోనే గంజాం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉండేది. బ్రిటిష్ వారి కాలంలో ఈ వూరు గంజాం జిల్లా ముఖ్యపట్టణంగా ఉండేది. కానీ 1815-1818 మధ్యలో వచ్చిన అంటువ్యాధి వలన జిల్లా ముఖ్యపట్టణాన్ని బరంపురంకు ఆ తరువాత ఛత్రపూర్ మార్చారు.

గంజాం ఊరు ఋషికుల్యా నది సముద్రంలో కలిసే ప్రాంతంకు సమీపంలో ఉండడం వలన ఇక్కడ ఓడరేవుకు ఆరోజుల్లో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఈ ఓడరేవుని 17వ శతాబ్దంలో కేర్ పేర్ ఓడరేవు అని అనేవారు. ఆలివ్ రెడ్లీ తాబేళ్ళు సామూహికంగా గూడు కట్టుకొనే మూడు ప్రపంచ ప్రదేశాలలో ఋషికుల్య నది సముద్రంలో కలిసే ఈ చోటు (గంజాం) ఒకటి.

**బుగడ :** ఋషికుల్య నదికి ఉపనది అయిన భగువా నదికి సమీపంలో ఉన్న బుగడ లో నున్న విరించి నారాయణ (సూర్యనారాయణ మూర్తి) ఆలయాన్ని క్రీస్తుశకం 1790లో ఘుంసూర్ రాజ్య సింహాసనం అధిష్టించిన శ్రీకరభంజ్ నిర్మించాడు. బుగడలోని జగన్నాథస్వామి ఆలయయాన్ని క్రీ.శ.1680లో హరిశరణ్ భంజ నిర్మించాడు. బుగడకు పది కిలోమీటర్ల దూరంలో కృష్ణ జింకల అభయారణ్యం ఉంది. ఘనశ్యామ హోతా బుగడలో జన్మించాడు. ఈయన మాయ హరిణి, శ్రీరామ విలాస్, ఉపేంద్ర భంజ్, అగ్నిసాక్షి వంటి రచనలు చేశాడు.

**కవిసూర్య నగర్ :** ఇది ఋషికుల్య నదికి ఉపనది అయిన ధనాయ్ నదీతీరంలో ఉంది. తొలి రోజుల్లో ఈవూరు అథాగర్ రాజ్యంలో ప్రముఖమైన స్థానం వహించింది. తొలిరోజుల్లో ఈ ఊరిని బోయ్ రాణి అని పిలిచేవారు. కవిసూర్య బలదేవరథ్ (1789-1845) ఈ వూరిలో జన్మించినందున ఈవూరి పేరుని తరువాత కాలంలో ఈయన గౌరవార్థం కవిసూర్యనగర్‌గా మార్చడం జరిగింది. ఈయన వ్రాసిన "కిషోర్ చంద్రానంద చంపూ" ఎంతో పేరు పొందింది. రత్నాకర్ చంపూ, చంద్రకళ, సర్పజనన వంటివి ఈయన రచనలు. ఇతను ఒరియా, సంస్కృత భాషల్లో రచనలు చేశాడు. ధంపూ సంగీత సంప్రదాయకర్తగా ఇతనికి పేరు ఉంది. ఈవూరిలో ఆచార్య తరిణి చరణ్ పాత్ర (1893-1979) "గాంధీజీ సంగీత కళామందిర్"ని 1940లో స్థాపించి తాను మరణించే వరకు నిర్వహించారు. ఇది దక్షిణ ఒరిస్సా ప్రాంతంలో తొలి సంగీత విద్యాలయం.

**పురుషోత్తపూర్ :** గజపతి పురుషోత్తమదేవ్ యుద్ధంలో కంచి రాజును జయించిన సందర్భానికి గుర్తుగా ఋషికుల్య

నదీ ఒడ్డున ఉన్న ఈవూరిలో సుందర మహాదేవ్ ఆలయాన్ని నిర్మించాడు.

బ్రాహ్మణ్ చాయ్ : ఋషికుల్య తీరంలో ఉన్న ఈ గ్రామానికి చెందిన హనుమాన్ కవిచంద్ర రాయ్ గురు కిషోర్ కొయిలీ, రామ్ శ్యాం కొయిలీ రచనలు చేయగా ఈయన కుమారుడు గోవింద రాయ్ గురు రసపంచాధ్యాయి, ప్రహ్లాద నాటక వంటి రచనలు చేశాడు.

**నదీ పరివాహక ప్రాంతం :** ఇప్పుడు మనం ఈ నదికి ఉన్న ఉప నదులు, ఈ నది పరివాహక ప్రాంత విశేషాలు, కళలు, హస్తకళలు వంటి వాటి గురించి క్లుప్తంగా వివరిస్తాను. ఋషికుల్య నదికి ఉన్న ఒక ఉపనది లుహార్ ఖండి. ఇది ఋషికుల్యకు ఉపనది అయిన బడానది( మహానది లేదా బరా నది)కి ఉపనదిగా ఉంది. ఈ లుహార్ ఖండి నదీతీరంలో నున్నదే భంజ్ నగర్. తొలిరోజుల్లో దీని పేరు రస్సుల్ కొండ్.

**భంజ్ నగర్ :** ఆనాటి రస్సుల్ కొండయే నేటి భంజ్ నగర్. గతంలో ఈ ప్రాంతానికి చెందిన ఘుంసూర్ రాజ్యాన్ని పాలించిన భంజ్ వంశానికి చెందిన కవిసామ్రాట్ మరియు సంగీత సామ్రాట్ అయిన ఉపేంద్ర భంజ్ గుర్తుగా రస్సుల్ కొండ పేరుని 1953లో ప్రభుత్వం భంజ్ నగర్‌గా మార్చింది. సంగీతాన్ని, సాహిత్యాన్ని సమన్వయం చేసి రెండు రంగాల్లో మంచి కృషిని చేసారు ఉపేంద్ర భంజ్. ఇతను దాదాపు 67 కావ్యాలు వ్రాసాడని ప్రతీతి. వైదేహి విలాస్, లావణ్యవతి, కోట బ్రహ్మాండ సుందరి, కళాకృతికి వంటి రచనలు చేసాడు. ఒరియా భాషలో గీతాభినవ అన్న నిఘంటువుని కవుల కోసం వ్రాశాడు.

ఘుంసూర్ రాజ్యానికి రాజు అయిన బలభద్రభంజ్ (11వ శతాబ్దం) భబవతి కావ్యం రచించాడు. ఆనాటికి ఇంకా ఒరియా భాషలో సాహిత్యం ప్రారంభం కాలేదు. రాజు త్రివిక్రమ భంజ్ కనకలత, కృష్ణ విలాస్ కావ్యాలు వ్రాసాడు. ఈ భంజ్ నగర్‌కు చెందిన అభిమన్యు పట్నాయక్ కమలిని జనన, స్వరాజ్య గీత్, సుమన్ శతక వంటి రచనలు చేశాడు. ఇక్కడ జన్మించిన ఉమాచరణ పట్నాయక్ (1902-61) మెట్రిక్ వరకు చదివి తరువాత గొప్ప న్యాయవాదిగా గుర్తింపు పొందాడు. ఈయన 1922 నుండి గాంధీజీ అనుచరుడిగా ఉంటూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నాడు. ఋషికుల్య కాలువ వ్యవస్థ (ఋషికుల్య కెనాల్ సిస్టమ్)లో భాగంగా భంజ్ నగర్ సమీపంలో ఒక జలాశయం నిర్మించారు.

కుల్లడ లేదా కుల్లడ్ గఢ్ : భంజ్ నగర్‌కు దగ్గరలో మహానది (బడానది) తీరంలో ఉన్న ఈ వూరులో 12వ శతాబ్దంలో భంజ్ రాజవంశం వారు ఒక దుర్గం నిర్మించారు. ఈ కుల్లాడ గఢ్ ఘుంసూర్ (భంజ్ వంశం) రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఇక్కడే జన్మించిన కవిసామ్రాట్ (సంగీత సామ్రాట్) ఉపేంద్ర భంజ్ ఇక్కడి కొండపై బాగ్ దేవి ఆలయాన్ని నిర్మించాడు. కులడ లో జగన్నాథస్వామి ఆలయాన్ని రాజు శ్రీకృష్ణ భంజ్ (744-73) నిర్మించాడు.

ఇప్పుడు మనం ఋషికుల్య నదీ పరివాహక ప్రాంతంలో ప్రముఖంగా చెప్పుకోదగిన రాజ్యం అయిన "ఘుంసూర్ రాజ్యం" గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**ఘుంసూర్ రాజ్యం :** గంజాం ప్రాంతంలోని ఈ ఘుంసూర్ రాజ్యన్ని "భంజ్ రాజ వంశం" పాలించింది. ఈ వంశం గుప్తుల కంటే ముందునుండి ఉంది అని కొందరి అభిప్రాయం. ఈ భంజ్ రాజ వంశం వారు ఖింజలి మండలంకు చెందినవారు. బౌధ్ ప్రాంతంలో 10వ శతాబ్దంలో సోమవంశి రాజుల విజయంతో వీరు ఆ ప్రాంతాన్ని వదలి ఘుంసూర్ ప్రాంతానికి 12వ శతాబ్దంకు పూర్వం చేరి ఇక్కడ రాజ్యాన్ని స్థాపించారు. వీరి రాజధాని బడానది లేదా మహానది ( ఋషికుల్యకి ఉపనది) దగ్గర ఉన్న కుల్లడగడ్ (కుల్లడ).

రాజా రణభంజ్ (1707-1754) రాజ్య విస్తరణ చేసాడు. ఖుర్దా రాజుకు సహాయం చేస్తూ ఖుర్దా రాజు నుండి "క్షత్రియవర" బిరుదు పొందాడు. ఒరియా భాషలో త్రైలోక్య మోహిని అన్న కావ్యాన్ని రచించాడు. ఈయన కుమారుడు కృష్ణ భంజ్ (1754-1773) గంజాం ప్రాంతంలో ఫ్రెంచి వారి ప్రాబల్యాన్ని ఎదిరించాడు. లక్షణభంజ్ (1782-1790), శ్రీకర భంజ్ (1788-99), ధనంజయభంజ్ (1795-1808 మరియు 1833-35)లతో పాటుగా త్రివిక్రమ భంజ్, ఘనభంజ్, కవిసామ్రట్ (సంగీత సామ్రాట్), ఉపేంద్ర భంజ్ బలభద్ర భంజ్ వంటివారు ఈ వంశంలో చెప్పుకోదగిన వారు.

ధనుంజయ భంజ్ (1835) కాలంలోనే ఈ ఘుంసూర్ రాజ్యాం ఆంగ్లేయుల (ఈస్టిండియా కంపెనీ) వారి వశమైంది. ఇతని కాలంలో ఆంగ్లేయులకు ఘుంసూర్ రాజ్యంకు మధ్య స్పర్ధలు పెరిగాయి. ధనంజయ భంజ్

గెలరీ ప్రాంతంలోని అడవులకు పారిపోయి అక్కడి నాయకుడు దొరబిసాయి సహాయం పొందాడు. ధనంజయ భంజ్ 1835 డిసెంబర్‌లో మరణించాడు. తిరుగుబాటును కొనసాగించిన దొరబిసోయిని ఆంగ్లేయులు 1837లో బంధించగా, జీవిత ఖైదీగా ఉంటూ ఊటీలో 1846 మరణించాడు. ఇతని మేనల్లుడు చక్రబిసోయి తిరుగుబాటును 1840 నుండి తిరిగి కొనసాగిస్తూ 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందే మరణించాడు. క్లుప్తంగా ఇదీ ఘుంసూర్ రాజ్యం చరిత్ర.

**ఋషికుల్య నదీ పరివాహక ప్రాంత కళలు :** ఋషికుల్య నదీ పరివాహక ప్రాంతం హస్తకళలకు పేరుగాంచింది. గంజాం జిల్లా ఇత్తడి చేపల కళారూపాలు చాలా ప్రసిద్ధి చెందాయి. ఈ కళకు ప్రధాన కేంద్రం బెల్లగుంథ గ్రామం. ఈ కళారూపాన్ని ఘుంసూర్ భంజ్ వంశ రాజులు పెంచి పోషించారు. ఇత్తడి చేపల కళారూపాన్ని తొలిసారిగా రూపొందించిన వ్యక్తిని గంగాధర మహారాణాగా భావిస్తున్నారు. తల, మొండెం, తోక భాగాలను ఇత్తడి తీగెలతో కలుపుట వలన వీటిని కదిపిత మామూలు చేపల వలే కదులుతాయి. ఈ ఇత్తడి చేపలను విష్ణువు మత్స్య రూపానికి ప్రతీకగా ఆరోజుల్లో భావించేవారు. వివాహ సమయాల్లో పెండ్లికుమార్తెలకు వీటిని కానుకగా ఇచ్చే సంప్రదాయం ఉండేది. ఈ కళ రక్షణ కోసం ఒడిస్సా ప్రభుత్వం కొన్ని కార్యశాలలను (వర్క్‌షాపులు) నిర్వహిస్తోంది. ధారకోట వంటి ప్రాంతాల్లో కంచు వస్తువులు మరియు దేవాలయాల్లో వాడే గంటలు తయారు చేస్తారు. ధారకోటలో టెర్రకోట, మట్టి పాత్రలు, బొమ్మల తయారీ వంటి కళలు ఉన్నాయి. గంజాం జిల్లాలో పట్టచిత్ర అన్న కళారూపం ఉంది. వస్త్రంపై గాని, కట్ట పెట్టెలు, తలుపులు వంటివాటిపై సహజ రంగులతో కృష్ణ లీలలు, జగన్నాథస్వామి, ఇతర పురాణ గాథలు చిత్రిస్తారు. ఇవి ఎక్కువగా జానపదరీతిలో ఉంటాయి. ఈ కళకు బుగడలోని శ్రీ విరించి నారాయణ దేవాలయం జన్మస్థానంగా పేర్కొంటారు. కొబ్బరి బొండాల పైన కూడా ఈ చిత్రకళను వేస్తున్నారు. ఈ నదీ పరివాహక ప్రాంతంలో జోడి శంఖ ధ్వని నృత్యం, ప్రహ్లాద నాటక, దండ నృత్య, జంతు వేషాల నృత్యాలు, ధుంప సంగీత వంటి కళారూపాలు పేరు పొందాయి. ధుంప సంగీత ప్రక్రియకు ఆద్యుడు కవిసూర్య బలదేవ్ రథ్. దీని కోసం వెదురు కర్రను ఉపయోగిస్తారు.

**స్వాతంత్ర్యోద్యమం :** ఈ నదీ పరివాహక ప్రాంత స్వాతంత్ర సమరం విషయానికి వస్తే (క్లుప్తంగా) ప్రధానంగా గంజాంకు దాదాపుగా ముప్పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బరంపురం పట్టణం కేంద్రంగా స్వాతంత్ర సమరం కొనసాగింది. గంజాం టైగర్‌గా పేరొందిన శశిభూషణరథ్ గారి ఆశా దినపత్రిక జాతీయ వాదాన్ని బలంగా ప్రచారం చేసింది. దీపాంకర్ పట్నాయక్, బనమాలి మహారాణా, అద్రుతి లక్ష్మీబాయి (వి.వి. గిరి గారి సోదరి), కిషోరీదేవి వంటివారు ఎందరో దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొన్నారు. భారత మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి గారి తండ్రి గారు అయిన వరహగిరి వేంకట జోగయ్య పంతులుగారు గంజాం జిల్లా కాంగ్రెస్ కమిటీలో అనేక సంవత్సరాలు సభ్యునిగాను, కొన్నాళ్ళు అధ్యక్షుడిగా పనిచేశారు. వీరు 1920లో స్వరాజ్య పార్టీలో (చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూల పార్టీ) చేరారు.

భంజ్ నగర్ (రస్సుల్ కొండ)లో 1902లో జన్మించిన ఉమాచరణ్ పట్నాయక్ గారు ప్రముఖ గాంధేయవాది. గాంధీజీ డిసెంబర్ 1927లో భంజ్ నగర్, బెల్లగుంథ ప్రాంతాల్లో పర్యటించారు. ఉప్పు సత్యాగ్రహం సమయంలో గంజాం పట్టణం ప్రముఖ ఉద్యమకేంద్రంగా నిలచింది. నేతాజీ కాంగ్రెసు పార్టీ నుంచి బయటకు వచ్చి స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (1939) పార్టీలో గంజాం జిల్లాకు చెందిన ఎందరో వ్యక్తులు చేరారు.

ఇలా ఋషికుల్య వంటి నదులపై కూడా నిశితమైన దృష్టిని సారిస్తే పెద్ద నదుల వలే ఇటువంటి మధ్య తరగతి లేదా చిన్న నదులకు కూడా ఎంత నాగరికత, సంస్కృతి, వారసత్వ సంపద ఉందో తెలుస్తుంది. ఇలా నదుల గొప్పతనం గురించి మనం తెలుసుకున్న రోజున మనం వాటిని కలుషితం చేయకుండా కాపాడుకోవాలి అనే భావన కలుగుతుంది. మనం నదులను కాపాడుకుంటూ నదుల చేత మనమూ కాపాడబడుదాం. ......నది వెంట మనం నిదానంగా నడిస్తే....ఆ ప్రాంతం నాగరికత, సంస్కృతి మనకు తెలుస్తుంది.

**రామవరపు వేంకట రమణమూర్తి**
విశ్రాంత ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్, ఆకాశవాణి,
ఫోన్ : 9440 798 301

# నాగరకత
# సమాజ పరిణామాలు



– వల్లభనేని అశ్వినీకుమార్

**వ్య**క్తి కుటుంబం, సమాజం, ప్రభుత్వం, నగర జీవన నిత్యపోరాటం, న్యాయవ్యవస్థ, ఆరోగ్య సమస్యలు–ఇవన్నీ ఇప్పటి జన సామాన్యపు విశ్వాసాన్ని కోల్పోతున్నాయి! ఈ వ్యవస్థలన్నీ దేనికది ఆస్తిస్వాన్ని కోల్పోయి, బ్రతుకు పోరాటంలో అలసిపోతున్న సామాన్య పౌరుణ్ణి అపహాస్యం చేస్తున్నాయి – అణిచివేస్తున్నాయి – ఎందుకని ఈ శతాబ్దంలోనే – ఒక్కసారిగా ఈ పరిణామం దాపురించింది? అదికూడా, ప్రపంచ సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుండగా, తలసరి ఆదాయం ముందెన్నడూ లేనంతగా ఎదిగిపోతుండగా, సామాన్యుణ్ణి ఈ అపనమ్మకం, సమాజంలోని అన్ని వ్యవస్థలపైనా అవిశ్వాసం రోజురోజుకూ ముసురుకుంటున్నాయి?

ఇప్పటి సమాజం – గత నూట పాతిక సంవత్సరాల చరిత్రలో – ఎన్నో వడిదుడుకులను, రెండు అనవసరపు యుద్ధాలను, మరొక అసందర్భపు సిద్ధాంత వికృతాల నీడలనుంచి, బొగ్గు, పొగ, ఇనపరజను మొదలైన మోటు యాంత్రిక బాధలనుంచి తేరుకుంటూ – అప్పటి వైజ్ఞానిక విజయాల విషయ సుఖాల డోలికల్లో తేలవలసిన సంధిసమయంలో ఒక్కసారిగా, రాజకీయ, ఆర్థిక వ్యవహార సూత్రాల వలల్లో, అహంకారపు ఆక్రమణల (యుద్ధం పేరుతో) నేపథ్యంలో, మతఛాందసుల మతిలేని హింసలతో, బాధ్యతా రహిత మాధ్యమాల రంగుల వలయంలో ఎందుకు విలవిలలాడుతోంది?

ముఖ్యంగా, ఇప్పటి మార్పు – పరిణామం పరిశీలించితే – మనల్ని అబ్బురపరిచేటి – దానివేగం! ప్రతి సంఘటన త్వర త్వరగా జరిగిపోతుంటుంది – తర్వాత జరిగేది దీన్ని మరిమింపచేస్తుంది – ఈ సంఘటనల పరంపరల పరుగుపందెంలో మనం కదిలిపోతున్నాం – ఏమి జరుగుతోందో తెలిసేలోపు – పరుగు వేగం పెరుగుతోంది – రోజు చివరికి అలసి – సొలసి రంగుల పెట్టె ముందు కూర్చుని – ఆలోచనతో పనిలేకుండా జరిగిపోయిన సంఘటనల సమాహారం – వార్తల రూపంలో చూస్తూ ఒరిగిపోవటం – చేస్తున్నాం. ప్రముఖ వార్తాఛానళ్లు ప్రసారం చేసేది – ఉగ్రవాదుల పేలుళ్లు – మతవాదుల ప్రేలాపనలు – దుర్ఘటనల రక్తపు మరకలు –

పేదదేశప్రజల ఆకలిచావులు – వారి అనారోగ్యాల హాహాకారాలు –

ఆయా దేశాల దురాక్రమణల దుష్ట పరిణామాలు–

ఇక సినిమాల సంగతి – హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు – అంతులేని హింస – అసమర్థ కథానాయకుల అసత్యపు సామర్థ్యం!

ఇవన్నీకూడా సామాజిక వ్యవస్థలమీద అవిశ్వాసం పెంచేవే!

ఈ వేగం అన్నిటినీ, వ్యక్తి, సమాజపు అన్ని పార్శ్వాల్ని తనతో తీసుకుని పోతున్నది.

ఇక రాజకీయాల – అందలి కీలక వ్యక్తుల సమీకరణలు – పునరేకీకరణలు – ఇప్పటి వరకు వల్లె వేసిన సిద్ధాంతాల స్పృహ ఏ మాత్రం లేకుండా – సంకర ప్రభుత్వాలు నడవటంలోని – స్వార్థ ప్రజానాయకులు! వీరివిషయంలో ఈ వేగం మరీ స్పష్టంగా – సామాన్యులకు అందకుండా – జరిగిపోతుంది! ఈ వేగమైన మార్పులకు, రాజకీయవేత్తలు, రచయితలు, మేధావులు కూడా బెంబేలెత్తిపోతున్నారు! సాహిత్యం – అన్ని కళారంగాలూ ఈ పరిణామానికి లోనవుతున్నాయి!

ప్రభుత్వంలో ఉన్న దిశానిర్దేశం లేని ప్రబుద్ధుల పాలన, ఎల్లపుడూ అధికారంలో కొనసాగే ప్రభుత్వోద్యోగుల హ్రస్వదృష్టి, జనసామాన్యంపై చిన్నచూపు – వారి

అంతులేని స్వార్థపరత్వం – ఇవన్నీ అభివృద్ధి నిరోధకాలుగా ప్రజలను, మిగతా వ్యవస్థలను సంఘర్షణకు, కుల, మత సంక్షోభానికి గురిచేస్తున్నవి.

గతకాలపు యంత్ర వైజ్ఞానపు విజయాలు – హరిత విప్లవాల సంపదలు – ఇవి ప్రపంచ మానవాళిముంగిట చేరే సమయానికి – సమాచార మాధ్యమాల ఉప్పెన వచ్చి ప్రపంచ ప్రజలను ముంచెత్తి వేసింది. సమాచార 'విప్లవం' – నేల నాలుగుమూలలా జరుగుతున్న – మంచినీ, మతఛాందసుల మతిలేని ప్రేలాపనలు – హింసాత్మక కార్యకలాపాలను – అసహనాన్ని – మోసుకొస్తున్నాయి – ఇతర సమాజాల మీద అపనమ్మకాన్ని – ఆందోళనలు పెంపుచేస్తున్నాయి –

అంటే – ఇప్పటి సమాజాలను – వ్యక్తులను నడిపేది – అక్కడి ప్రభుత్వాలు – ఆర్థికవేత్తలు కాదు – లేక, వారిని విపరీతంగా ప్రభావితం చేసేది, సమస్త సమాచార మాధ్యమాల వ్యవస్థలు! ఇప్పటి మానవాళిని – ముంచెత్తి వేస్తున్న ఎంతో శక్తివంతమైన సమాచారపు ఉప్పెనలు!

ఇవి చేరవేసేది – కేవలం రాజకీయ వార్తలు – ఉగ్రవాదుల పేలుళ్లు – అన్ని రకాల ప్రమాదాల మరణాలు మాత్రమే కాదు – ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార రంగంలో వడిదుడుకులను – లాభనష్టాలు – క్లోనింగు – గర్భస్రావాల – నక్షత్రాలు, నెబ్యులాల, గ్రహాల వేట – ఆరోగ్యసంబంధమైన – సత్యాసత్యాల సమీకరణ – వ్యవసాయరంగపు వ్యాపారాలు, ఒకటేమిటి – ఈ మాధ్యమాలు ప్రసారం చేయని 24 గంటలు, 365 రోజులు వ్యవహారమే ఉండదు – ఈ వేగవంతమైన, ప్రసారమాధ్యమాల ప్రభావం – అనునిత్యం సామాన్యుణ్ణి – తాకకుండా, ఉండవు – ఊపిరాడనీయవు.

సరిగ్గా ఇక్కడి నుంచే – మొదలవుతుంది – నూతన సమాజపు ఆవిష్కారం! అంటే – మీరు ప్రపంచంలో ఏమూల కూర్చున్నా – ఏ పని చేస్తున్నా – ఈ సమాచార పెనుగాలుల బారి నుంచి తప్పించుకోలేరు – అంటే ఆ తప్పించుకోలేని విషయం – అందరికీ – సామాన్యమైన విషయం అన్నమాట –

ఈ సమాచార విస్ఫోటనం నుంచే – ఇప్పటి మానవాళి – జీవన సరళి – ఏప్రాదేశిక పౌరుడైనా స్థూలంగా గడిపేది – నడిపేది – ఒకే రకపు – జీవితం! కుటుంబం – అక్కడి చిన్న సమాజం – కోకొల్లలుగా వచ్చి పడుతున్న ఇంటి – వంటింటి – పెరటి సామగ్రి – ప్రపంచ వ్యాప్తంగా నాలుగైదు – పెద్ద పేర్లున్న సంస్థలపరంగా, ఇంక ఫాషన్స్ – అలంకరణలు, గడియారాలు – వాహనాలు – అన్నీ, అన్నీ అందరికీ అందుబాటులోకి తేగలిగిన – వ్యాపార సంస్థలు – మధ్యమాల ద్వారా వ్యాపార ప్రకటనతో అమ్మకాలు పెంచుకోగలిగినవే వారే, ఉంటున్నాయి అన్నీ ముంగిట్లో వాలిపోతున్నాయి – అంటే ఒక రకమైన వస్తుసారూప్య నాగరకత పాదుకొంటుందా అని! సరే అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది.

**ఈ క్రొత్త సమాజం–దీనికి నాంది పడింది – ఎవరూ కొబ్బరికాయకొట్టి–శంకుస్థాపన చేసిందికాదు –**

**20–21 శతాబ్ది సంధికాలంలో ఇది హఠాత్తుగా కాకపోయినా, మెల్లగా మాత్రం కాదు – జరిగిపోయింది! దీనికి నైతిక కోణం కూడా వుంది!**

ఈ క్రొత్త నాగరకత – ఆవిర్భావం మన జీవనసరళిని మార్చి వేస్తోంది – మొండివాళ్లు, గ్రుడ్డివాళ్లు దీన్ని చూడలేక పోయినా – ఇది అణిగిపోయేదికాదు – ఈ క్రొంగ్రొత్త నాగరకతలో – క్రొత్త కుటుంబ సమీకరణలు – ఉన్నచోట, కులాల వికేంద్రీకరణలు – వర్గ సంకీర్ణాలు – రాజకీయ పొత్తులు – ఘర్షణలు – సరికొత్త పని వాతావరణం – ఇవన్నిటినీ మించి – ఒక మారిన సమాజ స్పృహను తెచ్చిపెడుతోంది –

ఇప్పటి మానవాళి – ఒక పెద్ద – విపరిణామం చెందుతోంది – దీనితో – లోతైన సాంఘిక సంబంధాలు తిరిగి లోబడుతున్నాయి – మళ్లీ పునరేకీకరణ – లేక పునఃసమీకరణ జరుగుతోంది! జనసామాన్యానికి – తెలిసో తెలియకో – ఇష్టమున్నా లేకపోయినా – ఈ పెనుమార్పు జరిగిపోతున్నది!

ఇందుకు మూలకారణాలు ఇంకొంచెంలోతుగా చూస్తే, మానవ నాగరకత పరిణామం మూడు దశలుగా చూడవచ్చు –

**ఒకటి :** వేల సంవత్సరాల కాలంలో వ్యవసాయ పరమైన జీవనంలో – ప్రపంచపు అన్ని అంచులలోనూ మానవజాతి ఎదుగుబాటు – ఒక సరళసంస్కృతి, నాగరక సర్దుబాటు కనబడుతుంది!

ఈ నాగరక సమాజంలో – అది – గ్రామీణమైనా, నగర వాతావరణమైనా, సాంస్కృతిక వికాసమే ఎక్కువ గాని – ఇతర సంఘర్షణలకు అంతగా చోటు కనపడదు – జీవితం – తాపీగా, ఆర్థిక ఒడిదుడుకులు లేకుండా,

నడిచిపోయింది - అయితే, అప్పుడూ పాలకులు రాజ్యవిస్తరణ నెపంతో ఏ యుద్ధం చేసినా, సామాన్యులు బలి కావలసిందే - అయితే ఈ విపరీతాలు - ప్రాదేశికంగా పరిమితమై ఉండేవి - కళలూ, చేతి వృత్తులు - జీవన సరళిని మేలుగా చేసేది! జనజీవితం పగటికే పరిమితమైనా జాతుల వలసలు - సమీకరణలు - సంకీర్ణములు జరిగిపోతూనే వుండేవి - వస్తూత్పత్తి చేతులమీదగానే జరిగేది!

ఒకరకమైన సమాజ బంధం - ఐక్యకుటుంబం, మనుషుల ఆత్మీయత, పరస్పరాధారం - ప్రకృతి పట్ల గౌరవం-పరిమితమైన జ్ఞానం-ఇదీ అప్పటి సమాజచిత్రం!

**రెండవది :** 17వ శతాబ్దారంభంలో మొదలైన యంత్రయుగం - తర్వాత మూడువందల సంవత్సరాలలో మునుపటి సమాజ బంధాన్ని ఛిద్రం చేసింది. పెనుమార్పులకు లోనుచేసి చిన్నాభిన్నం చేసింది! అప్పటి వరకూ వేల సంవత్సరాలలో క్రమక్రమ పరిణామం చెందుతూ వచ్చిన మానవ నాగరకతను - యంత్రయుగపు ఇనప చట్రాలలోనూ - రైలుబండి ఉక్కు చక్రాలకు - పట్టాలకు మధ్యలోను పడి నలిపి రూపుమాపి - ఒక క్రొత్త యాంత్రిక నాగరకత - పని వాతావరణం - ముక్కలు అతకించుకుంటూ పోయే - మానసిక స్థితి - మనిషి అస్థిత్వాన్ని పోగొట్టే - పొగ గొట్టాలూ - బొగ్గు గనులూ- ఆకాశహర్మ్యాలూ ఇవన్నీ మూడువందల సంవత్సరాలలో రెండు యుద్ధాలకు - పరోక్షంగా - యాంత్రిక విప్లవమే కారణం - తర్వాత - ఒక ఆర్థిక సామాజిక సిద్ధాంతానికి రాజకీయవేర్పాటు వాదానికి నాంది పలికింది! ఈ మూడువందల సంవత్సరాలలో - మానవజాతి, నాగరకతల పరిణామం, దూరాలు దగ్గరవటంలో, జాతుల వలసలు మరింతగా పెరిగి - ఒక క్రొత్త సమాజ వాతావరణం నెలకొనటం జరిగింది - ఇందులోనూ వర్గ భేదాలు - మత ఘర్షణలూ - మానసిక సంఘర్షణలకూ - లోటు లేకపోలేదు - అయితే సహజమైన సర్దుబాటుతనం - సంస్కృతీపరమైన సహనం - ఒక నూతన ఇరవయ్యో శతాబ్దపు సమాజాన్ని ముందుకు తెచ్చింది!

**ఇక మూడవది!** గత ముప్పయిఏళ్లుగా వచ్చిన సమాచార విస్ఫోటనం - ఈ విస్ఫోటనానికి లోనయిన మానవ సమాజం - ఒక్కటిగా - అంటే ప్రపంచం అంతా, ఒక్కటిగా నిలబెట్టి - కలబెట్టి మార్చివేస్తోంది. అదీ ఎంతో ఎంతో వేగంగా. పై మూడు దశల్లోనూ మానవ నాగరకతలలోని కాలం - ప్రదేశం - మానసిక స్థితి - ఇవన్నీ పరిగణలోనికి తీసుకున్నా-ఎన్నోవేల ఏళ్లుగా పరిణితిచెందిన వ్యవసాయం సమాజం-యంత్రయుగంలో మూడువందల సంవత్సరాలలో తెరమరుగయింది.

అలాగే మూడువందల ఏళ్లుగా వృద్ధి చెందిన యంత్ర - నాగరక సమాజం - వెనుకపడిపోయి, యాభై ఏళ్ళలో కొత్తగా, క్రొంగ్రొత్తగా అవతరించి సమాచార మాధ్యమాల నాగరకతగా ఆవిర్భవిస్తోంది! ఇప్పుడు ఎఐ ఆ గతిని వేగవంతం చేసింది. మనం సరిగ్గా - ఇక్కడే - ఈ మార్పుల పెనుతుఫాను ముంగిట్లో ఉన్నాం! అందుకే మనకు ఈ ఘర్షణ - మానసిక ఒత్తిడి - అనునిత్యం ఈ తుఫాను తాకిడి! ఈ ఘర్షణలో, ఒత్తిడిలో ఒకరకమైన శక్తి దాగి ఉంది. ఈ నిక్షిప్త త్రాణ మనకు రోజుకు ఇరవయి గంటలు పనిచేసినా అలసిపోని శక్తినిస్తోంది. పూర్వం పదిగంటల్లో రెండుమూడు పనులు పూర్తి చెయ్యగలిగితే, ఇప్పుడు రెండు గంటల్లో పదిపనులు చెయ్యగలుగుతున్నాం! అదీ ఎంతో సమర్థవంతంగా, ఫలితార్థపరంగా, ఈ అర్థవంతమైన పనులన్నీ కూడా ఆర్థిక వనరులను సమకూరుస్తున్నాయి కూడా!

అంతేకాదు, వ్యక్తిస్వేచ్ఛ హరించబడకుండా కూడా ఈ శక్తి ఉపకరిస్తోంది!

ఇప్పుడు శక్తి ఉత్పత్తికి పొగబారిన ఫ్యాక్టరీలు లేవు- గాలియంత్రాలు - సూర్యకిరణాలు - సముద్రపుటలలు- ఇవన్నీ ఇంకా - చెత్తా - చెదారం నుంచికూడా శక్తి ఉత్పత్తి చేస్తున్నాయి - ఎలక్ట్రానిక్స్ - కంప్యూటర్లు - రోబోలు-ఇప్పటి నవసమాజ నిర్మాణంలో కీలక ప్రేరకాలు -నూతన నాగరకతకు మార్గదర్శకాలు - ఇవన్నీ - రాజకీయాలకు ఆర్థిక గుత్తాధిపత్యానికి, లొంగకుండా జన సామాన్యానికి అందుబాటులోనికి వచ్చి, ఇప్పటి జీవన పరిణామాన్ని మెరుగుపరుస్తున్నాయి. జనసామాన్యానికి నిన్న మొన్నటివరకూ అర్థం కాని సంఘటనలు - ఇప్పుడు ఒక్కసారిగా అర్థవంతంగా - తమకు ఉపయోగపడేవిగా కనపడుతున్నాయి -

**అణు విస్ఫోటన భయంనుంచి - సామ్రాజ్యవాద, స్వార్థపరుల సంఘంనుంచి - కమ్యూనిజం కోరలనుంచి మానవాళిని బైటపడవేసింది - ఇప్పటి, అంటే గత నాలుగు దశాబ్దాల వైజ్ఞానిక పరిణామాలే గాని - ఏ ఒక్కరాజకీయ**

**నాయకుడూ – మతగురువు లేక సిద్ధాంతమూ కాదని మనం గుర్తించాలి!**

ఇప్పటి మానవుడు – చిన్న చితకా ఆలోచనలు చేయటంలేదు – మనం చేసేపని, ఆడే ఆటలు – మనజీవన సరళి, మన ఆలోచనలే – పెనుమార్పులకు లోనవుతున్నాయి. ఇది ప్రపంచీకరణ అనుకుంటే పెద్దపొరపాటు – ఇది ఏకప్రపంచం! ఇది ఎవరూ పనిగట్టుకుని చేయటం లేదు – ముందుచెప్పినట్లు – మూఢులూ గ్రుడ్డివాళ్లు – అడ్డుపడినా, చూడలేకపోయినా – ఇది విపరీతమైన వేగంతో జరిగిపోతోంది! ఇందుకు ప్రధాన ప్రాతిపదికలు.

1. అధికజన సామాన్యానికి అనువైన ఆర్థికపర, ఆరోగ్యకర జీవనసరళి.

2. వ్యక్తి స్వేచ్ఛను హరించని, లేక హామీ ఇవ్వగలిగిన రాజకీయపరిపాలన, లేక ప్రభుత!

3. ప్రపంచ, ప్రాదేశిక పర్యావరణ సమతుల్యాన్ని కాపాడగలిగిన పనివాతావరణం, ఉత్పత్తి విధానాలు! కాలుష్య రహిత పరిసరాలు, సస్టెయినబిలిటీ – గాలిమరలు – సూర్యఫలకాలు!

ఈ మార్పుని – వ్యక్తిపరంగా, సమాజపరంగా, ప్రదేశ పరంగా పరిశీలించితే....

వ్యవసాయవాతావరణంలో – వ్యక్తికీ సమాజంతో అత్యంత అనుబంధం వుండేది – పరస్పరాధారం – మార్పిడి తప్పదు. ఇది యంత్రయుగంలో కొంతవరకూ తగ్గినా – వ్యక్తి – ఒక గుంపులోనే – ఒక పని సంఘంలోనే ఉండక తప్పని పరిస్థితి –

కాని ఇప్పటి వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ (పనిపరంగా) లభించింది – సమయం కూడా – జీవన సరళికూడా అతనికి అనుకూలిస్తున్నాయి – తన పనిలో నిబద్ధత అవసరమున్నా ఎవరికీ బద్ధుడై ఉండవలసిన నిర్బంధ పరిస్థితి లేదు!

ఒకరకంగా – ఇది వ్యక్తిపరంగా, ఈ స్వేచ్ఛ ఎంతో అధునాతన జీవితాన్ని ఇచ్చినా – భద్రత వుండదు!

ఈ పరిణామంలోని విపరీతాలు – కుటుంబ ఛిద్రమైపోవటం, తల్లిలేని పిల్లలు – తండ్రితోనే వున్న పిల్లలు – తండ్రికనపడని సంతానం – ఒంటరి కుటుంబాలు – స్వజాతి కుటుంబాలు – మళ్లీపెళ్లిళ్లు – పిల్లలులేని తల్లితండ్రులు – ఈ విధంగా ఒక అవక్రమైన సరళిలో వ్యక్తి స్వేచ్ఛ పరిణామం చెందుతోంది –

ప్రేమ – అనుబంధాలకోసం సినిమాలు చూస్తున్నామా? అనిపిస్తుంది!

పెళ్లితో అవసరంలేని కో లివింగ్ – సొంత ఇళ్లు అవసరం లేని వలసలు – సింగిల్ చైల్డ్ – తర్వాత కలిసి బతకటం – విడిపోవటం – ఎక్కడా నిలకడ లేని బతుకులు – స్వేచ్ఛ అంటే ఇదేనా?

ఇంకా – కుటుంబంలో – పరస్పర సంభాషణలు తగ్గి ఎవరి గదిలో వారు రంగులపెట్టె కరవాణి ముందు కాలం గడపటం – ఇలా ఒంటరితనం కోరుకుంటున్నారో – అలవాటుపడుతున్నారో తెలియని స్థితి!

**సమాజం :** ఇక్కడ కూడా ముక్కలుముక్కలుగా విడిపోతోంది – ఎవరితో అవసరమో – ఎంతమందితో పనిపడుతుందో అంతవరకే ఒక సమూహంగా సమాచార మార్పిడి జరుగుతోంది – దీనికి – రోజులో చెయ్యవలసిన పనులు పెరిగిపోవడం కూడా ఒక కారణం. మన పనిచేసే కంపెనీలు – ఉత్పత్తి చేసే కంపెనీలు – వస్తువులు అమ్మే చిల్లర కంపెనీలు – అందులో – ఇందులో ఉద్యోగస్తులు – ఇంతవరకే పరిమితమౌతూన్న సమాజాలు – ఒకరకమైన కార్పొరేట్ సమాజం అనుకోవాలి!


**దేశీయం :** ఈ రోజుల్లో ఈ దేశంనాది – దేశభక్తుణ్ణి అనుకుంటే – అనడానికి ఒకటి రెండుసార్లు ఆలోచించాలి–

నీ దేశంలో, నీకు ఆ పరిస్థితి – అంటే రోజుకు ఒకసారైనా నాది భారతదేశం అనుకోవాల్సిన స్థితి రావటం! రెండోది – నేను దేశభక్తుణ్ణి – అని చెప్పుకోవడం – అవసరమేముంటుంది? ఇక పైదేశంలోనికి వలసవెళ్లిన వానికి – ఆ హక్కు ఎలాగు ఉండదు – దేశపుటెల్లలు కేవలం కాగితాల మేరకు ఉంటున్న ఈ రోజుల్లో – ప్రతిరోజూ లక్షల ప్రయాణీకులు అన్ని దేశాల తీరాలు ఒకటికి నాలుగుసార్లు మారుతున్న ఈ జెట్, సూపర్‌సోనిక్ యుగంలో – ఈ ప్రపంచం అంతా ఒక పెద్ద సాలెగూడు – మాత్రమే! మనుషులందరూ స్పైడర్‌మాన్‌లే అనుకోవాలి!

ఇంకో ముఖ్య విషయం ప్రస్తావించాలి – ఇప్పుడు జరుగుతున్న పెక్కు మార్పుల్లో – ధనిక దేశాలు – పేదదేశాలూ రెండూ కూడా తప్పించుకోలేక పోతున్నాయి– ధనికదేశాల సాంకేతిక పరిజ్ఞానం – అధునాతన యంత్ర సముదాయం కూడా – పేద దేశాల చౌక పనిగంటల మీద ఆధారపడాలి – అంతేకాదు – ఈ పేదదేశాలు – అడవులు నరక్కుండా – పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవలసి అవసరాన్ని ధనికదేశాలు కాపాడాలి! అలాగే

పేదదేశాలలోని విద్యార్థికులు – సంపద కోసం – ధనికదేశాలకు వలస పోవలసిందే – అక్కడనుంచి – ఎంతోకొంత స్వదేశానికి పంపుకోవలసిందే – ఈ సంపద మార్పిడి కూడా ఇప్పటి నవ్య సమాజావిష్కారానికి ఎంతో ముఖ్యమైన అంశం!

ఇప్పుడు పేదరికం కొట్టవచ్చినట్లు కనపడదు – కోవిడ్ మానవజాతి మనుగడను – గతిని మార్చి వేసింది. అన్ని వర్గాలవారు ఖర్చుకు వెనకాడటం లేదు – పది రూపాయల సినిమా టికెట్టు రెండువందల తొంభై రూపాయలు అయినా చూస్తున్నారు. వలస సందర్భంగా ఒక ముఖ్యవిషయం ప్రస్తావించాలి – ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలోనూ ఇప్పుడు ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యేది 'అల్పసంఖ్యాకుల' అనల్ప శక్తి! ఇది ఎంత అసహజమో అంత నిజం కూడా! మానవుడు – అనాదిగా, చేసే తన నిరంతరాన్వేషణలో వలస – లేక ప్రయాణం ఒక భాగం మాత్రమే! తనలాంటి వారిని – తనను తను వెతుక్కుంటూ నేలనాలుగు చెరగులా తిరుగుతూనే వున్నాడు!



వ్యక్తిగా, గణాలుగా, జాతులుగా ఈ వలస విధానం కొనసాగుతూనే వున్నది – ఈ నిరంతర సంగమాల పర్యవసానమే వివిధ సంస్కృతుల ఆవిష్కారం!

ఈ వలసల గొలుసులు ఇప్పుడు కలగలసి పోయి ఒక మహాద్భుతమైన సాలెగూడు ఆవిర్భవించింది!

ఇంకా ముఖ్యమైనది – ఇప్పటి పెనుమార్పుల్లో సంస్కృతుల సంఘర్షణ – ఈ సంఘర్షణల రాపిడి ఇప్పుడు చాలావరకు తగ్గినా – మతపరమైన ఘర్షణలు – స్వార్థ పర మత రాజకీయ నాయకులు – ప్రపంచ వ్యాప్తంగా రేపుతున్నా – వీటికి సామాన్య జనుల మద్దతు ఏ మాత్రం లేదు! అయితే – ఇంతకు పూర్వం, సంస్కృతీపరంగా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనుకున్న సమాజాలు – ఇప్పుడు ఏకీకరణకే మొగ్గు చూపుతున్నాయి – ఇందుకు ప్రధానంగా, సమాచార బాంధవ్యాలూ, ప్రసార మాధ్యమాల ప్రభావమే కారణం! కుల, మతాంతర వివాహాలు – నానాజాతి సమీకరణలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి.

**ముగింపు :** ఈ క్రొంగ్రొత్త నాగరకత, సమాజ నిర్మాణానికి ముఖ్యమైన అవరోధాలు ఏమిటి?

1. అబద్ధాలు ప్రచారం చేసి, ప్రజలను యుద్ధంలోకి దింపే రాజకీయనాయకులు – ప్రజాస్వామ్యంలో అయితే – అమెరికా – బ్రిటన్ నాయకులు – సైనిక నియంతలైతే పాకిస్తాన్ పాలకులు – 2. తమ మనుగడకోసం ప్రజలను, పన్నులు, పని లేకుండా జోకొట్టి, అల్లాను అడ్డుపెట్టుకుని, తెల్లకుక్కలను కాపలా పెట్టుకుని, పెట్రోడాలర్ల సుఖాల డోలికల్లో తేలియాడుతూ, తమ జోలికి రాకుండా ఉగ్రవాదులకు వారి వంతు విరాళాలు రాలుస్తూ, పబ్బం గడువుకుంటున్న అరబ్బీ రాచకుటుంబాలు. 3. కాలం చెల్లిన కమ్యూనిస్టులు, ఏకప్రపంచానికి, నూతన సమాజానికి, సరిక్రొత్త నాగరకతకు వ్యతిరేకులు! ఎందుకంటే, ఈ భవిత విప్లవంలో వీరికి మనుగడ వుండదు. అనామకులుగా, గతకాలపు చెరిగిపోయిన గురుతులుగా పరిగణింపబడతారు! వారికి భవిష్యత్తు మీద నమ్మకం కంటే గత వైభవంపైనే మక్కువ ఎక్కువ! 4. సమాజాలను మూఢ నమ్మకాలతో, మత వంచనలతో తుప్పుపట్టిన మత గ్రంథాలతో తప్పుదోవ పట్టింపచూసే మతోన్మాదులు కూడా ఈ నవమానవ నాగరకతావిర్భావానికి వ్యతిరేకులే!

ఎన్ని అవరోధాలు ఉన్నా – ఎవ్వరు వ్యతిరేకించినా, భవిష్యత్కాలం ఏ ఒక్కరిసొత్తో కాజాలదు!

**గమనించ మనవి :** ఈ వ్యాసంలో కావాలనే గణాంక వివరాలు, సిద్ధాంత కర్తల వాద వివాదాలు, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వివిధ శాఖాపర ఆలోచనాసభల తీర్మానాలు, నానా గోష్ఠుల సంభాషణలను ఉటంకించలేదు. ఇవన్నీ చదివేందుకు ఆటంకాలే కాని, అసలు విషయానికి ఆసరాకాజాలవు.

**వల్లభనేని అశ్వినీకుమార్**
Author, Poet, Editor, Translator and Literary Curator
భాగ్యనగరం, ఫోన్ : 988 589 8585

# కిషినావ్ విశేషాలు

ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ



కిషినావ్ నగరం

ప్రపంచంలో చాలా మందికి, ఆ మాట కొస్తే చాలా మంది ఐరోపా వారికే మాల్డోవా తెలియదు. నిన్నా మొన్నటి వరకు, అంటే ఇక్కడకు వచ్చేవరకు నేను కూడా అంతే. కానీ ఇప్పుడు ఈ క్షణాన, మాల్డోవా రాజధాని కిషినావ్ వీధులలో.. అక్కడ ఒక్కరూ కూడా తెలియని నన్ను నేను చూసుకుంటే.. ఇది నిజమేనా? నేనెక్కడ ఉన్నాను? ఇక్కడ ఏమి చేస్తున్నాను? అనే ప్రశ్నలు నన్ను అధివాస్తవిక భావనలలోకి నెట్టాయి. వీటి ప్రవాహంలో తేలిపోతూనే నా హోటల్ చేరుకున్నాను.

హోటల్ కిషినావ్ చేరే సరికి రాత్రి 9.30 అయింది. సోవియట్ కాలపు భవనం ఇది. ఇంతకు ముందు కీవ్‌లో నేనున్న హోటల్ ఉక్రెయిన్‌తో పోలిస్తే దీని రేటు, సగమే. దీనిని బట్టే నాకు, మాల్డోవా కొంత బడ్జెట్‌కి లోబడి ఉంటుందనిపించింది. నేను వెళ్ళే సరికి, ఈ హోటల్ తలుపులు మూసి ఉన్నాయి. నేను బెల్ కొట్టటంతో యూనిఫార్మ్‌లో కాపలాదారులా ఉన్న ఒక వ్యక్తి, తలుపు తెరచి, నన్ను అక్కడ రిసెప్షన్ డెస్కు దగ్గర ఉన్న ఒకామె దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆమె కూడా చక్కని యూనిఫార్మ్‌లోనే ఉంది. హోటల్ సిబ్బందిని గుర్తు పట్టటానికి ఇది సులువైన మార్గం. ఆమె నాకు గది కేటాయించిన తరువాత, ఆ కాపలాదారుడే నాకు లిఫ్ట్ చూపించాడు. ఆ లిఫ్ట్ చాలా ఇరుకుగా ఉండి నన్ను పెట్టెలో మూసిపెట్టినట్లు అనిపించింది. అది చాలా పాతగా కూడా ఉంది. నా గది ఉన్న నాలుగవ అంతస్థులోకి అడుగు పెట్టగానే, ఆ నడవా చీకటిగా, ఇరుకుగా, ఎవరూ పట్టించుకోనట్లు కనిపించింది. అక్కడ వేసిన కార్పెట్ ఒక విధమైన చవుడు వాసన వస్తోంది. అవెప్పుడో, భూమి పుట్టినప్పుడు లేదా హోటల్ పెట్టినప్పుడు, కొన్ని దశాబ్దాల నాడు వేసి ఉంటారన్నట్లు ఉన్నాయి. బహుశా ఇవి కొన్ని వందల మంది సోవియట్ రెడ్ ఆర్మీ ఆఫీసర్లు, కమ్యూనిస్ట్ ఉన్నతాధికారుల బరువైన బూట్ల క్రింద నలిగి ఉండవచ్చు. ఇకపోతే నాగది కూడా ఇంతకంటే భిన్నంగా లేదు. అదే వాసన. నా చుట్టూ, నా నాసికా పుటాలలోకి దూరి పోయి నన్ను నిలకడగా ఉండనివ్వటం లేదు. ఇక్కడ ఎట్లా ఉండటం? అని దుగ్ధ మొదలయింది. సరిగ్గా అప్పుడే నేను ఈ హోటల్‌కు కట్టిన చార్జి గుర్తొచ్చి, దానికి ఇంత కాక మరేమి వస్తుంది? సోవియట్ కాలపు హోటల్‌లో ఉండటం అంటే ఇది కాక ఇంకేముంటుంది? ఇదంతా నేను కావాలనుకున్న అనుభవంలో భాగమే కదా అని నాకు నేనే సర్ది చెప్పుకున్నాను.

సరిగ్గా అప్పుడే నాకు మరో ఊహ కలిగింది. నేను చూస్తున్నది సోవియట్ తరం తాలూకు జీవన విధానపు నిజ స్వరూపమేమో!! ఒక పెద్ద నగర కేంద్రం, చూడటానికి వైభవంగా కనపడుతున్న బాహ్య స్వరూపం, యూనిఫార్మ్ వేసుకుని క్రమ శిక్షణతో ఉన్న సిబ్బంది.. దీని వెనుక చీకటి గదులు, దుస్సహమైన వాతావరణం.. లోప భూయిష్టమైన నిర్వహణ.. ఇదంతా సోవియట్ కాలంలోకి కిటికీ తెరచి చూపిస్తున్నట్లు అనిపించింది నాకు.

సోవియట్ యూనియన్ ఉచ్ఛదశలో ఉన్నప్పుడు, ప్రపంచానికి అది చూపించిన పగిలిన గాజుముక్కలతో తీర్చిదిద్దిన అందమైన రత్నాల రంగవల్లిని చూసి, ప్రపంచంలో చాలా భాగం ముచ్చట పడింది. దాని సైనిక శక్తి, అణ్వాయుధ సంపత్తి, వ్యోమ నౌకాలలో అంతరిక్ష విహారం, క్రీడా నైపుణ్యం.. వీటన్నిటిలో.. పాశ్చాత్య దేశాలకు తీసిపోని అభివృద్ధి. దీని వెనుక నెమ్మది నెమ్మదిగా, లోపల లోపలే బుగిలిపోయిన జీవన విధానం, నలిగి పోయిన వ్యక్తి స్వాతంత్ర్యం.. పైన పటారం, లోన లొటారం అన్నట్లయిన ఈ వ్యవస్థ మేడిపండు మెరుపు, 1990లలో మిఖాయెల్ గోర్బచేవ్ అన్యాపదేశంగా.. 'పెరెస్ట్రోయికా' (పునర్నిర్మాణం), 'గ్లాస్నోస్ట్' (పారదర్శకత) అంటూ బహిర్గతం చేసేవరకు ఎవరికీ తెలియలేదు. అటు తరువాత సువిశాల సోవియట్ యూనియన్ పేక మేడలా కూలిపోవటం మనం చూసిన నూతన శకపు చరిత్ర పుట. అట్లా కాకుండా, గోర్బచేవ్ ముందు దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేసి, అటు తరువాత రాజకీయ సంస్కరణలను సమయానుకూలంగా సమన్వయం చేసి ఉన్నట్లయితే, రష్యా సామ్రాజ్యం, పొరుగు దేశమైన కమ్యూనిస్టు చైనా మాదిరిగా, వెనుకటి సోవియట్ యూనియన్‌గా నిలబడి ఉండేదేమో!!

2019లో నేను ఇటలీ వెళ్ళినప్పుడు, నాకొక మాల్డోవా స్నేహితురాలు దొరికింది. ఆమె పేరు ులియ. ఇప్పుడు ఆమె దేశంలో ఉండి, అది కూడా మూడు రోజుల పాటు అక్కడ ఏమి చేయాలో, ఏమి చూడాలో ఇదమిత్థంగా తెలియని పరిస్థితిలో ఉండి, ఆమెను సంప్రదించకపోవటం ఏమిటనుకుని, ఆమెకు ఫోన్ చేశాను. ఆమె వెంటనే పలికి నాకు బోలెడన్ని సూచనలు ఇచ్చింది. ఉదయపు ఉపాహారం 'ప్లాసినై'.. ఇక్కడి సాంప్రదాయిక ఉపాహారం. ఛీజ్, సువాసన భరితమైన ఆకులు కలిపి నింపి, అధిక ఉష్ణోగ్రతలోఉంచి తయారుచేసిన పిండి దొప్పలు ఇవి. 'పై' అంటారు దీనిని. ఇవి చాలా రుచికరంగానూ, తృప్తికరంగా కూడా ఉన్నాయి.

నా హోటల్ ముందున్న ప్రాంతం లిబర్టీ స్క్వేర్. దాని మధ్యలో, నాజీ జర్మనీ నుండి కిషినావ్ విముక్తికి చిహ్నంగా సోవియట్ పద్ధతిలో నిర్మించిన ఒక స్మారక చిహ్నం ఉంది. దీని మీద ఒక చేయి చాచి, 'టైటానిక్' సినిమాలో 'కేట్ విన్స్లెట్'లా నిలుచున్న ఒక యువతి ఉంది. అందుకేనేమో, ఇటీవలి కాలంలో దీనిని 'టైటానిక్ మోన్యుమెంట్' అని పిలుస్తున్నారు. ఆమె వెనుక కరవాలం పట్టుకుని ఉన్న ఒక పురుషుడు, వీరి వెనుక ఒక ఎత్తైన నాలుగు పలకల స్తంభం ఆకాశాన్నంటుతూ ఉంది.

అక్కడక్కడే కొన్ని నేల లోపల వేసిన మార్గాలు దాటుకుంటూ నడిచాను. అవన్నీ కూడా బాగా పాతబడి పోయి ఉన్నాయి. కానీ అక్కడక్కడా గోడల మీద కొన్ని మంచి చిత్రాలు, కళాత్మకంగా గిలికిన చేతివ్రాతలు కనిపించాయి. నా దోవలో కొన్ని హుందా అయిన భవనాలు కూడా కనిపించాయి. సోవియట్ కాలపు పతకాలు, నాణాలు, జ్ఞాపికలు, కరెన్సీ నోట్లు, టి-షర్టు అమ్ముతున్న చిన్న చిన్న దుకాణాల మార్కెట్ కనపడింది. అక్కడున్నవి రెడ్ ఆర్మీ ఒకప్పుడు గర్వంగా ధరించిన పతకాలు. వీటిని అక్కడ కుప్పలు తెప్పలుగా అమ్ముతున్నారు. 'పతకం' ఏదో సాధించిన విజయగర్వానికి ప్రతీక. ఆ గర్వం మాసిపోయినప్పుడు ఆ పతకం ఉట్టి లోహపు ముక్క మాత్రమే. అవి నాకు అక్కడ కేవలం లోహపు ముక్కల లానే కనిపించాయి. అప్పటికి నేను తెచ్చుకున్న టి-షర్టులన్నీ వాడేశాను. క్రొత్తవి అవసరం. అక్కడ రెండు కొన్నాను. ఎరుపు రంగు షర్టు మీద కొడవలి-సుత్తి గుర్తు ఉంది. మరొక దాని మీద మాల్డోవా జాతీయ చిహ్నం ఉంది.

మాల్డోవా ఉక్రెయిన్, రుమేనియాల మధ్య ఉన్న, భూ పరివేష్టిత దేశం. జాతి లక్షణ పరంగా చూస్తే ఇక్కడి వారు, రుమేనియా వారిని పోలి ఉంటారు. చాలాకాలం పాటు ఇది రుమేనియాలో భాగంగానే ఉంది. ఐరోపాలో అతి పేద దేశంగా ఇది గుర్తించ బడింది. ఇక్కడికి వచ్చే సందర్శకులు చాలా తక్కువ. తండోప తండాలుగా యాత్రికులు వచ్చి పోయే ప్రాంతాలలో, ఆ ప్రాంతపు నిజరూపం అంతరించి పోతుంది. కానీ ఇక్కడ అటువంటి సమస్య లేదు. అరుదుగా వచ్చే నాలాంటి యాత్రికులు, ఈ దేశపు సహజ వ్యక్తిత్వాన్ని చూడవచ్చు. ఇక్కడి జన సంఖ్య మొత్తం మీద నాలుగు మిలియన్లు. ఇందులో 0.5 మిలియన్ ప్రజలు, దీని నుండి చీలిపోయిన ప్రాంతం.. 'ట్రాన్సినిస్ట్రియా' నివాసులు. ఇటు తరువాత నేను అక్కడికి వెళ్లాలనుకుంటున్నాను. కనీసం సగంమంది మాల్డోవా ప్రజలు, అంటే.. రెండు మిలియన్ల ప్రజలు విదేశాలకు తరలిపోయారు. వీరిలో సగం మంది రష్యాలో, మిగిలిన వారు, పశ్చిమ ఐరోపా, ఉత్తర అమెరికాలలో నివసిస్తున్నారు.

ఈ దేశమంతా కలిపి, మన హర్యానా రాష్ట్రమంత. యునైటెడ్ కింగ్డంలో భాగమైన వేల్స్‌కు 1.6 రెట్ల వైశాల్యం. యు.ఎస్.ఎ. లోని మేరిల్యాండ్, డెలావేర్‌లు కలిపినంత. ఈ దేశపు జాతీయ ఆదాయంలో 30%, విదేశాలలో నివసిస్తున్న మాల్డోవా దేశస్తులు, స్వదేశానికి పంపుకున్న సొమ్మేనట. ఇది తెలిసిన తరువాత, కిషినావ్‌లో కనిపించిన అసంఖ్యాక విదేశీ మారక ద్రవ్య సంస్థలు, విదేశీ ప్రయాణాల ఏర్పాట్లు చేసే సంస్థల అవసరం నాకు అర్థమయింది. అక్కడ నడుస్తున్నప్పుడు నాకొక టూరిస్ట్ సమాచార కేంద్రం కనిపించింది. అక్కడ 'ఉత్సాహం, ఆతిధ్యం.. మాల్డోవా జీవన పరమార్థం'.. అంటూ కనిపించిన నినాదం నన్ను ఆకట్టుకుంది. అక్కడ దీనిని బాగా ఆకళింపు చేసుకున్నట్లున్న ఇద్దరు యువతులు నవ్వు ముఖాలతో నన్ను పలకరించి, నాకు కాఫీ కూడా ఇవ్వబోయారు. సమాచార కేంద్రాలలో ఇటువంటి ఆహ్వానం నాకెప్పుడూ దొరకలేదు. ఆ రకంగా, ఆతిధ్యం విషయంలో ఈ ఆఫీసు ప్రపంచంలో నేను చూసిన వాటన్నిటిలో ప్రప్రథమంగా నిలుస్తుందని నాకనిపించింది. అక్కడ నేనొక్కడినే వారి అతిథిని. వారందరి సహకారం నాకొక్కడికే. అందరూ కలసి, తరువాత మూడు రోజులూ నేను చేయవలసినది, చూడవలసినదీ అంటూ బోలెడన్ని మ్యాప్‌లు, సమాచార కరపత్రాలు నాకు ఇచ్చారు.

వాళ్ళు సూచించిన అమెడెయస్ ట్రావెల్స్‌కు వెళ్ళి వాకబు చేస్తుండగానే, నా వెనుక ఇంగ్లీషు మాటలు వినిపించాయి. అక్కడ టోనీ అనే వ్యక్తి, ఈ దేశం ఉత్తర భాగానికి కారులో వెళ్ళాలని, ఖర్చు కలసి వస్తుందని తోడుగా ప్రయాణం చేసే వారికోసం చూస్తున్నాడని తెలిసింది. నేను దక్షిణం వైపున ఉన్న 'గగౌజియా' ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నాను. ఆ సంగతే అతనికి చెప్పాను. అతని హోటల్ వివరాలు నాకు ఇచ్చి, ఆ సాయంత్రం మళ్ళీ కలుసుకుని తరువాత కార్యక్రమం గురించి మాట్లాడుకుందామని అన్నాడు టోనీ.

ముందు రోజు రాత్రి, రైలు స్టేషను నుండి నా హోటల్ చేరుకోవటానికి సహాయం చేసిన ఒక వ్యక్తి, అహ్మద్ నవాజ్. అతను పాకిస్తానీయుడు. అతను అనుకోకుండా మళ్ళీ ఇప్పుడు తారసపడ్డాడు. అతను 'ట్రేడిజమ్' అనే పేరుతో ట్రావెల్ ఏజెన్సీని, కిషినావ్ కేంద్రంగా నడుపుతాడట. దీనికి కువాయిట్లో ఒక శాఖ కూడా ఉందట. 'మా ఆఫీసుకు వచ్చి ఒక కప్పు టీ త్రాగి వెళ్ళండి' అంటూ అతను నన్ను ఆహ్వానించాడు. అక్కడికి అతని ఆఫీసు అర కి. మీ. దూరం. అతని భార్య, స్థానిక మాల్డోవా మహిళ. గత 6 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాడట. వ్యాపారం బాగా నడుస్తుందని చెప్పాడు. 'నాకు ఇక్కడ ఎవరైనా మంచి గైడు దొరుకుతారా?' అని అడిగినప్పుడు అహ్మద్ వెంటనే, అతని స్నేహితురాలు ఆనా మరియాను సూచించాడు. ఆమె కోసం చూస్తున్న సమయంలో, నేను 2004లో లాహోర్ వెళ్లానని అతనితో చెప్పాను. లాహోర్ అతని స్వస్థలమట. సొంతూరు ప్రస్తావన వచ్చినప్పుడు హుషారు రాని వారుండరు కదా! లాహోర్‌లో అతని జీవితం, అతని చిన్ననాటి జ్ఞాపకాలు, అనుభవాలు ఇవన్నీ వింటుంటే సమయం తెలియలేదు. అక్కడ పని చేసే వారు నాకు మంచి టీ తో పాటు, బిస్కెట్లు కూడా ఇచ్చారు. కాసేపట్లో ఆనా మరియా తన 7 నెలల పసి బిడ్డతో సహా వచ్చింది. ముందు, నగరం వెలుపల ఉన్న వైన్ తయారీ నుండి టూర్ మొదలుపెడదామని ఆమె సూచించింది. అహ్మద్ టాక్సీ మాట్లాడటంతో పాటు, తినటానికి సాండ్విచ్ కూడా ఏర్పాటు చేశాడు. అవి తీసుకోవటానికి నేను సంశయించటం చూసి, నా చేతిలో ఒక చల్లని మంచి నీళ్ళ బాటిల్ కూడా పెట్టి, మళ్ళీ వైనరీకి వెళ్ళేవరకు, తినటానికి ఏమీ దొరకదని చెపుతూ, దోవలో టాక్సీలోనే వాటిని తినేస్తే మంచిదని సలహా ఇచ్చాడు. అతని సహాయానికి, ఆతిధ్యానికి సరితూగే కృతజ్ఞతలు నేను తెలుపుకోలేకపోయాను.

ఏదో ఒక వైన్ తయారీ కేంద్రాన్ని చూడకపోతే మాల్డోవా చూసినట్లు కాదట. నేను ఎంచుకున్న వైనరీ 'మిలెస్టీమికి'. ఇది నగరానికి దక్షిణాన 20 కి. మీ. దూరంలో ఉంది. టాక్సీలో 30 నిముషాల ప్రయాణం. ఆనా మరియా ఈ టూర్‌ను చక్కగా ఏర్పాటు చేసింది. చిన్న బేబీ ఉండటం వలన, ఆమె నాతో పాటు లోపలకు రాలేక పోయింది.

ఇక్కడ నేను చూసిన వైన్ తయారీ, నిలువ, పంపకం చేసే విధానం ఒక అద్భుతం. ఇక్కడున్న నేల మాళిగ, భూగర్భంలో సంవత్సరాల తరబడి సున్నపు రాయిని త్రవ్వి, తొలగించి ఏర్పాటు చేసిన పెద్ద సొరంగంలో భాగం. సుమారు 200 కి. మీ. పొడవున్న ఈ సొరంగ మార్గాన్ని

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కిషినావ్‌ను పునర్నిర్మించటానికి కూడా ఉపయోగించుకున్నారు. 1969లో ఈ సొరంగ అంతర్భాగంలో నిరంతరం 12 నుండి 14 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 85% నుండి 90% తేమ ఉండటం వలన, వైన్ నిలవ బెట్టటానికి అనుకూలంగా ఉంటాయని గమనించి, దాదాపు 55 కి.మీ. పొడవున్న సొరంగాలను ద్రాక్షాసవం నిలవ బెట్టటానికి ఉపయోగిస్తున్నారు.

మిలెస్టీ మికి కూడా ఈ క్రమంలో ఏర్పడిన వైనరీయే. ఇక్కడ దాదాపు రెండు మిలియన్ల వైన్ సీసాలు నిలవ చేస్తారు. ప్రపంచంలోనే అతి పెద్ద వైన్ తయారీ కేంద్రంగా ఇది, గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. దీని నేల మాళిగలలో 2000 ఓక్ బారెళ్ళు (ఒకబారెల్=7000 లీటర్లు), ఇంకా 1500 స్టీల్ టాంకులు (ఒకటాంకు= 20000 లీటర్లు) కూడా ఉన్నాయి. ఇదొక వైన్ రిజర్వాయర్‌లా ఉంది. ఇక్కడున్న వైన్, ఈ ఖండం మొత్తంలో ఉన్న ప్రజల వైన్ దాహాన్ని కొన్ని సంవత్సరాల పాటు తీర్చగలదని నాకనిపించింది.

నా టాక్సీ కూడా, అక్కడ కొలువు తీరి ఉన్న ఎన్నో వాహనాలతో పాటు, ఒక గైడ్ ఆధ్వర్యంలో ఆ సొరంగంలో ఉన్న పక్కా తారురోడ్ల మీద వెళుతూ ఉంది. అక్కడక్కడా ఆసక్తి కరంగా ఉన్న చోట్లలో ఆగి చూడటానికి వీలు చేశారు. చివరకు వెళ్ళాక, అక్కడ ఉన్న వైన్ బార్‌లో మాకందరికీ, మాల్డోవా వైన్ల రుచి చూపించారు. ఈ ప్రయాణంలో నేను మాల్డోవా వైన్ల గురించి చాలా క్రొత్త విషయాలు తెలుసుకోగలిగాను. మాల్డోవాలో 10% ఉద్యోగస్తులు వైన్ పరిశ్రమలో పనిచేస్తారట. జాతీయ ఆదాయంలో 15% కూడా ఈ పరిశ్రమ నుండే వస్తుందట. దేశపు భూభాగంలో ఎక్కువ శాతం ద్రాక్ష తోటలకు కేటాయించటంలో కూడా మాల్డోవా, ప్రపంచ దేశాలన్నిటి కన్నా ముందు ఉందట. ఎక్కడైనా జాతీయ వైన్ దినోత్సవం జరిగి, ఆరోజును శెలవు దినంగా ప్రకటిస్తారంటే.. అది మాల్డోవా ఒక్కటే కావచ్చు. ఇక్కడ 'వైన్ రన్' ఒక వినోద క్రీడ. మాల్డోవాలో సుమారు 1000 రకాల వైన్లు తయారవుతాయట. సరాసరిన ఒక్కొక్కరు తీసుకునే ఆల్కహాల్ లెక్కలో, ముందుండే దేశాలలో మాల్డోవా కూడ ఉంటుంది. ఇక్కడ సరాసరిన ఒక్కొక్కరు సంవత్సరానికి 15.2 లీటర్ల ఆల్కహాల్ తీసుకుంటారు. ఇదే ఐరోపాలో అయితే 8.9 లీటర్లు. దీనితో పాటు, ఆల్కహాల్ ప్రభావం వలన జరిగిన ప్రమాదాల లెక్కలో కూడా ఇది ముందే. ఇక్కడ ప్రతి నాలుగు ప్రమాదాలలో ఒకటి, మితిమీరి తీసుకున్న ఆల్కహాల్ వలనే. ప్రపంచంలో సరాసరిన ...ప్రతి 20 ప్రమాదాలలో ఒకటి మాత్రమే ఆల్కహాల్ వలన జరిగినట్లు లెక్క ఉంది. అనాది నుండీ వైన్ తయారు చేస్తున్న దేశాలలో మాల్డోవా ఒకటి. మాల్డోవా, దీనితో పాటు అప్పట్లో మరొక సోవియట్ రిపబ్లిక్‌గా ఉన్న జార్జియా దేశాల వైన్ అన్ని మాజీ సోవియట్ యూనియన్ రిపబ్లిక్కులలోనూ ప్రాచుర్యం పొందాయి. మాల్డోవాలో ఉన్న మరొక ప్రసిద్ధ వైనరీ 'క్రికోవా'. ప్రపంచంలోని అతి పెద్ద వైనరీలలో 'మిలెస్టీ మికి' తరువాత ఇది రెండవ స్థానంలో ఉంది.

వైనరీల వైనం తలకెక్కడం పూర్తయ్యాక, ఆనా మరియాతో పాటు నగరానికి తిరుగు ప్రయాణమయ్యాను. దోవలో ఆనా మరియా 'టీచర్' అని తెలిసింది. అప్పుడప్పుడూ, ఇట్లా టూర్లు నిర్వహించడం ఆమె ఇష్టంగా చేసే పని అట. మాల్డోవాలో వైన్‌ను పవిత్ర జలంగా భావిస్తారని ఆనా చెప్పింది. దానికి రోగాలను తగ్గించే శక్తి ఉందని నమ్ముతారట కూడా. పిల్లలకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు, వైద్యుడి దగ్గరకు వెళ్ళే ముందు కొంచెం వైన్ ఇచ్చి, తగ్గుతుందేమోనని చూస్తారట. ప్రతి కుటుంబం, వారి అవసరాలకు సంవత్సరమంతా సరిపోయే వైన్ తయారుచేసుకుని నిలవ బెట్టుకుంటారని ఆనా చెప్పింది. ముఖ్యంగా గ్రామాలలో, ఇళ్ల వెనుక పెరటిలో ద్రాక్ష తీగెలను పెంచుకుని, వైన్ తయారు చేసుకునే సంప్రదాయం పాటిస్తారట. ఇంకా వీరు పట్టణాలలో ఉన్న బంధు మిత్రులకు కూడా ఇంటి వైన్ పంపిస్తారట. ఇది విన్నప్పుడు మన ఊళ్ళలో ఊరగాయ పచ్చళ్లు చేయటం, పట్నాలలో ఉన్న బంధువులకు పంపటం గుర్తొచ్చింది.

కాసేపటికి మా టాక్సీ డ్రైవరు ఆనాతో ఏదో చెప్పి నవ్వటం చూశాను. నా ముఖంలో ప్రశ్నార్థకం చూసిన ఆనా, అతను అక్కడ మేము అప్పుడే దాటిన పిచ్చాసుపత్రి గురించి చెప్పి నవ్వుతున్నాడని చెప్పింది. అక్కడి రోగులను గాని, డాక్టర్లను గాని తరచుగా నీ టాక్సీలో ఎక్కించుకుంటావా?

అని అతనిని అడిగాను. ఆనా మా ఇద్దరి మధ్యా సంభాషణ సాగేందుకు సహాయం చేస్తోంది. డ్రైవరు మళ్ళీ గట్టిగా నవ్వి, 'ఆ పిచ్చి ప్రపంచం నుండి నేనెప్పుడూ ఎవరినీ ఎక్కించుకోను' అని చెప్పాడు. ఆ నవ్వులో కొంచెం హేళన మిళితమై ఉండటం నేను గమనించాను. కానీ ఏమీ గమనించనట్లు, 'అయితే ఇప్పుడు ఎక్కించుకున్నావు' అంటూ, నా వృత్తి వివరం చెప్పాను. వెంటనే అతని ముఖంలో నవ్వు మాయమయింది. నాకు ఇటువంటి సందర్భాలు కొత్త కాదు. ఈ ప్రపంచమంతటిలో సామాన్య జనానీకంలో మానసిక రుగ్మత అంటే చాలా హేళన. అప్రతిష్ట. దీనిని ఒక రుగ్మతగా గుర్తించి, వైద్యుల సహకారం కోరటానికి కూడా చాలా సమయం, సంయమనం కావాలి. దీని తరువాత కారులో వాతావరణం కొంత గంభీరంగా, భారంగా మారింది. దీనిని కొంచెం తేలిక పరచటానికి, 'నన్ను నాలుగు గంటలు చూసిన తరువాత పిచ్చి డాక్టర్లు కూడా ఫరవాలేదనిపిస్తోందా మరి?' అని నవ్వుతూ అడిగాను. అతను సన్నని నవ్వుతో తల ఊపాడు.

దోవ పొడుగునా ఆనా మరియూ ఎన్నో కబుర్లు చెపుతూనే ఉంది. రెండు సంవత్సరాల క్రిందట ఆమె గ్రీసు దేశంలో, విహారానికి వెళ్ళి అక్కడ ఒక రెస్టారెంట్‌లో చిరు ఉద్యోగం చేస్తుండగా, అక్కడికి విచ్చేసిన మాల్డోవా ప్రెసిడెంట్, ఐగర్ డోడోన్‌కు సేవలు అందించిందట. ఆమె మాల్డోవా నుండి వచ్చిందని తెలుసుకుని, అతని కోసం వెంట తెచ్చుకున్న, అతి ప్రాచీనమైన మాల్డోవా వైన్ సీసాను ఆమెకు ఇచ్చాడుట. అది ఆమెకు మరపు రాని అనుభవం. ఆ వైన్ ఆమె వద్ద ఇంకా ఉందట. ప్రత్యేక సందర్భాలలో మాత్రమే దానిని బయటకు తీస్తుందట.

మాల్డోవా ఐరోపా కూటమి వైపు నిలబడుతుందా లేక రష్యాతో సఖ్యంగా ఉంటుందా? అని ఆనాను అడిగాను. పాశ్చాత్య దేశాల పట్ల కూరిమి చూపించినప్పటికీ, పొరుగున ఉన్న శక్తివంతమైన రష్యాతో కూడా మాల్డోవా సంఘీభావం చూపుతుందని, రష్యాకు అంగీకారం కాని పనులేవీ చేయదని ఆమె చెప్పింది. 14వ రష్యన్ సైనికదళం, మాల్డోవా విడి భాగమైన ట్రాన్సినిస్ట్రియాలో ఉంది. పైగా మాల్డోవా ఉత్పత్తులకు, ముఖ్యంగా మాల్డోవా వైన్‌కు రష్యా చాలా మంచి మార్కెట్. విక్రయశాల. ఆనా



షెటఫెన్ చెల్ మారె

చెప్పిన మరొక విశేషం, మాల్డోవా ప్రెసిడెంట్, ప్రధాన మంత్రులలో ఒకరు రష్యాతో సఖ్యంగా ఉంటే, సమతూకం కోసం మరొకరు పాశ్చాత్య దేశాలతో మిత్రుత్వం గరపుతారట.

అటు తరువాత ఆనా నాకు, పెద్ద శిలువ పట్టుకుని ఉన్న 'షెటఫెన్ చెల్ మారె' (స్టీఫెన్ ది గ్రేట్) విగ్రహం చూపించింది. ఇతడు మాల్డోవా గౌరవించుకునే జాతీయ నాయకుడు. చాలా కాలం వరకు నాకు, అలెగ్జాండర్ ది గ్రేట్, అశోక ది గ్రేట్, సైరస్ ది గ్రేట్..,వీళ్ళు అందరికీ తెలుసు. కానీ ఎంత చిన్న దేశమైనా దానికి ఎనలేని సేవలందించిన మహనీయులను గుర్తుపెట్టుకుంటుంది. ఈ విషయాన్ని నా ప్రయాణాలే నాకు తెలిపాయి. ప్రయాణాలు చేసిన కొద్దీ మనకు తెలిసినది ఆవగింజంత, తెలుసుకోవలసినది కొండంత అని తెలుస్తుంది. ప్రయాణం మనకు వినయం నేర్పుతుంది. క్రొత్త ప్రపంచపు ద్వారాలు తెరుస్తుంది. పెద్ద పెద్ద దేశాలలో మహా నాయకులుగా గుర్తించ బడిన వారు చేసిన త్యాగాల గురించి ప్రపంచమంతా తెలుస్తుంది. కానీ మనకు తెలియని స్థానిక హీరోలు ఎందరో!!

*(ఇంకొన్ని విశేషలు... వివరంగా వచ్చే సంచికలో)*

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనునాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com



భర్తృహరి.



# హెచ్చరిక

**– ఆచార్య పి.ఆర్. హరినాథ్**

**మంత్రాంగం** సరిగ్గా లేకపోతే మహీపతి మట్టిపాలవుతాడు. మహా సామ్రాజ్యాలు మచ్చుకు కూడా మిగలకుండా పోతాయి. ఏదైనా అంతే. ఒక వ్యూహం లేకుండా, ఒక పద్ధతి లేడకుండా ఉంటే అన్నీ నశిస్తాయి. మిత్రలాభం, మిత్రభేదం, సంధి, విగ్రహము వంటి పంచతంత్రాలు మంత్రాంగాల్లో ఒక విధానం. విష్ణుశర్మ కూడా రాజకుమారులను బుద్ధిమంతులుగా చేయడానికి హితోపదేశం మూలంగా పంచతంత్రాన్ని నేర్పాడు. ఊరినేలే రాజుకు కూడా ఈ ఉపాయాలు ఉత్తేజాన్నిస్తాయి. గతి తప్పి ప్రవర్తిస్తే గతులు లేకుండా పోతాయి. నిర్వహణ సక్రమంగా లేకపోతే శత్రువులు అవలీలగా ప్రవేశించి ఆ రాజ్యాన్ని దోచుకుంటారు, ఆక్రమించుకుంటారు. దేనివల్ల ఏది చెడిపోతుంది అని వివరంగా చెబుతూ మహా దార్శనికుడు భర్తృహరి అంటున్నాడు.

**దౌర్మంత్ర్యా న్నృపతి ర్వినశ్యతి యతి స్సంగాత్సుతో లాలనాత్**
**విప్రోనధ్యయనాత్ కులం కుతనయాత్ శీలం ఖలోపాసనాత్**
**హ్రీ ర్మద్యా దనవేక్షణాదపి కృషిః స్నేహః ప్రవాసాశ్రయాత్**
**మైత్రీ చాప్రణయా త్సమృద్ధి రనయా త్త్యాగాత్ప్రమాదా ద్ధనం**

ఈ విషయాన్ని వివరిస్తూ మొదట్లోనే 'దౌర్మంత్ర్యాత్' అనడం చేత–మంత్రాంగం ఒక్కటే కాదు, దుష్టుడైన మంత్రి వల్ల– అని కూడా ఇంకో అర్థం. దండించాల్సిన మంత్రులను దండించకుండా వాళ్ళను వెనకేసుకొని రావడం వల్ల కూడా రాజు నశిస్తాడు. మంత్రి అంటే రాజుకు మూడవ కన్ను లాగా ఉండాలి. తప్పుడు సలహాల నిచ్చి ముప్పులలో ముంచరాదు. శత్రువు బలం ఏమిటో, బలహీనతలు ఏమిటో తెలుసుకుని రాజ్యాన్నీ, రణాన్నీ నడపాలి. ముందు ఆలోచన లేకుండా తొందరపడి దూకరాదు. ఎంత కష్ట పరిస్థితి వచ్చినా స్వామి భక్తిని, దేశ భక్తిని వీడరాదు. అలా కాకుండా డబ్బు కోసం నానా గడ్డి కరచి, శత్రువుల వైపు సహాయం అందించే దుర్మార్గపు మంత్రి రాజు నాశనానికి కారకుడవుతాడు.

అలాగే–గుంపుతో చేరడం చేత, సాంగత్యం చేత యతి నశిస్తున్నాడు. సంగం చేత సన్యాసి చెడిపోతాడు. అతిగా బుజ్జగించడం, లాలన చేయడం వల్ల 'మన వాడే మన బుజ్జే' అని గారాబం చేయడం వల్ల పిల్లలు చెడిపోతారు. పాత కాలపు నీతి కథ ఒకటి ఉంది. ఒక అబ్బాయి తోటకూరను దొంగిలించి తెచ్చాడు. ఆ అబ్బాయి అమ్మ పిల్లవాడిని మెచ్చుకుంది. వాడు క్రమంగా చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డాడు.

ఒకానొకసారి ఒక పెద్ద దొంగతనం చేసి కారాగారంలో బంధీ అయ్యాడు. అబ్బాయిని చూడడానికి అమ్మ వచ్చింది. కన్నీళ్ళు పెట్టుకుంది. వాడు–'ఒక రహస్యం చెప్పాలి దగ్గరకు రా' అన్నాడు. ఆమె కటకటాల దగ్గరకు వచ్చి వానికి దగ్గరగా చెవి చేర్చింది. వాడు ఆమె చెవిని గట్టిగా కొరికాడు. ఆమె 'కెవ్వుకెవ్వు' మని గావుకేకలు పెట్టింది "తోటకూర నాడే నన్ను మందలించి ఉంటే ఇంత దూరం రాదు కదా" అన్నాడు. ప్రాచీన సూక్తులు కూడా ఇదే చెప్పాయి.'లాలనాత్ బహవో దోషాత్' అన్నారు. లాలించడం వల్ల దోషాలు ఎక్కువగా ఉన్నాయి. దండించడం వల్ల గుణాలు ఎక్కువగా ఉన్నాయి. అందుచేత పుత్రుడినైనా,

శిష్యుడినైనా దండించాలి. వాళ్ళు ఒక స్థాయికి వచ్చిన తర్వాత మిత్రులలాగా చేరదీసి సలహాల నివ్వాలి-అని ఒక సూత్రం ఉంది.

విప్రుడు-అంటే పండితుడు-ఎప్పటికప్పుడు చదువుకోకపోవడం చేత చెడిపోతూ ఉన్నాడు. అధ్యయనం అంటే వివేచనతో చదువుకోవడం. లోతుగా పరిశీలించి గ్రహించడం. ఎవరికైనా కూడా జ్ఞాన నిర్దేశం చేసేవారు చెప్పిన దాన్ని ఊరంతా వింటుంది. ఆ ఊరి బాధ్యత తన మాటల మీద ఉంది కాబట్టి, నిరంతరం నిప్పును రాజేసినట్లు జ్ఞానాగ్నిని ప్రజ్వలింప జేసుకోవాలి. దానికి అధ్యయనం ఒక ఉత్తమ మార్గం. అలా చేయక 'తెలిసిందే సర్వస్వం' అని భావిస్తే అనధ్యయనంతో పండితుడు చెడిపోతాడు.

'స్వాధ్యాయ న ప్రమదితవ్యం'--'నిరంతరం చదువుకోవడంలో ఏమరుపాటు పడకు'-అని తైత్తిరీయ ఉపనిషత్తు కూడా దీని గురించే హెచ్చరించింది. అలాగే-దుష్టుడైన కొడుకు చేత వంశం చెడిపోతుంది. కొడుకైనా, కూతురైనా తప్పు చేస్తే మొత్తం ఆ వంశం గురించే చెప్పుకుంటారు. 'ఆ వంశం వాళ్ళంతా ఇంతే' అన్నట్టుగా ఒక ముద్ర పడిపోతుంది. ఎలాగైతే ఒక చిన్న నిప్పు రవ్వ ఎండిపోయిన గడ్డిలో చేరితే గడ్డి మొత్తం తగలబడి పోతుందో, తొర్రలో అగ్ని చేరితే నిట్ట నిలువుగాచెట్టు ఎలా తగలబడిపోతుందో, అలా కులంలో దుర్మార్గ సంతతి పుట్టినప్పుడు కులం చెడిపోతుంది. కులానికి మచ్చ వస్తుంది-ఒక దుర్యోధనునితో మొత్తం కౌరవులకే అపఖ్యాతి వచ్చినట్లు.

శీలం అంటే స్వభావం. ఈ మాటను మంచి స్వభావం అనే అర్థంలోనే ప్రయోగిస్తారు. శీలవంతుడు, శీలవతి వంటి మాటలు విలువైన వ్యక్తిత్వ స్ఫోరకాలు. ఎవరూ చూడనప్పుడు, ఎవరి పర్యవేక్షణ లేనప్పుడు మనుషులు ఎలా ప్రవర్తిస్తారో ఆ ప్రవర్తనకు శీలం అని పేరు. ఒకరు చూసేలాగా ప్రవర్తిస్తే అది నటన. ఎవరూ చూడడం లేదు అని తెలిసి కూడా మనుషులు తమ ఏ అంతర్గత స్వభావాన్ని స్పష్టంగా ప్రకటిస్తారో అది శీలం. ఏమి కోల్పోయినా తిరిగి పొందవచ్చు. కానీ సచ్ఛీలాన్ని కోల్పోరాదు. దుర్జనులను సేవించడం వల్ల ఆ శీలం చెడిపోతుంది. అలాగే సిగ్గు అన్నది ఒక గొప్ప ఆభరణం.' సిగ్గే సింగారమంద్రు' అన్నాడు సుమతీ శతకకారుడు. అలాంటి అందమైన సిగ్గు-హ్రీ. ఏది సమాజానికి రోత పుట్టిస్తుందో, నీతి మాలినది అనిపిస్తుందో, దేనిని చేస్తే జనం ఛీత్కరిస్తారో దానిని చేయడానికి వెనకాడితే అది సిగ్గు. దాన్ని లజ్జ అంటాం. 'ఆ పని చేయడానికి నాకు సిగ్గవుతుంది' అంటాం-ఎందుకు సిగ్గు? అది నీతి మాలింది కాబట్టి, రోత పుట్టించేది కాబట్టి, సమాజానికి వ్యతిరేకమైనది కాబట్టి. అలా ప్రవర్తించకుండా ఉండడం అలాంటి పరిస్థితుల్లో పక్కకు తొలగడం సంస్కార లక్షణం. ఈ సిగ్గు, లజ్జ అన్నవి రెండూ మద్య పానం చేత మాసిపోతాయి. తాగుబోతులు ఏమి మాట్లాడుతారో తెలియదు, ఎక్కడ పడిపోతారో తెలియదు, ఒంటి మీద బట్టలు ఉన్నాయో, నగ్నంగా ఉన్నారో కూడా తెలియదు. పది మంది తమను చూస్తున్నారా లేదా కూడా తెలియదు. తాము నోటికొచ్చినట్టు ఏమేమి వదరుతున్నారో కూడా తెలియదు. అవన్నీ సిగ్గు కలిగించే వ్యవహారాలు. ఈ సిగ్గు అన్నది మద్యం వల్ల చెడిపోతోంది. అంటే మద్యపానం వల్ల మనిషి రోత పుట్టించేలాగా ప్రవర్తిస్తున్నాడు.

వ్యవసాయం అన్నది పర్యవేక్షణ చేయనందువల్ల చెడిపోతుంది. ఆ వ్యవసాయం ఏదైనా కావచ్చు. అది సాహితీ వ్యవసాయం కావచ్చు, లేదా ఫల వ్యవసాయం కావచ్చు, సస్య వ్యవసాయం కావచ్చు, ధన వ్యవసాయం కావచ్చు. దేనిని పండించడానికి కృషి చేస్తున్నామో అది వ్యవసాయం. ఆ వ్యవసాయాన్ని పదే పదే గమనించుకోక పోవడం చేత మొత్తం కృషి చెడిపోతోంది. ఎప్పటికప్పుడు కలుపు ఏరేయడం, నీటి పాయలను సవరించుకోవడం, నీరు అందజేసే కాలువల్లో పూడికలు తీయడం, రాళ్ళ వంటివి ఏవైనా ఆటంకాలు ఉంటే అడ్డు తొలగించడం-ఇవి ఎలాగైతే సస్య క్షేత్రానికి అవసరమో, తదితర క్షేత్రాలకు కూడా ఇవన్నీ అవసరం. ఎప్పటికప్పుడు దాన్ని పర్యవేక్షించు కోకపోతే మొత్తం కృషి చెడిపోతుంది.

అలాగే స్నేహం అన్నది-ప్రవాసంవల్ల-అంటే దూరంగా ఉండడంవల్ల-చెడిపోతుంది. దేశాంతరాన్ని 'ప్రవాసం' అంటారు. స్నేహమంటే భార్య, భర్త, పిల్లలు, బంధువులు , సోదరులు, పనివాళ్లు ఇలాంటి వారి మీద ఉండే ప్రేమను స్నేహం అని వ్యవహరిస్తారు. వీళ్ళందరినీ విడిచి ఎక్కడో కొన్నేళ్ళపాటు గడిపితే, క్రమంగా వారి

మీద ప్రేమ సన్నగిల్లి, మాయమైపోతుంది. విదేశాలలో స్థిరపడిన వారు తమ సమీప బంధువుల చివరి చూపులకు కూడా రాకపోవడం ఆధునిక జీవితంలో ఒక సాధారణ దృశ్యం అయిందికదా. మైత్రి అంటే మిత్ర భావం, సఖ్యత. ఈ సఖ్యత–ప్రేమ లేకపోవడం చేత చెడిపోతుంది. మిత్ర భావానికి అనురాగం అనేది అవసరం. అనుమానము, హేళన, వెటకారం వంటివి ఉన్న చోట మైత్రి ఉండదు. ప్రేమ, అభిమానాలు లేనప్పుడు మైత్రి నశిస్తుంది. అలాగే, నీతి లేకపోతే సంపద చెడిపోతుంది. నీతిగా, పద్ధతిగా ఉన్నప్పుడు తన దగ్గర ఉన్న సంపదనిలకడగా ఉంటుంది. అలా కాకుండా దుర్మార్గులకు, దుష్టులకు ఆశ్రయం కలిగించినప్పుడు, దుష్టబుద్ధిని మనసులోకి ఆహ్వానించినప్పుడు సంపద పోతుంది. ధనం అన్నది దానాల వల్ల లేదా నిర్లక్ష్యం చేయడం వల్ల నశించిపోతుంది. తెలుగులో దీన్ని అందంగా చెప్పాడు ఏనుగు లక్ష్మణ కవి.

**యతి సంగంబున బాలు దాదరముచే జ్యాభర్త దుర్మంత్రిచే**
**శ్రుతిహానిన్ ద్విజు దన్వయంబు ఖలుచే గ్రూరాప్తిచే శీలము**
**ధ్ధతి చే మిత్రత చూపు లేమి కృషి మద్యప్రాప్తిచే సిగ్గు దు**
**ర్మతిచే సంపదలున్ నశించు జెడు నర్థంబుల్ ప్రమాదంబునన్**

ఒకానొక కాలంలో టిబెట్ పర్వత సానువుల్లో, నిశ్శబ్ద వాతావరణంలో ఒక సన్యాసి ఒంటరిగా ఆశ్రమంలో ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. ఆయన ఎవరితోనూ మాట్లాడడు. ఎవరినీ కలవడు. తన లోకం తనది. తన సాధన తనది. కాలక్రమేణా ధ్యానం సజావుగా సాగుతూంది. అలాంటి రోజుల్లో ఒక బాటసారి అటుగా వచ్చి ఆశ్రమం ప్రవేశించాడు. సన్యాసి కనబడగానే బాటసారి సాగిలబడి మొక్కాడు. 'దగ్గరే ఉన్న పల్లె నుంచి వస్తున్నా'నని చెప్పాడు. ఆ యోగి అతడి గురించి అడిగాడు. అతని కుటుంబ వివరాలు కనుక్కున్నాడు. సన్యాసితో అతడి బాధలేవో చెప్పుకున్నాడు. ఆశీర్వదించమన్నాడు. సన్యాసి దీవించి పంపాడు. ఆ తర్వాత మరో రెండు రోజులకు అతనితో పాటు కొందరు వచ్చి సన్యాసికి మొక్కారు. పూలూ పళ్ళు తెచ్చేవారు. ఇలా ఓ రెండు నెలలు గడిచే సరికి పల్లె వాళ్ళు రోజూ రావడం, ఆ సన్యాసి వారితో మాటాడుతూ కూచోవడం ఇలా కాలం గడిచిపోయేది. ఆయన మాటలకు వాళ్లంతా మురిసిపోయేవారు. వారి ప్రశంసలకు సన్యాసి ఆనందించే వాడు. ధ్యానాలలో సాధనలలో వెనకబడ్డాడు. తెల్లవారగానే ధ్యానానికి కూర్చోవడం మానేసి, "ఈరోజు ఎవరొస్తారో?" అని ఎదురు చూడసాగాడు. వాళ్ళు రాకపోతే దిగులు పడేవాడు. క్రమేణా అతని మాటల్లో పవిత్రత పోయింది. లాలస పెరిగింది. తత్త్వం అడుగంటింది. తపన మొదలయ్యింది. కళ్ళలో ఆధ్యాత్మికత మాయమైంది. ప్రశంసల కోసం ఆరాటపడే మనస్సు ప్రశాంతతకు దూరమవుతుంది.

ఆ సన్యాసి జన సాంగత్యాన్ని కోరుకున్నాడు. వారి మాటలు, పొగడ్తలు ఆయనను క్రమంగా ధ్యాన సాధన నుంచి దారి మళ్ళించాయి. ప్రాపంచిక విషయాలలో పడి పతనమై పోయాడు . పల్లె వారికి ఆయన మీద నమ్మకం పోయింది. రావడం మానేశారు. ధ్యానాలు చెడి మర్యాద కోల్పోయి సన్యాసి భ్రష్టుడయినాడు. 'ఒక మెట్టు దిగితే ఏమవుతుంది లే' అనిపిస్తుంది. కానీ అవి జారుడు మెట్లు. జాగ్రత్త పడాల్సింది ఇక్కడే.

లోకానికి సేవ చేయడం మంచిదే. కానీ ఆ సంగత్వంలో పడిపోరాదు, చెడిపోరాదు. భగవద్గీతలో కూడా ఇదే అంశాన్ని చెప్పాడు శ్రీ కృష్ణుడు. మొదటగా ఊరికే అలా కలుద్దాం అనిపిస్తుంది. ఆ కలయికలో నుంచి ఒక కోరిక పుడుతుంది. ఆ కోరిక నెరవేరాలని ఆశతో కోపం వస్తుంది. ఆ కోపం ఒక మైకంలో పడవేస్తుంది. దానితో బుద్ధి సక్రమంగా పనిచేయదు. ఫలితంగా మనిషి నశించడం జరుగుతుంది. కవి చెప్పిన అంశాలు వట్టి ఉదాహరణలు కాదు. జీవితానికి ఒక క్రమశిక్షణ ఉండడం, నీతిగా జీవించడం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం, బంధు మిత్రుల పట్ల, తల్లితండ్రుల పట్ల ప్రేమాభిమానాలను కలిగి ఉండడం – ఇవన్నీ జీవన విలువలు. వాటిని కోల్పోరాదు. ఇది ప్రతి ఒక్కరికీ కవిచేస్తున్న సుకుమారమైన హెచ్చరిక.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 948 044 3108

# పైరసీ - సముద్రపు దొంగలు

**- చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్**

*(మూడవ భాగం)*

**దక్షిణ ఆసియా :** దక్షిణ ఆసియా అంటే భారత ఉపఖండం లేదా అఖండభారతంను వుద్దేశించి వాడే పదశ్రేణి. ఈనాటి పాకిస్తాన్‌లో వున్న సింధ్ ప్రాంతానికి చెందిన బావర్జీలు పైరేట్లుగా చరిత్రకెక్కారు. వీరు క్రీ.శ. 251-865ల మధ్యకాలంలో అరేబియా సముద్రంలో తమ దోపిడీ కార్యక్రమాలు నిర్వహించారు. వీరి యుద్ధనౌకలు బార్జాలకు ఒక విశిష్టత వుండేది. బార్జాల వల్లే వీరికి బావర్జీ అని పేరు వచ్చిందంటారు. అరబ్బీలో బార్జా అంటే పెద్ద యుద్ధనౌక అని అర్థం. బావర్జీలు అరబ్ దేశాల నుండి భారత్, చైనాలకు వెళ్లే నౌకలను దోచుకునేవారు. క్రీ.శ. 708లో బావర్జీలు సిలోన్ (ప్రస్తుతపు శ్రీలంక) నుండి అరేబియా వెడుతున్న నౌక నుండి డబెల్ రేవు దగ్గర ముస్లిం స్త్రీలను అపహరించారు. ఉమయ్యద్ (Umayyed) సామ్రాజ్య ఆధిపత్యానికి ఈ కారణంగా సింధ్ సామ్రాజ్యంపై దండయాత్రకు అవకాశం దొరికింది. క్రీ. శ. 711-713ల మధ్య సింధ్ ముస్లింల ఆధీనమైంది. రాజా దహిర్ సింధ్‌ను పాలించిన ఆఖరి హిందూ రాజు. చోళుల పరిపాలనా కాలంలో ప్రభుత్వ క్షమాభిక్ష పొందిన వారిని నౌకాదళంలో చేర్చుకునేవారు. వీరిని అరబ్ పైరేట్లను ఎదుర్కొనేందుకు అరబ్ సాగరంకు పంపేవారు. ఒక విధంగా వీరు అప్పటి కాలం ప్రైవేటియర్‌లు.

14వ శతాబ్దం నాటికి భారత్ దక్షిణ ద్వీపకల్ప భాగంలో రెండు సామ్రాజ్యాలు వుండేవి. ఒకటి బహమనీయుల సామ్రాజ్యం. రెండవది విజయనగర సామ్రాజ్యం. ఈ రెండు సామ్రాజ్యాల మధ్య నిరంతరం యుద్ధాలు జరుగుతూనే వుండేవి. అందువల్ల యుద్ధానికి అవసరమైన సరుకులు, గుఱ్ఱాల సరఫరా అనివార్యమయ్యేది. ఆఫ్రికా, పర్షియాల నుండి గుఱ్ఱాలను దిగుమతి చేసుకునేవారు. ఈ రవాణాకు భారత్ పశ్చిమ తీరంలోని పైరేట్ల బెడద తప్పేది కాదు. తిమోజి అన్న పేరు వున్న ఒక పైరేట్ కర్ణాటక తీరంలోని కార్వార్ వద్ద వున్న అంజదీవ్ అనే ఒక ద్వీపం నుండి తన దాడులు జరిపేవాడు. ఇతడు గుఱ్ఱాలను దొంగిలించి హనోవర్ రాజుకు అమ్మి అతనికి ప్రైవేటియర్‌గా వ్యవహరించేవాడు. కేరళ వ్యాపారులకు చెందిన నౌకల నుండి మిరియాలను దొంగిలించి గుజరాత్‌కు అమ్మి పైరేట్‌గా చలామణి అయ్యేవాడు.

16-17 శతాబ్దాల మధ్య ఐరోపా నౌకలు అరేబియా సాగరంలో తరచూ మొగల్ నౌకల మీద దాడులు చేసేవి. ముఖ్యంగా హజ్ యాత్రకు మక్కా వెడుతున్న నౌకల మీద ఎక్కువగా దాడులు చేసేవారు. 1613లో పోర్చుగీస్ నౌకలు మొగల్ రాణి మరియం జమానికి చెందిన రహీమి అన్న నౌక మీద దాడి చేసి దానిని బంధించారు. ఈ కారణంగా మొగలులు పోర్చుగీస్ వలస సామ్రాజ్య భాగం అయిన దామన్‌ను ముట్టడించారు. 18వ శతాబ్దంలో మరాఠా ప్రైవేటియర్ కానోజీ ఆంగ్రే బాంబే-గోవా సముద్ర ప్రాంతంలో తన పైరసీ దాడులు చేసేవాడు. మరాఠాలు తమ సముద్ర జలాలలో వ్యాపారం చేస్తున్నందుకు ఈస్ట్ ఇండియా కంపెనీవారి నౌకలు నుండి పన్నులు వసూలు చేసేవారు.

**పారశీక అఖాతం :** పారశీక అఖాతంలో క్రీ. పూ. 2000, ఆ దగ్గర కాలంలో దిల్‌మన్ నాగరికత ప్రస్తుతపు బహరీన్, కువైట్, సౌదీ అరేబియా తూర్పు ప్రాంతంలో కేంద్రీకృతమై వుండేది. క్రీ.పూ. 1800లో ఈ నాగరికత వాణిజ్య పరంగా క్షీణించడం మొదలయింది. ఆ సమయంలో పారశీక అఖాతంలో పైరసీ బాగా వృద్ధి చెందింది. బహుశా పైరసీయే ఈ పతనానికి కారణమేమో కూడా. అప్పటి నుండి ఈ ప్రాంతంలో పైరసీ జరుగుతూనే వుంది. క్రీ.పూ. 694లో అస్సిరియన్ (Assyrian) పైరేట్లు భారత్-పారశీక అఖాతం మధ్య నడిచే నౌకలను దోచుకునేవారు. అప్పటి అస్సిరియన్ రాజు సెన్నాచెరీబ్ (Sennacherib) పైరసీని అణచి వేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి.

కొన్ని చారిత్రాత్మక కథనాల ప్రకారం ప్రస్తుత యుగం 5వ శతాబ్దంలో పైరసీ, సాసన్ (ఇరాన్, క్రీ. శ. 224-651 సామ్రాజ్య వాణిజ్యంపై గట్టి ప్రభావం చూపేది. వీరు భారత్ నుండి వచ్చే నౌకలను దోచుకునేవారు. ఈ దాడులు యెజ్డెగెర్డ్ (Yezdegerd; 438-457) పరిపాలనా కాలంలో ఫార్స్(ఇరాన్) ఆ పరిసర ప్రాంతాల తీరంలో జరిగేవి. 825లో పారశీక అఖాతంలో అభివృద్ధి చెందుతున్న వాణిజ్యం గురించి ప్రొఫెసర్ రిచర్డ్ హోడ్జెస్

తాను వ్రాసిన వ్యాఖ్యలలో ఇరాన్, భారత్, చైనాలకు సంబంధించిన దాడుల గురించి ప్రస్తావించాడు. బహరీన్‌కు చెందిన పైరేట్లు సిరాఫ్ (ఇరాన్), బస్రా (ఇరాక్) పట్టణాల మధ్య నడిచే నౌకల మీద దాడులు చేసేవారన్నాడు. మార్కోపోలో కూడా తాను వ్రాసిన ప్రయాణానుభవ జ్ఞాపకాలలో పారశీక అఖాతంలో పైరసీ గురించి ప్రస్తావించాడు. ఆయన కథనం ప్రకారం 7వ శతాబ్దంలో బహరీన్ ద్వీపం వృత్తిపరంగా పైరేట్లయిన అబ్ద్–ఉల్–కైస్ తెగ ఆక్రమణలో ఉండేది. 9వ శతాబ్దం నాటికి పారశీక అఖాతంలో పైరసీ విచ్చలవిడిగా జరిగేది. చైనీయులు రక్షణ కోసం తమ నౌకలలో 400 నుండి 500 వరకు సిబ్బందిని, వారికి సరిపడా తుపాకులను తీసుకొని వెళ్ళేవారు. అరబ్ సాగరంలోని సొకోత్రా ద్వీపం పైరేట్లకు 13వ శతాబ్దం చివరి వరకు స్థావరంగా వుండేది. ఇక్కడి నుండి దాడులు జరపడమే కాకుండా తాము దోచిన సరుకును ఇక్కడి నుండే విక్రయించేవారు.

17–18 శతాబ్దాలలో హిందూ మహాసముద్రంలో వున్న మెడగాస్కర్ ద్వీపం కూడా పైరేట్ల స్థావరం అయినట్లు, అక్కడ 1000 మందికి పైగా పైరేట్లు వుండే వాళ్ళని కొంతమంది చరిత్రకారులు అంటారు.

కరీబియన్ ప్రాంతం : 1650 – 1720ల మధ్యకాలం కరీబియన్ ప్రాంతంలో పైరేట్లకు స్వర్ణ యుగంగా చరిత్రలో నమోదు అయ్యింది. 1650 నాటికి ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఇప్పటి నెదర్‌లాండ్ మునుపటి భౌగోళిక స్వరూపమైన యునైటెడ్ ప్రావిన్సెస్ కరీబియన్ దీవులలో వలస రాజ్యాలు స్థాపించాయి. ఈ పరిణామం ఆ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధికి, నౌకల ద్వారా సరుకుల రవాణా అభివృద్ధికి దోహదకారి అయ్యింది. ఈ పరిణామం పైరసీకి బాగా అనుకూలమైన వాతావరణం కల్పించింది.

17వ శతాబ్దారంభంలో స్పెయిన్ రాజు ఫిలిప్ III, తమ వలస రాజ్యం సాంటో డొమింగో (ఈనాటి డొమినికన్ రిపబ్లిక్) అధినేత ఆంటోనియో డి ఒసారియోకు హిస్పానియోల (ఈనాటి డొమినికన్ రిపబ్లిక్, హైతీ) ద్వీపం పశ్చిమ, ఉత్తర ప్రాంతాల నుండి జనాభాను తొలగించమని ఆదేశం పంపాడు. ఈ ఆదేశానికి కారణం ఆ ప్రాంతంలో నివసించే ప్రజల ద్వారా సరుకుల దొంగ రవాణా, ఆ కారణంగా స్పెయిన్ ప్రభుత్వానికి వాటిల్లుతున్న నష్టం. ఆంటోనియో డి ఒసారియో స్పెయిన్ రాజు ఆదేశాలను 1605, 1606 సంవత్సరాలలో అమలు చేసాడు. ఈ చర్య వల్ల ఆ ప్రాంత ప్రజలందరూ అతి దారిద్ర్యం పాలయ్యారు. ఆ తరువాత ప్రజా నివాసం లేని ఈ ప్రాంతాన్ని ఫ్రెంచ్ బుకనీయర్లు తమ నివాసంగా మార్చుకున్నారు. అయితే వీరు మొదట్లో పైరసీకి పాల్పడకుండా వేట, వ్యవసాయం వృత్తులుగా జీవించే వారు. పైరేట్లుగా వీరి పరివర్తన క్రమక్రమంగా జరిగింది. స్పెయిన్ ఆధిపత్యం బుకనీయర్లను, వారి జీవనాధారమైన జంతువులను అణచి వేయాడానికి చేసిన ప్రయత్నాలు వీరు పైరసీ వైపు మొగ్గడానికి దోహదపడ్డాయి. స్పెయిన్ ఆధిపత్యం పైరసీని అరికట్టడానికి చేపట్టిన చర్యల నుండి తప్పించుకోవడానికి వీరు హిస్పానియోల తీరానికి చేరువలో వున్న టార్చుగా ద్వీపంలో స్థిరబడ్డారు. ఈ ద్వీపం స్పెయిన్ చర్యల నుండి తప్పించుకోవడానికి కావలసినంత భద్రత కలిగి ఉండడమే ఈ వలసకు కారణం. ఈ వలస వలన ఎదురైన ఇంకో పరిణామం వనరుల కొరత. అందువల్ల పైరసీ జీవనోపాధి అయ్యింది. 1625 నాటికి పైరేట్లుగా వీరి రూపాంతరం పూర్తి అయ్యింది అనవచ్చు. చరిత్రకారుడు, బుకనీయర్ అలెక్జాండర్ ఎక్స్‌క్వెమెలిన్ వ్రాతలు బుకనీయర్ల చరిత్రకు మూలాధారాలు. ఇతడు టార్చుగా (Tortuga)లో స్థిరపడిన పైరేట్లలో పియర్ లె గ్రాండ్ ముఖ్యుడని, అతడి నాయకత్వంలో బుకనీయర్లు కరీబియన్ నుండి స్పెయిన్ తిరిగి వెళుతున్న నౌకల మీద దాడులు జరిగేవని పేర్కొన్నాడు.

బ్రిటన్ 1655లో జమైకాను స్పెయిన్ నుండి స్వాధీనం చేసుకుంది. ఈ పరిణామం టార్చుగా బుకనీయర్ల పైరసీకి అగ్నికి ఆజ్యంలా తోడయ్యింది. జమైకాలోని ఆంగ్ల అధికారులు తమ దేశీయులకు, టార్చుగా బుకనీయర్లకు విచ్చలవిడిగా ప్రైవేటియర్‌లుగా వ్యవహరించేందుకు ఆమోదపత్రాలు ఇచ్చారు. జమైకాలోని పోర్ట్ రాయల్ రేవు అభివృద్ధి పైరేట్లకు తమ దోపిడీ సొమ్ము అమ్ముకోవడానికి అనువుగాను, లాభదాయకంగాను మారింది. 1660లో టార్చుగాకు కొత్తగా నియామకమైన ఫ్రెంచ్ అధికారి బెర్ట్‌రాండ్ డి'ఓగెరన్(దీవతీతీఖఅస ఠహాస్త్రవతీశీఅ) అక్కడి బుకనీయర్లకు, పోర్ట్ రాయల్‌కు చెందిన ఆంగ్ల తిరుగుబాటుదారులకు, నేరస్థులకు ఆమోదపత్రాలు ఇచ్చాడు. ఈ పరిస్థితులు కరీబియన్ ప్రాంతంలో పైరసీని పతాక స్థాయికి తీసుకువెళ్లాయి.

1690 నుండి పైరసీలో కొత్త పర్వం మొదలయ్యింది. బ్రిటిష్ పైరేట్లు కరీబియన్ కాకుండా అన్య ప్రాంతాలలో దోపిడీ అవకాశాలు వెదకడం మొదలు పెట్టారు. బ్రిటన్‌లో స్టూవర్ట్ రాజా వంశ పతనంతో ఫ్రాన్స్, బ్రిటన్‌ల మధ్య వైరం తిరిగి మొదలయ్యింది. ఫలితంగా బ్రిటిష్ జమైకా, ఫ్రెంచ్ టార్చుగాల మధ్య లాభదాయకమైన పైరసీ భాగస్వామ్యం ముగిసింది. 1692లో సంభవించిన భూకంపం వల్ల జమైకాలోని పోర్ట్ రాయల్ ధ్వంసం అయ్యింది. ఈ పరిణామంతో పైరేట్లకు తాము దోచుకున్న సరుకు విక్రయించేందుకు అనువుగా వున్న మండీ కూడా ధ్వంసం అయ్యింది. ఇక్కడి పైరేట్లు ఇతర ప్రాంతాల వైపు తమ దృష్టి మళ్లించడానికి ఇది కూడా ఒక కారణం. అంతేకాక కరీబియన్‌లోని ఐరోపా అధికారులు పైరేట్లకు ఆమోద పత్రాలు యుద్ధ సమయాలలో తప్పించి మిగతా సమయాలలో ఇవ్వడం కూడా నిలిపివేసారు. ఈ నియమాన్ని చాలా నిష్కర్షగా అమలు చేశారు. పైరసీ మీద కఠిన చర్యలు కూడా తీసుకోసాగారు. 1667, 1668 సంవత్సరాలలో స్పెయిన్ వలస సామ్రాజ్యంలోని మరకైబో, రియో డెల హాచ, తోలు నగరాల మీద పలుమార్లు దాడులు జరిగాయి. ఈ దాడులతో స్పెయిన్ వలస సామ్రాజ్య క్షీణ దశ ఆరంభమయ్యింది.

బ్రిటన్ 1660లో నౌకాయాన చట్టం (నావిగేషన్ ఆక్ట్)ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టం విదేశీ నౌకల ద్వారా జరిగే వాణిజ్యం పైన ఆంక్షలు విధించింది. ఈ చట్టం వల్ల బ్రిటన్ అంతగా పట్టించుకోని వలస సామ్రాజ్య భాగాలైన న్యూయార్క్, రోడ్ ఐలండ్, బర్మ్యుడాలు ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యాయి. ఈ ప్రాంతాలలో ధనలభ్యతకి పెద్ద కొరత ఏర్పడింది. డబ్బు కొరతతో సతమతం అవుతున్న అధికారులు, వ్యాపారులు పైరసీని ప్రోత్సహించారు. ఒకానొక వలస సామ్రాజ్యానికి చెందిన అధికారి తమ ప్రాంతానికి బంగారం తెచ్చే పైరేట్ల పట్ల కఠినంగా వ్యవరించడం క్రూరత్వం అవుతుందని వాదించాడు కూడా. న్యూ ఇంగ్లండ్, మిడిల్ కాలోనిస్ (డెలావేర్, న్యూజెర్సీ, న్యూయార్క్&పెన్సిల్వేనియా)లకు చెందిన పైరేట్లు ఎక్కడో పసిఫిక్‌లో వున్న స్పెయిన్ వలస ప్రాంతాల మీద 1690 దశకం చివరి వరకూ దాడులు చేసేవారు. కానీ, హిందూ మహాసముద్ర ప్రాంతం లాభదాయకంగా, ఆకర్షణీయంగా ఉండేది. ఆ రోజుల్లో భారతదేశ ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుగా ఉండేది. భారతదేశంలో తయారైన పట్టు, చేనేత



ప్రసిద్ధ కరేబియన్ సముద్రపు దొంగ జాక్ స్పారోతో రచయిత

వస్త్రాలు పైరేట్లకు చాలా విలువైన సరుకుగా ఉండేవి. వీటితో పాటు మసాలా దినుసులకు కూడా చాలా గిరాకీ ఉండేది. అంతేకాక ఆ సమయంలో హిందూమహా సముద్రంలో బలవత్తరమైన నౌకాదళ గస్తీ లేకపోవడం పైరేట్లకు ఒక మంచి అవకాశంగా మారింది. ఈస్ట్ ఇండియా కంపెనీ నౌకలు, స్థానిక భారతీయ నౌకలు పైరేట్ల దాడులకు చాలా అనువుగా ఉండేవి. ఈ పరిస్థితులు థామస్ ట్యూ, హెన్రీ ఏవరీ, రాబర్ట్ కల్లిఫోర్డ్&విలియం కిడ్ వంటి ప్రసిద్ధికెక్కిన పైరేట్ల కార్యకలాపాలకు హిందూమహాసముద్రంను రంగస్థలంగా మార్చాయి

నవంబర్ 1700లో స్పెయిన్ రాజు చార్ల్స్ II మరణంతో ఆ దేశపు ఉత్తరాధికారం కోసం 1701లో యుద్ధాలు మొదలయి 1714 వరకు జరిగాయి. 1713-1714లో విరోధి వర్గాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందాలతో ఈ యుద్ధం ముగిసింది. ఈ పరిణామం వల్ల కరీబియన్ ప్రాంతంలో చలామణీ అవుతున్న ప్రైవేటియర్‌లు, వారితో పనిచేస్తున్న వేల మంది నావికులు యుద్ధ బాధ్యతల నుండి తొలగింపబడ్డారు. ఈ సమయంలో అట్లాంటిక్ సముద్రంలో నౌకల ద్వారా వాణిజ్యం, బానిసల రవాణాతో సహా, బాగా అభివృద్ధి చెందసాగింది. నిరుద్యోగం వల్ల వీరికి సరుకు రవాణా చేసే నౌకలపై తప్పనిసరిగా పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ పని పైరసీ అంత లాభదాయకం కాదు. అందువల్ల వీరు ఎప్పుడూ పైరసీ వైపు మొగ్గు

చూపుతూనే ఉండేవారు. అందువల్ల పైరసీ నౌకల ఆధిపత్యానికి సిబ్బందికి ఎటువంటి కొరత ఉండేది కాదు.

1715లో పైరేట్లు ఫ్లోరిడా తీరంలో మునిగిపోయిన స్పెయిన్‌కు చెందిన గాలియన్ నుండి బంగారాన్ని వెలికి తీస్తున్న లోయీతగాళ్ల మీద విజయవంతంగా దాడి చేశారు. ఈ దాడి ఆంగ్ల ప్రైవేటియర్‌లు హెన్రీ జెన్నింగ్స్, చార్ల్స్ వేన్, సామ్యూల్ బెల్లామి, ఎడ్వర్డ్ ఇంగ్లండ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. వీరు ఈ బంగారాన్ని జమైకాలో విక్రయించడానికి ప్రయత్నించారు. జమైకా ప్రభుత్వం వీరికి అనుమతి నిరాకరించింది. అందువల్ల వీరు బహామస్‌కు చెందిన న్యూ ప్రావిడెన్స్ దీవిలోని నాస్సావ్‌లో కొత్త స్థావరాన్ని ఏర్పరుచుకున్నారు. మూడేళ్ళ తరువాత 1718లో ఆంగ్లేయుడు వుడ్స్ రోజర్స్ గవర్నరుగా నియమింపబడ్డాడు. ఈ నియామకంతో పైరేట్ల స్థావరం మూతబడింది.

18వ శతాబ్దంలో అట్లాంటిక్ సముద్రంలో నౌకల ద్వారా సరుకు రవాణా గణనీయంగా పెరిగింది. ఇది త్రికోణ వాణిజ్యం అన్న పేరుతో ప్రసిద్ధికెక్కింది. అభివృద్ధి చెందుతున్న వాణిజ్యం, తద్వారా నౌకల ద్వారా పెరుగుతున్న సరుకుల రవాణా పైరేట్లకు చాలా అనుకూలమైన వాతావరణం. నౌకలు ఐరోపా నుండి కర్మాగారాలలో తయారైన వస్తువులు, ఆయుధాలు తీసుకొని ఆఫ్రికా వెళ్ళేవి. అక్కడ ఈ సరుకులకు బదులుగా బానిసలను తీసుకొని కరీబియన్ దీవులకు రవాణా చేసేవి. అక్కడ బానిసలను అమ్మి; చక్కెర, పొగాకు, కోకో వంటి సరుకులను తీసుకొని ఐరోపాకు రవాణా చేసేవి.. కొన్ని నౌకలు ఆఫ్రికా నుండి ఎండిన ఉప్పు చేపలు, రమ్ తీసుకొని ఐరోపాలోని రేవులకు వెళ్ళేవి. అక్కడ ఇందులో కొంత భాగం అమ్మి, బదులుగా తయారైన వస్తువులు తీసుకొని కరీబియన్ దీవులకు వెళ్ళేవి. అక్కడ ఈ సరుకులను విక్రయించి చక్కెర, మొలాసిస్, కొంత తయారైన వస్తువులతో ఉత్తర అమెరికా రేవులకు వెళ్ళేవి. మూడు ఖండాల మధ్య జరిగిన ఈ వ్యాపారం ప్రతి రేవులోను నౌకల యజమానులకు లాభసాటిగా ఉండేది.

1713-1714లో స్పెయిన్ వారసత్వ యుద్ధం తరువాత కుదుర్చుకున్న శాంతి ఒప్పందాలలో ఒక భాగంగా బ్రిటన్ అమెరికా ఖండాలలోని స్పెయిన్ వలస రాజ్యాలకు బానిసలను సరఫరా చెయ్యడానికి ఆ దేశ ప్రభుత్వం నుండి Asiento De Negros అనే ఒడంబడిక ద్వారా గుత్తాధిపత్యం సాధించింది. ఈ ఒడంబడిక వల్ల లాభపడిన వారు బ్రిటన్ వ్యాపారులు, స్మగ్లర్లు. సాధారణంగా ఇతర దేశాలకు నిషేధింపబడ్డ స్పెయిన్ వలస రాజ్యాల విపణులు బ్రిటిష్ వారికి అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిణామం పశ్చిమ అట్లాంటిక్ సముద్రంలో పైరసీ బాగా పెరగడానికి బలమైన కారణమైంది. ఇంతకు ముందు ప్రస్తావించినట్టు వారసత్వ యుద్ధం తరువాత కుదిరిన ఒప్పందాలతో చాలామంది ప్రైవేటియర్‌లకు ప్రభుత్వాల అనుగ్రహం కరువయ్యింది. అందువల్ల చాలామంది నావికులకు పని లేకుండా పోయింది. ఇదే సమయంలో అట్లాంటిక్‌లో నౌకల ద్వారా సరుకుల రవాణా కూడా బాగా అభివృద్ధి చెందింది. ఈ నౌకల కప్తానులకు సిబ్బందికి కొరత ఏమాత్రము ఉండేది కాదు. ఇది అదనుగా తీసుకొని నౌకల యాజమాన్యాలు అధిక లాభాల కోసం సిబ్బంది జీతాలను బాగా తగ్గించేసాయి. నౌకల మీద వాతావణం చాలా దయనీయంగా ఉండేది. ఈ పరిస్థితుల వల్ల సిబ్బందిలో మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉండేది. ఒక్కొక్కసారి మరణాల సంఖ్య రవాణా చేయబడుతున్న బానిసల సంఖ్య కన్నా ఎక్కువ వుండేది. ఇలాంటి హేయమైన పరిస్థితుల వల్ల నౌకా సిబ్బందిలో అధికులు పైరసీ వైపే మొగ్గేవారు. అభివృద్ధి చెందుతున్న వాణిజ్యంతో పాటు పైరసీ కూడా దినదిన ప్రవర్ధమానమయ్యింది. కరీబియన్ పైరేట్లలో బాగా (అప)కీర్తి గడించిన ఆంగ్ల పైరేట్లు ఎడ్వర్డ్ టీచ్, జాన్ రాక్‌మన్, బార్తలోమ్యూ రాబర్ట్స్. వీరిలో ఎడ్వర్డ్ టీచ్ బ్లాక్ బియర్డ్‌గా ప్రసిద్ధి చెందాడు. వలస రాజ్యాల సేనాదళాలు, పైరేట్ల మధ్య సముద్రం మీద, వెలుపల కూడా అనేక యుద్ధాలు జరిగాయి. బ్రిటిష్ రాయల్ నేవి ఇంతకు ముందు పేర్కొన్న పైరేట్లను వేటాడి పట్టుకోవడమో, చంపడమో జరిగింది.

1730 తరువాత కరీబియన్ ప్రాంతంలో పైరసీ తగ్గుముఖం పట్టింది. ఈ తీరు చాలా దశాబ్దాల పాటు కొనసాగింది. 1810, ఆ ప్రాంతంలో చాలా మంది పైరేట్లు అట్లాంటిక్ సముద్రంలో సంచరించే వారు. కానీ పైరసీ మునపటి స్థాయికి చేరలేదు, పైరేట్లకు వారి ముందు వచ్చిన పేరు గన్న పైరేట్ల స్థానము వీరికి దక్కలేదు. కరీబియన్ పైరసీ చరిత్రలో బాగా ప్రసిద్ధికెక్కిన పైరేట్లు జీన్ లఫ్ఫిటే, రాబర్టో కాఫ్రేసి. లఫ్ఫిటే మెక్సికో అఖాతంలోని అనేక రేవులు స్థావరాలుగా తన దాడులు చేసేవాడు. ఇతని

వద్ద పెద్ద సంఖ్యలో నౌకలు, వాటికి తగ్గ సిబ్బంది ఉండేవారు. అందువల్ల చరిత్రకారులు చాలా మంది ఇతను ఆఖరి బుకనీయర్ అని అభిప్రాయ పడ్డారు. ఇతను అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యునైటెడ్ కింగ్‌డంల మధ్య జరిగిన 1812 యుద్ధం, 1815 న్యూ ఆర్లీన్స్ యుద్ధాలలో అమెరికా తరఫున పోరాడాడు. లఫిట్టే చేసిన సహాయానికి బదులుగా అమెరికా ప్రభుత్వం అతనికీ, అతని సిబ్బందికి క్షమాభిక్ష పెట్టింది. కాఫ్రేసి ప్యూర్టో రీకోలోని మోనా దీవి స్థావరంగా కరీబియన్, ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో దాడులు చేసేవాడు. 1825 మార్చిలో ఇతను తన నౌక ఆన్‌తో సహా పైరేట్లకు విరుద్ధంగా అంతర్జాతీయంగా చేపట్టిన చర్యలలో ప్యూర్టో రీకో దక్షిణ తీరంలో పట్టుబడ్డాడు. అక్కడ జరిపిన విచారణలో ఇతనిని దోషిగా నిర్ధారించి బంధించిన నాలుగు రోజుల తరువాత తుపాకులతో కాల్చి చంపారు.

ఐరోపాలో 18వ శతాబ్దారంభంలో పైరసీని నిరోధించడానికి చేపట్టిన చర్యలు క్రమక్రమంగా కరీబియన్, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, హిందూ మహా సముద్ర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. 1720 నాటికి పైరేట్లకు పరిస్థితులు చాలా ప్రతికూలంగా మారాయి. పైరేట్ల దాడులు తమ దేశ ఆర్థిక, వాణిజ్య వ్యవస్థకు మిక్కిలి నష్టం కలిగిస్తుండడం వల్ల ఇంగ్లండ్ 18వ శతాబ్దం మొదలు పైరసీ అరికట్టడానికి చర్యలు చేపట్టింది. 1698లో పైరసీ చట్టంను కూడా అమలు చేసింది. ఈ చట్టం ద్వారా బ్రిటన్ నౌకాదళం అడ్మిరల్‌లకు సముద్రంలో, బ్రిటన్ పాలిత ప్రాంతాలలో ఎక్కడైనా పైరేట్లను, పైరేట్లకు సహాయపడిన వారిని బంధించడానికి, విచారించడానికి, దండించడానికి అధికారం లభించింది. ఈ విచారణలు సముద్రం మధ్యలో కూడా జరపవచ్చు. బ్రిటన్‌లోని న్యాయస్థానాలకు ఈ ఫిర్యాదును తీసుకు వెళ్ళవలసిన అవసరం ఉండేది కాదు. ఈ చట్టం వల్ల పైరేట్లకు వారి వైపు వాదించేందుకు న్యాయవాదులు గాని, న్యాయస్థానాలు గాని అందుబాటులో ఉండేవి కావు. ఈ చట్టం సహాయంతో బ్రిటిష్ నౌకాదళాధిపతులు 600కు పైగా పైరేట్లను ఉరి తీశారు. ఈ సంఖ్య కరీబియన్ పైరేట్లలో 10 శాతం మాత్రమే.

స్పెయిన్ వారసత్వ యుద్ధం తరువాత పరిస్థితులు 1713-1720ల మధ్య పైరసీకి అనుకూల వాతావరణానికి దారి తీశాయి. అయినప్పటికీ పైరసీ తిరిగి మునుపటి స్థాయికి చేరలేదు. పైరసీని పూర్తిగా అణచి వేసే వుద్దేశ్యంతో బ్రిటన్ శాసనసభ పైరసీ చట్టం 1717, పైరసీ చట్టం 1721లను అమలులోకి తెచ్చింది. పైరసీని అరికట్టే చర్యలలో ఒకటిగా 1717లో కొంతమంది పైరేట్లకు క్షమాభిక్ష కూడా పెట్టింది. 1718 నాటికి బ్రిటన్ నౌకాదళంలోని నౌకలు సంఖ్య 124కు పెరిగింది. బ్రిటిష్ రాయల్ నేవీ పైరేట్లను నిర్దాక్షిణ్యంగా వేటాడి చంపింది. బ్రిటన్ పైరసీ నిరోధించడానికి తీసుకున్న కఠిన చర్యల వల్ల 1720 నాటికి సంప్రదాయ సిద్ధమైన పైరసీ ముగిసిందని చెప్పవచ్చు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ చాలామంది పైరేట్లు లొంగిపోలేదు. వీరందరూ నిర్బంధించబడిన వెంటనే హతమార్చబడ్డారు. బాగా ప్రసిద్ధికెక్కిన ఎడ్వర్డ్ టీచ్ (బ్లాక్ బియర్డ్) నవంబర్ 22, 1718న ఉత్తర కారోలైనా తీరం వద్ద బ్రిటిష్ రాయల్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ రాబర్ట్ మేనార్డ్‌కు పట్టుబడ్డాడు. బంధించిన వెంటనే ఆతని తల నరికి మేనార్డ్ తన నౌక పురప్రాణి (bowsprit) నుండి అతని తలను వేలాడదీసాడు. బ్లాక్ బియర్డ్ నౌక "క్వీన్ ఆన్'స్ రివెంజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కప్తాను చలూనర్ ఒగ్‌ల్ బ్రిటిష్ రాయల్ నేవీ నౌక స్వాలోతో రాబర్ట్ బార్తలోమ్యూ నౌకను గేబాన్ (ఆఫ్రికా)లోని కేప్ లోపెజ్ వద్ద ముట్టడించాడు. స్వాలో పక్క వైపు నుండి చేసిన ఫిరంగుల దాడిలో బార్తలోమ్యూ మరణించాడు. అతని మరణ వార్త విన్న ప్రపంచం విస్మయానికి లోనయ్యింది. ప్రజలు, వర్తకులు, ప్రభుత్వాలు


ఉరిశిక్ష తరువాత ఎడ్వర్డ్ టీచ్ (బ్లాక్ బియర్డ్) తల

బార్తలోమ్యూను అజేయుడుగా భావించేవారు. బార్తలోమ్యూ మరణంతో పైరసీ స్వర్ణ యుగం ముగిసిందనవచ్చు. పైరేట్లకు మిక్కిలి అనుకూల స్థావరం నస్సావ్ పతనం కూడా పైరసీ అంతానికి కారణమయ్యింది.

19వ శతాబ్దం మొదట్లో ఉత్తర అమెరికా తీరం (మెక్సికో అఖాతం సహా) వెంబడి, కరీబియన్ సముద్రం లోనూ పైరసీ తిరిగి పుంజుకోసాగింది. జీన్ లఫ్టిటే, రాబర్టో కాఫ్రేసి (Roberto Coffresi) ఈ కాలానికి చెందినవారే. అప్పటికి అమెరికా సంయుక్త రాష్ట్రాల నౌకాదళం బాగా అభివృద్ధి చెంది బలవత్తరమైన శక్తిగా మారింది. అమెరికా నౌకలు మెక్సికో అఖాతంలో తరచూ పైరేట్ల నౌకలతో తలపడేవి. కరీబియన్ దీవులలో కూడా ప్రవేశించి పైరేట్ల స్థావరాల మీద దాడులు చేశారు. అమెరికా, పైరేట్లను బ్రిటన్, బ్రిటన్ మిత్ర దేశాలతో జరిగిన యుద్ధాలలో తమ తరపున పోరాడడానికి వాడుకుంది. ఆలా పోరాడిన వారికి క్షమా బిక్ష పెట్టింది. క్యూబా ఆ సమయంలో పైరేట్లకు ముఖ్య స్థావరంగా వుండేది. 1830 నాటికి అట్లాంటిక్ సముద్రంలో పైరసీ అంతరించి పోయిందని అనవచ్చు. ఆ తరువాత నుండి అన్ని నౌకాదళాలు బానిసలను రవాణా చేసే నౌకలపై తమ దృష్టి సారించాయి. 1830వ సంవత్సరం నుండి ఆవిరితో నడిచే నౌకల నిర్మాణం ఆరంభమయ్యింది. ఈ పరిణామం తెరచాపలతో నడిచే నౌకల పర్వానికి తెర దింపింది. దీనితో సాంప్రదాయ బద్ధమైన, సాహిత్యంలో ఆదర్శీకరణ పొందిన పైరసీ పూర్తిగా ముగిసింది. కానీ ప్రైవేటీయర్‌లు యుద్ధ సమయాలలో అక్కరకు వచ్చే వనరుగా పరిగణించడం వల్ల, వారి కార్యకలాపాలు ఇంకొన్ని దశాబ్దాల పాటు కొనసాగాయి. ఈ నిర్ణయం అమెరికా ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య జరిగిన అంతర్యుద్ధం (1861-1865)లో ప్రాముఖ్యత వహించింది. 19వ శతాబ్దం మధ్య వరకు ప్రైవేటీయరింగ్ ఐరోపా దేశాలకు యుద్ధ సమయంలో ఒక సాధనంగా ఉండేది. 16 ఏప్రిల్, 1856న జారీ అయిన పారిస్ ప్రకటనతో ప్రైవేటీయరింగ్ దాదాపుగా ముగిసినట్లే. అయినప్పటికీ యుద్ధ సమయాలలో ప్రభుత్వాలు చాలా అరుదుగా ప్రైవేటీయర్‌లకు అనుమతి పత్రాలను జారీ చేసేవి. ఈ అనుమతి పత్రాలను వివాదాలు ముగిసిన వెంటనే రద్దు చేసేవి.

**కానరీ ద్వీపాలు :** ఆఫ్రికా తీరానికి దగ్గరలోని కానరీ ద్వీప సమూహం (Canary Islands) భౌగోళికంగా కీలక స్థానంలో వున్నది. ఐరోపా, హిందూ మహాసముద్రం, ఆఫ్రికా, అమెరికా ఖండాలను కలిపే సముద్రపు రహదారిలో ఉండటం వల్ల పైరేట్లకు కీలకమైన స్థావరంగా నిలిచింది. ఈ ద్వీపాలు 1496 నుండి స్పెయిన్ అధీనంలో ఉన్నాయి. ఆ రోజులలో ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పైరేట్లు ఈ ద్వీప సమూహం చుట్టుపక్కల సంచరిస్తూ ఉండేవారు. బార్‌బరీ, ఇంగ్లీష్, ఫ్రెంచ్‌డచ్ కోర్సైర్స్ ఈ ద్వీపాల మీద నిర్విరామంగా దాడులు చేసేవారు. ఈ దాడులలో అప్పుడప్పుడు సఫలీకృతమైనా, తరుచు ఓటమి ఎదురయ్యేది. కొంతమంది పైరేట్లు ఈ ద్వీపాలు స్థావరంగా కరీబియన్, అమెరికాలలో దాడులు చేసేవారు. 1553లో ఫ్రాన్సిస్ లే క్లర్క్, జాక్ డి సోరెస్, రాబర్ట్ బ్లండెల్‌లు కలసి శాంటా క్రూజ్ డె లా పామా (Santa Cruz De La Palma) రేవు మీద దాడి చేసి విధ్వంసం సృష్టించారు. దోచుకున్న తరువాత నగరాన్ని తగలబెట్టారు. ఆ తరువాత ప్యూర్టో రీకో, క్యూబాలను దోచుకున్నారు. భూపరిభ్రమణం చేసిన రెండవ వ్యక్తిగా చరిత్రలో ప్రసిద్ధికెక్కిన ఫ్రాన్సిస్ డ్రేక్ గ్రాన్ కనరియాలోని లాస్ పామాస్ రేవు మీద చేసిన దాడిలో ఓటమి నెదురుకొని పలాయన మార్గం పట్టాడు.

1585లో బార్‌బరీ కోర్సైర్ మురాత్ రీస్ లాంజోరోట్ ద్వీపం మీద విజయవంతంగా దాడి చేసాడు. ఆ ద్వీపం పాలనాధికారిని, నాగరీకులను బందీలుగా పట్టుకున్నాడు. పాలనాధికారిని రొక్కానికి బదులుగా విడుదల చేసాడు. మిగతా బందీలను బానిసలుగా అమ్మివేశాడు. డచ్ కోర్సైర్ పీటర్ వాన్ డర్ డజ్ 1599లో లాస్ పామాస్ మీద దాడికి విఫలప్రయత్నం చేసాడు. ఈ దాడిలో ఇతను బాగా గాయపడ్డాడు. చరిత్రకారులు ఇతను గాయాల వల్ల మరణించాడో లేక మలేరియా వల్ల మమరణించాడో నిర్ధారించలేక పోయారు. 1797లో బ్రిటిష్ ప్రైవేటీయర్ హోరేషియో నెల్సన్ శాంటా క్రూజ్ డె టెనెరీఫ్ రేవును ముట్టడించడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటన బాటిల్ అఫ్ శాంటా క్రూజ్ డె టెనెరీఫ్‌గా చరిత్రలో నమోదు అయ్యింది. ఈ యుద్ధంలో నెల్సన్ కుడి చేతికి తగిలిన గాయం వల్ల ఆ చేయి తీసివేయవలసి వచ్చింది.

*(ఇంకా ఉంది)*

**చెన్నూరి శివ రామకృష్ణ ప్రసాద్**
రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మర్చెంట్ నావీ,
రచయిత, పరిశోధకులు,
ఫోన్ : 991 225 5220




**పరిచయం :** అనగా... అనగా... అంటూ కథ చెప్పే దశ నుండి ఈనాటి ఆధునిక కథ వరకు ఎన్నో దశలు దాటి వచ్చిన కథలను ఇప్పుడు మనం చదువుతున్నాం. ఇవన్నీ జీవితాల నుండి, జీవన విధానం నుండి పుట్టినవే. నిజజీవితంలోని సంఘటనలు, పాత్రలతో రచయిత జరిపే సంభాషనే కథ.

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలో నవల, కథ, వ్యాసం, జీవిత చరిత్ర మొదలైనవి పేర్కొనదగినవి. వీటిలో కథ నేడు విశేష పాఠకాదరణ పొందింది. సామాన్యుని జీవిత విశేషాలను చిత్రించడంలో కథ తనదైన పాత్రను పోషిస్తుంది. కథలో వస్తు, శిల్పాలు రెండు సమాన ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. విమర్శకులు కథలలో వస్తువు ముఖ్యమని కొందరు అంటే, శిల్పం ముఖ్యమని మరికొందరు అంటారు. వస్తువు అంటే రచయిత ఎంచుకున్న అంశం. కథలో రచయిత ఏమి చెప్పాడన్నది వస్తువు అవుతుంది. ఆ వస్తువు ఎలా చెప్పాడన్నది శిల్పం అవుతుంది.

సాహిత్యం అనేది మానవ అనుభవాల కూర్పు. వస్తువును రచయిత మానవుని అనుభవం నుంచే ఎంపిక చేసుకుంటాడు. ఈ వస్తువు అనేది రచయిత జీవితంలోని సంఘటన కావచ్చు లేదా రచయిత గమనించిన పరిసరాల నుండి గాని, ఆయన సంభాషించిన వ్యక్తుల నుండి గాని రచయిత వస్తువును ఎన్నుకోవచ్చు. ఈ వస్తువు అనేది మానవానుభావాల సమహారం. రచయిత సామాజిక సమస్యలను, పరిణామాలను, రాగద్వేషాలను మానవ సంబంధాలను, మానవుని మనస్తత్వ లోతులను, ఆర్థిక అంశాలను మొదలైన అనే విషయాలను వస్తువుగా స్వీకరించవచ్చు.

వస్తువు గురించి సాహితీవేత్తలు చెప్పిన అభిప్రాయాలను పరిశీలిస్తే 'నిగూఢ బీజ స్థితిను నుండి వెలికి వచ్చిన విషయాంకుర కథా వస్తువు' (దక్షిణామూర్తి, 1988:239)" సాహిత్యంలో వ్యక్తం అయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు'' (మధుసూదన్ రావు, 1987:13)

కవి లేదా రచయిత చెప్పే ప్రధాన విషయాన్ని వస్తువు అనవచ్చు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. తాను ఎంచుకున్న వస్తువు అంశం. వస్తువును అభివ్యక్తం చేసే తీరు శిల్పం. ఈ రెండింటిలో ముఖ్యమైనది వస్తువు. కంటెంట్ అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో వస్తువు అని వాడుతున్నాం. ఒకానొక విషయంలో ప్రత్యేకంగా నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయ్యే ప్రధానమైన conceptని వస్తువుగా చెప్పుకోవచ్చు. (లక్ష్మీకాంతం, పింగళి. 1986:39) రచనలో, కవిత్వంలో వ్యక్తమయ్యే ముఖ్యమైన అంశం వస్తువు.' మనిషి ప్రకృతిలో పోరాడుతూ జీవిక కోసం పడిన ఘర్షణ సాహిత్యంలో వస్తువు అయింది. (కాసిం, 2012:96). వస్తువు అంటే సంబంధాలు, సామాజిక జీవితం అందలి సమస్త వైరుధ్యాలు, వీటన్నింటి యొక్క కళాత్మకమైన ఆవిష్కరణ సాహిత్యంలో వస్తువు (శివశంకర్, పాపినేని. 2008:8)

మనుషులు, వాళ్ల మధ్య సంబంధాలు, బాంధవ్యాలు, ఆప్యాయతానురాగాలు, ప్రేమలు, ద్వేషాలు మానవ సంబంధాల్లోని సమస్త అంశాలు సాహిత్యంలో వస్తువే. సమాజం మారినకొద్దీ వస్తువు కూడా మారుతుంది. ఎందుకంటే సాహిత్యం నిరంతరం చలనశీలమైనది.

కవులు, రచయితలు వస్తు స్వీకరణలో వైవిధ్యం పాటించారు. మారుతున్న కాలాన్ని అనుసరించి వస్తువు స్వరూపం దాని విలువలు, ప్రయోజనాలు కూడా మారాయి. ప్రాచీనులకు ప్రకృతి ప్రధాన కవిత వస్తువుగా కనిపించేది. ప్రాచీన కవులు నదులు, గుట్టలు, చెట్లు

చేమలు, సూర్యోదయం, చంద్రోదయం మొదలైనవి వర్ణించేవారు. కానీ నేడు కవులు, రచయితలు ప్రజల దుర్భర జీవితాలు, పేదరికం, వలస, కుల నిర్మూలన, మానవ సంబంధాలు, భాష గొప్పదనం, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు మొదలైనవి ఆధునిక కవులకు వస్తువులు అవుతున్నాయి.

మానవత్వం మానవ లక్షణం. మానవత్వం అంటే ప్రేమ, దయ, అనురాగం, ఆప్యాయత, స్నేహం, సౌజన్యం, పరోపకార ప్రవృత్తి, రుజువర్తన వంటి మంచి గుణాలు వీటిని సంపూర్ణంగా కలిగి ఉన్నవాళ్లే మానవులు.

మనిషి సహజంగా కుటుంబ జీవి, సంఘజీవి. కుటుంబంలో, సంఘంలో ప్రశాంతత నెలకొనిఉండాలంటే మనుషుల మధ్య పరస్పరం ఆప్యాయత అనురాగాలు, స్నేహ సౌజన్యాలు, పరస్పర గౌరవాదరణలు కొనసాగాలి. నేటి మానవుల్లో కొందరు ఈ గుణాలను వదిలి వదిలి బాంధవ్యాలను, మమతానురాగాలను బుక్కు అమ్మి వేస్తూ అర్థమే (ధనమే) పరమార్థంగా భావించడం వల్ల సంబంధాలు చెడిపోతున్నాయి. ఆత్మీయమైన పలకరింపులతో పులకరించే రోజులు గత వైభవాల అయిపోతున్నాయి. మనిషి స్నేహ సౌజన్యాలకు మంగళం పాడుతూ, ఒంటరితనానికి అలవాటు పడిపోతున్నాడు. తన కళ్ల ఎదుటే దౌర్జన్యాలు జరుగుతున్న కనీసం స్పందించాలనే తలపు శూన్యమైపోతుంది. 'వరకు రాకుంటే చాలు' స్వార్థ బుద్ధి ప్రభలుతున్నది. ఇది సమాజానికి చేటు.

బాహ్య పరిణామాలు వ్యక్తిగత జీవితాల్లో తెస్తున్న పెను మార్పులన్నీ మానవ జీవితంలోకి ఇంకిపోయి మానవ విలువల స్వరూప స్వభావాలను సమూలంగా మార్చి వేస్తున్నాయి. వ్యవస్థీకృత పునాదులు కదిలిపోతున్నాయి. ప్రతి అంశాన్ని ఆర్థిక విషయాలు శాసిస్తున్నాయి. నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమై ప్రపంచీకరణ దిశగా సమాజం పరుగులు పెట్టడంతో వస్తున్న విపరీత పరిణామాలు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇంతకు ముందు కథల్లో ఉన్న ఉన్న అస్పష్టత, అయోమయం, అర్థంకానితనం ఇప్పుడు ఏమీ లేదు. ఇప్పుడు అంతా నలుపు తెలుపుల్లో స్పష్టంగా ఒక వికృత సమాజం మన కళ్ళ ముందు కనిపిస్తుంది. అలాగే రైతు జీవితంలో ఆర్థిక సంబంధాలు తెచ్చిన మార్పును మనం రామచంద్రమౌళి రాసిన 'భూమి దుఃఖం దుఃఖం' కథలో గమనించవచ్చు. ముఖ్యాంశాలు : గొర్రు, బర్రెలు, సాంక్షన్ సాంక్షన్, మతలబు,బ్యారం, గుత్తా, అగ్గువా సగ్గువ,పెయ్యి, కార్ఖానా, పాసి పాయె.

**విషయ విశ్లేషణ** : భార్యాభర్తలిద్దరూ కాయ కష్టం చేసుకుని సంపాదించిన భూమిని ప్రభుత్వం తీసుకొని ఊరు ఖాళీ చేయించి, ఆ భూములకు సర్కార్ లెక్క ప్రకారం పైసొపర్కో కట్టించి ఎక్కడన్నా పునరావాసం ఏర్పాటు చేస్తుందని, గవర్నమెంట్ దేశాన్ని డెవలప్ చేయాలని స్పెషల్ ఎకనామిక్ జోన్స్ ఏర్పాటు చేస్తుంది. మన భూమిని మనకు ఇష్టం ఉన్న, లేకున్నా ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందంటే తీసుకోవడం ఎంత దురాక్రమణ, దగా. ఇంత వ్యాపారం, మనుషులు మనుషులు మనుషులను కొనడం, మనుషులు భూములను కొనడం, భూములు మనుషుల చేతుల్లో కాగితపు ముక్కల కంటే హీనంగా పీలికలు పీలికలైపోవడం, ఒర్రెలు, వాగులు, గుట్టలు అన్ని డబ్బుగా మారిపోతున్నాయి. ఇంతకుముందు మనిషి అంటే మానవతా, ప్రేమ కనిపించేవి. ఇప్పుడు మనిషి అంటే డబ్బు అనే అర్థం.

భూమి అంటే వ్యవసాయ క్షేత్రంగా చూసేవారు. వ్యవసాయం చేసే రైతును రాజుగా భావించేవారు. కానీ గవర్నమెంట్ డెవలప్ చేయాలనుకుంటుందని తెలిసి కొందరు వ్యాపారవేత్తలు ముప్పై వేలకు ఎకరం ఉన్న భూమిని మంచి రేటు పెట్టి కొని అతను ఎవరికి అమ్ముకున్న పరవాలేదు. మనం భూమీయకుంటే, అందరూ అమ్ముకొనిపోతే మనం ఒక్కళ్లమే ఉండాలే. అది కాకుండా ప్రభుత్వం అగ్గువ సగ్గువకు తీసుకుంటదని బెదిరింపులు. ఇట్లాంటి అప్పుడు నలుగురితో నారాయణ అన్నట్లు ఉండాలె.

"తరతరాలుగా ఈ భూమిలపుట్టి ఈ భూమిల పెరిగి ఈ భూమితోనే బతుకుతున్నోళ్ళం.... ఈ భూమిని ఇచ్చి ఎట్ల పోతాం. ఏడికి పోతాం... ఇన్ని రూపాయలు ఇచ్చిన ఈ భూమి మన పెయ్యిల అంగం లెక్కుండే. ఎట్లా వాళ్ల పాలు చేస్తాం (రామచంద్రమౌళి :2007:పుట:464) భూమిని ఆధారంగా చేసుకుని బతికేవాళ్లు, శరీరంలో ఒక అవయం లెక్క అనుకొని, ఆ అవయవానికి ఏదైనా ఇబ్బంది వస్తే ఎంత బాధ పడుతామో, భూమిని కోల్పోవాల్సి వస్తే ఆ భూమిని నమ్ముకుని బతికే వాళ్ళు పరిస్థితి కూడా అలాగే

ఉంటుంది. ఇప్పుడు భూమి ఎంత ఉంటే అన్ని డబ్బులుగా లెక్క కడుతున్నారు. ఎక్కడో ఢిల్లీ నుంచి వచ్చి ఊరిని కబ్జా చేయడం, కార్ఖానా పెట్టడం వాడెవ్వనికో ఉద్యోగాలు ఇవ్వడానికి మన ఊళ్ళమ్ముకొని మన బతుకులను మట్టి పాలు చేసుకుని వెట్టి కూలీలుగా, వలస పక్షులుగా మారడం ఎంతవరకు సమంజసం.

ఇంతకుముందు ఊర్లలో జనాలు ఒకరితో ఒకరు ఎంత నిష్కల్మషంగా ఉండేవారు. ఒకరి మనసులో మాట ఒకరు పంచుకొని, ఒకవేళ ఏమైనా సమస్య వస్తే కలిసి పరిష్కరించుకునేవారు. కానీ ఇప్పుడు ఎవనికి వాడే రహస్యంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతివాడు తన కడుపులో ఏముందో బయటకి చెప్పకుండా ఎదుటివాని విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. మంగలి రాములు తన రెండెకరాలు ఆరు లక్షలకు అమ్ముతాడు. నిజానికి అది ఎక్కువ రేటు. ఇంత రేటు పెట్టి కొన్నోడు, వ్యవసాయం అంటే తెల్వనోడు. భూమి కొని ఏం చేస్తాడంటే తప్పకుండా అంతకన్నా ఎక్కువకు ఎవరికో అమ్ముతాడు లేదా అంతకంటే ఎక్కువ డబ్బును ఈ భూమిలోనుండి ఏదో రకంగా పుట్టిస్తాడు.

భూమికి, మనిషికి, మనిషికి వొట్టి మట్టికి, డబ్బుకు ఉన్న సంబంధమే ఉందా అంటే ఒక తల్లితో పిల్లలకు ఏర్పడే అనుబంధం ఉంటుంది. కానీ మట్టిని నమ్ముకున్న మనిషి గుండె పగిలి భూమి నుండి ఎలా వేరవుతాడు. ఈ అనుబంధం విలువ ఎంత. అనుబంధం ఉన్నంత మాత్రాన డబ్బుతో కొలువబడే విలువ మారతాయా, మట్టి ముంతలో ఉన్న నీళ్లు, కల్లు, బంగారం వంటి పదార్థం విలువలు మారుతాయి. కానీ మట్టి ముంత విలువ అంటే ఉంటుంది కదా. ఒకప్పుడు ప్రతి ఒక్కరూ భూమిని నమ్ముకొని, వ్యవసాయం పనుల మెలకువలు ఒకరి నుంచి మరొకరు తెలుసుకొని పోటీపడి పంటలు పండించి నిండుకుండల్లా పండు వెన్నెల్లా బతికిన వాళ్లు. ఇప్పుడు ఊరంతా భూమిని అమ్ముకోవడం పిచ్చి కమ్మింది.

సుందరయ్య పెద్దకొడుకు రాజ కొమురు కూడా భూమిని అమ్ముదామని తండ్రిని అడుగుతాడు. వాడెవడో రెండు వందల ఎకరాలు కొని ఊకుంటే మిగిలిన భూమి పడావు పడతదని, ఆలస్యమైతే గవర్నమెంట్ చేతులపడితే వాడేమిస్తడు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు పెద్దలు. రాజకొమురు ముఖం భూమిని అమ్ముకుంటే రాబోయే లక్షల డబ్బు ఊహతో కైపెక్కి ఎర్రగా తోమిన రాతి గిన్నెల మారుతది. “రెండేండ్ల కిందనే భూమిని అంతా మీ ఇద్దరి పేర చేసిన గదరా రాజ కొమురు. భూమి ఉంచుకునుడా, అమ్ముకునుడా మీ ఇష్టం తమ్ముని కూడా అడుగు. నువ్వు మనస్ఫూర్తిగా చెప్తలేవే నాయన....’ ఏం జెప్పేది బిడ్డ... నడుమంత్రపు డబ్బు కట్టల కట్టలు గుట్టలోలే నెత్తిలపడి మనుషులను పాపబట్టే...(రామచంద్రమౌళి : 2007: పుట:466)

మనుషులను డబ్బు అనే మాయ కమ్మి, ఎవుని మాట ఎవడింట లేదు. రాజకొంరు భూమిని అమ్మి డబ్బు ఇంటికి తీసుకొచ్చాక, ఇక ఆ భూమి మీద తనకు ఏ హక్కు లేదు, అది తనది కాదు అన్న భావనను కూడా సుందరయ్య భరించలేక పోయిండు. తన పొలంలోని నీటి సంపులో దబాల్న పడిపోతాడు. డబ్బంతా తనదే కావాలన్నా అత్యాశతో విషం కలిపిన స్వీట్‌ను తన తమ్ముడికి తినిపిస్తడు. తండ్రి, తమ్ముడు పోయారని తెలిసిన ఏడవకుండా ఇంట్లోకి వెళ్లి రాత్రి గుమ్మిలో దాచిన డబ్బు బ్యాగును తృప్తిగా చూసుకుంటాడు.

**ముగింపు :** భూమికి రెక్కలొచ్చి ఎక్కడెక్కడికో ఎగిరి పోతుంది. త్వరితగతిన అనేక చేతులు మారి మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్ళిపోతుంది. ఈ ప్రక్రియ చిన్నపాటి పట్టణ ప్రాంతాల్లోను వేగవంతం అయింది. ఈ క్రమంలో భూమి విలువలో వచ్చినా అనూహ్యమైన పెరుగుదలను మన సమాజపు మానవ సంబంధాలు తట్టుకోలేనంతగా అయిపోయాయి. భూమి ఇక ఎంత మాత్రమూ పంటలు పండించే క్షేత్రం కాదు. కోట్లు కుమ్మరించగలిగే సాధనం. పోనీ ఈ ఫలితాలు అందరికీ అందుతున్నాయా అంటే అది లేదు. అతి తక్కువ ధరకు చేతులు మారిపోయి కోట్ల విలువను సంతరించుకుంది. ఒకవేళ ఈ అనూహ్య సంపద సామాన్యుల చేతికొచ్చిన దాని వెన్నంటి వచ్చే కృతకమైన విలువలు, విశృంఖల భావనలు, అనుమానాలు, ఆరాటాలు, హత్యలు, ఆత్మహత్యలు. మానవ సంబంధాల కన్నా ఆర్థిక సంబంధాలు బలీయమైనవిగా కనిపిస్తాయి.

**మామిడి విజేత**
పరిశోధకురాలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
ఫోన్ : 849 991 7782

# మ్యూజియం ఆఫ్ బేడ్ ఆర్ట్

**– టి.వి. ప్రసాద్**

సలక్షణ కళ అంటే మంచి కళ. అవలక్షణ కళ అంటే చెడ్డకళ. బేడ్‌కు చెడ్డ, అపకర, అమంగళ అని అర్థం. ఐనా బేడ్‌ఆర్ట్ ఎవరికీ ఏ రకమైన అపకారం చేయని, అమంగళం కలిగించని కళ. ఈవ్యాసంలో 'బేడ్ ఆర్ట్' అవలక్షణ, లోపభూయిష్ట మైన కళ అనే అర్థంలో వాడబడింది. దీన్నే లోపకళ అనీ, అవకర కళ అనీ అనవచ్చు.

ఏదో ఒక లోపం ఉన్న, విలక్షణ కళ బేడ్ ఆర్ట్. సాంకేతిక లోపాలతో కళాకారుని అంచనాలను అందుకోలేని, సవాలు చేయలేని, మౌలికం కాని, అతి సాధారణమైన, సాంప్రదాయ విరుద్ధమైన, నిర్దేశిత ప్రమాణాలను అందుకోలేని, నిజాయితీగా చిత్రించినా మెప్పు పొందలేని, విజయం సాధించలేని కళాకృతి చెడ్డకళగా పరిగణించబడుతుంది.

1970–1980ల్లో బేడ్ పెయింటింగు అమెరికాలో ఉద్యమంగా వ్యాపించింది. ఆనాటికి ప్రచలితంగా వున్న అత్యంత సాదాసీదా (మినిమలిస్ట్), భావాలకు ప్రాధాన్యత కలిగిన కాన్సెప్ట్యువల్ ఆర్టుకు వ్యతిరేకంగా అలంకారిక శైలిలో కావాలని లోపభూయిష్టంగా, మొరటు సౌందర్యంతో పుట్టి అభివృద్ధి చెందింది. అంతకుముందు బేడ్ పెయింటింగును గురించి ఆలోచించినవారు లేరు. 1978 నాటి న్యూయార్క్ న్యూ మ్యూజియం కొరకు మ్యూజియం డైరెక్టర్ మార్సియా టర్కర్ బేడ్‌ఆర్ట్ ప్రదర్శనను నిర్వహించింది. సాంప్రదాయ సౌందర్యాన్ని, అభిరుచిని ఉద్దేశపూర్వకంగా నిరసించడం, ఇష్టారీతిన వర్ణాలను ఉపయోగించడం, కళాలక్షణాలను కాదని మందంగా రంగులు పులమడం, నిర్లిప్త హాస్య ధోరణిలో చిత్రాలు వేయడం మొదలైన అవలక్షణాల కళ నియో ఎక్స్‌ప్రెషనిజమ్‌కు పూర్వగామిగా పరిగణించబడింది. జాక్ మైఖేల్ బస్కియత్. కెనీ ప్రాఫ్‌లు ఇతరుల దృష్టిలో సలక్షణ చిత్రాలైనా తమ చిత్రాలను తామే యిష్టపడక, మౌలిక లోపాలను ఎత్తి చూపించడం, బేడ్ ఆర్ట్‌గా పై ప్రదర్శన సాధించిన విజయం. చిత్రకళపై అభిరుచి కలిగించడంలో విఫలమవడం, నూతనత్వం చూపించలేక పోవడం, వీక్షకుని ఆలోచనలకు సవాలు విసరలేకపోవడం ఈ ప్రదర్శనలో బయటపడ్డ లోపాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన 14 మంది అనామక కళాకారులు పాల్గొన్న ప్రదర్శన ఉద్దేశపూర్వక అగౌరవ ప్రదర్శనగా పేరు తెచ్చుకుంది. ఈ ప్రదర్శన ఉద్దేశం వర్తమాన కళాశైలిని, సాంకేతిక ప్రతిభను, మంచి అభిరుచిని కావాలని నిరసించడం, ఊహ కందని ఇతివృత్తానికి, విషయానికి, వ్యంగ్యానికి ప్రాధాన్యత నివ్వడం, నిర్దేశిత లక్ష్యంలేని ప్రగతిని సాధించాలను కోవడం దీని ఉద్దేశం. అసాధారణ స్వేచ్ఛతో ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు ఎవరి శైలిని వారు పాటిస్తూ, వారి వారి దృక్పథంలో ప్రపంచం అంటే ఏమిటో పెయింటింగుల ద్వారా చూపించారు.

**బేడ్ ఆర్ట్ లక్షణాలు :** విసుగుకు కారణమై చికాకు కలిగిస్తుంది. సాంకేతికంగా కూడా తక్కువ స్థాయిలో ఉండి ఎలాంటి భావోద్రేకాలను కలిగించదు. మౌలికతా లోపం, నూతనత్వం, ఉవజ్ఞ కలిగి ఉండదు. ప్రేక్షకుని ఆకర్షించడంలో, చిత్రకారునికి ప్రేక్షకునికి మధ్య బంధం ఏర్పరచడంలో వైఫల్యం, బేడ్ ఆర్ట్ ఉద్యమం కొరకే ప్రత్యేకంగా సృజించబడిన కళా నిర్వహణలో నిరాసక్తత, ఉత్తేజాన్ని కలిగించడంలో విఫలం కావడం, కళాకారుని నిర్లిప్తతకు, ప్రయత్న లోపానికి ఓపిక లేమికి ఉదాహరణగా నిలుస్తుంది. వీక్షకుని ఆలోచనకు పని పెట్టని సవాలు విసరలేని ప్రయత్నలోపం, ఇతి వృత్తంలో స్పష్టత కరువు, వివరణలో చప్పదనం మొదలైనవి బేడ్‌ఆర్ట్ లక్షణాలు. ఈ లక్షణాల వల్ల కళాకృతుల్లో నూతనత్వం లోపించి



నిర్జీవంగా ఉండి చిత్రాన్ని చూసేవారికి ఉత్సుకత కలిగించదు. అవకర, అవలక్షణ కళ కావడం ఇందుకు కారణం. బేడ్ ఆర్టును స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. సాంకేతికంగా పేలవంగా ఉన్న కళ ఒక రకమైతే, కృతి నిర్వహణలో లోపాలున్నది రెండవరకం. బేడ్ ఆర్ట్ మాట పుట్టుకకు మూలం న్యూమ్యూజియం నిర్వహించిన బేడ్ పెయింటింగ్ ప్రదర్శన సృష్టి కర్త మార్సియా టక్కర్.

**బేడ్ ఆర్టుకు – ఏన్‌టి అర్టుకు తేడా :** లోప, అవలక్షణ కళ బేడ్ ఆర్ట్ ఐతే, ఏంటీ ఆర్ట్ వ్యతిరేకకళ, కళా నిర్వహణనూ, లక్షణాలనూ, ప్రమాణాలనూ తిరస్కరించే కళ. కళాత్మత కన్నా వ్యాపార దృక్పథం ఎక్కువ. ఉదా. దూ షాన్ ఫౌంటెన్ (1917) గొప్పకళ సాంకేతికంగా ఉన్నతంగా, భావోద్రేకాల పరంగా ఉత్తేజాన్ని కలిగించేలా, ఏకైక, అసాధారణంగా ఉన్న కళ ఉత్తమ కళగా పరిగణించబడుతుంది. నిర్దిష్టమైన భావాల్ని, సందేశాన్ని యిస్తుంది. పై లక్షణాలు లేని కళ లోపకళ అవుతుంది. ఇది వీక్షకునిపై ఎలాంటి ప్రభావం చూపించదు. దీనిలో సాంకేతిక నైపుణ్యం కన్పించదు. కళాకారుడు చెప్పదలుచుకున్న దేమిటో అర్థం కాని గందరగోళం సృష్టిస్తుంది.

అసలు చెడ్డ కళ అనేదే లేదనేది మరొక వాదన. ఇష్టాయిష్టాలు వ్యక్తిగతాలు. ఒకరి దృష్టిలో చెడ్డకళ మరొకరి దృష్టిలో మంచికళ కావచ్చు, విలువలు అభిరుచులని బట్టి మారుతాయి. అందంగా లేని, సాంకేతిక లోపాలున్న కళాకృతులు కూడా వీక్షకుని ప్రతిస్పందనకు అవకాశం కల్పిస్తాయి. మంచి – చెడు నిర్ణయంలో సంస్కృతి కూడా భాగమౌతుంది. కొన్ని సంస్కృతులలోని మంచి ఆచారాలు వేరొక సంస్కృతిలో చెడ్డ ఆచారలవుతాయి. కళా విషయంలోనూ ఈ సూత్రం వర్తిస్తుంది. ఒకరికి చెడ్డ కళగా తోచింది వేరొకరికి 'మంచి' చెడ్డకళగా తోచవచ్చు. కావాలని కాలంచెల్లిన సౌందర్య సూత్రాలను ఎన్నుకున్నప్పుడే చెత్త కళ కూడా ఉత్తమకళగా మారి పోతుంది. కళా విలువ వ్యక్తిగతం, ప్రేక్షకుని వ్యక్తిగత అనుభవం, అభిరుచి పరిగణన లోనికి తీసుకుంటే విశ్వజనీన ప్రమాణాలు, మంచీ చెడూ కనిపించవు. కళావిలువ ప్రేక్షకుని ప్రతిచర్య, స్పందనను బట్టి మారుతుంది.

**బేడ్ ఆర్ట్ ఉపయోగాలు** : కళా కారులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునే కార్యక్రమంలో భాగంగా బేడ్ ఆర్టు సృష్టి జరుగుతుంది. అది ఒక ప్రయోగాత్మక ప్రక్రియ. తప్పులు చేయడం ద్వారా నేర్చుకోవడానికి వీలవుతుంది. కొందరికి బేడ్ ఆర్ట్ హాస్యాస్పదంగా, వినోదాత్మకంగా కన్పించవచ్చు. బోస్టన్ మ్యూజియం ఆఫ్ బేడ్ ఆర్ట్ ఇటువంటి కళాకారుల కళాకృతుల్ని సేకరించి ప్రదర్శిస్తుంది. చెడులో కూడా మంచి ఉండడం విచిత్రం. బేడ్ ఆర్ట్ కళాకారులకు అవకాశాలను సృష్టిస్తుంది. ప్రయోగాలు చేయడానికి, తమ కళా పరిధిని విస్తృతపరుచుకోవడానికి, నైపుణ్యాలను మెరుగుపరుచు కోవడానికి తోడ్పడుతుంది. ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పనిచేసుకునేందుకు, తప్పుల్ని సరిదిద్దుకునేందుకు, నేర్చుకుంటూనే పరిపూర్ణత సాధించుకునేందుకు ఇది ఉత్తమ సాధనం.

**అవలక్షణ కళా మ్యూజియం** : ఈ మ్యూజియం పేరు (మ్యూజియం ఆఫ్ బేడ్ ఆర్ట్) పక్కనే ఆర్ట్ టూ బేడ్ టు బి ఇగ్నోర్డ్ అనే నినాదం వుంటుంది. అవలక్షణ కళామ్యూజయం, ఐనా విస్మరించజాలని చెడ్డ కళ అని భావం. బోస్టన్ పట్టణంలో 1993లో డోర్ ఛెస్టర్ బ్రూయింగ్ కంపెనీ, 1250 మాస్ అవెన్యూలో ఈ మ్యూజియం స్థాపించ బడింది. దీనిలో 900ల సేకరణ కళాకృతులు ఉంటాయి. వాటిలోని అరవై కళాకృతులు మాత్రమే నిత్యం ప్రదర్శించబడతాయి. ప్రతి కళాకృతి వెంట

దాన్ని గురించిన సంగ్రహ లిఖిత సమాచారం, వ్యాఖ్యానం ఉంటుంది. ఆయా కళాకృతుల్లోని ప్రత్యేకత, సంక్లిష్టతలను, సులభంగా తెలుసు కోవడానికి వాటి వెంట ఉన్న సమాచారం, ఉపయోగపడుతుంది.

**మ్యూజియం చరిత్ర** : ఏ ఇతర సాంప్రదాయ మ్యూజియాలలో ప్రదర్శనకు నోచుకోని కళాకృతుల్ని సేకరించి ప్రదర్శించే ప్రపంచంలోని ఏకైక మ్యూజియం బోస్టన్ పట్టణంలోని MOBA. మ్యూజియం క్యూరేటర్, ఏదో ఒక లోపం కలిగిన పెయింటింగుల్ని సేకరించడం, ప్రదర్శించడం మా మ్యూజియం ప్రత్యేకత అని గొప్పగా చెప్పుకుంటాడు. కొంత కాలం ఇది క్యూబెక్ పట్టణ 29వ నెంబర్ రోడ్ షాపింగ్ సెంటర్, నాటర్ డాంలో సంచార మ్యూజియంగా సేవలందించింది. రోడ్ ఇలండ్ బోస్టన్ మ్యూజియంపై ఏడు నిముషాల వీడియోను రూపొందించింది. మ్యూజియం చరిత్ర, నిర్వహణ, అందులోని కళాకృతుల వివరాలతో వీడియోను ఆర్ట్ షోలో ప్రదర్శించింది. దీన్ని యూట్యూబ్ ఛానల్ లో చూడవచ్చు. ఇది ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో నడుస్తున్న మ్యూజియం. ఏ మ్యూజియంలోనూ ప్రదర్శనార్హత దొరకని, ఏ సంస్థలోనూ ఆదరణ దొరకని కళాకారుల కళాకృతుల్ని ఆదరించడానికి ఈ మ్యూజియం స్థాపించబడింది. ఇందులో లోపాలుండి పనికి రావను కొని పారేసిన కళాకృతికల్ని ఆదరించి ప్రదర్శిస్తుంది. మ్యూజియం పేరే 'చెడ్డ కళా మ్యూజయం'.

1993లో విలువైన పాత వస్తువుల్ని సేకరించి వ్యాపారం చేసే స్కాట్ విల్సన్‌కు చెత్తలో దొరికిన ఒక పెయింటింగును తన స్నేహితులకు చూపిస్తాడు. వారు ఆ పెయింటింగ్‌లోని ప్రత్యేకతను గుర్తించి అటువంటి కళాకృతులు మరి కొన్నింటిని సేకరించమని సలహా యిస్తారు. మ్యూజియం సహస్థాపకుడు జ్యారీ రెయిలీ 1995 లో "ప్రతి నగరంలో ఆర్ట్ మ్యూజియాలు, ఉత్తమ కళాఖండాల ప్రదర్శనాశాలలు ఉంటాయి. మా మ్యూజియం (MOBA) చెత్తగా, అథమంగా భావించబడిన కళాకృతుల సేకరణకు ప్రదర్శనకు అంకితమైంది" అంటాడు. 'ఉత్తమ చెత్త' కళా ఖండాలని అతని ఉద్దేశం. ఈ మ్యూజియంలో ప్రదర్శించబడడానికీ కొన్ని షరతులుంటాయి. కళాకృతి మౌలికమైనదిగా ఉండటం, చిత్రకారుని ఉద్దేశం నిజాయితిగా వుండడం ముఖ్యమైన అర్హత. నిరాసక్తత, విసుగు కలిగించని చెప్పుకోతగిన లోపాలుండడం రెండవ అర్హత. నిర్వాహకులు కన్పించిన చెత్తనల్లా (deliberate kitsch) ప్రదర్శించరు. ఉత్తమ చెత్త చిత్రాలను మాత్రమే ప్రదర్శిస్తారు. ఐతే ఈ మ్యూజియాన్ని గురించిన పెద్ద విమర్శ "అది ప్రదర్శించేది కళా విరుద్ధం, అది కళే కాదు (anti art)"

ఈ మ్యూజియం సేకరణలో పూల తోటలో లూసీ పెయింటింగ్ మొదటిది. ఆ తర్వాత మోనాలీసా, ఫుల్ఫ్ పేక్, బాలెన్స్-బాలెన్స్, బ్రూనో టైగర్, పాల్స్, సన్‌డే మొదలైనవి ఇతర ప్రదర్శితాలు. వీటితో పాటు మ్యూజియంలో స్పోర్ట్స్ విభాగం, అన్‌లైక్లీ లాండ్ స్కేప్స్, ద రెయిన్ బో కలెక్షన్ లాంటి విభాగాలు ఏర్పాటు చేయబడినాయి. మ్యూజియంలోని సేకరణలు ప్రతిభావంతులైన కళాకారులు తమ పొరపాటు వల్లనో కుంచె మీద అదుపు కోల్పోవడంతోనో చిత్రించిన విపరీత, అసభ్య చిత్రాల నుండి 'సుసంపన్నమైన అవకర చిత్రాల' వరకు విస్తృత పరిధిలో కన్పిస్తాయి. అవి వారి అసమర్థత ఫలితం కాదు, వారి అజాగ్రత్త ఫలితం. వాటిలో విపరీత, వికృత, మొరటు పెయింటింగులూ వుంటాయి.

లాభాపేక్షలేని నిర్వాహకులు ప్రభుత్వసాయం లేకుండానే మ్యాజియాన్ని నడువుతూ అందరికీ ఉచిత ప్రవేశం కల్పించడం విశేషం. బేడ్ ఆర్ట్ ను గురించి చెప్పుకునే సందర్భంలో-కొందరు ప్రఖ్యాత చిత్ర కారులు, లబ్ధప్రతిష్ఠులైన చిత్రకారులు అవలక్షణ చిత్రాలను ప్రజల మీదికి విసిరినవి చరిత్రలో చాలా కన్పిస్తాయి. పేరుగాంచిన శిల్పి మైఖేలాంజిలో నుండి పాబ్లో పికాసో వరకు కళాస్రష్టలు చిత్రించిన ఆశ్చర్యకరమైన చెడ్డ కళాకృతులు చాలా ఉన్నా అవి MOBAలో కన్పించవు - అలాంటి వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

మైఖేలాంజిలో 'రాత్రి' శిల్పం (1520-32) నిద్రిస్తున్న స్త్రీ చెడ్డ శిల్పానికి గొప్ప ఉదాహరణ. అతని ఇతర మహిళలందరిలాగానే 'నైట్' శిల్పంలో కూడా ఆమె పురుష ప్రతిరూపమైన 'డే' (పగటి పూట) రూపంలాగా కండలు తిరిగిన శరీరాన్ని కలిగి బలిష్టంగా కన్పిస్తుంది. అప్పట్లో స్త్రీ మహిళా మోడళ్ళ స్థానంలో పురుషులే



వనిచేసేవారు. స్త్రీ నగ్నంగా, మోడల్‌గా నిలబడడం అవమానకరంగా పరిగణించబడింది. ఈ శిల్పంపై చాలా విమర్శలు వచ్చాయి.

ఆల్ బ్రెక్ట్ డ్యూరర్ గడ్డంతో వున్న చిన్న పిల్ల. (The Head of Bearded Child) (1527) నడుము వరకు పెరిగిన గడ్డంతో వున్న బాలికను మనం ఎక్కడైనా చూశామా? చూడగలమా? డ్యూరర్ ఎందరో స్త్రీల పోట్రేట్లు చిత్రించాడు. వాటిలో వెనిన్ యువతి చాలా ప్రసిద్ధ పోట్రేట్, కానీ ఎక్కడా గడ్డంతో ఉన్న చిన్నపిల్ల చిత్రాన్ని రూపొందినట్లు కన్పించదు. తను గడ్డంతో ఉన్న స్వీయ రూప చిత్రంలో (1500) పొడవైన గడ్డంతో క్రీస్తు పోజుకు అనుకరణగా వుంటుంది. ఇది 'గడ్డంతో వున్న చిన్నపిల్ల' మగ కళాకారుని స్వీయ చిత్రం అయి వుండొచ్చు. కానీ ఆడపిల్లది కాదు అని విమర్శకుల అభిప్రాయం.

**రూసో ఫియరెన్టినో :** మడోనా అండ్ ఛైల్డ్ విత్ వుట్టి – ఈ చిత్రంలో కన్పించిన శిశువు అంత వికారంగా పునరుజ్జీవన కాలపు మరే ఇతర చిత్రంలోనూ చూడలేము. కండలు తిరిగిన పిల్లల శరీరాలకు పెద్దల తలలు అతికించినంత అసహజంగా వుంటాయి.



ఆర్టిస్టుఅనుభవ రాహిత్యం వల్లనో, పసి పిల్లలతో అనుబంధం లేకపోవడం చేతనో ఈ చెడ్డచిత్రం పుట్టి ఉండవచ్చు.

**పియర్స్ బ్రోస్నన్ : (Night Marcher)** నిశాచరుడు. బ్రోస్నన్ జేమ్స్ బాండ్ చిత్ర నటుడు. జీవితంలోని ఎత్తు పల్లాలెన్నో చూసినవాడు. ప్రస్తుతం ఆర్ట్‌కు సంబంధిత వెబ్‌సైట్ నడుపుతున్నాడు. ఇతని చిత్రాలు పీడకలల్లోంచి ఊడిపడినట్లుంటాయని కాండీ బెడ్ వర్త్ వ్యాఖ్యానిస్తాడు.

**బాబ్ డిలాన్ :** స్వీయ రూప చిత్రం (1970) ఈ శతాబ్దపు మేటి పాటల రచయిత, గాయకుడు. అభిమానులకు ఆరాధ్యదైవం. 1970 నాటి ఇతడి పాటల ఆల్బమ్ కవర్ మీద కన్పించే స్వీయరూప చిత్రం అభిమానుల గుండెల్ని ముక్కలు చేసింది. తమవి కాని ఇతరరంగాల్లో తల దూర్చిన ఫలితం బ్రోస్మన్, డిలాన్‌ల అవలక్షణ కళాసృష్టి.

**పాబ్లో పికాసో :** పూసజ్జతో అమ్మాయి (1905) చిత్ర కళారంగంలో పికాసో అంతటి మేరు పర్వతంలాటి కళాస్రష్ట, అంతకు మించిన వివాదాస్పద కళాకారుడు మరొకరు కన్పించరు. అతని వ్యక్తిగత జీవితం కూడా అంతా గందరగోళం (mess), అనేక దశాబ్దాల పెయింటింగ్ అనుభవం గలిగిన కళాకారుడు 'యంగ్ గర్ల్ విత్ ఫ్లవర్ బాస్కెట్ ' చిత్రాన్ని పరమ వికారంగా చిత్రించాడు. ఇంకా వికసించని శరీరాంగాలు గల వీధి అమ్మాయిని అంత శ్రద్ధగా చిత్రించిన తీరు అనవసరం అన్పిస్తుంది అన్నది విమర్శ. పికాసో జీవిత చరిత్రను రాసిన సర్ జాన్ రిచర్డ్ సన్ కళావిమర్శకుడు కూడా. ఇతడు పైచిత్రాన్ని a sultry looking gammie అని (చిరచిర పెట్టే వీధి బాలిక) అని వ్యాఖ్యానించాడు.

**మారియో క్లింజ్ మన్ & AI**: కృత్రిమమేధ 02472. కృత్రిమ మేధ మానవాళికి హానికరం అని చాలా మంది భయపడతారు. మరికొందరేమో యంత్రాలు మానవత్వాన్ని కాపాడుతాయంటారు. మారియో క్లింజ్ మన్ AI సృష్టి చూస్తే కృత్రిమ మేధ సృజనను అర్థం చేసుకోవడం కష్టమనీ, అది నష్టించే ఆర్ట్ వెర్రితలలు వేస్తుందనీ కళాపండితులు అంటారు. రెబ్రాంట్ స్టోన్ ఆపరేషన్, విన్సెంట్ వాంఘో పొటాటో ఈటర్స్, ఎడ్వర్డ్ ముంక్ ఏంగ్రీడాగ్ లాంటివి ఎన్నెన్నో బేడ్ ఆర్టుకు ఉదాహరణగా నిలుస్తాయి.

"మనసుకు ఆహ్లాదం కలిగించే ఏ కళనైనా మెచ్చుకుంటాము. లబ్దప్రతిష్టులైన, అనుభవజ్ఞులైన చిత్రకారులు కూడా దారుణమైన చిత్రాలను వేయడం చూసి నవ్వుకోవడం తప్ప ఏమీ చేయలేము" అంటుంది డైలీ ఆర్ట్ మాగజైన్.

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 798 139 8250

# కువైట్ సావిత్రమ్మ

**– చక్రవేణు**

**కు**వైట్ సావిత్రమ్మ కథ రాసిన చక్రవేణు తక్కువ కథలే రాశాడు. దురదృష్టవశాత్తు చిన్న వయసులోనే మరణించారు. ఈ కథ జూలై నెల ఇరవై తారీకు – 1990 ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. దరిదాపు ముప్పై అయిదేళ్ళక్రితం కథ.

ఈ ఒక్క కథతో చక్రవేణుకి గొప్ప గుర్తింపు వచ్చింది. వలసలు వెళ్ళటం అనాదిగా ఉన్నదే. కానీ ఒంటరిగా వయసులో వున్న స్త్రీలు, కేవలం డబ్బు సంపాదన కోసం దేశం విడిచి వెళ్ళటం, అదీ అన్నిటికీ సిద్ధపడి, ఇంచుమించు ఆరంభకాలం అది. అలా వెళ్ళిన వైనం కథా వస్తువైన కథ, బహుశా తొలి కథ ఇది. ఆ తర్వాత చాలా ఇలాంటి కథలకి నాంది. అదీ దాని ప్రత్యేకత. అదీకాక కథలో మానవనైజపు రకరకాల రంగుల్ని దుర్భిణీలోంచి చూపించినట్టు అతిపదునుగా చిత్రించాడు రచయిత. అందరూ కువైట్ సావిత్రమ్మ అని పిలిచే ఆమె ఇంటి పేరు కువైట్ కాదు. ఆ ప్రాంతం నుంచి అందరి కన్నా ముందు కువైట్ వెళ్ళటం వల్ల ఆ పేరు స్థిరపడింది.

దిక్కులేని పరిస్థితిలో కువైట్ వెళ్ళి కొన్నేళ్ళు ఉండి, బాగా డబ్బు సంపాదించి వచ్చింది. చేయి జారిన ఇల్లు స్వాధీనం చేసుకుని బాగు చేయించి తిరిగి కట్టుకుంది. కొడుక్కి, కూతురికి ఒకేసారి ఘనంగా పెళ్ళిళ్ళు చేసింది. వచ్చిన అందర్ని ఆదరించింది. గతంలో నిరాదరించిన వారితో సహా, ఇప్పుడు అందరూ సావిత్రమ్మను గౌరవించి ఆదరిస్తున్నారు. డబ్బుకెంత మహాత్యం అనుకుంది.

మనసు గతంలోకి సాగిన సావిత్రమ్మకి అప్పటి విషయాలు గుర్తొచ్చాయి. ఆమె భర్త మరణించిన నెలలోపే మరిది చిన్నబ్బ ఆమెని బలవంతంగా చెరిచాడు. ఆ తర్వాత పరిస్థితుల వల్ల, కన్న పిల్లల పస్తులు చూడలేక సావిత్రమ్మ వ్యభిచారంలోకి దిగింది. ఆయినా ఆమె దారిన ఆమెని బతకనివ్వలేదు మరిది చిన్నబ్బ, బంధువులు. పంచాయితీ పెట్టి ఇల్లు, ఊరు వదిలి వెళ్ళేలా చేశారు. ఊరు వదిలిన సావిత్రమ్మ, దేశమే వదిలి కువైట్ సావిత్రమ్మ అయింది.

ఆ ఆలోచనల్లో ఉండగానే, చిన్నబ్బ భార్య రామలక్ష్మిని తీసుకువచ్చాడు. ఆశ్చర్యం ఏమిటంటే రామలక్ష్మిని సావిత్రమ్మతో కువైట్ పంపటానికి. పంపితే రామలక్ష్మికి వ్యభిచారం తప్పదని తెలిసీ.


ఒకప్పుడు సావిత్రమ్మని వ్యభిచారి అని అల్లరి చేసి, అవమానించిన చిన్నబ్బ ఇప్పుడు భార్యని తనంతగా తాను వ్యభిచారిని చేస్తున్నాడు. దానికి అదే సవిత్రమ్మని సాయం చెయ్యమని బతిమాలుతున్నాడు.

ఎంతగానో సావిత్రమ్మ ఆ కష్టాలు వివరించి చెప్పింది. అయినా చిన్నబ్బ వినలేదు. అంతా జరిగిపోయింది. ఆ ఆదివారమే రామలక్ష్మి బీభత్సంగా ఏడుస్తూ సావిత్రమ్మ, బ్రోకర్ రహిమాన్‌తో కలిసి రైలెక్కింది. చలించే శక్తి కోల్పోయిన దానిలా ఉండిపోయింది సావిత్రమ్మ.

ఈ కథ ఓ ట్రెండ్ సెట్టర్. ఆర్థిక పరిస్థితుల బలీయతతోపాటు, అవమాన ఆదరణ రంగుల్ని హృద్యంగా, నిశితంగా పట్టుకున్న ఆరకం తొలి కథ.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్, ఫోన్ : 9394738805

## కమ్మతెమ్మెర



మే నెల **మిసిమి** సంచిక...ఎంత చెప్పినా తక్కువే. అన్నీ చదివాను. 35ఏళ్లుగా చదువుతూనే ఉన్నా.. మీ *డైరీ, సంభాషణ, జీవన మకరందం*..శీర్షికలన్నీ వేటికవే.. చెప్పాలనిపించి ఫోన్ చేశాను..

**- రఘుబాబు**

## ఎడారిలో ఒయాసిస్సు
# హైబిజ్ టీవీ అవార్డులు

జర్నలిస్టులు వార్తాసేకరణలో భాగంగా చాలా కోల్పోతుంటారు.. కుటుంబంతో గడపటం మొదలుపెడితే అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా అందరికంటే ముందు అన్న వార్తా (విష) వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతుంటారు.. ఎందరికో ఎన్నో అవార్డులు ఉంటాయి, ఆ అవార్డుల గురించి కథనాలు రాస్తారు, ప్రసారం చేస్తారు కానీ సమాచార స్రవంతి వారధిలో సరుకుగా మారిన విలేఖరులు, పాత్రికేయులకు పురస్కారాలు, గుర్తింపు తక్కువే.. ఈ బాధ్యతను తలకెత్తుకున్న హైబిజ్ టీవీ వారు గత ఆరేళ్ళుగా జర్నలిజం ప్రతిభ కనబరిచినవారిని సన్మానిస్తున్నారు.. గౌరవిస్తున్నారు.. ముఖ్యంగా ఈ అవార్డులు స్థానికంగా ఉన్న మీడియా సంస్థల వారికివ్వటం అరుదైన అంశంగా చెప్పుకోవాలి. ఇలాంటి అవార్డులు మీడియా సంస్థల్లో పనిచేసేవారికి ఎనర్జీ డ్రింకులాంటివి..

హైబిజ్ టీవీ వారు ఈ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించే తీరు కూడా ఒక పండగ వాతావరణంలా ఉండటం విశేషం..

మే రెండవ తేదీ శనివారం ఉదయం పదిగంటలకల్లా సైబర్ కన్వెషన్ సెంటర్ (ఇది శిల్పారామం సమీపంలో ఉంది.. పక్కనుంచే వెళతాం కానీ ఎప్పుడూ గమనించలేదు) లో ఎటుచూసినా యంగ్ జర్నలిస్టుల సందడే.. ఇందులో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా వారున్నారు.. హైబిజ్ టీవీ వారు సాదరంగా మమ్మల్ని రిసీవ్ చేసుకుని మాపేర్లు నమోదు చేసుకుని వేడి వేడి కాఫీ, టీ బిస్కెట్లతో స్వాగతం పలికారు..



అక్షర యోధులకు అరుదైన గుర్తింపు.
గౌ॥ మంత్రి శ్రీధర్ బాబు గారితో రెంటాల జయదేవ్

ఆరోజు లెజెండ్ పురస్కారం పొందబోతున్న ఆచార్య సి.మృణాళిని, భండారు శ్రీనివాసరావు గారిని అభినందించి వచ్చేనరికి వ్యవసాయ పాత్రికేయానికి అవార్డు అందుకోబోతున్న మిత్రుడు వలేటి గోపిచంద్ రైతునేస్తం వై. వెంకటేశ్వరరావుతో కలిసి వచ్చారు, సీనియర్ పాత్రికేయ పురస్కారానికి ఎంపికైన సాక్షి ఎడిటోరియల్ టీం మెంబర్ రెంటాల జయదేవ్ తన సోదరుడితో కలిసి వచ్చారు..

ఈ అవార్డులను జర్నలిజంతో పాటు మీడియా సంస్థ నిర్వహణకు మూల స్థంభాలైన మార్కెటింగ్, ప్రకటనారంగంలో విశేష కృషి చేసినవారికి ఇవ్వటం ఇంకో విశేషం.. కొవిడ్ కాలంలో జర్నలిస్ట్‌ల శ్రమ మనందరికీ తెలిసిందే.. ఈ అవార్డుల తలంపు కొవిడ్ మనదేశం తలుపు తట్టిన సమయంలో నిర్వాహకులకు తట్టింది.. అలా 2021 సంవత్సరం నుంచి ఈ వేడుక నిర్వహిస్తున్నారు.. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐ.టి శాఖామాత్యులు డి. శ్రీధరబాబు దాదాపు గంటసేపు ఓపికగా నిలబడి, చిరునవ్వులు చిందిస్తూ అవార్డు గ్రహీతలకు పురస్కారాలందచేయటం మామూలు విషయం కాదు. అనంతరం ఇంకో అరగంటకు పైగా ప్రసంగించారు.. రెండు కీలక అంశాలేమిటంటే ఒకటి సమాజానికి నిత్యం తోడుగా నిలిచే పాత్రికేయ మిత్రులంటే తనకెంతో గౌరవం అన్నారు.. వారికే కష్టమొచ్చినా తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రెండవది ఐటీ రంగంలో తెలంగాణ ఎంతో పురోగతి సాధించింది అన్నారు.. తెలంగాణాలో దాదాపు ఎనభై global capabilty centres ఉన్నాయన్నారు.. పాత్రికేయ వృత్తిలో విరామాలుండవు.. విశ్రాంతి ఆరామాలుండవు.. అదొక పరుగాపలేని ప్రయాణం..

ఒత్తిళ్ళు, డెడ్‌లైన్స్ జోడుగుర్రాల స్వారీ చేసే ఈ జర్నలిజం మిత్రులకు ఎడారిలో ఒయాసిస్సులా సేదీరుస్తున్న హై బిజ్ టీవీ వారు అభినందనీయులు.

**- పురస్కార గ్రహీత వలేటి గోపీచంద్**

## ఆడంబరానికి దూరంగా ...

**పె**ళ్ళి వేడుక ఇటీవలి కాలంలో సంపదను ప్రదర్శించడం గొప్పగా మారిపోయింది. ఎవరి స్థాయిని బట్టి వారు అన్నచందంగా ఈ తంతు జరపటం మనం చూస్తున్నాం..

ఇటీవల జరిగిన ఒక పెళ్ళికి వెళ్ళినప్పుడు ఇందుకు భిన్నమైన అనుభవం ఎదురై కమ్మని అనుభూతినిచ్చింది.. సాహిత్యాభిమాని మానికొండ కాంతారావుగారు ఏప్రిల్ ఇరవై ఎనిమిదవతేదీ నాడు వారి మనవరాలి వివాహానికి తప్పకుండా రావాలని **మిసిమి**ని ఆహ్వానించారు.. వేదిక వచ్చేసి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న అన్వయ కన్వెన్షన్ హాలు.. ఈసారి భానుడి ఆగ్రహాన్ని అందరూ చవిచూస్తున్నాం కదా..అలాంటి ఓ నిప్పులు కక్కే సాయంత్రం వేళ పెళ్ళి వేదిక అన్వయ హాలుకి వెళ్ళగానే వాతావరణమంతా మారిపోయి ఆహ్లాదపరిచింది.. మరీ హంగూ ఆర్భాటాలు లేకుండా పెళ్ళివారంతా పంచె, లాల్చీలతో సంబరంగా కనిపించారు. చక్కటి నాదస్వరం ఒకపక్క, వేదపండితుల సావనాధాష్టకంతో సుమూహూర్త సమయాన్నే సంప్రదాయబద్ధంగా వధువు వరుడు ఒకరి శిరస్సుపై మరొకరు తమ వామహస్తాన్ని జీలకర్ర బెల్లం ఉంచటంతో కొత్త వెలుగును తమ జీవితాల్లో ప్రసరింపచేశారు.. జీవన వేణువును పలికించారు..



చి॥సౌ॥ శృతిక, చి॥ రోహిత్

వరుడు ఆచార్య రంగా గారి మునిమనవడే కాకుండా సినీ నిర్మాత శేఖర్ బాబు మనవడు కావటంతో సినీరంగం కదలివచ్చింది.. చిరంజీవి, అల్లు అరవింద్ తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.. దర్శకుడు రాఘవేంద్రరావు, సినీనటి శారద, మురళీమోహన్ పర్చూరి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, ఎంతోమంది ఫిల్మ్ జర్నలిస్టులు హాజరయ్యారు.. ఎక్కడా హడావుడి లేదు.. తోపులాట లేదు. బౌన్సర్ల భయానక దృశ్యాలు లేవు.. కాంతారావుగారి వెన్నంటి ఉండే సోదరులు బి.నర్సింగరావు, బావమరది నర్సింగరావు, వేదకుమార్‌లు అన్నీ దగ్గరుండి చూసుకోవటం చాలా కుటుంబాల్లో అరుదైన దృశ్యమనే చెప్పాలి.. వధూవరులపై అక్షితలు వేసి ఆశీర్వదించిన అనంతరం డైనింగ్ హాలు వెపు కాళ్ళు లాక్కెళ్ళగా అక్కడ కూడా అనుకోని క్రమశిక్షణ ఆశ్చర్యపరచింది..తింటామా లేదా అన్నదానితో సంబంధం లేకుండా యాభై అరవై ఐటమ్స్ పెట్టారన్న పబ్లిసిటీకి దూరంగా సింపుల్ మెనూతో సరిపుచ్చటం మామూలు విషయం కాదు.


బయటకి వచ్చి చూశాం కదా అప్పుడే రైల్వే ఉన్నతాధికారి రవి పాడి లోపలికి వస్తూ కనిపించారు..వారితో కలిసి మరోసారి లక్ష్మీకాంతారావు గారిని కలిసి మా అభినందనలు మరోమారు పలికి వీడ్కోలు చెప్పి బయటకు వచ్చాం.. చుట్టూ కార్ల సముద్రమే కానీ ముంచెత్తేట్టు లేవు.. ఎవరో అలలను నియంత్రించినట్టుగా కార్లన్నీ అడ్డదిడ్డంగా కాకుండా గోడకట్టినట్టు ఉన్నాయి.. తొంభైశాతం ఫారిన్ బ్రాండ్లే.. సంపదెంతైనా ఉండొచ్చు కానీ సంపెంగలా పరిమళిస్తూ ఉండాలి కానీ డిస్ ప్లే చేసే చిరునామాలా ఉండకూడదని అన్వయ కన్వెన్షన్ కొత్త అన్వయాన్ని ఆ పెళ్ళిలో ప్రవేశపెట్టిందనిపించింది.. వధూవరులు కూడా సంప్రదాయ వస్త్రధారణకో కొత్త అన్వయాన్ని కల్పించిన తరుణమది..

జీవితంలో అందరికీ అన్నీ జరగవు.. మనవరాలి వివాహాన్ని అత్యంత వైభవంగా కన్నా అత్యంత సుందరంగా జరిపించి సింప్లిసిటీయే తన అభిరుచి అని మరోమారు చాటుకున్నారు అందరి ఆత్మీయులు కాంతారావుగారు.

***సి.ఎస్. ఆర్.***

# సత్యశోధన

**బ**డిలో, కాలేజీలో చరిత్ర చదువుకున్నాం. ఆ చరిత్ర రాసిన వారి పేర్లేమి పెద్దగా తెలియదు. ఆ తరువాత తెలిసింది చరిత్ర రాయించేవారు పాలకులేనని, అదీ వారికి అనుకూలంగానే ఉంటుందని. ఆంగ్లేయుల పాలన కోసం దిగిన వారు వీధి రౌడీలు, బందిపోటు దొంగలని. దానికి ముందు మొగలాయిల చరిత్ర విధ్వంసమేనని, అక్బర్ నామా చక్రవర్తి రాయించుకున్న చరిత్ర మాత్రమేనని. అప్పట్నుంచి చరిత్ర అంటే గౌరవం పోయింది. తరువాత The Forgotten Emphire చదివిన తరువాతనే ఉలిక్కిపాటు కలిగింది.




**మిసిమి** ద్వారా రావినూతల సత్యనారాయణ గారితో *విజయనగర చరిత్ర* కూలంకషంగా రాయించగలిగాం. తంజావూరు పాలకుల వైభవాన్ని విపులంగా చూపించగలిగాం. ఇదంతా **మిసిమి** పాఠకులకు ఆథెంటిక్ చరిత్ర అందించాలనే. ఆ సందర్భంలో శ్రీ గార రంగనాథం గారు నాకు కణుగుల వెంకట్రావు గారి ద్వారా పరిచయమయ్యారు. శ్రీ కణుగుల **మిసిమి**కి ఎంతో విలువైన పాఠకులు. **మిసిమి**లో ప్రచురించిన 'సమీప చరిత్రలను' ఎంతో విలువైన డాక్యుమెంట్లుగా పరిగణించారు! ఈ సమీప చరిత్రలన్నీ సాంఘిక చరిత్రలే – అవ్నీ వందేళ్ల లోపలివే. అయితే అవి శోధించి – పరిశోధించి రాసినవి కావు – వలస కుటుంబాల – వ్యక్తి పరిసరాల వంశ చరిత్రలే ఎక్కువ – చరిత్రలో ఇది ఒక పొర మాత్రమే. శ్రీ రంగనాథం గారు వారు స్వగతంలో చెప్పినట్లు పద్యకవి, సంప్రదాయ రచయిత. వీరు *కళింగ చరిత్ర* రాయబూనటం ఒక సత్యశోధన లాంటిది. కళింగుల చరిత్ర అతి పురాతనమైనది. అశోకుని నాటిది. గాంగుల నాటిది. విజయనగర కృష్ణదేవరాయల నాటిది. ఆంగ్లేయుల కంటే ముందు మొగలాయుల నాటిది. ఆంగ్లేయులచేత ఛిన్నాభిన్నం చేయబడినది. తురకల ఘాతుకాలు అనుభవించినది. అంతర్యుద్ధాలతో అతలాకుతలమైనది. – బౌద్ధానికి పునరుజ్జీవనం కలిగించింది! కళింగుల చరిత్ర! ఇంత గాఢమైన చరిత్రలో నుంచి వీరులు, మహావీరులు, మన్యంవీరులు ఉద్భవించినది. కాని ఇదంతా ఎక్కడ రాసి ఉంది? మనకు చరిత్ర అంటే గౌరవం లేదు. అందుకే ప్రబంధాలు రాసుకున్నట్లు చరిత్ర రాయలేకపోయాం. భారత ఇతిహాసాన్ని చరిత్రగా నెత్తినపెట్టుకున్నాం – రామచరితను మానవమాత్రునిగా మనలో కలుపుకున్నాం – ఆ తర్వాత అంతా చీకటే. ఎవరైనా ఆదినుంచి పాలకుల చరిత్ర రాయాలంటే కేవలం శాసనాలే ఆధారం. గుడి, గోపురాలను వెతకవలసిందే. ఈ పరిశోధన ఒక తమాషా కాదు. అందుకే ఎవరూ నెత్తికెత్తుకోరు. ఒకవేళ ప్రారంభించినా శాసనాలకే పరిమితమౌతారు – రంగంలో దిగి కార్యనిర్వహణ చేయరు – మనకు లభించిన చరిత్ర అవశేషాలు కవుల పుణ్యమే – కాళిదాసు, నన్నయ్య, పెద్దనల తాళపత్రాలే – భోజరాజు – రాజ రాజనరేంద్రుడు – శ్రీకృష్ణదేవరాయల కథలు చెప్పింది వారే – ఈ మహత్కార్యాన్ని తలకెత్తుకోవాలన్న తలపే పునీతమైనది. దాన్ని నిర్వహించడం ఒక యజ్ఞం లాంటిది. ఎవరెవరో చేయి అందించి ఉండవచ్చు, కాని యజ్ఞం చేయడం ఎంతటి కష్టమయిన కార్యమో పూర్వులు చెప్పే ఉన్నారు. గార రంగనాథం గారు ఈ రాజాం చరిత్ర శోధనలో తమను తాము పునీతులని చేసుకున్నారు.

నలభై, యాభై ఏళ్లు చాలామంది ఒకచోట నివసించవచ్చు. అది చాలా సామాన్యమైన విషయమే. కాని ఆ ప్రాంత చరిత్రను శోధించి రాయాలన్న తలపే అసమాన్యమైన కార్యం. అలాంటి మహత్కార్యాన్ని రంగనాథం గారు ఎంతో నిష్ఠతో, నిబద్ధతో నిర్వహించి మనకందించిన గ్రంథం ఈ రాజాం చరిత్ర. ఇందులో వారు శోధించి మనకందించినవి మానవ పరిణామ క్రమంతో పాటు పూర్వగాంగులు, కళింగ రాజులు, గజపతులు, బొబ్బిలి, విజయనగరం పాలకులు మాత్రమే కాదు, ఆయా పట్టణాల ప్రదేశాల చరిత్రను, అప్పటి ప్రజా జీవితాన్ని, పల్లె సమాజాన్ని ఎలా శోధించి రాసారో ఆశ్చర్యమే. ఇంతటి చరిత్రతో పాటు గ్రామదేవతల ఉదంతం, గ్రామ నామాల చరిత్ర, జమిందారుల భాగోతం, భౌగోళిక చరిత్రను, కళింగ ఆంధ్రగా ప్రసిద్ధి చెందిన ప్రదేశాన్ని ఎంతో వివరంగా రికార్డు చేయగలిగారు. రంగనాథం గారికి ఎన్ని డాక్టరేట్లు ఇచ్చినా తెలుగువారికి ఋణం తీరదు. కళింగ రాజులు ఎప్పట్నుంచి ఉన్నారు? వారు గజపతులు ఎందుకు అయ్యారు? రవీంద్రనాథ్ ఠాగూర్ ఉత్కళగంగ అని ఎందుకు పాడాడు? గాంగులెవరు? బొబ్బిలి, విజయనగరం ఎందుకు కొట్టుకులాడాయి? ఇలాంటివి ఎన్నో తెలియాలంటే ఈ చరిత్ర గ్రంథం మళ్లీమళ్లీ చదవాలి. ఈ చరిత్ర గ్రంథాన్ని హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు పాఠంగా పెట్టాలి. వారికి నిజమైన చరిత్ర అవగాహనకు వస్తుంది. మాయ చరిత్రల నుంచి వారి కళ్లు తెరిపిస్తుంది.


*పుటలు : 280, వెల : రూ. 250/-, ప్రతులకు : ఫోన్ : 9885758123*

**- ఎ.కె.**

## సాహో.. డాన్ కిహోటే ..

**ఆం**గ్లసాహిత్యాన్ని తెలుగులో అనేకమంది పరిచయం చేశారు.ఎవరి పంథా వారిదే..ఎవరి శైలి వారిదే.

అయితే ముక్తవరం పార్థసారధి గారు ఆంగ్లరచయితల్ని వారి సాహిత్యాన్ని కలిపి విశ్లేషించే తీరు వేరు.. ఒక రచనలో ఆ రచయిత వ్యక్తిత్వం ఎలా ప్రతిఫలిస్తుందో వారు బాగా పట్టుకుంటారు.. అందుకు ఉదాహరణ ఆయన వెలువరించిన ఫిక్షన్ ఆవిష్కర్త సెర్వాంటెస్–డాన్ కిహోటే అన్న చిన్న పుస్తకం..యాభై ఆరు పేజీల పుస్తకం..




నిజానికి ఫిక్షన్ ఆవిష్కర్త సెర్వాంటెస్ గురించి కొంతకాలం మిసిమిలో ముక్తవరం పార్థసారధి గారు రెండు వ్యాసాలు రాశారు.అవి చదివనివారికి ఇప్పుడీ పుస్తకం ఆ లోటు తీరుస్తుంది.మనకి రాజశేఖర చరితము తొలి తెలుగు నవలగా 1880లో ప్రచురింపబడితే సెర్వాంటిస్ రాసిన నవల డాన్ కిహోటే *ఆఫ్ లామాంఛా* (Don Quixote of La Mancha) 1605లో ప్రచురింపబడింది.. డాన్ కిహోటే పాత్రను ఆయన ఎక్కడి నుండి తీసుకున్నాడు. సామాన్య ప్రజానీకంలోంచి తీసుకున్నాడు. అతనో రైతు కావొచ్చు. గుర్రబగ్గీ తోలేవాడు కావొచ్చు.. క్షురకుడు కావొచ్చు. అతనికో తుప్పు పట్టిన కవచం, అలాంటిదే శిరస్త్రాణం, చేతిలో ఒక బరిసె, బక్క చిక్కిన గుర్రం..ఈ కథానాయకుడికి తోడుగా ఒక సైడ్ కిక్కు(శాంకో పాంజా)..వీరి సాహసయాత్రలు, సామాన్యుడు చేయలేనివి, చేయాలనుకున్నవి..దీనికి సెర్వాంటెస్ తన అనుభవాలను వ్యంగ్యంతో హాస్యంతో జోడిస్తాడు.అప్పటివరకు సాహసవీరుల గాథలు చదివిన ప్రజలు ఈ వయసుమళ్ళిన కథానాయకుడి ప్రయాణంలో భాగమై కడుపారా నవ్వుకుంటారు..

నిజానికి డాన్ కిహోటే ఆధునిక వచనంగా అవతారమెత్తి హాట్ కేకుల్లా అమ్ముడైపోవటం వలన సెర్వాంటెస్ పేదరికం తొలగిపోలేదు.అతని కష్టాలు తీరిపోలేదు.సైనికుడిగా పోరు సలిపిన సెర్వాంటెస్ అపహరణకు గురయ్యాడు. కారాగార శిక్ష అనుభవించాడు.దేశానికి ప్రాణాలర్పించే సైనికులకు సరైన రీతిలో గౌరవమివ్వని రాజరిక వ్యవస్థను నిరసించాడు..తన లక్షణాలన్నీ డాన్ కిహోటే పాత్రకు ఆపాదించాడు..అందుకే సాహసవీరుల గాథలు చదివిన పాఠకులకు సెర్వాంటెస్ వ్యంగ్యాస్త్రాలు వాడివాడిగా తగిలాయి..నీరాజనాలు పట్టారు..

చేయని నేరాలకు శిక్షలనుభవించి అవమానాలపాలవ్వటం వల్లనే సెర్వాంటెస్ రచనల్లో పాత్రలన్నీ బహిష్కృతులుగాను పరాజితులుగాను ఉంటాయి.అందుకే ఆ పాత్రలతో ప్రజలు తమ్మల్ని తాము పోల్చుకున్నారంటారు ముక్తవరం పార్థసారధి మంచివాళ్ళే మూర్ఖులన్నది సెర్వాంటెస్ కు జీవితం నేర్పిన పాఠమంటారు.. నిజానికి నాలుగొందల ఏళ్ళ క్రితం సెర్వాంటెస్ ఒక బెస్ట్ సెల్లర్ ను మాత్రమే ఆవిష్కరించలేదు.అనేక భాషల్లోకి అనువాదమయిన ఈ పుస్తకం అమ్మకాల్లో బైబిల్‌ను దాటేసింది.. ఫిక్షన్ అనే ఒక సరికొత్త ప్రక్రియను ఆవిష్కరించింది..

కేవలం యాభై ఆరు పేజీల్లో సెర్వాంటిస్ పేదరికాన్ని, దాన్ని దాటడానికి అతడు చేపట్టిన ప్రయాణాన్ని.. అది మిగిల్చిన చేదు అనుభవాల్ని, అందులోంచి పుట్టిన డాన్ కిహోటేని జనం హత్తుకున్న తీరుని మనకో తీరని దాహంగా చేసిన ముక్తవరం పార్థసారధి గారిని గుర్తుచేసుకోవటం ఎంతైనా అవసరం..


ఆయన మరికొంతకాలం జీవించి ఉంటే మరికొన్ని అనువాదాల వంటను రుచి చూసి ఉండేవారం..

*– శారద*

## చార్లీ చాప్లిన్ నా కథ

### ఒక పాఠకుని స్పందన

రసాత్మకమైనది చార్లీ చాప్లిన్ నా కథ (My Autobiography) ఎన్నో ఆశ్చర్యాలు, మరెన్నో అబ్బురపరిచే సంఘటనలు!! అతని బాల్యం, యవ్వనం, అమ్మ ప్రేమ, నాన్నతో బాధలు, అమ్మ మీద చార్లీ కురిపిస్తున్న ప్రేమ, పేదరికం, జీవితకై చార్లీ చేసిన నానా విధాలైన చిల్లర పనులు ఇలా భిన్న సన్నివేశాలలో జీవము, జీవితము ఉట్టిపడేట్టుగా రాసి మనల్ని కట్టిపడేస్తాడు చాప్లిన్. చాప్లిన్ సినిమాలలోనే కాదు అతని జీవితం అంతకన్నా ఎక్కువ ట్విస్టులతో నిండి ఉంటుంది. Fact is stranger than fiction అనే వాక్యానికి సరిగ్గా సరిపోయే జీవితం చార్లీ చాప్లిన్ ది. తన మూలాలు, తాను గడిపిన నిరుపేద బ్రతుకు, యవ్వన కాలంలో తాను నెరిపిన శృంగార, ప్రేమ జీవితం, నాటక సినీ జీవిత ప్రగతి, సినీ మాయా ప్రపంచపు లోతులు, లోటుపాట్లు, అసూయలు, వ్యాపారం, రచన, దర్శకత్వం, సంగీతం, నటన, కూర్పు, అన్నీ తానే అయ్యి చేసిన అష్టావధానం లాంటి సినీ నిర్మాణం, ప్రేక్షకుల నుంచి ప్రముఖుల వరకు చూపిన ఆదరణ, లిబర్టీ బాండుల అమ్మక విశేషాలు, సినీ నిర్మాతల ఉమ్మడి యూనియన్‌కి ప్రతిస్పందనగా తాను తీసుకున్న యునైటెడ్ ఆర్టిస్టుల సంఘ ప్రతిపాదనలు, అన్న సిడ్నీ చాప్లిన్ చూపిన భ్రాతృ ప్రేమ ఇలా ఎన్నెన్నో విశేషాలతో చాప్లిన్ తన కథని చెప్పుకుపోతుంటే ఆ కథన ప్రవాహములో మనం కొట్టుకుపోతుంటాం. చాప్లిన్ చలనచిత్రాలు చూడడం ఎంత అనివార్యమో అతని ఆత్మకథని చదవడం అంతే అనివార్యం.




ఎక్కడా అతిశయోక్తి కానరాదు, ఒక్క పదం కూడా కృతకంగా తగలదు. చాలా ఓపెన్‌గా, కాండిడ్‌గా మన ఎదుట కూర్చుని పిట్ట కథ చెబుతున్నట్టుగా చాప్లిన్ తన కథని చెప్పే క్రమంలో అతని కన్నీళ్లు మన కన్నీళ్లు అవుతాయి, అతని విజయం మన విజయం అవుతుంది. అతని కథని మన కథగా సొంతం చేసుకుంటాం. ఎన్నెన్నో మలుపులు, మరెన్నో తలపులు, ఇంకెన్నో మెరుపుల ముప్పేట వాల్లడ చాప్లిన్ జీవన గమనము. కమీడియన్‌గా అతను ఒక ఎవరెస్టు శిఖరమని, సినీ నిర్మాణానికి సంబంధించి అతను ఒక మేరువు అని లోకమంతటికి తెలుసు. అయితే ఇంకా తెలియనిది ఈ ఆత్మకథ పఠనం ద్వారా మాత్రమే మనం తెలుసుకోగలది సినీయేతర రంగాలలో సైతం చాప్లిన్‌కి గల పట్టు, అవగాహన మరియు అతని దార్శనికత. మానవ ప్రవర్తన రీతులపై ప్రభావాన్ని చూపించే పరిస్థితులకి సంబంధించి సిగ్మండ్ ఫ్రాయిడ్‌నీ కూడా ప్రశ్నించగలిగినంత లోతు, వైశాల్యం చాప్లిన్ సొంతం. రచయితలు, నృత్యకారులు, సంగీత విద్వాంసులు, గాయకులు, క్రీడాకారులు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, పత్రికాధిపతులు, రాజనీతి ప్రముఖులు, దేశాధినేతలు ఇలా అబ్బురు పరిచేటంతటి పెద్ద జాబితా అతని పరిచయాలు, స్నేహాలు. ఇలా అన్ని పార్శ్వాలు, రసాలతో నిండిన నికార్సైన చాప్లిన్ జీవితంలో పట్టుదల ఉంది, మొండితనం ఉంది, తర్కం ఉంది, సాహసం ఉంది, విలాసాలున్నాయి, చింతన తరంగాలు ఉన్నాయి, సౌభ్రాతృత్వం ఉంది, సానుభూతి సహకారాలు ఉన్నాయి, నియంతలను ఎదిరించే తెగువ, మానవత్వం పట్ల అవ్యాజమైన ప్రేమ కూడా ఉన్నాయి. అవన్నీ చాప్లిన్ జీవితాన్ని అనుసరించదగ్గ ఒక నమూనాగా తీర్చిదిద్దాయి.

450 పేజీల చాప్లిన్ నా కథని నేను చదివేను అన్న ఆనందం కంటే అప్పుడే అయిపోయిందా అనే బాధ ఎక్కువగా కలుగుతున్నది. ఇంగ్లీషులో ఆత్మకథని పర్ఫెక్షన్ కోసం చాప్లిన్ ఆరుసార్లు తిరగరాసారట. దీనిని తెలుగులోనికి అనువాదం చేసిన **మిసిమి** సంపాదకుడు శ్రీ వల్లభనేని అశ్వినీ కుమార్ గారు ఎంతగా శ్రమించారో, ఎంతగా సొంతం చేసుకున్నారో, ఎంతగా నిమగ్నమైనారో గాని అనువాదంలోని ప్రతి వాక్యం ఒక రస ప్రవాహమే.

ఈ ఆత్మకథలో 1900 నుండి 1960ల వరకు గల ఓ ఆరవై సంవత్సరాల అమెరికా, ఐరోపాల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక చిత్రాన్ని మనం చూడవచ్చు. చాప్లిన్ స్వీయ జీవితానికి సమాంతరంగా సాగిన ఆ సంఘటనల మాల నాటి స్థితిగతుల పట్ల మనకు ఒక క్లోజ్ పిక్చర్ అందిస్తుంది. ఒక సినిమా నటుని ఆత్మకథలో ఇంతటి విశ్లేషణ, ఇంతటి వివరణ ఉంటుందంటే నమ్మశక్యం కాదు. కానీ ఇదే ఈ ఆత్మ కథలో మనల్ని అబ్బుర పరిచే విషయము. చాప్లిన్ ఒక ప్రపంచ పౌరుడు, ఒక విశ్వ నరుడు. అతని జీవితం కడుపేదరికం నుండి ఎన్నెన్నో మలపులు తిరుగుతూ అత్యున్నత శిఖరానికి చేరుకుంటుంది. ఆయన మానవతా దృష్టి అమెరికాకి కంటగింపు అయింది. 40 ఏళ్లుగా అమెరికాలో నివాసం ఉన్న చాప్లిన్ని దేశద్రోహని, నాస్తికుడని, కమ్యూనిస్టు అని, కేథలిక్ వ్యతిరేకి అని, అసభ్య స్త్రీ లోలుడని ఇలా రకరకాలుగా ముద్ర వేసి కోర్టుకి ఈడ్చి ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తుంది అమెరికా ప్రభుత్వం. అమెరికా అధికార వర్గ అసూయ జ్వాలలకి బలై దేశ నిష్క్రమణ చేయాల్సిన అని వార్యత చాప్లిన్‌కి తలెత్తుతుంది. విసిగి వేసారి చివరికి అమెరికాలోని తన ఆస్తులను అమ్మేసి స్విట్జర్లాండ్‌లో స్థిరపడతాడు చార్లీ. యవ్వనవతి అయిన తన మూడవ భార్య ఊనా ఇచ్చిన భరోసా, మానసిక ధైర్యం చాలా గొప్పదని, ఆమె సన్నిధిలో తన జీవితం ఎంతో అర్థవంతంగా, విజయవంతంగా సాగిపోయిందని చెప్తాడు చాప్లిన్,

ఆలు మగల మధ్య ఎక్కువ వయోభేదం ఉండరాదు అంటారు కానీ దానికి ఖచ్చితమైన ఒక మినహాయింపు చాప్లిన్–ఊనాల జీవితం. వారి ప్రేమ వయస్సుని అధిగమించింది, వారిరువురూ ఆత్మలుగా జీవించారు. “ఊనా నా చిన్నారి భార్య, నన్ను స్వార్థరహితంగా, అర్థవంతంగా ప్రేమతో పునీతం చేసింది. నిజానికి ఈ విషయం నేనింకా వివరంగా రాయాలి కానీ ఇది అక్షరాలకు ఒదిగేది కాదు. ఊనా ఒద్దిక, వ్యక్తిత్వం నాకు ఎన్నో కొత్త లోకాలు తెరిచాయి. ఆమె సౌందర్యంలోని గోప్యత నాకు రోజు రోజుకి కొత్తగానే ఉంటుంది” అని తన చిన్నారి భార్య పట్ల ప్రేమను ప్రకటించకున్నాడు చాప్లిన్ తన నా కథలో.

మానవత్వాన్ని ప్రవచించిన, ఆచరించిన చాప్లిన్ అరుదైన వ్యక్తిత్వ మూలాలు బాల్యంలోని తన అమ్మ ప్రేమలో ఉన్నాయి, ఆమె పడ్డ కష్టంలో ఉన్నాయి, ఆమె త్యాగంలో ఉన్నాయి. చాప్లిన్ ఆత్మకథ అంతట ఆ మహనీయురాలి ఆత్మ ప్రతి పదం, ప్రతి వాక్యంలోనూ పరుచుకొనున్నదా అన్న అనుభూతికి పాఠకుడు లోనవుతుంటాడు.


*ది కిడ్ , డాగ్స్ లైఫ్, షోల్డర్ ఆర్మ్స్, ది సర్కస్, గోల్డ్ రష్, సిటీ లైట్స్, మోడరన్ టైమ్స్, ది గ్రేట్ డిక్టేటర్, మిస్టర్ గార్బో* ఇంకా *లైమ్ లైట్* లాంటి చిత్రాల సృష్టికర్తగా చాప్లిన్ గుర్తుండిపోయినా, అంతకుమించినవాడు చాప్లిన్ అన్న సత్యం ఈ నా కథ చదివినప్పుడే మనకు అర్థమవుతుంది. పండితులు, పామురులు, దేశాధినేతలు అనే తారతమ్యం లేకుండా అందరి మనసులను సమానంగా ఆక్రమించుకున్నవాడు చార్లీ చాప్లిన్.

చాప్లిన్ గురించి ఎందరెందరో ఎన్నెన్నో కోణాల్లో వర్ణించి ఉన్నప్పటికీ ఫ్రాన్స్‌కు చెందిన డ్రమటిక్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడైన రోజర్ ఫెర్డినాండ్ చాప్లిన్‌కు రాసిన ఉత్తరం చాప్లిన్ నిజ వ్యక్తిత్వాన్ని పూర్తిగా పట్టిచ్చేదిగా ఉంది. ఫెర్డినాండ్ ఇలా అంటాడు “.... మాకు తెలియకపోయినా కనీసం ఊహించగలం మమ్మల్ని నవ్వించి ఆనందపరచడానికి (అంతలోనే కన్నీళ్లు) మీరు మీ జీవితంలో ఎంతగా కష్టాలను చవి చూశారో..., మమ్మల్ని ఎంతగానో కదిలించిన చిన్న చిన్న విషయాలు..... అదీ ఎంతో వివరంగా మీరు చూపేందుకు ఎంతగా ఎన్ని బాధలు అనుభవించారో మీ జీవితంలో మేము లీలామాత్రంగానైనా ఆలోచించగలం... అవన్నీ మీ జీవన శకలాలే అనుకుంటాం... ప్రతి వ్యక్తి మీకు సహచరుడే ఎందుకంటే అతను మీతో మమేకమవుతున్నాడు.” పుస్తక ప్రియులకు చాప్లిన్ నా కథ ఒక విలువైన కానుక మాత్రమే కాదు, అది ఒక జీవితకాలపు మహోన్నత మార్గదర్శి.

***- డా. అలజంగి మురళీధర రావు, అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఫోన్ : 9440335461***

# ఉపనిషత్ ఉద్యానవనమ్

**భా**రతీయ తత్త్వశాస్త్రంలో ఉపనిషత్తులు అత్యున్నతమైన జ్ఞాన శిఖరాలు. ఆ శిఖరాలను అధిరోహించడం సామాన్యులకు అసాధ్యమనే భ్రమను తొలగిస్తూ, ఆచార్య వియ్యన్నరావు గారు నిర్మించిన అక్షర సేతువు ఉపనిషత్ ఉద్యానవనమ్. **మిసిమి** పత్రికలో ప్రతినెలా ఒక జ్ఞాన ప్రవాహంలా జాలువారిన ఈ వ్యాసాలు, నేడు ఒక గ్రంథంగా మన చేతికి అందడం తెలుగు పాఠకలోకానికి లభించిన ఒక గొప్ప ఆధ్యాత్మిక వరం. ఈ పుస్తకం కేవలం సంస్కృత శ్లోకాలకు అనువాదం కాదు; ఇది ఒక అనుభూతి. రచయిత ప్రతి ఉపనిషత్తును ఒక విలక్షణమైన కోణంలో ఆవిష్కరించారు.




**మానసిక విశ్లేషణ :** మాండూక్య ఉపనిషత్తులోని జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను వివరిస్తూనే, ఆధునిక మానవుడు కోరుకునే మానసిక ప్రశాంతతకు మార్గం చూపారు.

**సామాజిక స్పృహ :** తైత్తరీయం ద్వారా "మాతృదేవోభవ" వంటి విలువల వెనుక ఉన్న సామాజిక బాధ్యతను, సత్యకామ జాబాలి గాథ ద్వారా సత్యం యొక్క నిర్భయత్వాన్ని అద్భుతంగా చిత్రించారు.

**వైజ్ఞానిక తర్కం :** ఐతరేయ, ఛాందోగ్య ఉపనిషత్తుల్లోని సృష్టి రహస్యాలను వివరిస్తూ, సైన్స్ అన్వేషిస్తున్న చేతన గురించి మన ఋషులు వేల ఏళ్ల క్రితమే చేసిన తర్కాన్ని నేటి తరానికి అర్థమయ్యేలా విశ్లేషించారు.

**భక్తి-జ్ఞాన సమన్వయం :** శ్వేతాశ్వతరం ద్వారా భక్తి అనేది కేవలం మూఢనమ్మకం కాదని, అది జ్ఞానానికి దారితీసే ఒక పవిత్ర మార్గమని నిరూపించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసే శిక్షావల్లి నుండి, సృష్టి ఆవిర్భావ రహస్యాల వరకు అత్యంత ఆధునిక కోణంలో చర్చించారు. తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి వంటి మహావాక్యాలను కేవలం మంత్రాలుగా కాకుండా, మనిషి తనను తాను గుర్తించే 'సెల్ఫ్-రియలైజేషన్' సూత్రాలుగా మలిచారు. వియ్యన్నరావు గారి శైలిలో గొప్పదనం ఏమిటంటే.. ఆయన ఉపనిషత్తులను మూఢనమ్మకాలుగా కాకుండా, తార్కిక శాస్త్రాలుగా పరిచయం చేశారు. క్వాంటం ఫిజిక్స్ అన్వేషిస్తున్న 'చైతన్యం' గురించి మన ఋషులు వేల ఏళ్ల క్రితమే ఎలా చెప్పారో ఆయన అన్వయించిన తీరు ఇన్నోవేటివ్‌గా ఉంది. ఆచార్య కోదాటి వియ్యన్నరావు గారి కలంలో ఒక రకమైన ఆర్ద్రత కనిపిస్తుంది. యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి ఇచ్చే బోధనలో మనం ప్రేమిస్తున్నది వ్యక్తులను కాదు, వారిలోని ఆత్మను అని వివరించే ఘట్టం పాఠకుడి అంతరంగాన్ని తట్టి లేపుతుంది. "అసతోమా సద్గమయ" అని ప్రార్థించే ప్రతి హృదయానికి, ఆ వెలుగు ఎక్కడుందో చూపించే దిక్సూచి ఈ పుస్తకం.

**మిసిమి** మాస పత్రిక ఈ అమూల్యమైన జ్ఞానాన్ని సంవత్సరాల తరబడి భద్రపరిచి, నేడు ఒక గ్రంథ రూపంలో మనకు అందించడం అభినందనీయం. ఆచార్య వియ్యన్నరావు గారు ఉపనిషత్తులనే అరణ్యాన్ని సామాన్యులు విహరించగలిగే ఉద్యానవనంగా మార్చడంలో నూటికి నూరు శాతం కృతకృత్యులయ్యారు. సంస్కృత శ్లోకాల కఠినత్వం లేకుండా, అచ్చతెలుగులో అలంకారప్రాయంగా సాగిన ఆయన భాష పాఠకుడిని ఒక అలౌకిక స్థితికి తీసుకెళ్తుంది.

ఈ పుస్తకం చదివాక మనలో మనం కొన్ని ప్రశ్నలు వేసుకోక మానము:

* నేను కేవలం ఈ శరీరాన్ని మాత్రమేనా? లేక అంతకు మించిన అనంత చైతన్యాన్నా?
* భౌతిక సంపదలు ఇచ్చే సుఖం శాశ్వతమా? మైత్రేయి కోరిన అమరత్వం ఎక్కడ ఉంది?

ఇలాంటి అంతర్మథనానికి ఈ పుస్తకం ఒక వేదికగా నిలుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే-ఈ పుస్తకం చదవడం ముగిసేసరికి, పాఠకుడు ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతాడు. అక్కడ మతం ఉండదు, కేవలం మనుషి-మహా చైతన్యం మాత్రమే ఉంటాయి. తనను తాను తెలుసుకోవాలనుకునే ప్రతి అన్వేషి హృదయంలో ఉండాల్సిన, ప్రతి ఇంటి లైబ్రరీలో మెరవాల్సిన అక్షర నిధి ఈ ఉపనిషత్ ఉద్యానవనమ్. అసతోమా సద్గమయ- అసత్యం నుండి సత్యం వైపు ప్రయాణించాలనుకునే వారికి ఈ పుస్తకం ఒక చేతికర్ర. తమసోమా జ్యోతిర్గమయ- అజ్ఞానమనే చీకటి నుండి అక్షరమనే జ్యోతి వైపు సాగే ఈ ప్రయాణంలో ఈ గ్రంథం ఒక సహచరి. మీరు ప్రపంచంలో ఏ పుస్తకాన్ని చదివినా సమాచారం లభిస్తుంది, కానీ ఈ పుస్తకాన్ని చదివితే 'రూపాంతరం' సంభవిస్తుంది.


*పుటలు : 192, వెల : రూ. 199/-, ప్రతులకు : ఫోన్ : 9949516567*

***- డా. యన్. విజయ రాఘవ రెడ్డి, ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఫోన్ : 9441239803***

# చదవండి...


**– మిసిమి**

📖 **విత్తనంలో విశ్వం - అరుణ పప్పు:** ఒక రైతు జీవన గమనం ఇది. మామూలు రైతు కాదు. మహాప్రయోగశీలి! సాటివారికి అన్నం పెడితే చాలనుకునే సాధారణ మంచితనానికి మించి. సమాజంలో పదింతల సంపద సృష్టించాలని జీవితాంతమూ తపనపడిన అధునాతన తావని. తారనవడాలేగాని, తన ప్రేమాభిమానాలతో తడిపేసే వాత్సల్యసింధు. అటు గాంధీని, ఇటు కమ్యూనిజాన్ని ఒంట పట్టించుకుని అభ్యుదయానికీ, అభివృద్ధికీ పెద్దపీట వేసిన ఆదర్శవాది. ప్రతిదాన్నీ శోధించి, సాధించిన శాస్త్రజ్ఞుడు. జీవనమార్గంలో ఎదురైన కష్టసుఖాలను సమానంగా స్వీకరించిన కర్మయోగి. ప్రపంచ సాహిత్యాన్ని ఔపాసన పట్టిన చదువరి. చదువుల సారాన్నంతా వ్యక్తిత్వంలో ప్రతిఫలింపజేసిన సాత్వికమూర్తి. విద్య ప్రాధాన్యతను గురించి, ఎందరినో విద్యావంతులుగా మలచిన సజ్జనుడు. పుట్టుకతో గ్రామీణుడు, ఆలోచనలో విశ్వమానవుడు. పేరు కన్నెగంటి పాపారావు. ఇది వారి ఆత్మకథ.





*పేజీలు : 195, వెల : 250/–, ప్రతులకు : కన్నెగంటి కిశోర్‌బాబు, ఫోన్ : 9844033367,*

📖 **ప్రేమలేఖలు :** చలంగారు ప్రేమలేఖలు వ్రాసేటప్పుడు మనసులో ఎవరున్నారో లేరోగాని ఎవరో ఉన్నంత వాస్తవంగా ఉంటుంది లేఖ. వాటిని పోస్టులో ఎవరూ అందుకోలేరు, పుస్తక రూపంలో పాఠకులు తప్ప. లేఖలు వ్రాయడం నేర్చుకోదలచిన వారికి ఇవ్వి ఒరవడులు. ప్రేమలేఖలలో ఉన్న చలం మనసు, జీవిత ఘట్టాలు, ప్రేమలు, విరహాలు, సౌందర్య చర్చలు, తాత్విక ప్రశ్నలు, ఇంకా అనేకానేకం చలం జీవితంలోని వాస్తవాలే!





*పేజీలు : 303, వెల :275/–, ప్రతులకు : విశాలాంధ్ర, నవచేతన, నవోదయ బ్రాంచీలు.*

📖 **చలం ఆత్మకథ :** స్వీయ చరిత్రలన్నీ ఆత్మకథలు కావు. తారీకుల వివరాలతో సహా పోరాటాలు, విజయాలు. చరిత్రకు పనికి వచ్చే సమాచారంతో ఉండేవి స్వీయచరిత్రలు – ఇందులో అవ్వేమీలేవు. ఆత్మకథ అనగానే "ఆత్మ" ప్రత్యేకంగా ముందుకు వస్తుంది. ఆ పదానికి భారతీయ చింతనలో ప్రత్యేకార్థం ఉంది. దేహం ఏర్పడక ముందు, దేహం వీడిన తర్వాతగూడ దాని అస్తిత్వాన్ని గుర్తించి వ్రాస్తే అది "ఆత్మకథ". అది వ్రాసిన 30 ఏళ్లకు తాను ఎక్కడ నుండి వచ్చాడో వెతుక్కొని ఈ పుస్తకంలో "అవతరణ"లో అస్పష్టతను విడమరచి చెప్పాడు. ఇలా "ఆత్మ"ను తమ చరిత్రలో భాగం చేసికొన్న స్వీయచరిత్ర రచయితలెవరు లేరు.




*పేజీలు : 279, వెల :260/–, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, నవచేతన బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్ బ్రాంచీలు.*

📖 **డి.వి.జి. కథలు - డి.వి.జి. శంకరరావు :** పాలకులు పొగడ్తలకు పొంగిపోకూడదని, పదవీ వ్యామోహంతో ప్రజలకు ఉచిత పథకాలు అందించి ఖజానా ఖాళీ చేసి అప్పుల్లో కూరుకుపోవడం మంచి పరిణామం కాదని పాలకుల్ని హెచ్చరించే ఒక ఆలోచింపజేసే కథ "రాజద్రోహమా.... అంతకు మించి" పాఠకులు తప్పక చదవాల్సిన కథ. కథలన్నీ సున్నితమైన హాస్యంతో సందేశాత్మకంగా ముగుస్తాయి. వైద్యులుగా రోగాల్ని నయంచేయడమే కాకుండా సాహితీవైద్యంతో సామాజిక రుగ్మతల్ని తొలగించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం గొప్పది. ఈ విధంగా సమాజ రుణం తీర్చుకుంటున్న మిత్రులు శంకరరావు గారు అభినందనీయులు.




*పేజీలు : 160, వెల :250/–, ప్రతులకు : డి.వి.జి. శంకరరావు, ఫోన్ : 9440836931.*

# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి    బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : తపాలా ఖర్చులు పెరిగిన మూలంగా పత్రిక వెల **జనవరి 2026 నుంచి రూ. 60/-** చేయవలసి వస్తున్నది. మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. పాఠకులు సహకరించగలరని ఆశిస్తున్నాం.

**ప్రతినెలా ముప్ఫయి తారీఖున పత్రిక పోస్టు ద్వారా పంపబడుతుంది. ఏ కారణం చేతనైనా పత్రిక చేరకపోతే మళ్లీ పంపటానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెసులపాటు కల్గించడంలేదు. కేవలం స్పీడు పోస్ట్ ద్వారానే పంపాలి. దయచేసి చందాదారులు గమనించగలరు.**


**చందా వివరాలు:**

₹720/- (సంవత్సర చందా),
₹1440/- (రెండు సంవత్సరాలకు),
₹2,160/- (మూడు సంవత్సరాలకు),

**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi


## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



సప్తపర్ణి | వ్యాస మంజూష | ప్రవాస సాహిత్యం | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్



యాత్రా కథనాలు | షెల్లీ జీవిత కథ | కొత్త కెరటాలు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. **ఫోన్: 994 951 6567.**



Printed & Published by **BAPANNA ALAPATI**

Printed at **Kala Jyothi Process Pvt. Ltd.**, Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**